వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 10 సంచిక : 11 హైదరాబాద్ 136 నవంబర్ 2012 పేజీలు : 68 రు. 15

- జీవ వైవిధ్యం కాదు జీవ విధ్వంసం
- ప్రజా వ్యతిరేక కూడంకుళం ప్రాజెక్ట్
- బీమా, పెన్షన్ రంగాల్లో ఎఫ్‌డిఐ
- చౌరస్తాలో తెలంగాణ ఇంకెన్నాళ్లు?
- ముప్పై ఏళ్ల తర్వాత గౌరవెల్లి
- జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం
- ఆదివాసి మహిళల పోరాటాలు

అందరికీ ఆహ్వానం

వీక్షణం - బి 1 కలెక్టివ్ ల నిర్వహణలో

ఆర్ ఎస్ రావు స్మారక ఉపన్యాసం, సదస్సు

నవంబర్ 10 –11, 2012, హైదరాబాద్

ప్రొ. వి ఎస్ ప్రసాద్,

మాజీ డైరెక్టర్, నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి)

'కూడలిలో ఉన్నత విద్య : ప్రత్యామ్నాయాల అన్వేషణ' పై

ఆర్ ఎస్ రావు స్మారక ఉపన్యాసం చేస్తారు

అధ్యక్షత: ఎన్ వేణుగోపాల్

స్థలం: బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్, సమయం: నవంబర్ 10, 2012, శనివారం సా. 6 గం.

నవంబర్ 11, 2012, ఆదివారం ఉ. 10.00 నుంచి సా. 6.00 వరకు

సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్), బేగంపేట, సమావేశ మందిరంలో

ఆర్ ఎస్ రావు స్మారక సదస్సు

ఉదయం సెషన్ – అధ్యక్షత: ప్రొ. ఆర్ కవితా రావు

ఆర్థిక వ్యవస్థ – రాజ్యం – మిగులు మనుషులు: పరస్పర ప్రభావాలు – ముదునూరి భారతి

విభిన్న కొరతల సహజీవనం : ఒరిస్సా ఆర్థిక వ్యవస్థ ఉదాహరణ – లినతా దాస్

రాష్ట్రాల మధ్య తేడాలు: వివిధ రంగాల అంతస్సంబంధాలు – సునీల్ ఆశ్రా

సంస్కృతి – ఆర్ ఎస్ రావు సంవిధానం – పాణి

భోజనానంతర సెషన్ – అధ్యక్షత: ప్రొ. జి. హరగోపాల్

చారిత్రక భౌతిక వాద దృక్పథంలో సుందర్‌ఘర్ జిల్లా – గోలక్ బిహారీనాథ్

గ్రామీణ వర్గ సంబంధాలు – ముప్పై ఏళ్లకు ముందూ తర్వాతా – రామచంద్రం, రామకృష్ణారావు

సాగుచేయని కుటుంబాల పుట్టుక, స్వభావాలు – తొమ్మిది గ్రామాల అధ్యయనం – ఆర్ విజయ్

ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా: విప్లవోద్యమ ప్రయోగాల చరిత్ర – ఎన్ వేణుగోపాల్

ఈ పత్ర సమర్పణలతో పాటు ఆర్ ఎస్ రావు మిత్రులు ఆయన జ్ఞాపకాలు పంచుకుంటారు

136

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

నవంబర్ 2012
సంపుటి : 10
సంచిక : 11

లోపలి పేజీల్లో...

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

గత సంచికలో 'ఒక పాఠకుడు' పేరుతో ప్రచురించిన లేఖ ప్రారంభంలోనే సంపాదకుని మీద, రచయితల మీద విమర్శనాస్త్రాలు సంధించడం, అంటే వీక్షణం పత్రిక మీదే దాడి చేయడం. అత్యంత గర్హనీయం. ఏ సంచికలో ఏ విమర్శ ప్రచురింపబడ్డదో, ఆ సంచికలోనే అరడజను వ్యాసాలు 'ఒక పాఠకుడు' కొలబద్దను తప్పుడు కొలబద్దగా నిరూపిస్తాయి. ఏ ప్రమాణాలు లేకుండా 'ఆర్థిక నేపథ్యం గురించిన స్పృహ కూడా ఉన్నట్లు లేదు' అని అన్నారో?! ఆ స్పృహ ఉండబట్టే వీక్షణం చందాదారుల సంఖ్య 800 నుంచి 8000కు పెరిగిందని గమనించాలి. ఉభయ పార్లమెంటరీ కమ్యూనిస్టులు ప్రచురిస్తున్న పత్రికలకు భిన్నంగా నడుస్తున్న ఒకే ఒక వామపక్ష పత్రిక 'వీక్షణం'. మొదటి రెండు సంవత్సరాలు మినహాయిస్తే మిగతా కాలమంతా ప్రస్తుత సంపాదకుడే ఆచరణలో సంపాదకునిగా నిర్వహిస్తూ వచ్చారు. ఆయన్ను పట్టుకొని 'సామ్రాజ్యవాదం ఆర్థిక వ్యవస్థ నేపథ్యం కూడా ఉన్నట్లు లేని' వారి వ్యాసాలు ప్రచురిస్తున్నారని సంపాదకుని మీద అభాండం వేస్తారా? ఒక పత్రికన్న తర్వాత అనేక అభిప్రాయాలున్న వారి వ్యాసాలు ప్రచురిత మవుతాయి. అయితే అవి వామపక్ష పత్రిక విధాన పరిమితిలో ఉంటే, దానికన్నా ముఖ్యంగా ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తుంటే, అవి వీక్షణం పత్రికలో ప్రచురణకు నోచుకుంటాయి. అలా కాకుండా ప్రతి సమస్య మూలాలకు వెళ్లి, సామ్రాజ్యవాదులు, ప్రపంచబ్యాంక్ ప్రతి సమస్యకు కారణమని నిందిస్తూ పోతే, ఆ సంస్థలు ఆదేశించిన విధానాలను అమలుపరుస్తున్న ప్రస్తుత పాలకుల మీద చేయాల్సిన దాడి మొద్దు బారుతుంది. రెండు మూడు సంవత్సరాల క్రితం కాబోలు ఒక వీక్షణం పాఠకుడు లేఖ రాస్తూ వీక్షణంలో వచ్చే వ్యాసాలు తన బోటి సామాన్యునికి అర్థం కావడం లేదని, గణాంకాలు మొదటే మింగుడు పడడం లేదని రాశారు. ఆ సామాన్యుణ్ణి ప్రభుత్వం ఎలాగూ పట్టించుకోదూ, వీక్షణం పట్టించుకొంటుంది కాని, ప్రతి వ్యాసంలో ఆర్థిక పుట్టు పూర్వోత్తరాలను జతపరచితే సామాన్యుడు వీక్షణంకు దూరంగా పారిపోతాడు. 'ఒక పాఠకుడు' లేఖ వ్యాసాలు పంపే వాళ్లను నిరుత్సాహ పరుస్తోంది. ఈ పాఠకుడు రాజకీయార్థిక పండితుడు కావచ్చు. కాని వ్యాసకర్త లందరూ ఆ స్థాయిలోనే రాయాలంటే ఎలా? వీక్షణం దశమ వార్షికోత్సవం జరుపు కుంటోంది. వీక్షణం ప్రారంభించినపుడు 48 పేజీలు నింపడమే గగనమైంది. ఏ పత్రికైనా అంతే. పత్రిక ప్రస్తుత మాసపత్రిక స్థాయి నుండి వచ్చే దశాబ్దం చివరి నాటికి పక్షపత్రిక కావాలని కోరుకుందాం. పాఠకులు కూడా స్పందించాలని నాకోరిక.

– వి. హనుమంతరావు
హైదరాబాద్

(గత సంచికలో ప్రచురించిన ఒక పాఠకుడి ఉత్తరం 'ప్రచురణ కోసం కాదు' అని పంపించారు. అయినా రచయితల అవగాహన కోసం ఉత్తరం వేయడం జరిగింది. 'ఒక పాఠకుడి'ని క్షమాపణలు కోరుతున్నాం. – సం.)

వీక్షణం సెప్టెంబర్ సంచికలో ములపాకు జంగంరెడ్డి సుబ్బరామిరెడ్డి(ఎం.జె) గూర్చి పి. వరలక్ష్మి రాసిన వ్యాసం చదువుతుంటే ఒక సాధారణ వ్యక్తి ఇన్ని సమాజ సంక్షేమ కార్యక్రమాలు ఎలా చేశాడని ఆశ్చర్యం కలిగింది. సీమ ప్రజలు ఆయనను అక్కున చేర్చుకున్న విధం పలువురికి మార్గదర్శకం కాగలదు. కష్టజీవుల హక్కుల కొరకు చివరి వరకు నిలబడ్డ ఎం.జె. వంటి వారి జీవిత చరిత్రను వివరించిన వరలక్ష్మి, అచ్చువేసిన వీక్షణంకు ధన్యవాదాలు తెలుపుతున్నాను.

– ఎన్. భీమార్జున్‌రెడ్డి,
నల్గొండ

వీక్షణం అక్టోబర్ 2012 సంచికలో ఆశాలత గారి వ్యాసం 'జీవ వైవిధ్య సదస్సు ఎవరికోసం?' చిన్న వ్యాసమైనా చాలా సమాచారం అందించారు. వాస్తవానికి గిరిజనులే జీవ వైవిధ్య పరిరక్షకులు. 'మన్యంలో ఆదివాసులపై హింస తీవ్రం' వ్యాసం చదివాను. జి.కె. వీధి, కొయ్యూరు, చింతపల్లి మండలాలలో ఏ గ్రామంలో ఎప్పుడు దాడి జరుగుతుందోనని గిరిజనులు బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నారు. రచయిత అక్కడి పరిస్థితులను చక్కగా పరిచయం చేశారు.

– తుంపాల శ్రీరామమూర్తి
విశాఖపట్నం

మిత్రులకూ, శ్రేయోభిలాషులకూ కృతజ్ఞతలు
వీక్షణం ఆర్థిక స్థితి గురించి విజ్ఞప్తికి ప్రతిస్పందనగా అక్టోబర్ నెలలో అందిన విరాళాలు, సహాయాలు

లయన్ డా. వి.వి. గిరి, ఎం.జె.ఎఫ్. హైదరాబాద్ (రు. 2000); వై. నాగభూషణం, మెదక్ (రు. 2000)

'అసోంలో ఏం జరుగుతోంది? వ్యాసంలో (వీక్షణం, అక్టోబర్ 2012) కొన్ని లోపాలున్నాయి. ఈ సమస్య చాలా సంక్లిష్టమైనది. ఎవరికైనా చోటుచాలదు. అయినా కొన్ని ముఖ్యమైన అంశాలను స్పృశిస్తూ పునర్ వీక్షణం చేద్దాం:

అసోం ఏర్పడిన 1955 నాటినుంచి చొరబాటుదార్ల సమస్య వేధిస్తున్నది అని, వారిలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లింలు ముఖ్యమని రాశారు. అసోం ఏర్పడినది 1874లో, అదే 1947 తర్వాత కొనసాగింది. ఇది తేదీ సమస్యే కాదు. రాజకీయంగా ముఖ్యమైన లోపం. భారత భాషాజాతుల్లో ముఖ్యమైనది అసోం. పాలకుల విభజించి పాలించే దేశ విభజన రాజకీయాలకు 1947లోనే బలైన రాష్ట్రం అసోం. అనాటి మత ఆధారిత విభజన రాజకీయాలతో దేశం అతలాకుతలమైంది. అందులో భాగంగా కోట్లాది జనం శరణార్థులయ్యారు. ఆ తాకిడి తూర్పున ప్రధానంగా బెంగాల్, అసోంలపై పడింది. మతం పేరిట బెంగాల్ని విభజించిన పాలకవర్గాలు 1971లో పాకిస్తాన్‌ని జాతిపేరిట ముక్కలు చేశాయి. పాలిటిక్స్ ఆఫ్ కన్వీనియెన్స్! అలా బంగ్లాదేశ్ ఏర్పడింది! రెండు సార్లూ శరణార్థుల సమస్య ముంచెత్తింది. 1947లో హిందువులు, 1971లో వారితోపాటు భారీ సంఖ్యలో ముస్లింలు తరిలివచ్చారు. 1947 విభజనలో బ్రిటిష్, 1971లో రష్యన్ సామ్రాజ్యవాద వ్యూహాల్లో భాగంగా జరిగిన పరిణామాలివి. ఈ అంశాన్ని కప్పి పుచ్చి మతోన్మాద రాజకీయాలను బిజెపి రెచ్చగొట్ట చూస్తోంది. కాగా కాంగ్రెస్ వాటినే సెక్యులర్ రూపంలో సాగిస్తున్నది.

అసోం జాతీయ ఆకాంక్షలు మొదట బ్రిటిష్, తర్వాత భారత పాలకులకు వ్యతిరేకంగా వ్యక్తమవుతూ వచ్చాయి. ఈ జాతీయ ఆకాంక్షలను అణచివేసే క్రమంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఇంకా అనేక రూపాల్లో విభజించి పాలించే రాజకీయాలను కొనసాగిస్తున్నారు పాలకులు. ఈశాన్య భారత్‌లో సుమారు 5 లక్షల సైన్యం దశాబ్దాలుగా తిష్ట వేసుకొని కూర్చుంది ఈ పాలక వర్గ రాజకీయాల్లో భాగంగానే. ఈ మౌలిక విషయాన్ని అర్థం చేసుకోకుండా ఇటీవలి అసోంలోని బోడో ఘర్షణలను అర్థం చేసుకోలేం.

ఈశాన్యంలో ఉన్న జనానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. రచయిత పడికట్టు భాషలో పేర్కొన్నట్టు వారు అమాయక గిరిజన ఆదివాసులు కాదు. మన రాష్ట్రంలో అక్షరాస్యత 67 శాతం అని 2011 జనాభా లెక్కలు చెపుతున్నాయి. ఇది ఈశాన్య

(మిగతా 65వ పేజీలో...)

సెప్టెంబర్ సంచికలో వచ్చిన జి. లచ్చయ్య వ్యాసం 'వాకపల్లి ఘటనకు ఐదు సంవత్సరాలు'లో పేజీ 45లో రెండవ పేరాలో 8వ లైన్‌లో 'సామూహికంగా బలాత్కరించి అత్యాచారం చేసార'ని ఉంది. దాన్ని 'వేధింపులకు గురిచేశార'ని చదువుకోగలరు. జీవవైవిధ్య సదస్సు వ్యాస రచయిత్రి ఆశాలత పనిచేస్తున్న సంస్థ 'యక్షి' అని పొరపాటుగా వచ్చింది. దాన్ని 'ఆంత్ర' అని చదువుకోవాలి. – సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఎక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ; కడప, క్రిష్ణా, తూర్పు గోదావరి, గుంటూరు – ఏకుల మల్లేశ్ (ఇంటర్నెట్ ద్వారా)

వాద్రా, గడ్కరీ... బందిపోట్లదే ఈ రాజ్యం!

ప్రస్తుత అధికార కూటమి అధ్యక్షురాలు, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాకు ఎన్ని అక్రమ లావాదేవీలతో, కుంభకోణాలతో సంబంధం ఉన్నదో, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆయన ఎన్ని వందల ఎకరాలు, వందలకోట్ల రూపాయల ఆస్తులు పోగుచేసుకున్నాడో బైటపడుతున్నది. అంతకు ముందు కాంగ్రెస్ కు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నాయకులు పాలుపంచుకున్న కుంభకోణాలెన్నో బయటపడ్డాయి. అదే సమయంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నితిన్ గడ్కరీకి ఎన్ని అక్రమ వ్యాపారాలున్నాయో, ఎన్ని కుంభకోణాలలో భాగం ఉందో కూడ బైటపడుతున్నది. భాజపా కేంద్ర ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు, రాష్ట్రాలలో అధికారాలలో ఉన్నచోట్ల కూడ ఇటువంటి అవినీతి ఉదంతాలెన్నో బైటపడ్డాయి.

ఇవాళ రాబర్ట్ వాద్రా, నితిన్ గడ్కరీ అనే ఇద్దరు వ్యక్తులు ఎంతగా చట్టాలను ఉల్లంఘించారో, తప్పుడు వ్యాఖ్యానాలు చేశారో, చట్టవ్యతిరేక కార్యకలాపాలకూ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికీ, చట్ట నిబంధనలకు లోబడే దేశ సంపదలను హక్కుభుక్తం చేసుకోవడానికి పాల్పడ్డారో రోజురోజూ కొత్త వివరాలు బైటపడుతున్నాయి. ఇది ఆ ఇద్దరికీ మాత్రమే సంబంధించిన విషయం కాదు. ఈ రెండు ఉదాహరణలు ప్రతీకాత్మక చిహ్నాలు మాత్రమే. అధికారంలో ఉన్నా, ప్రధాన ప్రతిపక్షం అయినా ఆయా రాజకీయ పక్షాలు ఎంతగా అవినీతిలో, అక్రమార్జనలో, ప్రజావ్యతిరేక కార్యకలాపాలలో, స్వార్థభరిత ప్రవర్తనలో కూరుకుపోయాయో ఈ రెండు ఉదాహరణలు చూపుతున్నాయి.

ఆమాటకు వస్తే కాంగ్రెస్, భాజపా మాత్రమే కాదు, పార్లమెంటరీ రాజకీయ పక్షాలన్నీ ఆ తానులోని ముక్కలే. అన్వేషించగల శక్తి సామర్థ్యాలూ, ఓపికా ఉంటే ఈ దేశంలో పార్లమెంటరీ రాజకీయ నాయకులలో తొంభై శాతానికి పైగా, గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి రాష్ట్రపతి స్థాయిదాకా, ఏ ఒక్క పార్టీ మినహాయింపు లేకుండా, ఇటువంటి అక్రమ లావాదేవీలున్న విషయం బయటపెట్టవచ్చు. బెంగళూరు – మైసూరు రహదారి కుంభకోణంలో మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు భాగస్వాములని ఇప్పుడిప్పుడే వార్తలు వస్తున్నాయి. రాష్ట్రంలో అటు తెలుగుదేశం పాలనలోనైనా, ఇటు కాంగ్రెస్ పాలనలోనైనా సహజవనరులను, భూమిని, ఖనిజాలను, అడవిని, సముద్రతీరాన్ని, పాలనా అవకాశాలను అప్పగించి వేలకోట్ల రూపాయల ముడుపులు, 'నీకది – నాకిది' లోపాయికారీ పంపకాలు విచ్చలవిడిగా సాగాయి, సాగుతున్నాయి. రాజకీయ నాయకుడు కావడమంటే వందల, వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని కైంకర్యం చేయడమేనని అర్థం స్థిరపడిపోతున్నది.

దీన్ని అవినీతి అని పిలుస్తున్నప్పటికీ ఇది నీతి లేకపోవడం అనే నైతిక సమస్య మాత్రమే కాదు. నిజానికి ప్రజలను దోపిడీ చేసి స్వలాభం చూసుకోవడమే వర్గ సమాజంలో పాలకవర్గ నీతి. ఆ నీతిని ఇవాళ్టి పాలకవర్గాలు నిస్సిగ్గుగా, నగ్నంగా, బహిరంగంగా అమలు చేస్తుండడమే మధ్యతరగతి ఏవగింపు పెరగడానికి కారణమవుతున్నది. ప్రతి విషయాన్నీ నైతికదృష్టితో చూడడం మధ్యతరగతికి అలవాటు గనుక కుంభకోణాలను, ప్రజాధనం కైంకర్యాన్ని, వనరుల దోపిడీని అవినీతి పరిభాషలో అర్థం చేసుకోవడం జరుగుతున్నది. కాని ఇది రాజకీయార్థిక సమస్య. ఒక మనిషిని వేరొక మనిషి పీడించే, దోపిడీ చేసే సాంఘిక ధర్మపు సమస్య. సొంత ఆస్తి పెంచుకోవడం వ్యసనంగా మారిన సామాజిక విలువల సమస్య. 'నేను చేసిందంతా నీతి, ఇతరులు చేసేదంతా అవినీతి' అనుకునే సాంస్కృతిక కపటత్వపు సమస్య. సామాజిక శాంతి భద్రతలకోసం మోసపూరితంగా రాసిపెట్టిన నామమాత్రపు చట్టాలను కూడ ఉల్లంఘిస్తున్న సమస్య. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది సొంత ఆస్తి సమాజపు మౌలిక సమస్య. వర్గ అంతరాల సమాజపు ప్రధాన సమస్య.

ఇంత విశాలమైన సామాజిక, రాజకీయార్థిక, సాంస్కృతిక, నైతిక, చట్టపరమైన సమస్యను కేవలం అంకెలతోనో, మంచి చట్టాలతోనో, నీతిమంతులైన అధికారులతోనో, తమను తాము స్వచ్ఛమైన వారిగా భావించుకునే వాచాలత్వపు సంస్కర్తలతోనో పరిష్కరించడం అసాధ్యం. ఈ పద్ధతులలో ఎక్కువలో ఎక్కువ ఈ రుగ్మతలకు తాత్కాలిక ఉపశమనం కనిపించవచ్చు. ఈ చిరుగుల బొంత వ్యవస్థకు కొత్త అతుకులూ మాట్లూ పడవచ్చు. కాని జరగవలసింది ఈ రుగ్మతలు శాశ్వతంగా రద్దు కావడం. ఈ వ్యవస్థ సంపూర్ణంగా, మౌలికంగా మారిపోవడం. వ్యవస్థ మారే వరకూ అవినీతి సమస్య రూపాలు మార్చుకోవచ్చు గాని రద్దయిపోదు.

ఈ వ్యవస్థను రద్దు చేయవలసిన అవసరం పెరుగుతున్నదనడానికి అవినీతి మాత్రమే కాదు, మరెన్నో ఆధారాలు రోజురోజూ కనబడుతున్నాయి. ఈ గజదొంగలూ బందిపోట్లూ అధికార పక్షంగానో, ప్రతిపక్షంగానో ప్రజా ప్రతినిధులుగా నటిస్తూ చేస్తున్న పని అక్షరాలా దేశద్రోహం. ప్రజాద్రోహం. దేశదేశాల సంపన్నులతో భుజాలు రాసుకు తిరుగుతూ దేశ వనరులను కారుచౌకగా అమ్మివేయడం. దేశ మార్కెట్లను బహుళజాతి సంస్థలకు అప్పగించడం. ముడుపులూ ఎంగిలి మెతుకులూ సంపాదించడం. తమ దొంగల దోపిడీని సమర్థించుకునే చట్టాలు అమల్లోకి తేవడం. మరొకవైపు ఆ దోపిడీని ప్రశ్నించే, ఈ దేశ వనరులు ఈ దేశ ప్రజలకే దక్కాలని పోరాడే శక్తులపై విరుచుకుపడడం. వారిని దేశ వ్యతిరేక శక్తులని ముద్రవేయడం, నిర్బంధాల పాలు చేయడం. కూడంకుళంలో అణువిద్యుత్ ప్రాజెక్టు తమ జీవనాన్ని భగ్నం చేస్తుందని గుర్తించి దానికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై, వారికి సహాయ సహకారాలు అందిస్తున్నవారిపై, సానుభూతి తెలుపుతున్నవారిపై ప్రభుత్వాల అమానుష వైఖరి చూస్తే ఈ ప్రభుత్వాలను, పాలకవర్గాలను, వ్యవస్థను ధ్వంసం చేయడం తప్ప గత్యంతరం ఏమీ లేదని స్పష్టంగా తేలిపోతున్నది. దేశాధినేతలు, పాలకవర్గాలు ఇంతింత దుర్మార్గాలకు పాల్పడుతుంటే ఎదిరించవలసినవాళ్లు మౌనంగా ఉండడమే విషాదం. ప్రజలు తమంతట తామే పెద్ద ఎత్తున వీరోచితంగా ప్రతిఘటిస్తుంటే వారితో చేతులు కలపవలసిన, వారికి గళం ఇవ్వవలసిన వాళ్లు నిర్లిప్తంగా ఉండడమే విచారం. తన ప్రగతిశీలత గురించి తానే గొప్పలు పోయే మధ్యతరగతి పలాయనమే విచిత్రం.

వీ

పాదయాత్రల రుతువులో వాగ్దానాల వెల్లువ


రాష్ట్రంలో ఆ మూల నుంచి ఈ మూల దాకా ప్రజాద్రోహుల పాదయాత్రల భూకంపాలు చెలరేగుతున్నాయి. ప్రజాసమస్యల పరిష్కారం కోసం, పాలకవర్గాలనూ ప్రభుత్వాలనూ నిలదీయడం కోసం దశాబ్దాల కింద ప్రారంభమైన అద్భుతమైన ప్రచార, ఉద్యమ రూపం గత దశాబ్దంగా దగాకోరుల చేతుల్లో పడి తన సార్థకతను కోల్పోతున్నది. చైనా కమ్యూనిస్టు పార్టీ నడిపిన లాంగ్ మార్చ్ గాని, బ్రిటిష్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ మద్రాసు రాష్ట్రంలోని తెలుగుజిల్లాలలో అటు చివర ఇచ్ఛాపురం నుంచి రాష్ట్ర రాజధాని మద్రాసు దాకా 1938లో సాగిన రైతు రక్షణ యాత్ర గాని, ప్రజలను చైతన్యవంతం చేసి, పోరాట పథంలోకి తీసుకొచ్చే లక్ష్యంతో సాగాయి. కాగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో సాగుతున్న పాదయాత్రల ఏకైక లక్ష్యం తాము అధికారం లోకి రావడానికి ప్రజలను మాయ చేయడం. అప్పటి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించే పేరుతో 2003లో వై ఎస్ రాజశేఖర రెడ్డి ఇచ్ఛాపురం నుంచి చేవెళ్ల దాకా నిర్వహించిన పాదయాత్ర వల్లనే ఆయనకు అధికారం దక్కిందని రాజకీయ నాయకులు ఒక సూత్రం తయారు చేసిపెట్టుకున్నారు. ఇప్పుడు ఆ సూత్రాన్నే మళ్లీ ఒకసారి ప్రయోగిస్తున్నారు. కాని ఆ పాదయాత్ర జరిగినా, జరగకపోయినా, అప్పటికే తొమ్మిదిన్నర సంవత్సరాల చంద్రబాబు పాలనలో, ప్రపంచబ్యాంకు నిర్దేశిత విధానాలతో, వరుస మూడు సంవత్సరాల కరవుతో విసిగిపోయిన ప్రజలు తెలుగుదేశం పార్టీని గద్దె దించడానికి నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయానికి పాదయాత్ర కొంత తోడ్పడి ఉండవచ్చు గాని అదే ఏకైక కారణం కాదు. అదే ఫార్ములాను అమలుచేస్తూ చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అక్టోబర్ 2న హిందూపురం నుంచి 'వస్తున్నా మీకోసం' పేరుతో పాదయాత్ర ప్రారంభించారు. ఇది మొదటి దశలో 13 జిల్లాలలో 2,340 కి.మీ. సాగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల, మరొక ప్రత్యామ్నాయం కనబడక ప్రజలు ఈ యాత్రలో చంద్రబాబుకు ఆదరణ చూపుతుండవచ్చు. కాని ఇప్పటికి సాగిన మూడు వారాల యాత్రలో చంద్రబాబు ఉపన్యాసాలలో వాగ్దానాల వెల్లువ చూస్తే అవి ఆయన నోటినుంచి వస్తున్న మాటలేనా అని ఆశ్చర్యం కలుగుతున్నది. ఈ అబద్ధాలతో, బూటకపు వాగ్దానాలతో ఆయన మళ్లీ అధికారానికి వస్తానని ఆశిస్తే అది అత్యాశే అవుతుంది. మరొకపక్క రాజశేఖర రెడ్డి కూతురు, ప్రస్తుతం అక్రమార్జన కేసులలో జైలులో ఉన్న జగన్ మోహన్ రెడ్డి చెల్లెలు షర్మిల అక్టోబర్ 18న ఇడుపులపాయ నుంచి మూడువేల కి.మీ. యాత్ర ప్రారంభించారు. ఈ యాత్రలలో అటు చంద్రబాబు నాయుడైనా, ఇటు షర్మిల అయినా స్పష్టంగా, బహిరంగంగా తమకు అధికారం ఇమ్మని, తమకు అధికారం ఇస్తే ప్రజల బతుకులు బాగుపడతాయని మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారు. ప్రజలు వీరిలో ఒకరి పాలనను స్వయంగా చూసి ఉన్నారు, మరొకరి తండ్రి పాలననూ చూసి ఉన్నారు. అవినీతి, అక్రమార్జన, ప్రజల వనరులను కొల్లగొట్టడం, ప్రజలమీద భయంకరమైన నిర్బంధాన్ని, పీడనను అమలు చేయడం తప్ప ఆ పాలనలలో మరేమీ లేదు. ఈ పాదయాత్రలవల్ల యాత్రికుల పాదాలకు కొత్తగా బొబ్బలు వస్తాయేమో గాని, నిప్పుల గుండాలలోనే బతుకుతున్న ప్రజల జీవితాలకు, ఉపాధులకు తగిలిన బొబ్బలూ దెబ్బలూ ఎప్పటికీ మరపుకు రావు. వీ

ఛావెజ్ గెలుపు ఆశాసూచికేనా?


వెనిజ్యులా అధ్యక్షుడు హ్యూగో ఛావెజ్ అక్టోబర్ 7న జరిగిన ఎన్నికలలో 54.5 శాతం వోట్లు సంపాదించి 2013 జనవరి 19 నుంచి 2019 జనవరి 13 దాకా అధికారంలో ఉండే అధ్యక్షుడిగా నాలుగోసారి గెలుపొందారు. వెనిజ్యులాలో బొలివారియన్ విప్లవ నాయకుడిగా, ఇరవయ్యొకటో శతాబ్ది సోషలిజం నిర్మాతగా ప్రశంసలు అందుకుంటున్న ఛావెజ్ గెలుపు ప్రగతిశీల శక్తులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. పదమూడు సంవత్సరాల కింద, 1999లో అధికారం చేపట్టిన నాటి నుంచి కుట్రలను, హత్యా ప్రయత్నాలను, దుష్ప్రచారాలను, ఆర్థిక ఆంక్షలను, వ్యక్తిగత అనారోగ్యాన్ని ఎదుర్కొంటూ, మూడుసార్లు ఎన్నికలలో విజయం సాధించి, తనదైన శైలిలో సోషలిజం నిర్మాణానికి ప్రయత్నిస్తున్న నేతగా కూడ ఛావెజ్ అభినందనీయుడే. కాని లాటిన్ అమెరికా రాజకీయాలను అధ్యయనం చేస్తే, ఛావెజ్ ను ప్రశంసిస్తూనే ఈ విజయాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని అనిపిస్తున్నది. అసలు వ్యవస్థ మారకుండా, ఉన్న వ్యవస్థలోనే ఎన్నికల ద్వారా అధికారం లోకి వచ్చి నిజమైన ప్రజానుకూల సోషలిస్టు వ్యవస్థను నిర్మించడం సాధ్యమేనా అనే ప్రశ్నకు తగిన సమాధానం చెప్పకోకుండా ఛావెజ్ గెలుపును ప్రశంసించడం సాధ్యం కాదు. అలా ప్రశంసించడం సంస్కరణవాదులకు, ఉన్న వ్యవస్థలో చిన్నచిన్న మార్పులతో సంతృప్తి పడదలచినవారికి సరిపోతుందేమో గాని, మౌలిక పరివర్తన కోరుకునేవారు ఈ గెలుపును ఆశాసూచికగా చూడలేరు. స్వయంగా ఛావెజే తన మొదటి మంత్రివర్గ సమావేశంలో తాము ఎంత కోరుకున్నా కమ్యూన్లు స్థాపించడంలో విఫలమయ్యామని, ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని అన్నారంటే తన ప్రయోగపు పరిమితులు ఆయన కూడ గుర్తించారనుకోవాలి. ఉత్పత్తి సాధనాలపై, వినియోగంపై సామాజిక యాజమాన్యం పెంచాలనీ, సంక్షేమ కార్యక్రమాల వ్యయం పెంచాలనీ, స్థానిక నిర్ణయాధికారంలో మరింత ప్రజా భాగస్వామ్యం కావాలనీ, స్వతంత్ర విదేశాంగ విధానం ఉండాలనీ, ప్రజానుకూల పన్నుల విధానం ఉండాలనీ, ఉచిత ప్రజారోగ్యం, ఉచిత విద్య, దేశంలోని చమురు నిక్షేపాలపై ప్రజలకే అధికారం ఉండాలనీ ఛావెజ్ వాదిస్తున్నారు. ఇవన్నీ జరగాలంటే రాజకీయార్థిక శక్తుల బలాబలాలు మారాలి. ప్రజావ్యతిరేకశక్తుల బలం తగ్గాలి. కాని వ్యవసాయ, చమురు రంగాలలో తప్ప మిగిలిన ఎ రంగంలోనూ, పదమూడు సంవత్సరాల తర్వాత కూడ బొలివారియన్ విప్లవ శక్తుల అదుపు పెరగలేదు. దేశంలో ఇప్పటికీ ద్రవ్య రంగంలో ఎనభై శాతం అధికారం సంపన్న వర్గాల చేతుల్లోనే ఉంది. ఉత్పత్తి, సేవా, వర్తక వాణిజ్య రంగాలలో ఇప్పటికీ ప్రైవేట్ పెట్టుబడిదే ఆధిక్యత. ప్రచార సాధనాలపై అభివృద్ధి నిరోధక సంపన్న వర్గాల గుత్తాధిపత్యమే ఉంది. లాటిన్ అమెరికాలో ప్రధాన చమురు ఉత్పత్తి దేశంగా వెనిజ్యులా చమురు ఎగుమతుల మీద మాత్రమే ఆధారపడుతోంది. ఇరుగుపొరుగు లాటిన్ అమెరికన్ దేశాల ప్రభుత్వాలతో సఖ్యత కోసం రాజీలకు సిద్ధపడుతోంది. చివరికి కొలంబియా సరిహద్దులు దాటివచ్చిన ఆ దేశపు మార్క్సిస్టు గెరిల్లాలను వెనిజ్యులా ప్రభుత్వం బంధించి కొలంబియా ప్రభుత్వానికి అప్పగించింది. ఈ లోపాలతోనైనా, తన పరిమితుల లోపలే అయినా సోషలిస్టు విధానాలను వెనిజ్యులా నిజంగా అమలు చేస్తే అమెరికా, సిఐఎ ఊరుకుంటాయా? చిలీ పునరావృతం అవుతుందా? హ్యూగో ఛావెజ్ మరొక సాల్వదార్ అయెండె అవుతారా? సోషలిజానికి దగ్గరదారి లేదని అయెండె చూపారు. ఉందని ఛావెజ్ చూపగలరా? వీ



- **చైనా–** వంద ప్రశ్నలు – జవాబులు – అనువాదం: జి. సత్యనారాయణరెడ్డి –పోరునేల ప్రచురణ – 189 పేజీలు, 1/8 డెమీ, రు: 75, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు




- **వాడిపోని మాటలు** – భూమిక సంపాదకీయాలు – కొండవీటి సత్యవతి – భూమిక ప్రచురణలు – 278 పేజీలు, 1/8 డెమీ, రు: 150, ప్రతులకు: భూమిక, ఎచ్ఐజి–2, బ్లాక్ 8, ఫ్లాట్ 1, వాటర్ టాంక్ వెనుక, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్–44. ఫోన్: 040–27660173




- **చింతల్నార్** – బాసగూడ మారణహోమం – విప్లవ జనతన సర్కార్ నేపథ్యం – పాణి – విప్లవ రచయితల సంఘం – 84 పేజీలు, 1/8 డెమీ, రు: 40, ప్రతులకు: దిశ పుస్తక కేంద్రం; సహచర బుక్ మార్క్; నవోదయ బుక్‌హౌస్



- **'వన'జనపథం**–హక్కుల న్యాయవాది ఎం.ఎ. వనజ స్మృతిలో –సంకలనం : కె. సజయ, ఎం.ఎ. వాసు, ఆర్. వెంకటరెడ్డి – దిశ సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్ –128 పేజీలు, 1/8 డెమీ, రు: 100, ప్రతులకు: కె. సజయ, 1-3-183/40/70/104, స్ట్రీ నెం. 9, చంద్రా అపార్ట్‌మెంట్స్, ఎస్‌బిఐ కాలనీ, బాకారం, గాంధీనగర్, హైదరాబాద్–80, ఫోన్: 040–27610963




- **కామ్రేడ్ వీరన్న** – మల్లయ్య – అను పబ్లికేషన్స్ – 102 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: అనురాధ, కనకమ్మ సదనం, ఇ.నెం. 5-2-174/ 62ఎన్, గాంధీనగర్, వనస్థలిపురం, హైదరాబాద్ – 70. సెల్: 9395103108, 9908853052




- **యామినీ కుంతలాలు** – నాయుని కృష్ణమూర్తి – వియన్నార్ బుక్‌వరల్డ్ – 182 పేజీలు, 1/8 డెమీ, రు: 70, ప్రతులకు: వియన్నార్ బుక్ వరల్డ్, చౌడేపల్లి – 517 257, చిత్తూరు జిల్లా



- **ఎంబిసిలు ఏం చేయాలి?** – కోలపూడి ప్రసాద్ – ఎంబిసి అధ్యయన వేదిక ప్రచురణ – 220 పేజీలు, 1/8 డెమీ, రు:200, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




- **కార్మికవర్గ భావజాల ప్రచారంకై నూతన పద్ధతుల అన్వేషణ** (సంకలనం) – లియో హ్యూబర్‌మన్, మైఖేల్ డి. యేట్స్, బ్రూస్ రాపాపోర్ట్, మైఖేల్ మీరొపోల్ – లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ – 52 పేజీలు, 1/8 డెమీ, రు:20, ప్రతులకు: విశాలాంధ్ర; ప్రజాశక్తి; మైత్రి; దిశ; సహచర; నవయుగ; మణి బుక్‌స్టాల్స్




- **నేను రుద్రవీణని... జగిత్యాలని!** – దీర్ఘ కవిత, ఫొటోలు – కె.వి. నరేందర్, సంగెవేని రవీంద్ర – సిద్ధార్థ పబ్లికేషన్స్, ముంబై – 48 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: కెవి నరేందర్ (9440402871), సంగెవేని రవీంద్ర (09987145310)



- **మిసిమి** – వ్యాసాలు – నరిసెట్టి ఇన్నయ్య –230 పేజీలు, 1/8 డెమీ, రు. 125, ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్; నవోదయ బుక్‌హౌస్; ఆర్ట్స్ అండ్ లెటర్స్



- **కించిద్విషాదం** – ముక్తవరం పార్థసారథి – వికాసం బుక్స్ – 99 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: ముక్తవరం పార్థసారథి, 411, ప్రభాత్కర్ అపార్ట్‌మెంట్స్, విజయనగర్ కాలనీ, హైదరాబాద్– 500 057; సెల్: 9177618708; ప్రజాశక్తి; విశాలాంధ్ర; నవోదయ



- **ఘంటారావం** – మూలం: విక్టర్ హ్యూగో; అనువాదం: సూరంపూడి సీతారాం – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 186 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 067; ఫోన్: 040–23521849




- **మంటిదివ్వ** – కవిత్వం – సిరికి స్వామినాయుడు – స్నేహ కళా సాహితి ప్రచురణ – 106 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: సిరికి స్వామినాయుడు, ఎచ్.ఎం., బంగారమ్మ కాలనీ, బెల్గాం, పార్వతీపురం, విజయనగరం – 535501; సెల్: 9494010330



- **రెక్కల హరివిల్లు** – కథా సంపుటి – సలీం – పాలపిట్ట బుక్స్ – 156 పేజీలు, 1/8 డెమీ, రు: 100, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500 036.



- **పొద్దు పొడుపు** – కవిత్వం – అన్నవరం దేవేందర్ – సాహితీ సోపతి – 77 పేజీలు, 1/8 డెమీ, రు. 65, ప్రతులకు: శ్రీమతి రాజేశ్వరి, ఫ్లాట్ నెం. 406, మారుతి హెవెన్స్, భగత్‌నగర్, కరీంనగర్ – 505001



- **సవర గ్రామర్** – ఎ టాగ్‌మెమిక్ మోడెల్ – డా. ఎ. చంద్రశేఖరరావు – ఆదర్శ కళా మందిరం – 229 పేజీలు, 1/8 డెమీ, రు. 133, ప్రతులకు: డా. ఎ. చంద్రశేఖరరావు, ఆదర్శ కళా మందిరం, మాడుగుల స్ట్రీట్, పొందూరు, శ్రీకాకుళం – 532 168; ఫోన్: 08941–242141; సెల్: 9949605141; ఇమెయిల్–savaralanguage@gmail.com

ఆర్‌డిఎఫ్‌పై నిషేధం హక్కుల్ని కాలరాయడమే

రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఆర్‌డిఎఫ్)పై ఆగస్ట్ 9న రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 23న విప్లవ రచయితల సంఘం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ నిర్వహించింది. ప్రజాస్వామిక హక్కుల్ని పాలక విధానాలు కాలరాస్తున్నాయనీ, అందులో భాగంగానే ఆర్‌డిఎఫ్‌పై నిషేధం విధించారనీ సుప్రసిద్ధ రచయిత్రి, సామాజిక కార్యకర్త అరుంధతీరాయ్ పేర్కొన్నారు. 'నిషేధాలు, అక్రమ అరెస్టులు – రాజ్య స్వభావం' అన్న అంశంపై ఆమె ప్రసంగించారు. ముస్లింలను, విప్లవకారులను ఉగ్రవాదులుగా చిత్రీకరించి, దాడి చేసే పాలక విధానాలను ప్రతిఘటిస్తూ, సంఘటిత ఉద్యమాన్ని నిర్మించాలని ఆమె పిలుపునిచ్చారు. సభకు విరసం కార్యదర్శి పి. వరలక్ష్మి అధ్యక్షత వహించారు. వక్తలుగా బొజ్జా తారకం, జీవన్ కుమార్, మహమ్మద్ లతీఫ్ ఖాన్, ఎం. వేదకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మార్చ్

రాజకీయ జెఎసి పిలుపు మేరకు సెప్టెంబర్ 30న జరిగిన 'తెలంగాణ మార్చ్' విజయవంతమైంది. ఐదు లక్షలకు పైగా తెలంగాణ ప్రజలు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌కు తరలివచ్చి, తమ ఆకాంక్షను మరోసారి ఎలుగెత్తి చాటారు. పీపుల్స్ ప్లాజా నుంచి సంజీవయ్య పార్క్ వరకు ఇసుకవేస్తే రాలనంతగా జనం తరలివచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు మాత్రమే అనుమతించినా ప్రజలు ఉదయం తొమ్మిది గంటల నుంచే నెక్లెస్ రోడ్డుకు చేరడం మొదలుపెట్టారు. మార్చ్‌కు వస్తున్న వారిని ఎక్కడికక్కడ పోలీసులు నిలువరించారు. పలు రైళ్లు, బస్సు సర్వీసులను ముందుస్తుగానే రద్దు చేశారు. ఉస్మానియా విద్యార్థులను మార్చ్‌లో పాల్గొనకుండా అడ్డుకున్నారు. వీటన్నిటికీ నిరసనగా మార్చ్ రాత్రి పదకొండు గంటల వరకు కొనసాగింది. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, విద్యార్థులు, మహిళలు, రైతులు, కార్మికులు ఇలా వివిధ జీవన రంగాలకు చెందిన ప్రజలందరూ మార్చ్‌ను విజయవంతం చేశారు.

జీవ వైవిధ్య సదస్సు

అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సు అక్టోబర్ 1 నుంచి 19 వరకు హైదరాబాద్‌లోని 'హైదరాబాద్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్' (ఎచ్ఐసిసి)లో జరిగింది. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జయంతీ నటరాజన్ సదస్సును ప్రారంభించారు. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అక్టోబర్ 16న ఈ సదస్సులో పాల్గొన్నారు.

'మీకోసం వస్తున్నా' చంద్రబాబు పాదయాత్ర

తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవ సాధన కోసం చంద్రబాబు నాయుడు అక్టోబర్ 2 నుంచి 117 రోజుల పాటు సాగే పాదయాత్రను మొదలుపెట్టారు. ఈ పాదయాత్ర 130 నియోజకవర్గాల మీదుగా, 2300 కిలోమీటర్లు కొనసాగనున్నది. అనంతపురం జిల్లా హిందూపురం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. జనవరి 26న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ముగియనుంది. రాష్ట్రంలోని సమస్యలను ఏకరువు పెడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను విమర్శిస్తూ ఆయన యాత్ర కొనసాగుతోంది.

అక్రమ ఆస్తులు కొండంత.. జప్తులు గోరంత..

జగన్ అక్రమ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి.) చర్యలు ప్రారంభించింది. జగన్ అక్రమ ఆస్తుల కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్ జగన్మోహనరెడ్డికి చెందిన 51 కోట్ల రూపాయల విలువైన స్థిర, చరాస్తుల జప్తుకు అక్టోబర్ 4న ఇ.డి. ఆదేశాలు జారిచేసింది. ద్రవ్య అక్రమ చలామణీ చట్టం (పిఎంఎల్ఎ) కింద చర్యలు తీసుకొంది. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ప్రభుత్వం తరపున పొందిన 'మేళ్ల'కు ప్రతిఫలంగా జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హెట్రో డ్రగ్స్, అరబిందో ఫార్మాలతో పాటు, జగన్‌కు చెందిన జగతీ పబ్లికేషన్స్, జనని ఇన్‌ఫ్రా సంస్థల స్థిర, చరాస్తులపై ఇ.డి. దర్యాప్తు జరిపింది.

ఆత్మహత్యలు పురుషుల్లోనే ఎక్కువ!

గత ఏడాది వివిధ కారణాలతో మన రాష్ట్రంలో 15,077 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో 10,120 మంది పురుషులు, 4,957 మంది మహిళలు ఉన్నారు. 15–29 ఏళ్ల వయసు కలిగిన వారిలో మొత్తం 5,112 మంది ఆత్మహత్యలు చేసుకోగా, వారిలో యువకులు 2828 మంది, యువతులు 2,284 మంది ఉన్నారు. 30–44 ఏళ్ల మధ్య 3,551 మంది పురుషులు ఆత్మహత్యలు చేసుకోగా, మహిళలు 1,555 మంది ఆత్మహత్యల పాలయ్యారు. ఇటీవల జాతీయ క్రైం బ్యూరో రికార్డు ఈ విషయాలను వెలువరించింది.

కిడ్నీలూ దొంగలిస్తున్నారు!

'కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో రోగులకు తెలియకుండానే కిడ్నీలు దొంగలిస్తున్న పరిస్థితి ఉంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన మందుల్లోనూ కల్తీ చేస్తున్నారు. వీటిని బట్టి అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వీటన్నిటిపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, సమాజంలో మార్పునకు కృషి చేసేందుకు యువత ముందుకు రావాలి' అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఎస్.వి. యూనివర్సిటీలో మానవహక్కులు, సామాజిక అభివృద్ధి విభాగం విద్యార్థులతో అక్టోబర్ 13న ఆయన ముఖాముఖి మాట్లాడారు.

సోంపేట పవర్ ప్రాజెక్ట్‌ను అనుమతించడం లేదు

శ్రీకాకుళం జిల్లా సోంపేట పరిధిలో నాలుగు వేల ఎకరాల బీల భూముల్లో నాగార్జున కంస్ట్రక్షన్ కంపెనీ తలపెట్టిన పవర్ ప్రాజెక్ట్‌కు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ (ఎంఒఇఎఫ్) అనుమతులు ఇవ్వడం లేదని ఎంఒఇఎఫ్ బోర్డు సభ్యుడు డా. ఇ.జె. జేమ్స్ తెలియజేశారు. హైదరాబాద్‌లోని జీవవైవిధ్య సదస్సులో భాగంగా చిత్తడి నేల సంరక్షణపై అక్టోబర్ 9న జరిగిన సమాంతర భేటిలో పాల్గొనడానికి వచ్చిన ఆయన ఈ విషయం తెలియజేశారు.

ప్రజా జీవ వైవిధ్య సదస్సు

యాభైకి పైగా దేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు కలిసి ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 'ప్రజా జీవ వైవిధ్య సదస్సు' అక్టోబర్ 13 నుంచి 16 వరకు హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నాలుగు రోజులపాటు జరిగాయి. ఈ సదస్సులో పదిహేను రాష్ట్రాలకు చెందిన రైతులు, ఆదివాసులు, వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. అరవై స్టాళ్లు ఏర్పాటు చేసి సాంప్రదాయ వ్యవసాయ ఉత్పత్తులను, ప్రజల జీవితంలో భాగమైన వైవిధ్య పంటలను, అటవీ ఉత్పత్తులను, ఔషధ మొక్కలను, జీవవైవిధ్యానికి సంబంధించిన పలు చిత్రాలను ప్రదర్శించారు. చివరి రోజున జీవవైవిధ్యం కాపాడమని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ 21 తీర్మానాలు చేశారు.

'మరో ప్రజాప్రస్థానం'

వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీని బలపరచాలని కోరుతూ, అక్రమ ఆస్తుల కేసులో అరెస్టై జైల్లో ఉన్న ఆ పార్టీ నేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సోదరి షర్మిల అక్టోబర్ 18న 'మరో ప్రజా ప్రస్థానం' పాదయాత్రను ప్రారంభించారు. వీ

జీవ వైవిధ్యం కాదు జీవ విధ్వంసం

నాగరికత పేరుతో ప్రకృతిపై, సహజ వనరులపై దాడి ఎప్పటి నుంచి మొదలైందో, అప్పటి నుంచే జీవ వైవిధ్యానికి హాని మొదలైందని అంటున్నారు **కె.వి. కూర్మనాథ్**

అక్టోబర్‌లో పంతొమ్మిది రోజులపాటు జీవవైవిధ్యంపై హైదరాబాద్‌లో ఒక తమాషా జరిగింది. చూడ్డానికి ఒక తమాషాగా, సర్కస్‌లాగా, తిరునాళ్లలాగా ఉన్నా దీని వెనుక ఒక పెద్ద దుర్మార్గమే ఉంది. ఒక అప్రజాస్వామిక దాడి ఉంది. అసలు ఆ సమావేశంలో ఏం జరిగిందో చర్చించే ముందు అసలు ఆ సమావేశం వెనుక ఉన్న దురుద్దేశాన్ని, కుట్రని అర్థం చేసుకోవాలి.

జీవ వైవిధ్యం ప్రకృతి మనకిచ్చిన గొప్ప సంపద. సమస్త జీవుల ఉనికికి ఆధారం. లక్షల రకాల జీవుల సహజీవనం, పరస్పర సహకారం, హననం – జీవ వైవిధ్యం ఒక గొప్ప సంరంభం. కాలాలకు అనుగుణంగా, రుతువుల చక్రంలో నవనవలాడుతూ, వాడిపోతూ, వర్ధిల్లుతున్న వైవిధ్య భరితమైన ఉనికి మనది. (కేవలం మనదే అనుకోవడం స్వార్థమూ, అన్యాయమూ. అది సమస్త ప్రాణి జాతికి సంబంధించినది.) వేల సంవత్సరాలుగా ప్రకృతితో, ప్రకృతిలో ఉండి జీవ వైవిధ్యాన్ని కాపాడింది మనం. మనం అనేకంటే ఆయా దేశాల్లో ఉండే మూలవాసులు, రైతులు, ఇంకా ప్రకృతితో ప్రత్యక్ష సంబంధాల్లో ఉండిన మెజారిటీ ప్రజలు.

నాగరికత పేరుతో ప్రకృతిపై, సహజ వనరులపై దాడి ఎప్పటి నుంచి మొదలైందో అప్పటి నుంచే జీవ వైవిధ్యానికి అపకారం మొదలైంది. ఎప్పుడైతే మన అవసరాల కోసం కాకుండా ఆడంబరాల కోసం, సౌఖ్యాల కోసం సహజ వనరుల్ని విచక్షణా రహితంగా వాడడం మొదలుపెట్టామో అప్పటి నుంచే భూమ్మీద ఎక్కడో ఒకచోట ఏదో ఒక జీవధాతువుకు వినాశనం కలగడం మొదలైంది.

ఈ జీవవైవిధ్య సమావేశాలకు అసలు లక్ష్యం జీవవైవిధ్యాన్ని కాపాడడం కాదు. విచ్చలవిడి దోపిడీకి, సైన్స్ పేరుతో ప్రకృతిపై ప్రమాదకరమైన దాడికి మరికొన్ని అనుమతులు తీసుకోవడం. మరికొన్ని జాతుల అంతానికి, ఇంకొన్ని వనరుల కైంకర్యానికి తోవను తయారు చేసుకోవడం. ఇది మొదటికుట్ర. రెండోది చర్చలో మనల్ని భాగస్వాములు కాకుండా చూసి జీవవైవిధ్యంపై తమదే చివరిమాట అని నిరూపించడం. జీవవైవిధ్యం సజీవంగా సమతుల్యంగా ఉంటే మనం బాగుంటాం. అది కేవలం మన అవసరమే కాదు, మన బాధ్యత కూడా. అందుకే కొన్నివేల ఏళ్లుగా దాన్ని కాపాడుకుంటూ అందులో భాగమై బతుకుతున్నాం. జీవవైవిధ్యాన్ని దెబ్బతీస్తే మనకి నష్టం. కానీ వాళ్లకి లాభం. ఏ విషయంపైన చర్చలోనైనా ఆ విషయంలో భాగస్వాములైన, లాభనష్టాలకు గురయ్యేవాళ్లందరికీ భాగస్వామ్యం ఉండాలి. నువ్వు గెలుస్తావా, ఓడుతావా అన్నది తరువాత విషయం. కానీ చర్చలో భాగస్వామ్యం ఉండడం అనేది కనీస ప్రజాస్వామిక హక్కు. కానీ జీవవైవిధ్యానికి హాని జరిగితే నష్టపోయే పక్షానికి ఈ ప్రపంచస్థాయి చర్చల్లో ప్రాతినిధ్యం అస్సలే లేదు. కేవలం ప్రాతినిధ్యం లేకపోవడం మాత్రమే కాదు, వాళ్లెవరూ కనీసం రెండు మూడు కిలోమీటర్ల చుట్టుపక్కలకి రాకుండా ఎన్నో అంచెల భద్రతను పెట్టారు. చర్చను పూర్తిగా తమ చేతుల్లో పెట్టుకొని ఒక స్పష్టమైన సందేశాన్ని ఇవ్వదల్చుకున్నారు. 'మీ జీవవైవిధ్యానికి మేం పరిమితులు పెడుతున్నాం. మీరేమీ చేయలేరు. మీకా ఆస్కారం లేదు'అని.

అస్సలే అసమ్మతి గొంతుకకు చోటులేదా అంటే, ఉంది. అది మైనారిటీ గొంతుక. ఏవో కొన్ని ఎన్‌జిఒలకు ఇందులో చాలాకొంచెం స్థానం కల్పించారు. వీళ్లది ఎంత మైనారిటీ అంటే పదివేల మంది పట్టే హెచ్ఐసిసి కన్వెన్షన్ హాల్లో ప్రధాన సమావేశాలుంటే, కేవలం పాతిక ముప్పై మంది పట్టే చిన్న గదులకే వీళ్లని పరిమితం చేశారు. భిన్నస్వరాల వారు మాట్లాడితే భిన్నస్వరాల వారు విన్నారు. కానీ, ప్రధాన సమావేశాల్లో ఈ స్వరాలకు చోటు అసలే లేదు. ఇది పశ్చిమదేశాలు, ముఖ్యంగా అమెరికా కనిపెట్టి, అద్వితీయ నైపుణ్యం, సంపాదించిన విద్య. ఏదైనా విషయం పట్ల – ముఖ్యంగా ప్రజాస్వామ్యం, హక్కులు, హింస, పేదరికం వంటి వాటిలో – గోల లేదా చప్పుడు (నాయిస్)ని అనుమతిస్తారు. ఈ గోల వల్ల, చప్పుడు వల్ల మధ్యతరగతి ప్రజలు ఏదో ముఖ్యమైన చర్చ జరుగుతోందిలే అన్న భ్రమకు లోనవుతారు. ఆయా ప్రభుత్వాలు ఆయా విషయాల్లో ఎంత అనైతికంగా, అన్యాయంగా, ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ప్రవర్తించాయో మరుగున పడిపోతుంది. విజయవంతంగా ఆ దేశాలు అనుకున్న పనులు పూర్తి అయిపోతాయి. సరిగ్గా జీవవైవిధ్యం పట్ల హైదరాబాద్ సమావేశాల్లో అదే జరిగింది. వాళ్లందరూ (అంటే ప్రభుత్వాలు, మల్టీనేషనల్ కంపెనీలు) జీవవైవిధ్యం గురించి చర్చలు చేస్తాయి. పత్రికలు విపరీతమైన ప్రచారం కల్పిస్తాయి. 'అందరు భాగస్వాములకు స్థానం లేని చర్చలివి' అని ఎక్కడా విమర్శ రాదు. అందువల్ల ఇవి అప్రజాస్వామికంగా జరుగుతున్న చర్చలు అని కూడా ఎవరూ అనరు. ఒకవేళ ఏ విశాఖపట్నం లోనో, హైదరాబాద్‌లోనో ఈ సమావేశానికి వ్యతిరేకంగా చర్చ జరిగితే దానికి ఇక్కడ జీవవైవిధ్య వార్తలకు ఇస్తున్న ప్రాముఖ్యం ఇవ్వరు. ఒకవేళ ఇచ్చినా ఏదో పిల్లపత్రికలో ఒకమూల ఎక్కడో చిన్నవార్త వస్తుంది. అంటే చర్చ విజయవంతంగా మనచేతిలోంచి జారిపోయిందన్నమాట. మన మనుగడకు చాల ముఖ్యమైన చర్చలోంచి మనం పక్కకు తొలగించబడుతాం. మన మందరమూ ఏదో తమాషా చూసినవాళ్లమైపోతాం. ముఖ్యమంత్రి ప్రకటించినట్టుగా వందకోట్లతో జీవవైవిధ్యం పై ఒక మ్యూజియం వెలుస్తుంది. మనకు సంబంధించిన వ్యవసాయ సంపద చిహ్నాలు, విత్తనాలు, జ్ఞానం ఆ మ్యూజియంలో వస్తువులైపోతాయి.

మూడో కుట్ర – చర్చకు పెట్టిన విధివిధానాలు. జీవవైవిధ్యానికి అసలు నష్టమెలా జరుగుతుందీ, ఎక్కడ జరుగుతుందీ, దానికి బాధ్యులెవరు, అందువల్ల అంతరించి పోతున్న జాతులేవీ, నష్టపోయే వారికి నష్టపరిహారమెంతా, అది ఎవరు చెల్లించాలి, ప్రకృతికి పూడ్చలేని నష్టం వాటిల్లితే దానికి బాధ్యులెవరు – ఇవీ న్యాయబద్ధంగా చర్చకు రావల్సిన అంశాలు. ఇంకా మన లాంటి దేశాల్లో జరుగుతున్న సహజ వనరుల దోపిడీ, పర్యవసానంగా జరిగే పర్యావరణ హననం, దెబ్బతినే మానవ, జంతు, వృక్ష జాతులు–వీటి రక్షణ చర్చకు రావాలి. ఇవీ మనల్ని వేధిస్తున్న ప్రశ్నలు. కానీ వాళ్లకి కావల్సినవి ఇవి కావు.

వాళ్లకి కావల్సినవి భిన్నమైనవి. వాళ్ల లక్ష్యాలు వేరు. అవి మన ప్రయోజనాలకు, మనుగడకు భంగం కలిగించేవి. అందుకే చర్చల నుంచి మనల్ని చాలా కుట్రపూరితంగానే దూరంగా ఉంచారు. ఉదాహరణకు వ్యవసాయ రంగంలో బయోటెక్నాలజీ. ఇది మోనోకల్చర్ కు దారి తీస్తుందని ఇప్పటికే రుజువైంది. (మోనోకల్చర్ అంటే ఏదో ఒకజాతి మొక్క మాత్రమే ప్రధానమైపోవడం. ఉదాహరణకు మన దేశం లో పత్తి. ఇది మరే పంటలకు స్థానం లేకుండాచేస్తుంది. మొట్టమొదటి సారిగా మన రాష్ట్రంలో పత్తి వరిపంట విస్తీర్ణాన్ని మించి పోయింది. ఇది మోనోకల్చర్‌కి దారితీస్తుంది. కొన్నిదేశాల్లో మొక్కజొన్న, సోయా వంటివి మోనోకల్చర్‌గా అవతరిస్తున్నాయి. ప్రకృతిలో అన్ని పంటలు సమానంగా ఉంటేనే జీవవైవిధ్యం సమతుల్యంగా ఉంటుంది.) వ్యాపారానికి అవసరమైన మొక్క తప్ప పొలంలోని మిగతా వృక్ష, ప్రాణి జాతినంతటినీ నాశనం చేయడమే ఈ టెక్నాలజీ లక్ష్యం. అంటే పంట పంటకోసమే. పంటలకి లాభం చేసే పురుగూ పుట్రా, మొక్కలూ ఉంటాయనేది రైతులు కనిపెట్టిన జ్ఞానం. అది ప్రకృతిలో అన్నీ సమానంగా పెరగాలి అన్నది సహజ న్యాయం. అది జీవవైవిధ్యానికి సంబంధించిన అంశం. కలుపుమొక్కల్ని ఏరివేయడం, పంటలకి నష్టం చేసే చీడపీడల్ని వేపరసం వంటి సహజసిద్ధమైన మందుల్ని వాడి తొలగించడం తరాలనాటి సామూహిక విజ్ఞానం. కాని బయోటెక్నాలజీ ఏం చేస్తుందంటే మొక్కల్నే విషపూరితం చేస్తుంది. 'అటువంటి మొక్కల్ని తిని రసం పీల్చే పురుగులు చనిపోతాయి. కాబట్టి మొక్క బతికి మంచి దిగుబడి వస్తుంది' అని బయోటెక్నాలజీ చెప్తుంది. లేకపోతే మొక్కకు పురుగుమందుల్ని తట్టుకునే జీన్స్ ఎక్కిస్తారు. ఆ తరువాత మొత్తం పంటమీద పురుగు మందుని కొడతారు. ఆ జీన్స్ లేని మొక్కలు, క్రిమికీటకాలు చచ్చిపోతాయి. కానీ అసలు పంటకేమీ కాదు. మొక్కలకి సహజసిద్ధమైన బలం ఇచ్చి, వాటిని పురుగుల దాడికి సంసిద్ధం చేస్తే ఎక్కువ ఉపయోగం అన్న సూత్రానికి బయో టెక్నాలజీ వ్యతిరేకం. ఇట్లాంటి టెక్నాలజీలకి దారి సుగమం చేయడమే ఈ జీవవైవిధ్య సదస్సు అంతిమలక్ష్యం.

చర్చ జీవవైవిధ్యం మీద అంటారు. కాని అసలు చర్చేమో (నగోయా సప్లిమెంటరీ ప్రోటోకాల్) మార్చబడ్డ జీవధాతువులు (మాడిఫైడ్ లివింగ్ ఆర్గానిజమ్స్), వాటివల్ల కలిగే నష్టాలు, వాటిని పరిష్కరించడం మీద ఉంటుంది. ఆ సదస్సులో 19 రోజుల చర్చల్లో వచ్చిన అన్ని విషయాల గురించి మాట్లాడడం ఇక్కడ సాధ్యం కాదు కాని, ఈ ఒక్క నగోయా ప్రోటోకాల్ అంశం చూస్తే చాలు ఈ సమావేశం అసలు లక్ష్యం మనకు అర్థమైపోతుంది.

ఈ ప్రోటోకాల్ లక్ష్యాలు, వాళ్ల మాటల్లోనే, ప్రధానంగా రెండు. ఒకటి జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం. రెండు లివింగ్ మాడిఫైడ్ ఆర్గానిజమ్స్ (బీటీ కాటన్‌లో వాడే జీన్ లాంటిది), వాటివల్ల జరిగే నష్టాలకు బాధ్యత వహించడం, ఆ నష్టాలకు గురయ్యేవాళ్లకు పరిష్కారం చూపించడం. ఈ రెండు లక్ష్యాలు ఎంత పరస్పర విరుద్ధమైనవో చూడండి. జీవవైవిధ్యాన్ని కాపాడాలి అంటే, ప్రకృతి మీద దాడి చేయకుండా ఉండాలి. కాని వీళ్ల అసలు లక్ష్యం జీవవైవిధ్యాన్ని కాపాడడం కాదు. దానిమీద దాడి చేయడం. లివింగ్ మాడిఫైడ్ ఆర్గానిజమ్స్‌తో వ్యాపారం చేసే బయోటెక్నాలజీ కంపెనీల ప్రయోజనాల్ని పరిరక్షించడం. అంటే పచ్చని ప్రకృతిలో కృతకమైన, ప్రమాదకరమైన జీన్స్‌ను ప్రవేశపెట్టడం. వ్యవసాయరంగంలో బయోటెక్నాలజీ ప్రమాదం కాదనీ, పెరుగుతున్న ఆహార అవసరాలకు అది అవసరం అని అన్యాపదేశంగా ఈ ప్రోటోకాల్‌లో చెప్తారు.

కానీ నష్టపరిహారం గురించి, అవి సృష్టించే ప్రమాదాల గురించి సీరియస్‌గా మాట్లాడరు. దీనికి రుజువేమిటంటే ప్రపంచ వ్యవసాయాన్ని బయోటెక్నాలజీతో నింపేస్తున్నది అమెరికన్ విత్తన కంపెనీలు. ఎప్పటి నుంచో అమెరికా ఈ బయోటెక్నాలజీని వాడుతున్నదని, కాబట్టి మనకు ఆందోళన అవసరం లేదని, మనం కూడా వాడొచ్చని కొందరు వాదిస్తారు. కానీ చిత్రమేమిటంటే, అమెరికా ఈ ప్రోటోకాల్‌ను అంగీకరించదు. ఇంతవరకూ దీనిపై సంతకం పెట్టలేదు. అంటే బయో టెక్నాలజీ వల్ల జరిగే అనర్థాలకు మాకేమీ బాధ్యత లేదని ప్రకటించడమే.

బయోటెక్నాలజీ వల్ల నష్టం లేదంటూనే, అవసరం అంటూనే ప్రమాదం జరిగితే మాత్రం బాధ్యత తీసుకోవడానికి సంసిద్ధంగా లేవు అమెరికా, యింకా అనేక పశ్చిమదేశాలు. సరిగ్గా అణువిద్యుత్ కేంద్రాల విషయంలో కూడా ఇలాంటి వాదనలే వింటుంటాం. అణువిద్యుత్ వల్ల ప్రమాదం లేదని, క్షేమమని అంటారు. కానీ నష్టపరిహారం విషయంలో మాత్రం బాధ్యతని ఒక బిలియన్‌కో, రెండు బిలియన్లకో కుదిస్తారు. నష్టమే లేకపోతే, ప్రమాదమే కాకపోతే నష్టపరిహారం ఒప్పుకునే విషయంలో భయమెందుకో? ఎందుకంటే అటు వ్యవసాయరంగంలో బయో టెక్నాలజీ గానీ, అణువిద్యుత్ కేంద్రాలు గానీ ఎప్పటికైనా ప్రమాద మేనని, ఉపద్రవం తప్పదని వాళ్లకి కూడా తెలుసు. ఏదోరోజు అవి భూమికి కడుపుకోత మిగిలిస్తాయని కూడా వాళ్లకి తెలుసు. అందుకే ఈ విషయంలో వాళ్లు ముందు జాగ్రత్తలు తీసుకుంటారు.

అందుకే ఈ జీవవైవిధ్య సదస్సు మార్కెట్ శక్తుల ప్రమాదకర ప్రయోగాలకు అడ్డూ అదుపూ లేని, బాధ్యత పడాల్సిన అవసరం లేని అనుమతులు తెచ్చుకోడానికే అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇక ఈ సమావేశాన్ని అడ్డుపెట్టుకొని జరిపిన అవినీతి గురించి చెప్పుకోడానికి ఇంకో వ్యాసమే రాయాల్సి ఉంటుంది. దాదాపు 500 కోట్ల రూపాయల నిధులు దీనికోసం మంజూరవగా ఏదో కొద్దిశాతం మాత్రం ఖర్చుపెట్టారు. ప్రధానమంత్రి పరువు కాపాడ్డానికి నిస్సిగ్గుగా కొందరు జర్నలిస్టులను ఎలా అడ్డుకున్నారో తెలంగాణ జీవన వైవిధ్యం గురించి, దాని గుంజాటన గురించి ప్రపంచానికి తెలియకుండా ఎలాంటి కట్టడి జరిగిందో కూడా చూసాం. ఇది జీవ వైవిధ్య సదస్సు కాదు, ఇది జీవవైవిధ్య నాశనం గురించి జరిగిన సదస్సు.

(రచయిత పాత్రికేయులు) వీ

జీవ వైవిధ్యం కాపాడే ఉద్దేశాలున్నాయా?

జీవ వైవిధ్య పరిరక్షణ కోసం గతంలో చేసిన తీర్మానాలేవీ ఇంతవరకు అమలు కాలేదనీ, జీవ విధ్వంసం కొనసాగుతూనే ఉందనీ చెబుతూ ఈ సదస్సుల అసలు ఉద్దేశాలను వివరిస్తున్నారు ఎం. నాగమణి

జీవ వైవిధ్యం గురించి ఘనంగా చెప్పుకుంటున్న పాలకులు దాని పరిరక్షణకు చేస్తున్నదేమిటి? ప్రకృతి వనరులను తవ్వేసి, జీవవైవిధ్య సంపదను సర్వనాశనం చేసి అభివృద్ధికి పునాదులు వేస్తామంటున్న పాలకులు, తమ చర్యల ద్వారా భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నామన్న వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు. రియో డి జెనీరో సదస్సు జరిగి రెండు దశాబ్దాలు దాటినా వాటి ఒప్పందాలు అమలుకు దిక్కులేదు. ఈ ఇరవై సంవత్సరాలలో ఎన్నో అరుదైన జంతుజాతులు హరించుకుపోయాయి. వృక్షజాతులూ నశించిపోయాయి. ఈ రెండూ తన మనుగడకు ప్రాథమికమన్న వాస్తవానికి పాలకులు గుర్తించిన దాఖలాలు మాత్రం కనిపించడం లేదు.

జీవి, జీవనం – ఈ రెండూ మనుగడకు అత్యంత ప్రాథమికం. ఈ రెంటిలో ఏది కొరవడినా, ఒకదానికి ఆసరా మరొకదానికి లేకపోయినా మనుగడే బలహీనం అవుతుంది. సృష్టిలో ఉన్న జీవ వైవిధ్యం మనిషి జీవితానికి, జీవనానికి అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తోందనడం లో ఎలాంటి సందేహం లేదు. మనిషి కోరుకోకుండా ప్రకృతిపరంగా సంక్రమిస్తున్న ఈ వైవిధ్య సేవలను ఏమాత్రం దుర్వినియోగం చేసినా, మితిమీరిన స్థాయిలో వాటిని వినియోగించినా అవి తీవ్రస్థాయి ఆర్థిక ఉత్పాతానికే దారితీస్తుంది. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభానికి మించిన స్థాయిలోనే ఈ జీవ వైవిధ్య సంక్షోభం ఇటు మనిషినీ, అటు ప్రకృతినీ నిస్తేజంగా మారుస్తుంది.

వృక్ష, జంతు జాతులు ఈ భూగోళమంతా విస్తరించాయి. వాటి ద్వారా మానవాళికి పలు విధాలుగా ప్రయోజనం చేకూరుతుంది. అయితే పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వల్ల ఈ వృక్ష జంతు జాతుల రకాలు అనేకం ఇప్పటికే అంతరించాయి. సహజ సిద్ధంగా అంతమవడం కంటే వెయ్యిరెట్లు ఎక్కువ పరిమాణంలో మనిషి వీటి అంతు చూస్తున్నాడు. ఆ విధంగా తనను రక్షిస్తున్న ప్రకృతిని భక్షిస్తున్నాడు. రెండు దశాబ్దాల క్రితం రియో డి జెనీరోలో జీవవైవిధ్య సదస్సు తొలిసారిగా జరిగింది. అప్పటి నుండి జీవ వైవిధ్య పరిరక్షణకు ఐక్యరాజ్య సమితి (ఐరాస) ఎప్పటికప్పుడు కొత్త మార్గదర్శకాలను రూపొందిస్తూనే ఉంది. ఆ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఎన్నో తీర్మానాలను నిర్బంధంగా అమలు చేయాలన్న ఉద్దేశంతో చేపట్టారు. కానీ ఏ ఒక్క పాలక ప్రభుత్వం (ప్రపంచ వ్యాప్తంగా) కూడా వాటిని అమలు చేసిన – చేస్తున్న దాఖలాలు లేవు. పైగా అభివృద్ధి పేరుతో గనుల విచ్చలవిడి తవ్వకాలతో ప్రకృతిని విధ్వంసానికి గురిచేస్తూ జీవ వైవిధ్యానికి ముప్పును కొనితెస్తున్నారు. హరించిపోతున్న జీవజాతులను రక్షించాలనీ, నశించిపోతున్న వృక్షజాతులను కాపాడాలనీ, ఈ విషయంలో ఏమాత్రం ప్రయత్న లోపం జరిగినా, అవి ప్రస్తుత తరానికి కాకుండా భవిష్యత్ తరానికీ ముప్పేనన్న వాస్తవం కళ్లకు కడుతున్న వాటిని చూడలేని మొద్దు నిద్ర మన పాలకులది. అందుకే ప్రకృతి అందాలను సరుకుగా మార్చేసి సొమ్ము చేసుకుని లాభాలు గడించడమే తప్ప, వాటిని పరిరక్షించే ప్రయత్నం ఏ కోశానా జరగడం లేదు.

సంపద కోసమే పాకులాడుతున్న పాలకులు గనుల తవ్వకాలకు విచ్చలవిడిగా అనుమతులు మంజూరు చేస్తున్నారు. జాతి అవసరాలకు అనుగుణంగా ఖనిజాల తవ్వకాలతో దేశ శ్రేయానికి మేలు జరగడం మాట ఏమోగానీ, విదేశీ శక్తుల చేతుల్లో పెట్టి దేశీయంగా తెరవెనుక వ్యక్తుల లబ్ధికి కేటాయింపులు జరుగుతున్నాయి. ఇది ఎవరి ప్రయోజనాలకు అన్న ప్రశ్నకు పాలకుల నుంచి జవాబు లేదు. ప్రకృతిని పణంగా పెట్టి గనుల తవ్వకాలు చేపట్టి అటవీ సందపను దోచుకుంటున్నారు. పర్యావరణానికి తీరని హాని కలిగిస్తున్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, రుతువుల చక్రం గతి తప్పుతోంది. భవిష్యత్ తరాలకు విషతుల్య పర్యావరణాన్ని మిగిల్చే చర్యలకు చరమగీతం పాడకపోతే మానవజాతి వినాశనాన్ని కొనితెచ్చుకున్నట్లే.

ప్రపంచవ్యాప్తంగా కాలుష్య ఉద్గారాలు ఎప్పటికప్పుడు భూతాపాన్ని పెంచేస్తున్నాయి. ఫలితంగా నదులు, జీవనదులు, హిమనీనదాలు కరిగి తరిగిపోతున్నాయి. మంచు శిఖరాలు సైతం గత పదిహేను సంవత్సరాలుగా గణనీయంగా కలిగిపోయినట్లుగా అంతర్జాతీయ నివేదికలు గోస పెడుతున్నాయి. ఇలాంటి విపరీత పరిణామాలు ఫలితంగానే హిమప్రాంతాల్లో నివసించే అదే ఆవాసంగా తరతరాలుగా భాసిల్లుతున్న ఎన్నో జంతుజాతులు కనుమరుగైపోయాయి. కేవలం కొన్ని మాత్రమే అడపాదడపా కనిపిస్తున్నాయి. అంటే మనిషికి ఆవాసం ఎంత అవసరమో, జీవితానికి, జీవనానికీ సానుకూల వాతావరణం ఎంత ముఖ్యమో, జీవజాతులు తమ మనుగడను సాగించాలంటే అదే రకమైన వాతావరణంను వాటికి కల్పించాల్సిన అవసరం ఉంది. అంటే వాటిని ఉండాల్సిన చోట ఉండనిస్తే వాటి సంతతి అదే పెరుగుతుంది. కానీ అలాంటిదేమీ జరగడం లేదు. ఒక జంతు జాతుల విషయంలోనే కాదు, పక్షిజాతుల విషయంలోనూ, వృక్షజాతుల విషయంలోనూ, ఆఖరుకు మనిషి విషయంలోనూ 'అభివృద్ధి' కాంక్ష వాటి ఉనికికే గొడ్డలిపెట్టుగా మారింది. పాలకుల అనాలోచిత 'అభివృద్ధి' కాంక్షను వీడకుంటే అరకొరగా ఉన్న వృక్ష జంతు జాతులు పూర్తిగా అంతరించి పోతాయి.

ఎత్తైన కొండలు ఒకవైపు, దట్టమైన అడవి మరోవైపు, లోతైన

లోయలు, జాలువారే జలపాతాలు, ఉరకలు వేసే నదీనదాలు, మైమరిపించే గాలులు, పక్షుల కిలకిలరావాలు, ప్రకృతి సోయగాలకు తూర్పు కనుమలు పెట్టింది పేరు. అలాంటి తూర్పు కనుమల్లో జీవ వైవిధ్యం తగ్గిపోతున్నది అనేది కఠోర వాస్తవం. గనుల విచ్చలవిడి తవ్వకాలతో తూర్పు కనుమల్లో జీవ వైవిధ్యానికి ముప్పు ఏర్పడుతుందన్న శాస్త్రవేత్తల మాటలు పాలకుల చెవులకు ఎక్కడం లేదు. జీవ వైవిధ్యానికి ఆలవాలంగా ప్రపంచ గుర్తింపు పొంది, మాల్యాద్రి కొండలుగా ప్రత్యేకత సంతరించుకున్న తూర్పు కనుమలు నేడు ప్రమాదం అంచున ఈసురోమంటున్నాయి.

ఎక్కడో పశ్చిమ బెంగాల్లో మొదలై ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల వెంబడి దక్షిణ తమిళనాడు వరకూ విస్తరించిన దాదాపు 2,50,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని తూర్పు కనుమలు అంటున్నాం. ఇవి హిమాలయాల కంటే ముందే ఉద్భవించాయన్నది శాస్త్రవేత్తల అంచనా. ఈ కనుమల వయసు దాదాపు 260 కోట్ల సంవత్సరాలుగా భావిస్తున్నారు. జీవ వైవిధ్య సంపదకు నిలయమైన తూర్పు కనుమల పరిరక్షణ అంశం తెరమీదకు వచ్చింది. 980 చదరపు కిలోమీటర్ల పొడవునా రాష్ట్రంలో విస్తరించిన ఈ అటవీ ప్రాంతంలో 33 ఆదివాసుల తెగలు, 3,200 పుష్పించే మొక్కజాతులు ఉన్నాయి. దాదాపు 200 రకాల పక్షులు, 55 రకాల చేపలు, 89 రకాల సీతాకోక చిలుకలు తూర్పు కనుమల జీవ వైవిధ్యానికి నిదర్శనం.

ఔషధ మొక్కల భాండాగారం

రకరకాల వ్యాధులకు మనం తీసుకునే మందుల్లో ఉపయోగించే రసాయనాలు 70 శాతం మొక్కల నుంచే వస్తాయి. మన దేశంలో కొన్ని వేల జాతుల ఔషధ, సుగంధ మొక్కలుంటే ఇప్పటి వరకు కేవలం 7,500లను మాత్రమే గుర్తించారు. వీటిల్లో నాలుగో వంతు మొక్కలకు తూర్పు కనుమలు ఆవాసం. మహేంద్రగిరి మొదలుకొని, శ్రీకాకుళం వరకు ఉన్న అటవీ ప్రాంతంలో లభించని ఔషధ మొక్క లేదంటే అతిశయోక్తి కాదు. కానీ మనిషి స్వార్థమనండీ, అభివృద్ధి ప్రయత్నమనండీ అటవీ విస్తీర్ణం నానాటికీ చిక్కిపోతోంది.

ఈ కనుమల్లో ఎంతో విలువైన బాక్సైట్, మాంగనీస్, గ్రాఫైట్, క్రోమైట్, ఇనుప ఖనిజం, రాగి, జింక్, మైకా, సిలికా, క్వార్ట్జ్, లెటరైట్‌లతో పాటు కనుమల తీరప్రాంతంలో అణు ధార్మికత కలిగిన మోనాజైట్, ఇల్మనైట్, మ్యాగ్నటైట్, గార్నెట్, సిలిమినైట్ వంటి ఖనిజ సంపద అక్కడి ఇసుకలో నిక్షిప్తమై ఉంది. ఈ విలువైన సంపద కోసం వేట మొదలైంది. మైనింగ్ కార్యకలాపాలు మొదలైతే దాదాపు లక్షన్నర ఎకరాల్లో విస్తరించిన కాఫీ, టేకు, 65 రకాల కలపేతర ఉత్పత్తులు, ఔషధ గుణాలున్న పిప్పళ్ల మోడి, కరక్కాయ, తాడికాయ, చీకాయ, కుంకుడికాయ, అపరాలు వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇవేవీ పాలకవర్గాలకు పట్టడం లేదు. గత ఏడాది వచ్చిన గనుల చట్టంతో ఈ ఆడవుల మనుగడ ప్రశ్నార్థకం కానుంది. గతంలో చిన్నపాటి ప్రాంతాల్లోనే గనుల తవ్వకాలకు అనుమతులిచ్చే ప్రభుత్వాలు కొత్త చట్టం (ఎంఎండిఆర్-II) పట్టాలెక్కడం ద్వారా వేల హెక్టార్లలో తవ్వకాలకు అనుమతులిస్తారు. ఇవన్నీ పర్యావరణానికి విఘాతం కలిగించే అంశాలే. ప్రపంచంలో అరుదుగా కనిపించే ఖైవిట్ గుడ్లగూబ (అరకు ప్రాంతం నిలయం), బట్టమేక పక్షి (శేషాచల అడవులు నిలయం) వంటి అరుదైన పక్షి జాతులు అంతరించిపోయే ప్రమాదం దాపురించింది. దాదాపు రెండు లక్షల మొక్క జాతులు అంతరించి పోతున్నాయని అంచనా. లక్షల చెట్లు నాటి కృత్రిమంగా అడవులు సృష్టించగలిగినా లక్షల సంవత్సరాల పరిణామ క్రమం ఫలితంగా ఏర్పడ్డ పర్యావరణాన్ని మాత్రం పునర్నిర్మించలేం. జీవ వైవిధ్యాన్ని రక్షించడానికి ఒకవైపు భారీ ఎత్తున మేధోమథన సదస్సులు నిర్వహిస్తూనే, మరోవైపు కొండలను భక్షించి పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే యత్నాలు ముమ్మరం అవుతున్నాయి.

తూర్పు గోదావరి జిల్లాలోని వంతాడను కొల్లగొట్టిన గనుల మాఫియా ఇప్పుడు అదే జిల్లాలో మరో భారీ దందాకు వేగంగా పావులు కదుపుతోంది. శంఖవరం మండలం పెద్దమల్లాపురం పంచాయితీ ఆవెల్తీ ఆదివాసి గ్రామం చుట్టుపక్కలనున్న నాగులకొండ దిబ్బల్లో ఉన్న లేటరైట్ ఖనిజాన్ని గంపగుత్తగా తోడుకునేందుకు ప్రస్తుతం ఈ గ్రామాల్లో అధికారికంగా రాచమార్గాలు వేసుకుంటున్నారు. ఓబుళాపురం గనుల వ్యవహారంలో ప్రధానపాత్ర పోషించిన ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మి ద్వారా 12 ఆగస్ట్ 2009లో జారీచేసిన 196, 228 జి.ఒ.ల ఆధారంగా ఇరవై సంవత్సరాల కాలానికి 134.01 ఎకరాల్లో (54.23 హెక్టార్లలో) లేటరైట్ తవ్వకాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. దీనికోసం సెప్టెంబర్ 20న ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకున్నారు.

కనీసం రోడ్డు వ్యవస్థ కూడా లేని ఆవెల్తీ, అనమర్తి, పెద్దూరు, ఒంద్రేగుల గ్రామాల్లోని ఆదివాసులు సహజ వనరులైన తేనె, చింతపండు, మామిడి, జీడి మామిడి వంటి వాటి ద్వారా జీవనాధారాన్ని పొందుతుంటారు. వీరికి విద్య, వైద్యం, రవాణా, తాగునీటి సదుపాయాలు లేనేలేవు. ఒకసారి మైనింగ్ ప్రారంభమైతే ఈ చుట్టుపక్కల కొండలకు సైతం అనుమతులు వాటంతటవే వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతం ఎడారిగా మారే అవకాశం పొంచి ఉంది. సాధారణ ప్రజానీకంతో ఇక్కడ నివాసం ఉండే కొండరెడ్డి ఆదివాసి శాఖకు అసలు పోలికే ఉండదు. ఈ నేపథ్యంలో ఇక్కడి ఆదివాసి తండాల ఉనికికే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. మరోవైపు ఈ ప్రాంతంలో దట్టమైన అడవులున్నాయి. జల వనరులూ అధికమే. జింకలు, లేళ్లు, నెమళ్లు, అటవీ సంపదలు వంటి వన్యప్రాణులకు ఈ ప్రాంతం నిలయం. దీంతో ఈ ప్రాంతంలో మైనింగ్ చేపట్టడం అంటే పచ్చదనానికి గొడ్డలి పెట్టేనని పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ మైనింగ్ కార్యక్రమాలు చేపట్టడం వల్ల శంఖవరం, తొండంగి, ఏలేశ్వరం మండలాల్లోని నీటి వనరులకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. తొండంగి మండంలో 12,000 ఎకరాలకు సాగునీరు అందించే పంప రిజర్వాయర్‌కు ఆవెల్తీ కొండల్లో కురిసిన వర్షం నీరే ప్రాణాధారం. ఇక్కడ తవ్వకాలు చేపడితే ఈ ప్రాజెక్టుకు నీరు చేరడం కష్టం. అలాగే జిల్లా మెట్ట ప్రాంతాల్లోని సుమారు యాభై చిన్న, పెద్ద చెరువులకు ఇక్కడ తవ్వకాల వల్ల వర్షం నీరు చేరే పరిస్థితి ప్రమాదంలో పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణానికి, జలవనరులకు, జీవజాలానికి ముప్పు తెచ్చే లెటరైట్ వెలికితీతను అడ్డుకోవాలని స్థానిక ఆదివాసులు, హక్కుల సంఘాలు, పర్యావరణవేత్తలు ఉద్యమాలు

కూడంకుళం అణు విద్యుత్ ప్రమాదాలు

***అణు విద్యుత్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై ప్రభుత్వాలు అమలు చేస్తున్న పాశవిక చర్యలనూ, ఆ ప్రాజెక్ట్ వల్ల పొంచి ఉన్న ప్రమాదాలనూ వివరిస్తున్నారు* ఎస్.జి. ఓమ్‌బట్కరే**

కూడంకుళంలో నిర్మాణమవుతున్న అణువిద్యుత్ ప్రాజెక్ట్ వల్ల ఆ చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అనేక ప్రమాదాలున్నాయి. స్థూలంగా ఈ ప్రమాదాలను రెండు రకాలుగా చూడవచ్చు. ఒకటి, ప్రభుత్వాలకు కనిపిస్తున్న ప్రమాదాలు; రెండు ప్రజలకు కనిపిస్తున్న ప్రమాదాలు. రెండూ వేరువేరు అనడం అంటే ప్రభుత్వాలు చట్టబద్ధ మైనవి కాదని అనడం కాదు. ఎందుకంటే అవి ఓట్ల చేతనే ఎన్నుకో బడ్డాయి మరి! కానీ కనిపిస్తున్న వాటిని బట్టి ఈ ప్రభుత్వాలు ప్రజలకోసం మాత్రం పనిచేయట్లేదు అని చెప్పవలసి వస్తుంది.

కూడంకుళం అణువిద్యుత్ ప్రాజెక్ట్ (కెకెఎన్‌పిపి) నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ వరుసగా ప్రతిఘటన తెలుపుతున్న 'పీపుల్స్ మూవ్‌మెంట్ ఎగనెస్ట్ న్యూక్లియర్ ఎనర్జీ'(పిఎంఎఎన్ఇ) ఉద్యమకారుల నుంచి ప్రాజెక్ట్‌కే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తూ ఉంది. ఆ ఉద్యమకారులు ఎటువంటి ఆయుధాలు లేకుండా పూర్తి శాంతియుత పద్ధతులలో నిరసన తెలియజేస్తూ, కేవలం కూడంకుళం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆపడమే తమ ఉద్దేశ్యమని స్పష్టంగా ప్రకటిస్తున్నారు. ఆ ఉద్యమంలో సగం మంది మహిళలు, మొన్నటి ఎన్నికల్లో జయలలితను అత్యధిక మెజారిటీతో గెలిపించిన వారు–వారిప్పుడు జయలలిత దృష్టిలో ఉన్నట్లు లేరు. వారి నుంచి అంతపెద్ద ప్రమాదం ఉంది కనుకనే ఆ ఉద్యమ నాయకులపైనే కాక అందులో పాల్గొంటున్న అనేక వేలమందిపై 'రాజద్రోహం', 'రాజ్యానికి వ్యతిరేకంగా కుట్ర' చేస్తున్నారనే ఆరోపణలతో కేసులు నమోదు చేసింది. కొన్ని వందల మందిని జైళ్లలో నిర్బంధించింది.

భారీగా అవినీతి కుంభకోణాల్లో కూరుకుపోయిన, ఆదాయాలకు మించి అడ్డగోలు ఆస్తులు పోగేసుకున్న మంత్రులతో నిండిపోయిన ప్రభుత్వాలకు, ప్రజలు ఒక వాస్తవ సమస్య పట్ల న్యాయమైన ఆందోళన, శాంతియుత ప్రతిఘటన విపరీతంగా కనబడడం అనేది అంత విచిత్రమేమి కాదు.

ప్రభుత్వం ఇంకా ఆరోపిస్తోంది ఏమిటంటే ఈ కెకెఎన్‌పిపి ప్రతిఘట నోద్యమానికి అంతర్జాతీయ విచ్ఛిన్నకర శక్తుల నుండి నిధులు అందుతున్నాయని. ఈ నిధులు ఏ సంస్థ నుండి ఎవరికి ఎంత మొత్తంలో అందాయనే దానికి ఒక్క ఆధారం చూపకుండానే ఒక పక్క ప్రభుత్వమే అణువిద్యుత్‌ను దేశంలో విస్తరించడానికి, పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపచేసుకోవడానికి పబ్లిక్‌గానే నిధులు అందుకోవడం మనం చూశాం.

కూడంకుళం ప్రాజెక్ట్ నిర్మాణం ఈ ప్రజా నిరసనల వల్ల ఇంకా ఆలస్యం అయితే, దాని ప్రభావంవల్ల దేశంలో నిర్మాణమైన ఇతర అణు విద్యుత్ ప్రాజెక్ట్‌లకు రావలసిన నిధులు ఆగిపోతాయని, లేదా ఆ

చేపడుతున్నా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. ఆదివాసులకు 1/70 చట్టాలు ప్రకటించి 5వ షెడ్యూలు కింద హక్కులను పొందుపరిచి అడవిపై ఆదివాసులకే హక్కు అని ఓ పక్కన నమ్మబలుకుతూ, వారు నిజంగానే ఆ భూమి దగ్గరకు వెళ్లినప్పుడు రాజ్యం రక్తం పారిస్తోంది. మనుషుల ప్రాణాలు హరిస్తోంది. ప్రకృతి దగ్గరకు పోవడానికి, బతుకును పండించుకోవడానికి వీలులేకుండా ఈ వ్యవస్థ అడ్డు పడుతోంది. తూర్పు కనుమల్లో ఉన్న ఆదివాసులకు పరిరక్షణలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. అడవులపై ఆధారపడిన ఆదివాసులు వాటిని వృద్ధి చేయడంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కఠిన వాస్తవాన్ని మరుగుపరిచి ఆదివాసుల పోడు వ్యవసాయం విధానాన్ని పాటిస్తుండడం కూడా అటవీ విస్తీర్ణం తగ్గడానికి ఒక కారణం అని కొంతమంది ప్రభుత్వ అనుకూలురు గోబెల్స్ ప్రచారానికి పాల్పడుతున్నారు. ఒకవేళ వాళ్ల వాదన సమంజసమనుకుంటే ఏళ్లు గడుస్తున్నా ఆదివాసులకు ప్రత్యామ్నాయ మార్గాలు ఎందుకు కల్పించలేకపోతున్నారు? మైనింగ్ పేరుతో అడవుల విచ్చలవిడి నరికివేతకు ఎందుకు చెక్ పెట్టలేక పోతున్నారు? నిస్సారమైన, నిరుపయోగమైన భూమి అందుబాటులో ఉన్నప్పటికీ పరిశ్రమల పేరుతో అటవీ భూములను కబళించడం ఎందుకు ఆగడం లేదు? అడవులకు ముప్పు వాటిల్లకుండా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఐరాస నిర్దేశించిన ప్రపంచ నైతిక సూత్రావళి (గ్లోబల్ కోడ్ ఆఫ్ ఎథిక్స్ ఫర్ టూరిజం) ప్రమాణాలను ఎక్కడా పాటించడం లేదు. పైగా పర్యాటక రంగాన్ని లాభార్జన ధ్యేయంగా తీర్చిదిద్దుతున్నారు. దాని అసలు ఉద్దేశ్యాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. సంపద కోసమే పాకులాడుతున్న పాలకులు ఆయా పర్యాటక ప్రాంతాల్లోని ప్రజల ఆచార సాంప్రదాయాలను సాంఘికంగా, సంస్కృతిపరంగా విచ్ఛిన్నానికి పూనుకుంటున్నారు. ఈ చర్యలు విడనాడకపోతే తూర్పు కనుమలు బలహీనమై ముమ్ముందు ఆదివాసి ప్రాంతాలకు, ఇతర ప్రాంతాలకు పెను ప్రమాదం తప్పదు. ఇరవై ఏళ్ల నాటి రియో డి జెనీరో ఒప్పందంతోపాటు తాజాగా ప్రపంచ దేశాలన్నీ భాగ్యనగరంలో మరోసారి సమావేశమై పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాయి. నాటి ఒప్పందాల్లో ఇంకా పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని నేపథ్యంలో తాజాగా కుదుర్చుకున్న ఒడంబడికలు ఏ మేరకు జీవ వైవిధ్య పరిరక్షణ విషయంలో ప్రపంచ దేశాలను సమాయత్తం చేస్తాయో వేచి చూడాల్సిందే.

(రచయిత సామాజిక ఉద్యమ కార్యకర్త) వీ

నిర్మాణాలు చేపట్టిన బహుళజాతి కంపెనీలకు నష్టాలు వస్తాయని, పెట్టుబడులు వెనుకకు పోతాయని ప్రభుత్వం భయపడుతోంది. అంటే ప్రభుత్వాలు వివిధ అంతర్జాతీయ వ్యాపార సంస్థలతో, పాలకులతో వివిధ ప్రాజెక్ట్‌ల కోసం ఈ దేశ వనరులను దోచిపెట్టడం కోసం కుదుర్చుకున్న రహస్య ఒప్పందాలు, సంతకాలు చేసిన ఎంఒయులు నిజంగానే ప్రమాదంలో పడతాయి మరి. ఇవన్నీ ప్రభుత్వాలకు ప్రమాదంగా కనబడడంలో ఆశ్చర్యమేమి లేదు. అయితే ఆ ప్రమాదాలను అధిగమించడం వల్ల ప్రజలకేమైనా మేలు జరుగుతుందా లేదా, ప్రజలకు మరిన్ని ప్రమాదాలు వచ్చిపడతాయా అన్నదే చూడవలసింది.

ప్రజలకున్న ఒకే ఒక్క జీవనాధారమైన భూమి, జీవిక కోల్పోవాల్సి రావడమే పెద్ద ప్రమాదం. కూడంకుళం ప్రాజెక్ట్ మొదలు పెట్టడంతోనే 'ఇడింతకరై' ప్రాంత గ్రామాల ప్రజలు పరిహారంతోనో, పరిహారం లేకుండానో తమ భూములను కోల్పోవాల్సి వచ్చింది. కోల్పోవడానికి భూమిలేని వాళ్లు జీవించడానికి అవసరమైన ఉపాధి కోల్పోయారు. ఇంకా ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైతే మరిన్ని కోల్పోనున్నారు. ఈ ప్రాజెక్ట్ పనిచేస్తున్నపుడు రియాక్టర్లను చల్లబరచడం కోసం సముద్ర జలాలను వాడుకొని వదిలి వేస్తుంటారు. ఫలితంగా ఆ ప్రాంత సముద్ర జలాలు, మత్స్య సంపద పూర్తిగా రేడియోధార్మిక పదార్థాలతో కలుషితమైతాయి. దీనివల్ల ఆ ప్రాంతంలో ఉన్న మత్స్యకారులంతా తమ వృత్తిని వదులుకొని పోవలసిందే. అంటే ఆ సమీప తీరప్రాంతమంతటా నివసించే లక్షలాది మంది జీవనోపాధికి సంబంధించిన సమస్య కూడా.

కెకెఎన్‌పిపి పని చేస్తున్నప్పుడు విడుదలయ్యే రేడియో ధార్మిక ఉద్గారాలు, వ్యర్థాల వల్ల ఆ సమీప ప్రాంతపు గాలి, నీరు. నేల అంతా రేడియోధార్మికతమయమవుతాయి. ఇది ఆ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఇప్పటికే 'రావత్ భాటా' అణువిద్యుత్ ప్లాంట్ ప్రాంత గ్రామాల్లో జరిపిన సర్వేలో అక్కడి ప్రజల్లో రేడియో ధార్మికత వల్ల వచ్చే తీవ్రమైన జబ్బులు, అంగవైకల్యంతో కూడిన శిశువుల జననం వంటివి ఎన్నో కేసులు ఉండడానికి కారణమేమిటో అణువిద్యుత్ డిపార్ట్‌మెంట్‌వారుకానీ, అణువిద్యుత్ చాలా సురక్షితమైనదనే ప్రచారాన్ని చేస్తున్న మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంగారు కానీ వివరించరు.

'రావత్ భాటా'లో వలెనే ఇక్కడ కూడా ప్రాజెక్ట్ ప్రారంభిండానికి ముందు ప్రజల ఆరోగ్య స్థితిని గురించిన సర్వే, ఆ తర్వాత ప్రాజెక్ట్ వల్ల ప్రభావితం అవ్వడం వల్ల ప్రజల ఆరోగ్య స్థితిని పోల్చిచూడడం కోసం జరగనే లేదు. ఈ సర్వేలు జరపకపోవడం అనేది అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ (డి.ఎ.ఇ) వారు ఉద్దేశ పూర్వకంగానో, నేరపూరితంగానో అని కూడా అనవచ్చు. అణువిద్యుత్ కర్మాగార ప్రాంత ప్రజల ఆరోగ్య సమస్యలైన క్యాన్సర్, అంగవైకల్యం, స్త్రీలలో గర్భస్రావం వంటి సమస్యలకూ ఆ ప్రాంత వాతావరణంలో ఉన్న రేడియో ధార్మికతకూ ఎలాంటి సంబంధం లేదనే మోసపూరితమైన వాదన చేస్తున్నారు.

ప్రాజెక్ట్ రక్షణ చర్యలకు సంబంధించి కూడా ప్రజల్లో అనేక భయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్ నుంచి వెలువడే రేడియోధార్మిక వ్యర్థాలను నిల్వచేయడంలో, శుద్ధిచేయడంలో తీసుకునే రక్షణ చర్యలు ఏమిటి? ఆ పరిసరాల్లో రేడియోధార్మికత స్థాయి అత్యంత కనిష్టస్థాయిలోనే ఉంచడానికి తీసుకునే చర్యలు ఏంటి? అనే దగ్గర నుంచి ఫుకుషిమా వంటి అనుకోని ప్రమాదాలు జరిగితే నష్టం జరగకుండా తీసుకునే రక్షణ చర్యలు ఏంటి. వాటి సమర్థత ఎంత? అనే దాకా అనేక భయాలు ప్రజల్లో ఉన్నాయి. ఈ రేడియోధార్మిక ఉద్గారాలు, వ్యర్థాల నిర్వహణలో లోపాలు, వాటి నుండి తలెత్తే సమస్యల గురించిన సమాచారాన్ని డి.ఎ.ఇ ఉద్దేశపూర్వకంగానే తొక్కిపెడుతోంది.

ఇంకా ఐ.ఎ.ఇ.ఎ గైడ్‌లైన్స్ ప్రకారం ఎక్కడైనా అణువిద్యుత్ కర్మాగారం నెలకొల్పదలచుకున్నపుడు ఆ ప్రాంతపు భూ భౌతిక సమగ్ర సమాచారం గడిచిన 10 మిలియన్ ఏళ్లలో కూడా అక్కడ ఎప్పుడూ భూగర్భ అగ్ని పర్వత సంబంధమైన భూకంపాలు రాలేదని నిర్ధారించు కోవాల్సి ఉంటుంది. కానీ కూడంకుళం ప్రాంతంలో 1998-2007 మధ్యకాలంలోనే తక్కువస్థాయి అగ్నిపర్వత విస్ఫోటనం జరిగిందనే సంకేతాలు, ఒక మిలియన్ సంవత్సరాల కిందనే అగ్ని పర్వతాల చురుకుదనం ఉందనే సంకేతాలు ఉన్నాయి. ఈ విషయానికి సంబంధించిన సాంకేతిక ఆధారాలను చూపే పత్రాలు బయటిపెట్టిన తర్వాతనే 'భారత ప్రభుత్వపు నిపుణుల కమిటీ' ఆ ఆధారాలను అంగీకరిస్తూనే, అవేమంత పట్టించుకోవలసిన స్థాయిలో లేవని వాటిని ప్రాజెక్ట్‌కు సంబంధించిన రికార్డులలో లేకుండా తప్పించింది.

ఈ విధంగా ఐ.ఎ.ఇ.ఎ. గైడ్‌లైన్స్‌ను ఉల్లంఘించడమే కాకుండా, ఆ ప్రాంతంలో అగ్ని పర్వతాల చురుకుదనం ఉన్నట్లు చూపే సంకేతాలు ఉండడం వల్ల అక్కడ ఎప్పుడైనా ఫుకుషిమా వంటి పెద్ద ప్రమాదం సంభవించేందుకూ సంభావ్యత ఉందన్న విషయాన్ని దాచిపెట్టింది. ప్రజల దీర్ఘకాలిక రక్షణ, పర్యావరణ రక్షణ అన్న వాటిని కొన్ని బహుళజాతి కంపెనీల ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రభుత్వం తాకట్టు పెట్టింది.

అణువిద్యుత్ ప్రాజెక్ట్‌లో అతికీలకమయిన ఒక భాగం 'మెటల్ రియాక్టర్ ప్రెషర్ వెసల్'(ఆర్.పి.వి). ఇది ప్రత్యేకమయిన లోహాలతో తయారు చేయబడి అణువుల తాడనం నుండి పెద్ద మొత్తంలో వెలువడే వేడిమి నుండి తయారయ్యే ఆవిరి పీడనాన్ని తట్టుకునేలా ధృడంగా ఉంటుంది. అయితే ఎంత ధృడంగా ఉన్నప్పటికీ ప్రతి సెకనుకూ అణువుల తాడనంలో విడుదలయ్యే న్యూట్రాన్‌లు అత్యంత వేగంతో దీన్ని ఢీకొడుతుంటాయి కనుక అంతకంతకూ దీని జీవిత కాలం తగ్గిపోతూ ఉంటుంది. సహజంగానే లోహానికి ఉండే పెలుదుచనం కారణంగా ఢీకొట్టే న్యూట్రాన్‌లు కొంతకాలం తర్వాత దీన్ని విచ్ఛిన్నం చేసే సంభావ్యత ఉంటుంది. పైగా న్యూక్లియర్ రియాక్టర్ల పాత మోడళ్లలో ఈ ఆర్.పి.వి.ని నిర్మించేటప్పుడు జాయింట్లలో వెల్డింగ్ చేసే పద్ధతి ఉండేది. అయితే లోహాలకు సంబంధించిన సాంకేతికత బాగా అభివృద్ధి చెందిన తర్వాత వస్తున్న ఆధునిక రియాక్టర్లలో ఆర్.పి.వి.ని వెల్డింగ్ చేయాల్సిన అవసరం లేకుండా నిర్మించడం ద్వారా దీని జీవితకాలాన్ని పొడిగిస్తున్నారు. అయితే తెలుస్తున్నది ఏమిటంటే కూడంకుళం రియాక్టర్‌లోని ఆర్.పి.వి. పాత వెలిడంగ్ పద్ధతిలో తయారైనదే అని. అందువల్ల ఇందులోని ఆర్.పి.వి విచ్ఛిన్నం అవ్వడానికి అవకాశాలు ఎక్కువ ఉండడమే కాదు, దీని నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ కూడా తక్కువ ఉంటుంది. అంటే ఈ అణు రియాక్టర్లు అమ్ముకునే వ్యాపారికీ, కొలుగోలుదారైనా ప్రభుత్వానికీ మధ్య ఒప్పందంలో అవినీతికీ. లంచగొండితనానికీ పాత్ర ఉండడం వల్లనే ఇటువంటి నాసిరకం యంత్రాల కొనుగోలుకు ఒప్పందాలు జరిగాయి. ఫలితంగా ప్రజల ప్రయోజనాలు, ప్రజలకు రక్షణ కానివాటి కోసం ఫణంగా పెట్టబడ్డాయి.

ఇప్పటికి 23 సంవత్సరాల కిందటే 1980ల చివర్లో కూడంకుళం ప్రాజెక్ట్ గురించి అప్పటి ప్రభుత్వం ప్రకటించినపుడే ప్రజలు తీవ్రంగా

వ్యతిరేకించారు. అప్పుడే తమిళనాడు రాష్ట్ర 'పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్' నిర్వహించిన 'ప్రజాభిప్రాయసేకరణ'కు ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి తమ వ్యతిరేకతను తెలియజేశారు. అప్పటి నుండి వరుసగా నిరసన తెలియజేస్తూనే ఉన్న ప్రజలు, ఫుకుషిమా ప్రమాదం తర్వాత తమ శాంతియుత ప్రతిఘటనను తీవ్రతరం చేశారు. వారి న్యాయమైన భయాలను ప్రభుత్వం పట్టించుకోవడానికి బదులు కూడంకుళం ప్రాజెక్ట్ పోరాట గ్రామాలకు వెళ్లే అన్ని దారులనూ దిగ్బంధం చేసి, గ్రామాల ప్రజలకు ఆహారం, నీరు కూడా అందకుండా చేసింది. అణువిద్యుత్ కర్మాగారాలు నిర్మాణం అయిన అన్ని చోట్లా అమలయిన నిర్బంధం గురించి తెలుసుకొని కూడా ప్రజలు తమ న్యాయమైన ప్రతిఘటనను శాంతియుతంగా కొనసాగించారు. కానీ ప్రభుత్వం మాత్రం వారిపై బూటకపు ఆరోపణలతో అక్రమ కేసులను బనాయించింది. దొరికిన వారిని పట్టుకొని పాశవికంగా హింసిస్తోంది. ఈ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న వారిపై రాజ్యానికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారనే బూటకపు అభియోగంతో అరెస్ట్ చేయడానికి ప్రయత్నిస్తోంది. ఆ ప్రాంత ప్రజలు తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కోవాల్సి వస్తోంది కనుక ప్రభుత్వానికి లొంగిపోదామని నాయకులు అన్నా, ప్రజలు వారిని అరెస్ట్ కానివ్వకుండా తమ ఇళ్లలో దాచిపెట్టి రక్షించుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారాణం నాయకులు గనుక అరెస్ట్ అయితే పోలీసులు వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదుచేసి సుదీర్ఘకాలం జైల్లో ఉంచుతారు. ఫలితంగా ప్రతిఘటన ఉద్యమం దెబ్బతింటుంది. ఇంతకన్నా ముఖ్యమైన మరో కారణం నాయకత్వం వహిస్తున్నవారు దొరికితే పోలీసులు వారిని బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమార్చడమో, లేదా కస్టోడియల్ టార్చర్‌తో నిర్బంధంలోనే హతమార్చడమో చేసి ఉద్యమాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తారు. ఈ భయాలు అంత అర్థరహితమైనవి ఏమి కాదని ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో పోలీసులు నిరూపించి ఉన్నారు. నిజానికి అక్కడ పోలీసులు ప్రతి ఇల్లు గాలిస్తూ ఆ ప్రయత్నంలోనే ఉన్నారా అనిపించేలా ప్రవర్తిస్తున్నారు.

మనదేశంలో ప్రజాస్వామ్యం అనేది ప్రజలు ప్రతి ఐదేళ్లకోసారి ఓటు వేయడానికే పరిమితం చేయబడింది. ఒకసారి ఓటు వేసిన తర్వాత ఎన్నికైన ప్రభుత్వాలు–చాలాసార్లు అసంబద్ధమైన, అంకెల గారడీలతో కూడిన సమీకరణలతో ఏర్పడే ప్రభుత్వాలు కూడా, ఏం చేయదలుచుకున్నా వారికి ఎదురు చెప్పకపోవడమే ప్రజలు చేయవలసింది. ఇక ప్రతిపక్ష పార్టీలనేవి అత్యధిక సమయం అధికార పార్టీని విమర్శించడానికి తప్ప, ప్రజల నిజమైన సమస్యలపై అర్థవంతమైన చర్చ చేయడానికి, న్యాయమైన హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలకు మద్దతుగా నిలవడానికి ఏ మాత్రం సమయం కేటాయించే స్థితిలో లేవు. ఈ స్థితిలో ప్రజలే తమ సమస్యల పరిష్కారాల కోసం, కోల్పోతున్న తమ వనరుల కోసం, తమ హక్కుల కోసం వీధుల్లోకి వచ్చి తమకు చేతనైన రూపాలలో పోరాడుతున్నారు. ఎన్నిక కాబడ్డ ప్రజా ప్రతినిధులేమో ప్రజల వనరులు, సహజ వనరులు, దేశ సమిష్టి సంపదపై హక్కుదారులుగా అమ్మకాలు, కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు.

ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటైన విధంగా, శాంతియుత పద్ధతుల్లో నిరసన తెలియజేస్తున్నవారిని ముళ్లకంచెలతో అడ్డుకోవడం, వారికి ఆహారం, మంచినీటి సరఫరా ఆపేయడం వంటి దుర్మార్గ పద్ధతులను ప్రభుత్వం అనుసరిస్తోంది. అణువిద్యుత్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన, ప్రజలకు తెలిస్తే ఇబ్బందికరమనుకున్న సాంకేతిక సమాచారాన్ని ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టడం, ప్రజాభిప్రాయ సేకరణను ఒక తంతుగా నిర్వహించడం, ఏకపక్షంగా ముగించడం, తప్పుడు రిపోర్టులు తయారు చెయ్యడం, పోరాడుతున్న ఉద్యమకారులపై తప్పుడు ఆరోపణలతో కేసులు బనాయించడం, ఆందోళనకారులపై అనవసర పోలీసు బలగాలను ప్రయోగించడం వంటి అప్రజాస్వామిక పద్ధతులతో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మినహాయింపు లేకుండా అన్ని రాజకీయ పార్టీలకు చెందినవారు, కార్పొరేట్ సంస్థల అధిపతులు, ప్రభుత్వ చర్యలను సమర్థిస్తూ ఉన్నారు. పోలీసులు, అధికార యంత్రాంగం వారి చేతిలో పనిముట్టులా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో భారతదేశంలో అసలు ప్రజాస్వామ్యం అన్నదే ప్రమాదంలో పడిందని చెప్పవచ్చు. ప్రజలను ఆదుకోగలిగే, ప్రజల్లో ఆశను నింపగలిగే వ్యవస్థలేమీ కానరావడం లేదు. అయితే ఇంకా మిగిలిన చిట్టచివరి ఆశ అయిన న్యాయవ్యవస్థ అయినా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం జరిగిన చట్ట ఉల్లంఘనలు, ప్రజలు కోల్పోవలసి వస్తున్న హక్కులు, నాశన మవుతున్న పర్యావరణం గురించి సరియైన విచారణ జరిపించి, న్యాయమైన తీర్పు ఇవ్వవలసి ఉంది. ఆ ఒకే ఒక్క చివరి ఆశతో ప్రజాస్వామ్యం కాపాడబడుతుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

(రచయిత భారత సైన్యంలో వివిధ విభాగాల్లో ముప్పై ఐదు సంవత్సరాలు పనిచేసి మేజర్ జనరల్‌గా రిటైర్ అయ్యారు. ప్రస్తుతం 'నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్‌మెంట్స్' (ఎన్ఏపిఎం)లోనూ, పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్)లోనూ సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారు)

(అనువాదం: జి. ఉదయ, ఉపాధ్యాయులు) వీ

ఎవరి మేలు కోసం ఈ ఎఫ్‌డిఐలు?

సామ్రాజ్యవాద ప్రయోజనాలు నెరవేర్చడంలో భాగంగానే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పాలకులు అనుమతిస్తున్నారని అంటున్నారు **విద్యాభూషణ్**

ప్రపంచ దేశాల మధ్య శాంతి నెలకొని సామరస్యత కొనసాగితే సామ్రాజ్యవాదానికి మనుగడే ఉండదు. 'పెద్దన్న'గా పెత్తనం చెలాయించేందుకు తావే ఉండదు. తన దగ్గరున్న ఆయుధ సంపత్తిని సొమ్ము చేసుకునే అవకాశమే ఉండదు. అందుచేతనే దేశాల మధ్య, ప్రాంతాల మధ్య, జాతుల మధ్య చిచ్చుపెట్టి 'పెద్దరికం' వహిస్తూ, తన ఆయుధ వ్యాపారాన్ని సజావుగా సాగించుకో చూస్తుంది. అయితే ఇటీవల ఇరాక్ అనుభవం విస్తృతమైన అణ్వాయుధ సంపత్తి కారణంగా ఇతర దేశాలతో గిల్లికజ్జాలు పెట్టుకోడానికి, ప్రత్యక్ష దోపిడీ కొనసాగించడానికి పరిస్థితులంత అనుకూలంగా లేవు. అందుకని తెలివిగా ఆధునిక పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థను ఆసరాగా చేసుకొని 'ఆర్థిక సంస్కరణల' ముసుగులో సామ్రాజ్యవాద విస్తరణకు తెరతీసింది. ఈ సంస్కరణల పునాది మీద అభివృద్ధిలోని డొల్లతనం ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తోంది. ఈ వాస్తవాన్ని ఇతర దేశాల అనుభవాలతో గత పదిహేనేళ్ల నుంచి మేధావులు హెచ్చరిసత్తా ఉన్నారు. 'అభివృద్ధి' నిర్వచనాన్ని తమకనుగుణంగా నిర్వచించుకుంటూ, అవకాశవాద రాజకీయం రోజులు నెట్టుకొస్తూనే, ప్రజలను నట్టేట ముంచిన వైనం మనముందు ఉంది. ఈ నాటక అంతిమ అంకానికి మనదేశంలో ఇప్పుడు తెరలేచింది. ఒకవైపు దేశ ఆర్థిక స్థితిగతులు చిన్నాభిన్నమై ప్రజల బతుకులు బజారున పడుతుండడంతో, వాస్తవాన్ని గుర్తెరిగిన ప్రజలు ప్రాణాలనెదురొడ్డి తిరస్కరించడం ఓ వాస్తవం. అయినా ఈ దళారీ పాలకవర్గాలు తమ మోసాలు తమనే వెక్కిరిస్తున్నా, అధికార దురహంకారంతో 'సంస్కరణలు, బహుళజాతి సంస్థల ప్రమేయం తప్పనిసరి, ఏది ఏమైనా అమలుపర్చక తప్పదు' అని నిస్సిగ్గుగా చెప్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వాస్తవాన్ని యావత్ ప్రజలు గుర్తెరగాల్సి ఉంది.

విస్తృతమైన తమ 'సాంకేతికత సహాయం'గా పేరుకుపోయిన ఉత్పత్తులని బడుగు – అభివృద్ధి చెందుతున్న దేశాలకు అంటగట్టేందుకై చేయాల్సిన ప్రయత్నాలు 'మార్కెట్ వ్యవస్థ'ను తమ చెప్పుచేతుల్లో ఉంచుకునేందుకై చేపడుతున్న చిట్టచివరి అస్త్రం ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రమేయం. వ్యవసాయరంగాన్ని సంప్రదాయ మార్గం నుంచి దారిమళ్లించి, ప్రత్యేక ఆర్థిక మండలాల ఏర్పాటు చేయడం, ప్రభుత్వరంగ పరిశ్రమలను బలహీనపర్చడం, దేశ సంస్కృతిని పణంగా పెట్టి మార్కెట్ సంస్కృతిని ప్రోత్సహించడం, 'సంక్షేమం' పేరిట అర్థంపర్థం లేని సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగింది. అదింకా పరిపూర్తి స్థాయికి చేరుకునేందుకే, ప్రత్యేక ఆర్థిక మండలాల పేరిట పారిశ్రామికాభివృద్ధిగా నచ్చజెప్పే ప్రయత్నానికి ఒడిగట్టారు. ఆ యత్నం బట్టబయలై ప్రజలు రోడ్డు మీదకొచ్చారు. అయినా ఆశ చావని సామ్రాజ్యవాదం ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రమేయాన్ని చేపట్టచూస్తోంది. దీనికంతటికీ ప్రజాహితం పట్టని దళారీ పాలకవర్గాల ప్రాపకమేనని మనమంతా గుర్తెరగాల్సి ఉంది.

ఇంతకీ ఈ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కథా కమామీషు ఏంటని పరిశీలిస్తే, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ – ఎఫ్‌డిఐ) అంటే అన్య దేశాల ఉత్పత్తి ప్రాపకంలో విదేశీ వ్యక్తులు గానీ, సంస్థలుగానీ ప్రత్యక్షంగా పాలు పంచుకోవడమే. అప్పుడిక ఆయా దేశాల ఉత్పాదక శక్తులన్నీ విదేశీ శక్తులకు లోబడి ఉంటాయి. ఈ కుట్రకు ఇప్పుడు తెరలేచినా ఇందుకు తగిన ప్రాథమిక ఒప్పందాలన్నీ తెరచాటున ఏనాడో పూర్తయిపోయాయి. 2005 నాటికే దేశపాలక వర్గాలు అమెరికా పాలకవర్గాలతో ఒప్పందాలను పూర్తి చేసేసుకున్నాయి. ఈ విదేశీ పెట్టుబడులు ఇతర దేశాల్లో ప్రవేశించే ముందు సాధారణంగా ఈ సూచికల ద్వారా నిర్ధారిస్తాయి. 1) తలసరి ఆదాయ స్థాయి, 2) వనరుల లభ్యత, 3) మానవ వనరుల స్థాయి.

తలసరి ఆదాయం విషయానికొస్తే మన దేశం అధమ స్థాయిలో ఉంది. అధికారిక గణాంకాలే పేదరికం 60 శాతం మేరకని నిర్ధారించాయి. దీంతో శ్రమశక్తి కారుచౌకగా లభ్యమవుతుంది. వనరులకు కొదవలేదు. సహజ వనరులు పుష్కలంగా ఉన్న పుణ్యభూమి మనది. వీటికి తోడుగా విస్తారంగా ఉన్న గ్రామీణ మార్కెట్. ఉత్పాదకత నాణ్యతలను గుర్తించలేని, గమనించలేని అసహాయత. ఆర్థిక వనరుల మాటెలా ఉన్నా, స్థిరమైన ధరల పెరుగుదలను సైతం నియంత్రించలేని, నిలదీయలేని పరిస్థితి వారికనువుగా ఉంటుంది. అనుకూల పన్నుల చెల్లింపులు, ఎంతటి స్థాయిలోనైనా పరువుకూ, ప్రతిష్టకూ పోయి పన్నులు చెల్లించే అనుకూల వాతావరణం. కులాలు, మతాలు పేరిట ప్రజల మధ్య అనైక్యత వీరికి కలిసొచ్చే అంశం. కాస్తో కూస్తో ఇతర వెనుకబడిన దేశాల్లో కన్నా కాస్త మెరుగ్గా ఇంగ్లిష్ భాష వాడుకలో ఉండడం సైతం వీరికి దోహదపడుతుంది. అగ్రరాజ్య చెప్పుచేతల్లో ఉన్న పాలకవర్గం, వారి ఆదేశాల మేరకే ప్రైవేట్ యాజమాన్యాన్ని ప్రోత్సహించేందుకనువైన విధి విధానాలు ఉండడం అత్యంత కీలకమైన అనుకూలత.

ఇన్ని అంశాల్లో అనుకూలత లభ్యమైనప్పటికీ, మౌలిక వనరుల కల్పన, నాణ్యతాయుత పాలన అందివ్వడంలో మన దేశం వెనుకబడి ఉన్నందున విదేశీ పెట్టుబడిదారుల విశ్వసనీయతను పొందలేకపోవడం జరుగుతూ ఉంది. ఇక రవాణా వ్యవస్థ విషయానికొస్తే, ఇది అత్యంత బలహీనంగానూ, నాణ్యతా లోపంగానూ ఉండడం సైతం మరో అడ్డంకిగా వారికి కనిపిస్తోంది. అందుకై జాతీయ రహదారుల అభివృద్ధిని యుద్ధ ప్రాతిపదికన చేపట్టడం సైతం జరుగుతూ ఉంది. అనుకూల – ప్రతికూల విషయాలిలా ఉన్నందునే విదేశీ పెట్టుబడుల విధి విధానాల్ని ప్రతి ఆరు నెలలకొకసారి సమీక్షిం చేందుకు మన పాలకవర్గాలు హామీనివ్వడం జరిగింది. అలాగే కార్మిక చట్టాలను సవరించేందుకు సైతం ప్రభుత్వం తలూపింది.

ఈ నేపథ్యంలో 2010 నాటికే మన దేశంలో విదేశీ పెట్టుబడులను

పెట్టేందుకై మారిషస్, సింగపూర్, అమెరికా, బ్రిటన్, నెదర్లాండ్స్, జపాన్, సైప్రస్, జర్మనీ, ఫ్రాన్స్, గల్ఫ్ దేశాలు సిద్ధమైనాయి. ఈ దేశాల ప్రమేయంతో వీరి పెట్టుబడులు సేవారంగంలో 21 శాతం, ఐటి (కంప్యూటర్స్) రంగంలో 9 శాతం, టెలీ కమ్యూనికేషన్స్‌లో 8 శాతం, రియల్ ఎస్టేట్‌లో 8 శాతం, జాతీయ రహదారుల రంగంలో 7 శాతం, విద్యుత్ రంగంలో 4 శాతం, ఆటోమొబైల్ రంగంలో 4 శాతం, పెట్రోలియం ఉత్పత్తుల్లో 2 శాతంగా ఉన్నాయి. ఈ పునాది మీద ఇప్పుడిక రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించేందుకు రంగం సిద్ధమైంది. ఏది ఏమైనా, ఎవ్వరేమనుకున్నా ఆర్థిక ప్రగతికి రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడుల ప్రమేయం అనివార్యమని పాలకులు ఢంకా భజాయించి చెప్పుకొస్తూనే ఉన్నారు.

ఇంతకీ రిటైల్ రంగం అంటే ఏమిటి? అంతిమ వినియోగదారుల స్వవినియోగానికి మార్కెట్ ఉత్పత్తులను అందించే సేవలు. ఇందులో మళ్లీ సింగిల్ బ్రాండ్ రిటైలింగ్, మల్టీ బ్రాండ్ రిటైలింగ్ అని రెండు తరహాలున్నాయి. అయితే ఈ మల్టీబ్రాండ్ రిటైలింగ్ రంగానికే ప్రభుత్వం 49 శాతం పెట్టుబడులను ఖరారు చేసింది. వ్యవసాయరంగం తరువాత ఉపాధి కల్పనకు విస్తృత అవకాశాలున్నది ఈ రిటైలింగ్ వాణిజ్య రంగమే. దేశ స్థూల జాతీయాదాయంలో సుమారు 10 శాతం మేరకు ఈ రంగానిదే ప్రాధాన్యత. ఇప్పటికే దేశవ్యాప్తంగా 12 లక్షల రిటైల్ వాణిజ్య కేంద్రాలను గుర్తించారు. అయితే ఇక్కడో ప్రధానాంశాన్ని మనం గుర్తించాల్సి ఉంది. మొట్టమొదటిసారిగా రిటైల్ వాణిజ్యంలో విదేశీ పెట్టుబడులను చైనాలో అనుమతించినప్పుడు కేవలం 132 పట్టణాల్లో రు.1537 కోట్ల విలువైన పెట్టుబడులను సేకరించారు. నాణ్యత దృష్ట్యా చైనాతో పోటీ పడలేక, విఫలమై అదే తరహా గ్రామీణ మార్కెట్ విస్తరించి ఉన్న భారతదేశం వైపు దృష్టి సారించారు. ఇక ఉపాధి కల్పన అంశానికి వస్తే సుమారు 15 శాతం మేరకు ఉపాధి అవకాశాలుంటాయనీ, 28 శాతం మేరకు వార్షికాభివృద్ధి సాధ్యమనీ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మార్కెటింగ్ రంగంలో ఆధునిక సాంకేతికతను, శాస్త్రీయతను మేళవించి ధరల నియంత్రణను చేపట్టి అధిక లాభాలను సుసాధ్యం చేయగలమంటున్నారు. అయితే ఈ లాభాపేక్షలోనే సిబ్బంది కుదింపు, భారీస్థాయి షాపింగ్ మాల్స్ ఏర్పాటు, నష్టాల దిశగా ఉన్న వాణిజ్య కేంద్రాల ఉపసంహరణ తదితర అంశాలూ ఉన్నాయి. అయితే ఇవన్నీ ఉపాధి అవకాశాలను నీరుగార్చేవేనని గుర్తించకతప్పదు. ఇక రిటైల్ వ్యాపారంలో విదేశీ శక్తులకు, స్థానిక వ్యాపారులకు ఆరోగ్యకరమైన పోటీ నెలకొని ధరలు తగ్గుతాయని ఊదరగొడుతున్నారు. అసమాన శక్తుల మధ్య సమానపోటీ తగునా? అన్నది మనం అంచనా వేయాల్సి ఉంది. స్వయం ఉపాధి పథకాల పేరుతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనే యువత, వ్యాపారాన్ని ముగించేసుకుని, షాపింగ్‌మాల్స్‌లో పనికి కుదురుకోవాల్సిన అగత్యం ఏర్పడుతుంది. ప్రధానంగా ఈ పరిస్థితి చిన్న చిన్న పట్టణాల్లో ఎదురవుతుంది. ఇంకా ముందుకుపోతే ఎగుమతి – దిగుమతి సమతుల్యతా దెబ్బతింటుంది. స్థానిక వనరుల నుంచి అందినకాడికి ముందస్తుగానే వస్తువులను సేకరించేసుకొని, విశ్వవ్యాపిత ఉత్పత్తుల దిగుమతులకు ఎగబాకడం జరుగుతుంది. అయితే మొదట్లో వినియోగదారులను ఆకర్షించేందుకు అనువుగా స్థానిక మార్కెట్ల కన్నా కాస్త తక్కువ ధరలకు ఉత్పత్తులను అందించినా, మార్కెట్‌పై పట్టు సాధించిన మీదట మొదలవుతుంది మోత.

ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న మన దేశ వాణిజ్య రంగంలో ఇంతటి పెనుమార్పు చోటు చేసుకుంటుంటే, కనీసం ప్రజాభిప్రాయ సేకరణగానీ, పార్లమెంట్‌లో చర్చగానీ లేకుండా చడీ చప్పుడు లేకుండా అనుమతించారు. ఇది 'స్వాహా'తంత్ర పాలకుల లక్షణం. చేసింది చెప్పకుండా, చెప్పింది చేయకుండా వంచనతో పబ్బం గడుపుకోవడం నేటి పాలకుల సహజధోరణిగా మారింది.

అమెరికాకు చెందిన వాల్‌మార్ట్ అనే అతిపెద్ద రిటైలర్‌కు గేట్లు బార్లా తెరవడం కోసమే ఈ కసరత్తు. 1962లో ప్రారంభమైన ఈ సంస్థ నేటికీ అమెరికా, మెక్సికో, కెనడా దేశాల్లో అతిపెద్ద రిటైలర్. అనువుకాని చోట మారుపేర్లతో ప్రవేశించడం దీనికి ఆనవాయితి. వాల్‌మార్ట్ ప్రవేశానికి 2005లోనే నాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ. బుష్‌తో మన ప్రధాని 'వ్యవసాయ ఒప్పందం' పేరిట సంతకం చేశారు. భారతీయ సీడ్ మార్కెట్‌ను మోన్‌శాంటోకు, గ్రెయిన్ మార్కెట్‌ను అమెరికా అగ్రి బిజినెస్‌కు, రిటైల్ మార్కెట్‌ను వాల్‌మార్ట్‌కు అప్పగించే ఒప్పందం అది. మల్టీ బ్రాండ్ జెయింట్స్‌ను ఈ తరహాలో మార్కెట్‌లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రవేశానికి అనుమతించడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుంది.

2007 నాటికే వాల్‌మార్ట్ ప్రవేశాన్ని అడ్డుకోజూస్తే, భారతీ ఎంటర్ ప్రైజెస్ ద్వారా అది దొడ్డిదారిన హోల్‌సేల్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. ఇవి 'బెస్ట్ ప్రైస్', 'మాడ్రన్ హోల్‌సేల్' పేరిట కొనసాగుతున్నాయి. తదుపరి అమెరికాలో ప్రభుత్వాలు మారినప్పటికీ, ప్రభుత్వ లక్ష్యాలు మాత్రం మారలేదు. మన దేశంలో పాలకవర్గాలు ఏ పార్టీకీ, కూటమికీ చెందిన వైనప్పటికీ ఆర్థిక సంస్కరణలను మోయడం తప్ప మరో లక్ష్యం వారికి లేదు. 2011లో వాల్‌మార్ట్ ప్రవేశాన్ని వ్యతిరేకించిన మమతా బెనర్జీని, 2012, మే 7న అమెరికా విదేశాంగ శాఖ మంత్రి హిల్లరీ క్లింటన్ కలకత్తా సందర్శన పేరిట కలవడం కాకతాళీయం ఏమీ కాదు.

రిటైలింగ్ వాణిజ్యంలో విదేశీ శక్తుల ప్రమేయం చిన్న తరహా రైతుల నాశనం, చిన్న తరహా రిటైలర్లను రోడ్డెక్కించడం, కార్మికులను దోచుకోవడం అనివార్యమైనవని ఇతర దేశాల అనుభవాలు వ్యక్తం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో అత్యంత కీలకాంశాలు నిక్షిప్తంగా దాగి ఉన్నాయి. వాణిజ్యం పేరిట ఉత్పాదకతా ప్రక్రియలో అడుగుపెట్టిన విదేశీ శక్తులు భారీ పెట్టుబడులతో వ్యవసాయ 'కార్పొరేటీకరణ'కు నాందీ పలుకనున్నాయి. అందుకే ఆధునిక వ్యవసాయం పేరిట యంత్రాల ఆధునికీకరణ ఇప్పటికే మొదలైంది. దీనికనువుగా ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సమీపంలో వాల్‌మార్ట్ షాపింగ్ మాల్ నిర్మాణం జరుగుతోంది. ఈ షాపింగ్ మాల్ ప్రవేశానికి మెంబర్‌షిప్ కార్డుల నమోదు సైతం మొదలయింది. పైగా దేశంలోనున్న కార్మిక చట్టాలను సవరణ చేసేందుకు ప్రభుత్వం హామీనిచ్చింది. ఇప్పటికే కార్మిక చట్టాలు ఉనికిలో లేని వాస్తవం మనముందుంది. అంటే ఉన్న కాస్తా కూస్తా కూడా మటుమాయం అయిపోతాయన్న మాట. వాల్‌మార్ట్‌ల ప్రవేశంతో మన గ్రామీణ సంస్కృతీ చిహ్నాలైన సంతలు, జాతరలు వంటి స్వేచ్ఛా వాణిజ్యం కనుమరుగు కానున్నాయన్న మాట.

దీంతో ఒకనాటి వలసపాలన మళ్లీ మన అనుభవంలోకి రానుందన్న మాట. నాటి ఈస్ట్ ఇండియా వారసత్వమే మళ్లీ పునరావృతం కానుంది. ఈస్ట్ ఇండియా హయాంలో నాటి స్వాతంత్ర్య సమరయోధులు విదేశీ బహిష్కరణకు పిలుపునిస్తే, అదే వారసత్వం పేరున నేటి ఖద్దరు పార్టీ నేతలు విదేశీ వాణిజ్యానికి సర్వశక్తులు ఒడ్డి, సాగిలపడి ఆహ్వానిస్తున్నారు. నాటి స్వాతంత్ర్య పోరాట పటిమను గుర్తెరిగి, గుణపాఠాలు తీసుకుని మళ్లీ మనం రెండో స్వాతంత్ర్య సమరానికి సమాయత్తం కావాల్సి ఉంది.

(రచయిత పాత్రికేయులు) వీ

బీమా, పెన్షన్ రంగాల్లో ఎఫ్‌డిఐ

సంక్షేమ దృష్టితో ఏర్పరచిన బీమా, పెన్షన్ రంగాలలోకి లాభాలే కేంద్రంగా పనిచేసే బహుళజాతి సంస్థలనూ, ఎఫ్‌డిఐలనూ అనుమతించడం మన పాలకుల స్వభావాన్ని చాటుతోందని అంటున్నారు **డా. శ్రీనివాసరావు చొప్పర**

అమావాస్య నాడు చంద్రుడిని వర్ణించడం ఎంత నిజమో, బీమా, పింఛను రంగాలలో విదేశీ ప్రత్యక్షపెట్టుబడు (ఎఫ్‌డిఐ)లను అనుమతించి చందాదారులకు అత్యంత భద్రతను కల్పిస్తామని చెప్పడం కూడా అంతే నిజం. బీమా రంగంలో ఇప్పటికే అనుమతించిన 26 శాతం ఎఫ్‌డిఐలను 49 శాతం పెంచాలని, పింఛను నిధుల రంగంలో తొలిసారిగా 49 శాతం అనుమతించాలని 2012 అక్టోబరు 4న కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. వాటితో పాటు సరుకు వాణిజ్యంలో ఆప్షన్ వంటి కొత్త జూదగొండు పద్ధతులకు అవకాశం కల్పిస్తూ ఫార్వర్డ్ కాంట్రాక్ట్ సవరణ బిల్లు, కొత్త కంపెనీ బిల్లులకూ ఆమోదం తెలిపింది.

దేశంలో 30 కోట్ల వ్యక్తిగత, 10కోట్ల గ్రూప్ పాలసీదారులను కలిగిన ప్రపంచంలోనే అతి పెద్ద బీమా రంగం మన జీవితబీమా కార్పొరేషన్ (ఎల్ఐసి), సాధారణ బీమా కార్పొరేషన్(జిఐసి). క్లెయిమ్‌లను పరిష్కరించడంలో, ప్రీమియంలను సేకరించడంలో దేశంలో అగ్రగామిగా నిలిచింది. బీమా రంగంలో విదేశీ, స్వదేశీ ప్రైవేట్ కంపెనీలకు అవకాశం కల్పించి 10 సంవత్సరాలు గడిచిన తరువాత కూడా మొత్తం బీమా మార్కెట్‌లో 76 శాతం ప్రీమియం, 81 శాతం పాలసీలను కలిగి ఉండి ప్రభుత్వ రంగ బీమా అగ్రస్థానంలోనే కొనసాగుతోందని 2012 ఆగస్ట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 1.5 లక్షల మంది ఉద్యోగులతో పాటు 13.5 లక్షల బీమా ఏజెంట్లతో దేశ వ్యాప్తంగా అతిపెద్ద నెట్‌వర్క్ మన ప్రభుత్వరంగ బీమా సొంతం. రు.13.17 లక్షల కోట్ల స్థిరాస్తులను కలిగి రు. 2.03 లక్షల కోట్ల ఆదాయాన్ని ప్రీమియం ద్వారా పొందుతోంది. బీమా విస్తరణ రేటులో అభివృద్ధి చెందిన దేశాల కంటే ఎంతో ముందుంది. అంతే కాకుండా దేశ స్థూల జాతీయాదాయంలో 5.4 శాతం వాటాను చేకూరుస్తూ, మౌలిక వసతుల కల్పన రంగానికి, ప్రభుత్వ ప్రణాళికల అమలుకు కావలసిన ద్రవ్య సరఫరా చేస్తున్న రంగం మన ప్రభుత్వ బీమారంగం.

ఇక మన పెన్షన్ నిధుల రంగాన్ని పరిశీలిద్దాం. కార్మికులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి పదవీ విరమణ చేసినా, అనారోగ్యం పాలైనా, ప్రమాదానికి గురైనా, ఉపాధి కోల్పోయినా, అకాల మరణం చెందినా ఆర్థికంగా ఆదుకోవలసిన భాధ్యత సమాజంపై ఉంది. సామాజిక భద్రతలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు ఒక హక్కుగా పింఛను సౌకర్యాన్ని అనుభవిస్తూ వచ్చారు. సర్వీసు నుండి రిటైర్ అయ్యే నాటికి పొందుతున్న వేతనం ప్రాతిపదికన పింఛన్‌ను నిర్ధారించి విశ్రాంతి ఉద్యోగులకు లేదా ఉద్యోగి మరణిస్తే సంబంధిత కుటుంబానికి జీవితాంతం పింఛను చెల్లించే చట్టబద్ధమైన విధానం అమలులో ఉంది. వేతన సవరణలను వర్తింపజేసి పింఛను చెల్లించడం ద్వారా జీవిత చరమాంకంలో ప్రశాంత జీవనం సాగించడానికి చట్టం భరోసా ఇచ్చింది.

పెన్షన్ అనేది భద్రతకు మారుపేరుగా చెప్పవచ్చు. గ్యారెంటీ రిటర్న్ ఉండే సంస్థలలోనే పింఛను నిధులను పెట్టుబడిగా పెట్టేట్లు పింఛను రంగంపై ప్రభుత్వ నియంత్రణ ఇప్పటి వరకు ఉంది. మార్కెట్ ఒడిదుడుకులతో ఏ మాత్రం సంబంధంలేని, మరీ ముఖ్యంగా స్టాక్ మార్కెట్ ఇండెక్స్‌తో ముడిపడని విధంగా చందాదారులకు కచ్చితమైన మొత్తానికి తగిన హామీ ఇచ్చే చందా లబ్ది విధానం (డిఫైన్డ్ బెనిఫిట్ సిస్టం) ప్రకారం పనిచేస్తున్న సుస్థిరమైన ఆర్థికరంగం మన పింఛను రంగం. బీమా, పెన్షన్ రంగాల నిర్వాహణలో కొన్ని లోపాలున్నప్పటికీ 'మనిషి' కేంద్రంగా ఈ రెండు రంగాలు ఇప్పటి వరకూ పనిచేశాయి. కాని 'లాభాలు' కేంద్రంగా గల ఎఫ్‌డిఐలు, బహుళజాతి సంస్థలు నేడు ఈ రెండు రంగాలను ఆక్రమిస్తున్నాయి.

రూపాయిని స్థిరీకరించడం, మూలధన నిధులను ఆకర్షించడం, వ్యయ నియంత్రణలో భాగంగా రెండవ దశ ఆర్థిక సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. బీమా రంగం విస్తరణకు గాను సమీప భవిష్యత్‌లో 5 నుంచి 6 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాదు మౌలిక సదుపాయాల రంగ అభివృద్ధికి బీమారంగం నుండి ఎక్కువ నిధులు మళ్లించాలని కూడా ప్రభుత్వం అంటోంది. ఇంకా ఉద్యోగ అవకాశాలను పెంచడానికి, పేదల జీవితానికి తగిన భద్రత కల్పించడానికి అటు బీమారంగంలోనూ, ఇటు పింఛను రంగంలోనూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనుమతించాలని ప్రభుత్వం అంటుంది. ఒక వైపు ఆర్థికరంగానికి, మరో వైపు చందాదారులైన దేశ ప్రజలకు ఈ రెండు రంగాలు జోడెద్దులుగా ఉండి తగిన భద్రతను, భరోసాను కల్పించాయి. వాటిని నేడు విదేశీ మదుపుదారులకు కట్టబెడుతూ ఎఫ్‌డిఐలకు తాళాలు తెరవనుంది. ఫలితంగా లాభాల వేటకై పోటీని పెంచింది. భద్రతను తుంచింది. అభద్రతను పెంచింది.

ఆర్థిక స్థిరత్వం కొరకు, బీమా విస్తరణకు, ఉద్యోగ అవకాశాల పెంపుదలకు 26 శాతం నుంచి 49 శాతానికి ఎఫ్‌డిఐని పెంచాల్సి వచ్చింది అంటున్నారు. అంచెలంచెలుగా విదేశీ భాగస్వామ్యాన్ని పెంచడంలో ఆంతర్యం ఏమిటి? ఇప్పటివరకు 26 శాతం ఎఫ్‌డిఐలు సాధించిన కొత్త ఉద్యోగాలెన్ని, వారు తరలించుకుపోయిన లాభాల శాతం ఎంత? ప్రభుత్వం ముందుగా వీటికి సమాధానం చెప్పాలి. బహుళ జాతి సంస్థలు (ఎంఎన్‌సిలు) లాభాల వేటకు వచ్చే వారే తప్ప పాలసీదారుల శ్రేయస్సు ఏ కోశానా ఉండదు. నిజానికి భారతదేశంలో ఇన్సూరెన్స్ ఎప్పుడూ కూడా నియంత్రించబడ్డదే. పోటీని నివారించి

పాలసీదారుల ప్రయోజనాలకు పెద్ద పీఠ వేసిందే. 'నిర్దిష్ట హామీలు–హామీల అమలు' అన్న సూత్రంపై పని చేసిందే తప్ప మార్కెట్ మాయాజాలం చూపి పాలసీదారులను మభ్యపెట్టలేదు. కానీ ప్రభుత్వం ఈ రంగంలో పోటీని పెంచుతోంది. ఇది వాంచనీయం కాదు. ఈ పోటీలో ఎక్కువ రిటర్న్స్ పొందాలనే దానితో ఎక్కువ రిస్క్ ఉన్న చోటనే పెట్టుబడి పెట్టడానికి బీమా కంపెనీ సిద్ధపడుతోంది. స్థిరమైన రిటర్న్స్ వచ్చే దగ్గర రిస్క్ తక్కువగా ఉంటుంది. పాలసీదారుల దృష్ట్యా అది అత్యంత అవసరం.

నిజానికి పాలసీదారుడు భవిష్యత్‌లో జరగబోయే అవాంచనీయ ఘటనల నుండి తననూ, తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి తన జీవితాన్ని, ఆస్తిని బీమా చేసి ప్రీమియం చెల్లిస్తాడు. ప్రీమియం చెల్లించే కాలానికి, క్లెయిమ్ పొందే కాలానికి మధ్య చాలా కాలవ్యవధి ఉంటుంది. ఆ పెట్టుబడులు సురక్షితమైతేనే క్లెయిమ్ మొత్తాన్ని చెల్లించగలదు. లేకుంటే పాలసీదారుకు తిప్పలు తప్పవు. అంతే కాకుండా బీమా కంపెనీ కాంట్రాక్ట్‌ను తక్కువ అంచనా వేయడం, క్లెయిమ్ సంభవించే అంచనాను తక్కువగా వేయడం జరగవచ్చు. అయితే ఆ బీమా సంస్థ జరగబోయే ఘటనలను ఆపడానికి ముందస్తు చర్యలు ఏమీ తీసుకోవడం సాధ్యం కాదు. ఈ పరిస్థితుల్లో బీమా సంస్థ పెట్టుబడి పెట్టే విషయంలో పొరపాటు చేస్తే దాని ఫలితం అంతిమంగా పాలసీదారుపైనే ఉంటుంది. ఇది బీమా రంగంలోని అతి పోటీ వలన జరుగుతుంది. తమ వ్యాపార విస్తరణ కొరకు, అధిక లాభార్జన కొరకు పాలసీదారుతో సంబంధం లేకుండా ఏకపక్షంగా పెట్టుబడి పెడతాయి. ప్రీమియం నిధులను మార్కెట్‌కు తరలిస్తాయి. అమెరికా లాంటి దేశాలలో ఇదే జరిగింది.

అమెరికాలో బీమా కంపెనీలు క్లెయిమ్‌లు పరిష్కరించడంలో విఫలం కావడంతో పాటు చాలా కంపెనీలు దివాలా తీశాయి. ఈ పరిణామాలపై అధ్యయనానికి గాను 1990లో అమెరికా ప్రభుత్వం పార్లమెంటరీ ప్రతినిధులతో ఒక ఉప సంఘాన్ని నియమించింది. అది తన నివేదికకు 'విఫలమైన హామీలు' అని నామకరణం చేసింది. ఆ నివేదికలో 'అడ్డు, అదుపూ లేని విస్తరణ కాంక్ష, చాలా తక్కువ ప్రీమియం, తప్పుడు నివేదికలు, అసమర్థమైన యాజమాన్యం, మోసపూరిత ప్రవర్తన, క్షేమకరం కాని క్షేత్రస్థాయి పోటీ, అత్యాశ' ప్రధాన కారణాలుగా తేల్చింది. ఈ విధమైన పరిస్థితి అంతటికి మూల చోదక శక్తి అనతి కాలంలోనే విపరీత లాభార్జన చేయాలనుకోవడం, కంపెనీ భవిష్యత్‌ను గానీ, పాలసీదారుల శ్రేయస్సును గానీ, ఉద్యోగుల, దేశ ప్రజల బాగోగులను బొత్తిగా పట్టించుకోకపోవడమే అని కమిటీ తేల్చింది. పనిలో పనిగా దేశంలోని బీమా రంగాన్ని నియంత్రించాలని ఆ కమిటీ సూచన కూడా చేసింది.

అయితే అమెరికా ప్రభుత్వం ఆ నివేదికను పట్టించుకున్నది లేదు. దాని పర్యావసానమే 2008 పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సంక్షోభం లో కూరుకుపోయింది. ప్రపంచ ఇన్సూరెన్స్ అగ్రగామిగా చెప్పుకుంటున్న అమెరికా ఇంటర్నేషనల్ గ్రూప్ (ఏఐజి) దివాలా తీసింది. లక్షలాది పాలసీదారులు తమ పాలసీ మొత్తాలలో, పొదుపులలో కొంత మంది 50 శాతం మాత్రమే పొందగా, ఎక్కువ మంది పూర్తిగా నష్టపోయారు. దానిని ఆదుకోవడానికి అమెరికన్ ప్రభుత్వం 170 బిలియన్ డాలర్ల ఉద్దీపన పథకాన్ని (బెయిల్ అవుట్) ప్రకటించింది. ఒకవైపు పాలసీదారులు రోడ్డున పడగా మరోవైపు ప్రజల సొమ్మును బెయిలవుట్ పేరుతో దివాలా తీసిన సంస్థలకు అమెరికా ప్రభుత్వం కట్టబెట్టింది. ఇలా ఆ ప్రజలు చెంపదెబ్బ, గోడదెబ్బ రెండూ పొందవలసి వచ్చింది.

కాని భారత బీమారంగం నేటికీ సుస్థిరమైన అభివృద్ధినీ, పాలసీదారుల విశ్వాసాన్ని పొందుతోంది. బీమా నిధులను పెట్టుబడి పెట్టే విషయంలో ప్రభుత్వ నియంత్రణ, ప్రజల భాగస్వామ్యం అనే ఈ రెండు విధానాలు మన బీమా రంగాన్ని నడిపిస్తున్నాయి. కాని నేడు వీటికి మనం స్వస్తి చెబుతున్నాం. ఎలాంటి నియంత్రణానుభవం లేని, పాలసీదారులను నట్టేట ముంచిన అనుభవాన్ని మూట గట్టుకున్న ఏఐజి లాంటి బహుళజాతి సంస్థలకు ఎర్రతివాచీ పరుస్తున్నాం. బహుళజాతి కంపెనీల దండయాత్రను మనం ఆహ్వానిస్తున్నాం. అమెరికా, యూరప్‌ల ఆర్థిక వ్యవస్థలను తలకిందులు చేసిన ద్రవ్యపెట్టుబడులను, బీమా మాయలను మనం తెచ్చి పెట్టుకోవడమంటే కొరివితో తల గోక్కోవడమే. ఇది మన ప్రభుత్వ బీమా రంగాన్ని మరింత బలహీన పరిచేదే తప్ప విస్తరణకు ఏ మాత్రం అవకాశం లేదు. ఉన్న ఉద్యోగాలు ఊడతాయి తప్ప కొత్తగా ఉద్యోగాల మాటే ఉండదు. ఇప్పటికే అది ప్రారంభమయింది. 2001-02 నుండి 2010-11 మధ్య కాలంలో బీమా రంగంలో ప్రైవేట్ సెక్టార్ 25 శాతం పెరిగితే పబ్లిక్ సెక్టార్ 10 శాతం మేరకు తగ్గుదల నమోదైంది. ప్రధానంగా చిన్న, మధ్య తరగతి ప్రజలకు ఇది ఎంతో నష్టదాయకం.

పింఛన్ నిధుల నియంత్రణ, అభివృద్ధి సాధికార సంస్థ (పిఎఫ్ఆర్‌డిఏ) నిర్వహిస్తున్న నూతన పింఛను పథకమైన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) కింద ఇప్పటి వరకు 37.47 లక్షల మంది చందాదారు లున్నారు. 20,535 కోట్ల మూల నిధి (కార్పస్ ఫండ్) జమైంది. ఈ నిధి 2015 నాటికి లక్ష కోట్ల రూపాయలకు చేరుతుందని అంచనా. మరో వైపు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఆర్)లో లక్షా ఎనభై ఐదు కోట్ల మూల నిధి, ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఇపిఎస్)లో లక్షకోట్లు, ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్‌డ్ ఇన్స్యూరెన్సు ఫండ్ (ఇడిఎల్ఐఎఫ్)లో గల పదివేల కోట్ల రూపాయల మూలధన నిధులను కలిపితే మొత్తం మూడు లక్షల కోట్ల రూపాయల పైనే పింఛను నిధులు నేడు అందుబాటులో ఉన్నాయి. అంతేగాక కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే వారే గాకుండా స్వయం ఉపాధిదారులతో పాటు పౌరులెవరైనా చందాదారులుగా చేరి పింఛను పొందడానికి అవకాశం కల్పిస్తూ 2010లో ప్రభుత్వం నిర్ణయించింది. అందువల్ల ఈ పింఛను రంగం సమీప భవిష్యత్తులోనే అత్యంత కీలకమైన, వ్యాపారానికి విస్తృత అవకాశాలున్న రంగంగా అభివృద్ధి చెందనుంది. బీమా రంగం మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటి కంటే పింఛను రంగం చాలా పెద్దదని పసిగట్టిన స్వదేశీ, విదేశీ గుత్త సంస్థలు దీన్ని కబ్జా చేయడానికి పోటీ పడుతున్నాయి. ప్రభుత్వం పై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ ఒత్తిడికి తల వంచిన కేంద్రం ఒకే సారి ఈ రంగంలో 49శాతం ఎఫ్‌డిఐలకు పచ్చ జెండా ఊపింది.

ఉద్యోగులకు వృద్ధాప్యంలో పెన్షన్ చెల్లించాలన్న సామాజిక బాధ్యతను ఎప్పుడో వదిలేసిన ప్రభుత్వం అక్కడితో ఆగలేదు. తమ ఆదాయంలో నిర్దిష్ట మొత్తాన్ని పొదుపుగా నూతన పింఛన్ పథకం కింద జమ చేస్తున్న ఆ మొత్తాలను కూడా విదేశీపరుల పాలు చేయాలని తలపెట్టింది. దాని కొరకు యుపిఎ–2 ప్రభుత్వం పింఛను నిధుల నియంత్రణ, పిఎఫ్ఆర్‌డిఎ సవరణ బిల్లును 2011 మార్చి 24న

లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లుపై అధ్యయనానికి బిజెపి నేత మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా నేతృత్వంలో పార్లమెంటరీ స్థాయి సంఘాన్ని ఏర్పరిచారు. ఆ సంఘం ఆగస్ట్ నెలలో నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో –

1) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 26 శాతానికి మించకుండా పరిమితి విధించాలి. 2) పెట్టుబడులపై కనీస ఆదాయానికి సంబంధించిన షరతు విధించటం ద్వారా మదుపుదారుల కనీస పింఛనుకు రక్షణ కల్పించాలి. 3) పింఛను పథకం ఖాతాలనుండి ఎప్పుడైనా తమ నిధులను ఉపసంహరించుకునే హక్కు మదుపుదారులకు కల్పించాలని సిఫారసు చేసింది. 49 శాతం ఎఫ్‌డిఐలను అనుమతించడాన్ని సంఘం ఏకగ్రీవంగా తిరస్కరించింది. ఈ సంఘంలో 31 మందిలో యుపిఎ మిత్రపక్షాల వారు 16 మంది కాగా అందులో 12 మంది ఒక కాంగ్రెస్‌కు చెందిన వారే కావడం గమనించదగ్గ విషయం. కాని ప్రభుత్వం వీటన్నిటిని నిర్ద్వందంగా తిరస్కరించింది. కనీస ఆదాయంపై రక్షణ కల్పించే షరతు విధించలేమని తేల్చింది. మదుపుదారుల కంటే విదేశీ వ్యాపార వేత్తల ప్రయోజనాలే ముఖ్యమన్నది.

ఇప్పటికే ఈ పింఛను రంగంలో ఎఫ్‌డిఐలను అనుమతించిన లాటిన్ అమెరికా దేశాలలోనూ, ఇంగ్లండ్, ఐరోపా, శ్రీలంక లాంటి దేశాలలో ప్రజలు చేదు అనుభవాలను చవిచూశారు. 2008–09 లో అమెరికాలో ఆర్థిక మాంద్యం ఏర్పడినప్పుడు పింఛను దారులు తమ పొదుపులను తీవ్రంగా నష్టపోయారు. అమెరికాలోని భారతీయ సంతతికి చెందిన ఒక ఐటి ఉద్యోగి తన పొదుపులలో ఎక్కువ మొత్తాలను యుఎస్ స్టాక్ ఎక్ఛేంజ్‌లో లిస్టు అయిన అమెరికాలో పేరెన్నికగన్న 401కె పథకం అనే పింఛను నిధుల నిర్వహణ సంస్థలో 100 శాతం పింఛను కింద తన నిధులను మదుపు చేశాడు. మాంద్యం కారణంగా 50శాతం పైగానే నష్టపోయాడు. ఇలాంటి వాళ్లు అమెరికాలో మిలియన్ల మంది ఉన్నారు. ఇది వాస్తవం కాగా కేంద్రం మన పింఛనుదారుల భవిష్యత్‌ను, భద్రతను బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసం. ఎవరి ప్రయోజనాలు, ఎవరి ఒత్తిడి ఇందులో ఉంది.

అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీల, బహుళజాతి సంస్థల మెప్పుకోసం, అగ్రరాజ్య ఒత్తిడి మేరకు ఈ నిర్ణయాలు తీసుకోబడ్డాయి. లాభాలను గరిష్ఠం చేసుకునేందుకు గాను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి నేతృత్వంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ కొత్త మార్గాల కోసం అన్వేషిస్తోంది. పెట్టుబడి ఎప్పుడూ ఖాళీగా ఉండబోదు. పెట్టుబడిదారీ స్వభావమే అంత. భారత ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా, భారత ఆర్థికవ్యవస్థ మూలాలను దెబ్బతీసే విధంగా చర్యలు తీసుకోవాలని ఒత్తిడి పెరుగుతుంది. మరిన్ని సంస్కరణలను ప్రవేశపెట్టడం ద్వారా అమెరికా ప్రయోజనాలకు అనుకూలంగా నడచుకునేలా భారత్ పై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ క్రెడిట్ ఏజెన్సీలు రేటింగ్‌ను తగ్గించడం ద్వారా ఒత్తిడిని పెంచాయి. ఫలితంగా అమెరికా పాలకులను సంతృప్తి పరచడమే ప్రధాన ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తూ మిత్రపక్షాలు కొన్ని వ్యతిరేకిస్తున్న పిఎఫ్‌ఆర్‌డిఎ–2011 సవరణ బిల్లుకు, ఐఆర్‌డిఎ–2008 సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం పొందడానికి నవంబర్‌లో జరగబోయే శీతాకాల సమావేశాలను వేదికగా చేసుకుంది. ఈ రెండు రంగాల్లో ఎఫ్‌డిఐలు అనుమతించాలన్న అభిమతాన్ని ఎన్‌డిఎ హయాంలోనే బిజెపి వ్యక్తం చేసింది. ఆ మేరకు నేడు ఈ రెండు సవరణల బిల్లులకు పార్లమెంట్ ఆమోదం పొందడంలో తమ వంతు సహకారాన్ని అందించడానికి సిద్ధంగా ఉంది. కాబట్టి ఈ బిల్లులకు పార్లమెంట్ ఆమోదం అన్నది పెద్ద విషయం కాదు.

నిజానికి బీమారంగం గాని, పెన్షన్ రంగం గాని వస్తు ఉత్పాదక రంగాలు కాదు. మౌలిక పారిశ్రామిక రంగాలు అసలే కాదు. సంస్కరణలను ప్రవేశపెట్టిన తొలినాళ్లల్లో, ప్రపంచీకరణ వ్యవస్థీకృత మవుతున్న రోజుల్లో కేవలం వస్తు ఉత్పత్తి రంగంలో మాత్రమే విదేశీ ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని అనుమతిస్తామని నేటి ప్రధాని, నాటి ఆర్థికమంత్రి దేశ ప్రజలకు ఇచ్చిన హామీకి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడు. అనుత్పాదక సేవల రంగం అయిన బీమా, బ్యాంకింగ్, పింఛన్ రంగాలలో, పంపిణీ రంగమైన చిల్లర వర్తకంలో విదేశీ భాగస్వామ్యాన్ని అనుమతిస్తుంది. ఇది రెండో దశ సంస్కరణలకు ఆరంభం అని చెబుతుంది.

అభివృద్ధి రేటు దిగజారడం, పారిశ్రామిక వృద్ధి రేటు పతనం, ఇలా అన్ని రంగాలు నేలచూపులు చూస్తున్న నేటి దుస్థితికి ఏ సంస్కరణలైతే కారణమయ్యాయో అవే సంస్కరణలను మరింత దూకుడుగా అమలు చేయడానికి ప్రభుత్వం పూనుకోవడమంటే దేశాన్ని సామ్రాజ్యవాదులకు కట్టబెట్టడానికి వేగాన్ని పెంచుతుందా అనే అనుమానం రాక తప్పదు.

(రచయిత లెక్చరర్, వాణిజ్య శాస్త్ర విభాగం,
జవహర్ భారతి కాలేజీ, కావలి) వీ

భూమి పందారం

భారత పాలకులు అమెరికన్ సామ్రాజ్యవాదులకూ, బహుళజాతి సంస్థలకూ బంట్లుగా వ్యవహరిస్తున్నారే తప్ప ప్రజలకు బాధ్యతపడడం లేదని అంటున్నారు వి. హనుమంతరావు

భూమి, నీరు, అడవులు, గాలి ప్రకృతి వరాలు. కాని పాలకులు భూమాతను రచ్చకీడ్చి నానారభస చేస్తున్నారు. పంట పండించాల్సిన భూమిని ప్రాజెక్టులకు, పరిశ్రమలకు కట్టబెడుతున్నారు. పరిశ్రమల కారణంగా గాలి కలుషితమవుతోంది. మొత్తం భూవైశాల్యంలో మూడో వంతు అడవులుండాలని భూశాస్త్రవేత్తలు చెబుతుండగా, ఆ అడవులతో ప్రభుత్వం వ్యాపారం చేస్తోంది. పోడు వ్యవసాయం చేసుకొంటూ, ఆకు అలం తిని బతుకు వెళ్లదీసుకొంటున్న ఆదివాసి ప్రజలు అడవులను నాశనం చేస్తున్నారనే సాకుతో గెంటివేసి, ఆ ప్రకృతి వరాన్ని నాశనం చేసే అవకాశం బహుళజాతి సంస్థలకు, కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. పూర్వకాలంలో వ్యవసాయం చెరువుల మీద ఆధారపడి సాగింది. ఇప్పుడు భూ కబ్జాదారులు ఆ చెరువులను ఆక్రమించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ చెరువులను పునరుద్ధరించే పేరుతో ప్రపంచబ్యాంక్ నుంచి అప్పు తీసుకొనే స్థితికి ప్రభుత్వం దిగజారింది. పరిశ్రమలు వాతావరణ కాలుష్యాన్ని వెదజల్లుతూ, ప్రజలు శుభ్రమైన గాలిని పీల్చలేని పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోంది.

గతంలోకి తొంగిచూస్తే అప్పటి చక్రవర్తులకు, తర్వాత వచ్చిన మొఘల్ సామ్రాట్‌లకు, బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు, ఇప్పటి 'ప్రజాస్వామ్య' పాలకులకు ఎటువంటి తేడా లేదు. కాదు కాదు, తేడా ఉంది. అప్పటి రాజులు, మొఘల్ బాదుషాలు, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు స్వతంత్రులైతే ప్రస్తుత పాలకులు అమెరికన్ సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల, కార్పొరేట్లకు గులాములు. కాస్త మర్యాదైన పదజాలంలో చెప్పాలంటే వాళ్ల సిఇఒలు (చంద్రబాబులా).

మానవజాతి ఆవిర్భవించినపుడు అప్పటి ఆదివాసులు చిన్న చిన్న గుంపులుగా నివసించేవారు. జంతువుల వేటలో కొన్ని గుంపుల మధ్య వివాదాలు చెలరేగడం, గెలిచిన గుంపు ఓడిపోయిన గుంపు నివసించే ప్రాంతాలను ఆక్రమించడం జరుగుతూ వచ్చేది. రాను రాను యుద్ధాలుగా మారి, గెలిచిన వారి స్వాధీనంలోకి మరింత భూభాగం వచ్చి, మెల్లమెల్లగా రాచరిక వ్యవస్థగా రూపొందింది. మరింత భూభాగం వారి రాజ్య పరిధిలోకి రాసాగింది. రాజ్యకాంక్ష పెరిగింది, యుద్ధాలు, ఆక్రమణలు మరింత రాజ్యకాంక్ష పెంచడంతో, విజయం సాధించిన రాజులు తమకు జయం చేకూర్చడంలో సహాయపడిన వారికి కొంత భూమి నజరానా ఇవ్వడం, ఆ భూముల మీద వచ్చిన ఆదాయంలో కొంత ఆదాయాన్ని రాజుకు కప్పం కట్టడం ప్రారంభమైనపుడు ఈ భూమి రాజుదా లేక వ్యక్తులదా అనే విషయం చర్చనీయాంశమైంది. కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రకారం రెండు రకాల భూకామందులుంటారు, భూమి రాజు పేర, రైతు పేరునా ఉంటుంది. రాజు యుద్ధంలో జయం సాధించడం ద్వారా, ఇతరంగా భూమికి అధిపతి అవుతాడు. రాజు స్వాధీనంలో ఉన్న భూమిని కౌలుదార్లు సేద్యం చేస్తూ, రాజుకు శిస్తు చెల్లించేవారు, వారికి దున్నే భూమి మీద ఎటువంటి హక్కులేదు.

ఆ తర్వాత మొగలాయి సామ్రాజ్యం ఏర్పడింది. దాడులు జరపడం, రాజ్యాలను ఆక్రమించడం, రాజ్య విస్తరణ సాధించడంలో అక్బర్ విజయ పరంపరలో మొఘల్ సామ్రాజ్యం నాలుగు చెరగులా విస్తరించింది. విస్తరించిన మేర భూమి మొఘలుల అధీనంలోకి ఏర్పడింది. ఇంకా కిందకుపోతే గ్రామస్థాయి పరిపాలనా వ్యవస్థ అమల్లోకి వచ్చింది. గ్రామాలలో (మొహల్లా) భూమి ఆదాయం ప్రజలందరిదీ. ఈ ఏర్పాటులో భాగంగా భూమి శిస్తు వసూళ్లు ప్రారంభమయ్యాయి. భూమి గ్రామస్తులందరిదీ అయినా, వ్యక్తిగతంగా భూములున్న వారు కూడా ఉన్నారు. మొఘల్ పాలనలో భూమి యాజమాన్యం, రెవెన్యూ యాజమాన్య పద్ధతులే తర్వాత వచ్చిన ఈస్టిండియా పాలనకు (18వ శతాబ్దం) ఆధారమయ్యాయి. కంపెనీ పాలనలో భూమి శిస్తు వసూళ్ల బాధ్యత జమీందారులను సృష్టించి వాళ్లకు అప్పజెప్పారు. ఆ విధంగా జమీందారీ వ్యవస్థకు పునాదులేర్పడ్డాయి. చూసిరమ్మంటే కాల్చి వచ్చినట్లు శిస్తు వసూలు చేయమంటే అసలు భూమినే రకరకాల పేర్లతో కబ్జా చేసుకొని వేల ఎకరాలకు యజమానులయ్యారు. బ్రిటిష్ పాలనలో రైతువారి శిస్తు వసూలు ప్రవేశపెట్టారు. రాజులు, మొఘల్ చక్రవర్తుల పాలనలో నజరానా పేరుతోనో, ఇతర విధాలుగా వ్యక్తులు పొందిన భూమి వ్యక్తుల వద్దకే, అలాగే జమీందారుల, జాగీర్దారుల వద్ద సక్రమంగానో, అక్రమంగానో ఉన్న భూమి, సంస్థానాధీశుల వద్దనున్న భూమి వారి సొంత భూమిగా పరిగణింపబడుతూ వచ్చింది. ప్రభుత్వ అధీనంలో అటవీ భూములు, పంట పండని భూములు మాత్రమే ఉండిపోయాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమీందారీ, జాగీర్దారీ, సంస్థానాధీశుల వ్యవస్థ రద్దయింది. ఈ రద్దు అనంతరం భూమి అంతా సివిల్, రక్షణ శాఖల అధీనంలోకి వచ్చాయి. రక్షణశాఖ భూములే నేటి కంటోన్మెంట్‌లు. మిగతా భూములన్నిటి మీద ప్రభుత్వ యాజమాన్యం ఏర్పడింది. ప్రభుత్వ ఆస్తులంటే – అని రాజ్యాంగం ఇలా నిర్వచించింది: 'రాజ్యాంగం అమలులోకి రాకముందు, బ్రిటిష్ పాలకులకు భూమి మీద ఏమి హక్కులున్నాయో, ఆ అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంక్రమిస్తుంది', 'అదే రాజ్యాంగం ప్రకారం ఇలా సంక్రమించిన ఆస్తులతో 'వ్యాపారం' చేసుకోవచ్చు లేదా, కాంట్రాక్టులు చేసుకోవచ్చు' అని ఉంది. అయితే 'వ్యాపారం' అనేదానికి అర్థం ఏమిటో వివరించలేదు. మామూలుగా వ్యాపారం అంటే కొనుగోళ్లు, అమ్మకాలు అని అనుకుంటాం. అయితే ఈ కొనుగోళ్లు, అమ్మకాలకు శాసనసభ లేదా పరిపాలనా వ్యవస్థ చేయాలా అనేది రాజ్యాంగం స్పష్టం చేయలేదు.

కంపెనీ	ఎక్కడ	ఇచ్చిన భూమి ఎకరాల్లో	మార్కెట్ ధర (రు. కోట్లలో)	అమ్మిన ధర (రు. కోట్లలో)
విప్రో	హైదరాబాద్	101.3	428.00	40.41
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్క్	హైదరాబాద్	670.00	2680.00	–
రహేజా కార్పొరేషన్	హైదరాబాద్	109.35	520.00	54.67
సత్యం	విశాఖ	50	186.00	–
ఎమ్మార్ ప్రాపర్టీస్	హైదరాబాద్	109.35	520.00	–
స్టార్‌గేజ్ ప్రాపర్టీస్	హైదరాబాద్	250	1282.50	50.00
బ్రహ్మణీ ఇన్ఫోటెక్	హైదరాబాద్	250	750.00	50.00
ఐ.టి. హార్డ్‌వేర్	హైదరాబాద్	100	500.00	–
అపోలో హెల్త్ సిటీ	విశాఖ	20	200	40
జెనోమ్ వాలీ	హైదరాబాద్	1000	4600	ఎ
గూగుల్ ఐఎన్‌సి	హైదరాబాద్	30	150	ఎ
డిఎల్ఎఫ్	హైదరాబాద్	26	126	ఎ
ప్రైవేట్ రిసార్ట్	హైదరాబాద్	175	432	ఎ
హార్డ్‌వేర్ ప్రాజెక్ట్	హైదరాబాద్	120	450	ఎ
ఫాబ్‌సిటీ	హైదరాబాద్	100	400	ఎ
ఇన్ఫోసిస్	హైదరాబాద్	447	1225	54
రహేజా గ్రూప్ ఐటి కంపెనీ	హైదరాబాద్	109	526	–
హిందూజా విద్యుత్ ప్రాజెక్ట్	హైదరాబాద్	1250	5000	–
యురేనియం ప్రాజెక్ట్	కడప	2240	36	

అలాగే భూముల అమ్మకం లేదా పందేరం చేయడానికి హక్కుందా అనే విషయం గురించి కూడా స్పష్టత లేదు. అమ్మకాలు, కొనుగోళ్లు అనే విషయం 'ఫైనాన్స్' మంత్రిత్వ శాఖ కిందకు వస్తుంది. అయితే ఆస్తులకు, వ్యక్తులకు, కార్పొరేషన్‌లకు గ్రాంట్‌గా ఇవ్వవచ్చా అనే విషయంలో స్పష్టతలేదు. ఈ అమ్మకాలు, గ్రాంట్‌లు ఇచ్చేటప్పుడు చట్టసభల అనుమతి తీసుకోవాలా అనే విషయం గురించి కూడా స్పష్టత లేదు. ఈ వివరణ లేకపోవడంతో పరిపాలనా వ్యవస్థ తనకు అర్థమైన రీతిలో ఈ అధికారాలను అన్వయించుకొంది. ఆఖరుగా ప్రభుత్వం ఎవరి భూములనైనా 'ప్రజోపయోగార్థం' స్వాధీనం చేసుకోవచ్చు అనే విషయంపై వాదోపవాదాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. 'ప్రజోపయోగం' అనే మాటకు అర్థం ఏమిటి? ఆస్తిపై హక్కు ప్రాథమిక హక్కు అని ఉండనే ఉంది. ఆ లెక్కన జమీందారీ పద్ధతి రద్దు చేసినప్పుడు ఈ హక్కును బయటకు తీసి జమీందారులు తమ భూమి మీద తమకు హక్కు ఉందని అప్పట్లో వాదించారు. ఈ చర్యలు వివాదాలన్నింటిలో ప్రజోపయోగార్థం అనే పదానికి అర్థమేమిటి అనే విషయంపై సుదీర్ఘ చర్చ జరిగింది, జరుగుతూనే ఉంది. వ్యవసాయం అనేది వంశ పారంపర్యంగా వస్తున్నదనీ, అందుచేత భూమి మీద హక్కు కూడా అంతే వంశపారంపర్యం ఉంటోందని రైతుల తరపున వాదన. అందుచేత తమ భూములను వ్యవసాయేతర వ్యవహారాలకు మళ్లించరాదనేది వారి తరఫు వాదన. మేము భూమి తీసుకొంటాం, అందుకు గాను మీకు ఉద్యోగాలిస్తాం. అంటే శతాబ్దాలపాటు మాకు వ్యవసాయం ఎలా చేయాలో తెలుసు గానీ, మరే ఇతర వ్యాపారాలేమిటో మాకు తెలియదన్నారు. అదీకాక తన జీవితకాలం ఉద్యోగం ఇచ్చినా, అది రైతు మారడంతో ఆ హక్కు రద్దయిపోతుంది. భూమి అయితే హక్కు వంశ పారంపర్యంగా ఉంటుందనేది రైతులు అంటున్నారు. ఇతర రకాలుగా కూడా ప్రభుత్వ భూముల పందేరాన్ని ప్రశ్నిస్తున్నారు. విద్యా సంస్థలకు, దేవాలయాలకు భూములను ప్రభుత్వం పంచి పెడుతోంది. వ్యాపార సంస్థలకు కూడా చవక ధరతో భూములను కేటాయించడం ప్రస్తుతం నిత్యకృత్యమైపోయింది. తెల్లారి లేచి పత్రిక చూస్తే కబ్జాల వార్తలు నిరంతరం వస్తున్నాయి. రాష్ట్ర రాజధాని నగరం చుట్టూ కబ్జాలే. మేం భూములు అమ్మేస్తే ఆదాయం వస్తుంది. ఆ ఆదాయంతో ప్రజలకు అనేక సౌకర్యాలు సమకూర్చవచ్చనేది ప్రభుత్వ వాదన. కాని ఆచరణలో ప్రభుత్వం కారుచవకగా రైతుల నుంచి 'ప్రజోపయోగార్థం' అనే పేరుతో భూములను లాక్కొని పారిశ్రామిక వేత్తలకు కట్టబెడుతోంది. ఈ విషయంపై కోర్టుల్లో, బయటా ఆందోళనలు తలెత్తాయి. ఇదేదో పది ఎకరాలో, వందల ఎకరాలో కాదు, వేల ఎకరాలు ప్రభుత్వ దురాక్రమణకు గురవుతున్నాయి. అలా భూములు చవగ్గా సంపాదించిన పారిశ్రామిక వేత్తలు కుబేరులవుతున్నారు. రైతులు రోడ్డున పడుతున్నారు. ఇప్పటికే రైతాంగ పోరాటాలు, పోలీసుల కాల్పులు నిత్యకృత్యమై పోయాయి. ప్రభుత్వం ఓ అగ్ని పర్వతం మీద కూర్చొన్నదని గ్రహించాలి.

చట్టాల్లో అన్ని జాగ్రత్తలు ప్రభుత్వం తీసుకోవచ్చుగాక, కాని వడ్డించే వాడు మన వాడైతే కడబంతిన కూర్చొన్నా పర్వాలేదన్నట్లు ప్రభుత్వంలో ఉన్నది మన వాళ్లయితే ఎంత భూమినైనా చవగ్గానో, లంచం ఇచ్చో స్వాధీనం చేసుకోవచ్చు. ఇటీవల కేంద్ర స్థాయిలో భూమిని అడిగిన వాడికల్లా వాళ్లబ్బ సొమ్మయినట్లు ఉచితంగానో, చవక ధరకో అమ్మేసిన ఉదంతాలెన్నో కన్నంలో నుంచి ఎలుకలు బయటపడినట్లు వెలుగు చూస్తున్నాయి. కేంద్రంలో అయితే ఇవాళా నిన్నా బయట పడుతున్నాయిగాని, మన రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడో 2005 నుంచే పరిశ్రమలకు భూపందేరం ప్రారంభించింది. ఉదాహరణకు పట్టిక చూడండి.

పట్టికలో బహుళజాతి ప్రాచుర్యంగల కంపెనీల వివరాలే ఇచ్చాను. జిల్లా స్థాయిలోగాని, సెజ్‌లకు ఇచ్చిన భూమిగాని ఇందులో చేర్చలేదు. 'ఎ' అంటే ఉచితంగా ధారాదత్తం చేసిన భూములు. ఈ భూములన్నీ ప్రభుత్వ భూములైతే భూమి కోసం, భుక్తి కోసం అల్లల్లాడే కోట్లాది జనానికి పంచిపెట్టాలి గాని, కార్పొరేట్ సంస్థలకు ఉచితంగా ఇవ్వడమేమిటి? పైన పేర్కొన్నట్లు రాజులు, మహారాజులు తమకిష్టమైన వారికి ఉచితంగా ఇచ్చి జమీందార్లను, జాగీర్దార్లను సృష్టిస్తే, ప్రస్తుత ప్రభుత్వం దేశంలో వేళ్లమీద లెక్కపెట్టదగిన కొద్దిమందిని మిలియనీర్లు, బిలియనీర్లను చేస్తుంది. అప్పటి రాజులకు ఇప్పటి పాలకులకు తేడా ఏమిటి? అధికార మార్పిడి జరక్కముందే దేశాన్ని ఎవరెవరు పాలించారో, వారంతా యుద్ధాలు చేసి వారి రాజ్యాలను విస్తరించుకొంటూరాగా, ప్రస్తుత పాలకులు ఏ యుద్ధం చేయకుండానే బ్రిటిష్ పాలకుల చెప్పుల్లో కాళ్లు పెట్టి భూమి మీద అధికారం సంపాదించి దానాలు చేసేస్తున్నారు. తనది కాకపోతే తాటిమట్టకెదురు దేకమన్నడట్లు, తన అధికారంలో ఉన్న భూములనే కాక, రైతుల దగ్గర నుంచి, బ్రిటిష్ పాలకులు రూపొందించిన చట్టాన్ననుసరించి, లాక్కొని పంచి పెడతారా? పైన ఇచ్చిన పట్టికలో ఫాబ్‌సిటీకి ఇచ్చిన నూరెకరాల భూమిని ఎకరానికి సంవత్సరానికి ఒకపైసాకు లీజుకిచ్చారని తెలుసా? ఇలా ఎందుకు చేస్తున్నారంటే అభివృద్ధి కోసం అని జవాబు. ఎవరి అభివృద్ధి అనేదే ప్రశ్న.

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

చౌరస్తాలో తెలంగాణ ఇంకెన్నాళ్లు?

***ప్రాంతీయ ప్రజా ఆకాంక్షలను తగిన సమయంలో నెరవేర్చకపోవడం, ఎటువంటి ప్రమాదాలకు దారితీస్తుందో వివరిస్తున్నారు* ఎన్. వేణుగోపాల్**

తెలంగాణ ప్రజా బాహుళ్యంలో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలు ఎంత బలంగా ఉన్నాయో సెప్టెంబర్ 30న విజయవంతమైన తెలంగాణ మార్చ్ మరొకసారి తేటతెల్లం చేసింది. ప్రభుత్వం వైపు నుంచీ, పోలీసుల వైపు నుంచీ పెద్ద ఎత్తున నిర్బంధకాండ అమలయినా, ప్రధాన తెలంగాణ పార్టీ సంపూర్ణంగా సహకరించకపోయినా, అడుగడుగునా ఆటంకాలు ఎదురైనా లక్షలాదిగా ప్రజలు ఆ ప్రదర్శనకు తరలివచ్చారు. ప్రభుత్వ, పోలీసు బలగాల వ్యతిరేకత, అనుమతిపై అనిశ్చితి, ప్రదర్శనాస్థలం మార్పు, కుదింపు, రాజకీయ పక్షాల అవకాశవాదం, నిర్లిప్తత, రవాణా సౌకర్యాల తొలగింపు, బెదిరింపులు, గృహ నిర్బంధాలు, అరెస్టులు, మధ్యదారిలో అడ్డంకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయ దిగ్బంధనం, లాఠీచార్జిలు, బాష్పవాయుగోళాల ప్రయోగాలు వంటి అసంఖ్యాక అవరోధాలను దాటుకుని తెలంగాణ ప్రజలు తమ ఆకాంక్షను, ఐక్యతను సహజంగా, స్వచ్ఛందంగా, అసాధారణంగా ప్రకటించారు.

అంత అద్భుతమైన ప్రజా ఆకాంక్షల ప్రదర్శన జరిగి మూడు వారాలు గడిచినా, కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఇంకా తమ వంచనాశిల్పాన్ని యథాతథంగా ప్రదర్శిస్తూనే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఒక్కొక్క నాయకుడు ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క మాటతో తెలంగాణ ప్రజలను మోసగిస్తూనే ఉన్నారు. ప్రజల ఆకాంక్షలను ప్రజలు కోరినప్పుడు తీర్చకపోవడమే, తన రాజకీయ అవసరాల ప్రకారం పనిచేయడమే నూట ఇరవై సంవత్సరాలుగా కాంగ్రెస్ నైజం అని మరొకసారి రుజువవుతున్నది. తెలంగాణ సాధన కోసమే ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి ఇంకా ఉద్యమం వద్దనీ, కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇస్తుందనీ వాయిదాల మీద వాయిదాలతో నమ్మబలుకుతోంది. ప్రజల సృజనాత్మకత వెల్లువ కావడం, ఉద్యమం ప్రజల చేతిలోకి వెళ్లడం ఇష్టం లేని ఒకానొక పాలకవర్గ పార్టీగా తెరాస అలా ప్రవర్తించడం కూడ సహజమే. తమ నాయకత్వంలో, ప్రధాన శ్రేణులలో నరనరాన జీర్ణించిన తెలంగాణ వ్యతిరేకతను దాచిపెట్టడానికి తెలుగుదేశం పార్టీ అష్టకష్టాలు పడుతోంది. తమ మతోన్మాద ఎజెండాపై తెలంగాణ అనుకూల మేలిముసుగు కప్పి దక్షిణాదిలో మరొక రాష్ట్రంలో మోడీ రాజ్యం తేవాలని భారతీయ జనతాపార్టీ శతవిధాల ప్రయత్నిస్తోంది. మొన్నటి దాకా తెలంగాణను తీవ్రంగా వ్యతిరేకించిన చరిత్రను మూసిపెట్టి, తామే ప్రధాన తెలంగాణ శక్తులుగా కనిపించడానికి భారత కమ్యూనిస్టు పార్టీ, న్యూడెమోక్రసీ ప్రయత్నిస్తున్నాయి. తెరాస కాంగ్రెస్‌లో విలీనమైతే, అసంతృప్త తెరాస శ్రేణులను తమలోకి ఆకర్షించడానికి ఒక కొసన భాజపా, మరొక కొసన సిపిఐ, న్యూ డెమోక్రసీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణ ఏర్పాటును సమర్థిస్తున్నామని చెప్పుకుంటున్న రాజకీయ పార్టీలన్నీ కూడ తమ రాజకీయ ప్రయోజనాలనే ప్రధానంగా చూసుకుంటున్నాయి.

అయినా రాజకీయ పార్టీలను పూర్తిగా పక్కన పెట్టగలిగిన అవకాశం తెలంగాణ ప్రజలకు లేదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఒక రాజ్యాంగబద్ధమైన, రాజకీయ పరిష్కారం. పార్లమెంటులో బిల్లు ద్వారా జరగవలసిన పరిష్కారం. అందువల్ల రాష్ట్రసాధన ఉద్యమంలో రాజకీయ పక్షాలకు గణనీయమైన పాత్ర ఉండక తప్పదు. కాని రాష్ట్ర సాధన ఉద్యమం అపజయానికి గురవుతున్నదీ, విజయానికి దూరమవుతున్నదీ రాజకీయపక్షాల ఎత్తుగడల వల్ల మాత్రమే. గత ఆరు దశాబ్దాల తెలంగాణ ఆకాంక్షల చరిత్రలో ఆ ఆకాంక్షలకు ద్రోహం చేయని, వక్రీకరించని, తమ ప్రయోజనాలతో పోటీ వచ్చినప్పుడు తెలంగాణను బలిపెట్టని రాజకీయ పక్షం ఏదీ లేదు. బహుశా తెలంగాణ సమస్య జటిలం కావడానికి మూలం ఈ వైరుధ్యంలోనే ఉంది. ప్రజా ఆకాంక్షల స్వచ్ఛత, స్వచ్ఛందత, వైశాల్యం ఒకవైపు, రాజకీయపక్షాల కుటిలత్వం, కృత్రిమత, సంకుచితత్వం మరొకవైపు ఉండడమే తెలంగాణ ప్రత్యేకత. అందువల్లనే తెలంగాణ అకాంక్ష ఆరు దశాబ్దాల వ్యక్తీకరణ తర్వాత, నాలుగు దశాబ్దాల ఉద్యమం తర్వాత, పదిహేను సంవత్సరాల రాజకీయ సంఘటిత రూపం తర్వాత, మూడు సంవత్సరాల వెల్లువ తర్వాత ఎక్కడవేసిన గొంగడి అక్కడే లాగ ఉంది.

తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో విలీనం అయి యాభైఆరు సంవత్సరాలు నిండాయి. విలీనానికి ముందే ఉన్న వ్యతిరేకత, విలీనానికి పునాది అయిన షరతులలో ఏ ఒక్కటీ అమలు కాకపోవడం వల్ల ప్రారంభమైన అసంతృప్తి కలగలసి 1969లో రక్షణల, హామీల అమలు కోసం మొదలైన ఉద్యమం విభజన ఆకాంక్షగా మారింది. ఆ విభజన ఆకాంక్ష నలభై మూడు సంవత్సరాలుగా నిర్బంధానికి, భ్రమలకు, బుజ్జగింపులకు, మళ్లీ మళ్లీ హామీలకు పడిపోతున్నా ఓడిపోకుండా కొనసాగుతున్నది. పదకొండు సంవత్సరాల కింద ఆ విభజన ఆకాంక్ష ప్రాతిపదిక మీదనే తెలంగాణ రాష్ట్ర సమితి పుట్టి, ప్రజా ఆకాంక్ష రాజకీయ రూపం కూడ ధరించింది. అది 2004 ఎన్నికల నాటికి రాజకీయ ఆయుధంగా కూడ మారి కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానంగా, తెరాసతో ఎన్నికల పొత్తుగా ముందుకు వచ్చింది. ఆ వాగ్దానమే అధికారపక్షమైన తెలుగుదేశం పార్టీని గద్దె దించి, ప్రతిపక్షంగా ఉండిన కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టింది. కేంద్రంలో కూడ కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి అధికారానికి వచ్చి, తెలంగాణ ఏర్పాటును తన కనీస ఉమ్మడి కార్యక్రమంలోను,

రాష్ట్రపతి ప్రసంగంలోను చేర్చింది. రాజకీయాభిప్రాయ సేకరణ కొరకు ఒక కమిటీని వేసింది. కాని ఈ ప్రయత్నాలన్నీ కేవలం కంటి తుడుపు చర్యలుగా, కాలయాపన తతంగంగా మిగిలిపోయాయి. తెలంగాణ విషయంలో కాంగ్రెస్ మరొకసారి వాగ్దాన భంగానికి పాల్పడింది.

ఆ తర్వాత 2009 ఎన్నికలలో అప్పటి ప్రతిపక్షాలు విభజన ఆకాంక్షకు మద్దతు తెలిపాయి. దానితో పార్లమెంటరీ రాజకీయాలలో ఉన్న అన్ని పక్షాలూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఆమోదించిన స్థితి ఏర్పడింది. అయినా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రయత్నాలు ముందుకు కదలలేదు. ఈలోగా తెలంగాణ ఉద్యోగులకు, నిరుద్యోగులకు అనుకూలంగా ఉండిన ఒక నిబంధనను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తెలంగాణ ఆకాంక్ష మరొకసారి రాజుకుంది. ఉద్యోగుల ఆందోళన నేపథ్యంలో తెరాస అధినేత కె చంద్రశేఖర రావు ఆమరణ నిరాహార దీక్ష ప్రకటించారు. ప్రభుత్వం ఆ దీక్ష జరగకుండా అడ్డుకోవడంతో తెలంగాణ అగ్నిగుండంగా మారింది. చంద్రశేఖర రావు నిర్బంధంలోనే నిరాహార దీక్ష కొనసాగించారు. తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు తమ నిరసనను, పోరాటాన్ని ప్రారంభించారు. విద్యార్థులు అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రకటించారు.

ఆ పూర్వరంగంలో డిసెంబర్ 7న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో అన్ని రాజకీయ పక్షాలూ తెలంగాణ ఏర్పాటుకు తమ ఆమోదాన్ని ఏకవాక్య తీర్మానంలో తెలియజేశాయి. ఆ తీర్మానం పునాదిగా డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతున్నదని ప్రకటించింది. కాని రెండు వారాలు తిరగకుండానే కేంద్ర ప్రభుత్వం ఆ ప్రకటన నుంచి వెనక్కి పోయి, విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ జరగవలసి ఉన్నదని డిసెంబర్ 23న ప్రకటించింది. ఆ ఏకాభిప్రాయ సాధనలో భాగంగా 2010 జనవరి 5న అఖిలపక్ష సమావేశం జరిగింది. డిసెంబర్ 7న జరిగిన అఖిలపక్ష సమావేశానికి భిన్నమైన వైఖరిని, అంటే ఒక్క నెల లోపలే తమ అభిప్రాయాలు తలకిందులుగా మారిన వైఖరిని పార్టీలు చూపాయి.

ఆ అఖిలపక్ష సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఉద్యమాన్ని ప్రజల చేతుల్లోకి పోనివ్వగూడదని, ప్రజా ఆకాంక్షలు నెరవేరడం కన్న శాంతి భద్రతలు నెలకొనడం ముఖ్యమని అన్ని రాజకీయ పక్షాలను ఒప్పించింది. న్యాయాన్యాయాల సమస్యను శాంతిభద్రతల సమస్యగా మార్చి చూపడం, పరిష్కారాలను నానబెట్టడం, తమ సమస్యలపై ఆందోళన చేసే హక్కు ప్రజలకు లేదన్నట్టుగా ప్రవర్తించడం ఈ దేశ పాలకవర్గాలకు, వాటి ప్రతినిధులైన పార్లమెంటరీ రాజకీయ పక్షాలకు మొదటినుంచీ అలవాటే. అన్ని పార్లమెంటరీ రాజకీయ పక్షాలు పాల్గొన్న జనవరి 5 అఖిలపక్ష సమావేశపు లోపాయకారీ ఒప్పందం కాలయాపన ద్వారా ఉద్యమాన్ని చల్లార్చడం. అందులో భాగంగా నియమించిన శ్రీకృష్ణ కమిటీ ఏడాది పాటు కాలయాపన చేసి, సమస్య పరిష్కారానికి సూచనలు చేయకపోగా మసిపూసి మారేడుకాయ చేసింది. కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ అధిష్టానం రెండు సంవత్సరాలుగా ఒకదాని తర్వాత ఒకటిగా వాయిదాలు వేస్తూ వచ్చాయి. స్వయంగా తెలంగాణ ఆకాంక్ష కోసమే ఉన్నామని చెప్పుకునే రాజకీయ పక్షాలు ఆ వాయిదాలను నమ్ముతూ, ప్రజలను నమ్మిస్తూ వచ్చాయి. ఇటువంటి కాలయాపన ప్రయత్నాలెన్ని జరిగినా ప్రజల ఆకాంక్ష చల్లారలేదు. ప్రజలు ఉద్యమ పథం నుంచి వైదొలగలేదు. ఉద్యమాన్ని నిలిపి ఉంచడానికి, కొనసాగించడానికి, ఎప్పటికప్పుడు స్ఫూర్తి పొందడానికి కొత్త కొత్త ప్రయత్నాలు చేశారు. సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, హైదరాబాద్ మార్చ్ వంటి అనేక కొత్త పోరాట రూపాలు కనిపెట్టారు. కొత్త వర్గాలు, సమూహాలు పోరాటంలోకి వచ్చాయి. ఎన్నో నాయకత్వాలు వచ్చాయి. ఆయా నాయకత్వాలను నమ్మి అయినా, నమ్మకుండా అయినా ప్రజలు తమ పోరాటాలు తాము చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఉద్యమ విస్తృతి, వైవిధ్యం, లోతు పెరిగాయి. అయినా ఉద్యమం విజయం సాధించలేక పోయిందనేది నిజం. నిజానికి ఈ ఉద్యమ విజయం వ్యవస్థలో, సమాజంలో, పాలనలో మౌలికమైన మార్పులతో ముడిపడినదేమీ కాదు. అది కనీస, రాజ్యాంగబద్ధ, ప్రజాస్వామిక, భౌగోళిక ప్రత్యేక విభజన కోరిక మాత్రమే. అంత కనీసమైన కోరికను కూడ ప్రజలు అడుగుతున్నారు గనుక తీర్చగూడదనుకునేంత దుర్మార్గమైన పాలకవర్గాల పాలన సాగుతున్నది. ఆ ప్రజా ఆకాంక్షను తీర్చకపోవడానికి ప్రత్యర్థులు సమకూరుస్తున్న డబ్బు సంచులు, వనరుల దోపిడీ దురాశలు, బహుళ జాతి సంస్థల ప్రయోజనాలు, పాలకులకు సహజంగా ఉండే ప్రజా వ్యతిరేకత, వాస్తవ రాజకీయార్థిక స్థితితో సంబంధం లేని ఐక్యత వంటి తప్పుడు భావజాలం లాంటి చిన్నా పెద్దా కారణాలెన్నో ఉన్నాయి. ఈ కారణాలు ఇవాళ ఎంత బలమైనవిగా, తెలంగాణ ఆకాంక్షను అడ్డుకో గలిగినవిగా కనబడుతున్నా, అవన్నీ ప్రజాశక్తి ముందు ఓడిపోక తప్పదు.

అయితే ఉద్యమం సాధించిన అద్భుతమైన ముందడుగులను, ప్రజా భాగస్వామ్యాన్ని, అంతిమ విజయాన్ని గుర్తిస్తూనే, ఉద్యమ క్రమంలో తలెత్తిన, తలెత్తుతున్న కొన్ని అపసవ్య ఆలోచనలను, పరిణామాలను కూడ గమనంలోకి తీసుకోవాలి.

తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయత్నం ఎంతగా రాజకీయ ఉద్యమ మైనప్పటికీ దాన్ని పూర్తిగా రాజకీయ పక్షాలకే వదిలివేయడం, ఆ రాజకీయ పక్షాలు తమ సంకుచిత, రాజకీయ ప్రయోజనాల కొద్దీ అవకాశవాద ఎత్తుగడలతో ఉద్యమాన్ని నీరుగార్చడానికి ప్రయత్ని స్తుండడం స్పష్టంగా కనబడుతున్నది. రాజకీయ పార్టీలను వాటి స్వభావాన్ని వదులుకొని నిస్వార్థంగా, తమ సొంత రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజల కోసం పని చేయమని కోరడం సాధ్యం కాకపోవచ్చు. కాని రాజకీయ పార్టీలను వాటి హద్దులలోపల ఉండమని, అవసరమైనంత వరకే ఉద్యమంలోకి రమ్మని, వాయిదాలతో కాలయాపన చేయవద్దనీ, తెలంగాణ ప్రయోజనాల కన్న తమ పార్టీ ప్రయోజనాలే మిన్న అనుకుంటే పక్కకు తొలగమనీ చెప్పే అధికారం ప్రజలకు తప్పకుండా ఉంది. సమాజంలో రాజకీయపార్టీల ప్రాధాన్యత, బలం అవి ప్రజల ప్రయోజనాల కోసం నిలబడినంత కాలమే ఉంటుంది గాని, భ్రమలతో, ఆకర్షణలతో, ధనబలంతో, తప్పుడు వాగ్దానాలతో ఉండదు. తరతరాలుగా గొప్ప పోరాటశీల వారసత్వం ఉన్న తెలంగాణ ప్రజలు రాజకీయపార్టీల పట్ల సరైన దృక్పథం తీసుకుని, వాటిని కేవలం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడం, ఆ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడం లాంటి సాంకేతిక ప్రక్రియలకు పరిమితం చేయవలసిన స్థితి వచ్చింది.

రాజకీయ పార్టీల మీద మితిమీరిన శ్రద్ధాసక్తులు, ఆదరణల వల్ల పార్టీలకు అతీతంగా పనిచేయవలసిన ప్రజా ఉద్యమం, స్వతంత్ర ఉద్యమకారుల పాత్ర నానాటికీ కుంచించుకుపోతున్నది. ప్రజా ఉద్యమ శక్తులు, స్వతంత్ర ఉద్యమకారులు తమ కార్యక్షేత్రాన్ని విస్తరించుకుని, క్రియాశీల ఉద్యమాలు నడిపి, పార్టీల మీద ఒత్తిడి తెచ్చి, పాలకుల మెడలు వంచే బదులు, క్రమక్రమంగా నిష్క్రియాపరత్వంలోకి, నామమాత్రపు ఆచరణలోకి దిగజారుతున్నారు. చాల సందర్భాలలో ఉద్యమాలు నడిచినట్టు, ప్రజా భాగస్వామ్యం పెరుగుతున్నట్టు కనబడుతున్నది గాని పరిష్కార దిశలో అంగుళం పురోగతి కూడ కనబడడం లేదు. ఈ స్థితిని మార్చి పరిష్కారాన్ని త్వరితం చేయగలిగిన క్రియాశీల పోరాట రూపాలు చేపట్టవలసి ఉంది. ఇతోధిక ప్రజా భాగస్వామ్యానికి అవకాశం కల్పించి, అట్టడుగు స్థాయి నుంచి ప్రజా నిర్మాణాలు రూపొందించవలసి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న కోస్తాంధ్ర, రాయలసీమ పెత్తందారీ శక్తులు, వారికి దళారీలుగా పనిచేస్తున్న తెలంగాణ నాయకులు దిగివచ్చి, తెలంగాణ ఏర్పాటు చేయక తప్పదని భావించే స్థితి తీసుకురావడం ఇవాళ స్వతంత్ర ఉద్యమ కారుల ముందున్న కర్తవ్యం.

ఒక పని సాధించడానికి పార్టీలు, నిర్మాణాలు అవసరమే, కాని నిర్మాణం అంటూ రాగానే దానికి తనను తాను సంరక్షించుకునే ప్రవృత్తి ఏర్పడి అది ఆ పనిని, ఆ పని అవసరమైన ప్రజలను వదిలేసే అవకాశం ఉంది. ఈ అనివార్య వైరుధ్య స్థితిలో ఇవాళ తెలంగాణ ప్రజల ఆగ్రహం నిస్సహాయంగా మిగిలిపోతున్నది. అందువల్లనే నిరాశా నిస్పృహలు వ్యాపిస్తున్నాయి. ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకుని, ప్రజలకు, ఆకాంక్షకు, నిర్మాణానికి మధ్య సంబంధాలను సమన్వయం చేయవలసి ఉంది. ప్రజలే మౌలిక శక్తి అని, ప్రజలకూ నిర్మాణానికీ పోటీ వచ్చినప్పుడు ప్రజలదే పైచేయి అవుతుందని గుర్తుంచుకుని, ఈ వైరుధ్యాన్ని పరిష్కరించవలసి ఉంది. ఈ సంక్లిష్టతను అర్థం చేసుకోలేకపోతున్న యువకులు నిర్మాణాల పట్ల అసంతృప్తితో, త్వరితగతి పరిష్కారం జరగడం లేదనే తొందరపాటుతో ఆత్మహత్యలకు సిద్ధపడుతున్నారు. ప్రజలకూ, ఆకాంక్షకూ, నిర్మాణానికీ మధ్య తేడా లేదనుకుని, భంగపడి, అందువల్ల నిరాశా నిస్పృహలు పెరిగి ఆత్మహత్యల వైపు నెట్టబడు తున్నారు. నిర్మాణ అవసరాన్ని గుర్తిస్తూనే, గుర్తింపజేస్తూనే, నిర్మాణాలను దాటి ఆకాంక్షతో, ఆకాంక్షను దాటి ప్రజలతో నిబద్ధంగా ఉండాలనే అవగాహనను స్వతంత్ర ఉద్యమ కారులు ప్రచారం చేయవలసి ఉంది. ఆ అవగాహన పెరిగితే నిర్మాణాలు ద్రోహం చేసినా నిరాశా నిస్పృహలు రావు సరిగదా, ప్రతి ద్రోహమూ నిబద్ధతను మరింతగా పెంచుతుంది.

తెలంగాణ ఉద్యమంలో తలెత్తిన, తలెత్తుతున్న తప్పుడు ధోరణులలో ప్రధానమైనది అనైక్యత. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కోరిక కొనసాగుతున్న సామాజిక విభజనలకు ఒక రకంగా అతీతమైనది. అందులో విడివిడిగా కుల, మత, స్త్రీపురుష, వర్గ ప్రయోజనాలు ఉండవచ్చుగాని, ఈ ప్రాంతంలోని ఆయా సమూహాలన్నిటికీ సంబంధించిన ఉమ్మడి కోరికగా అది ఈ విభజనలను పక్కన పెట్టి ముందుకు వచ్చిన, వచ్చే కోరిక. అంటే ఇటువంటి ప్రాంతీయ ఉద్యమానికి మిగిలిన అస్తిత్వాలన్నిటినీ తాత్కాలికంగానైనా పక్కన పెట్టి సాధించవలసిన ఐక్యత ఒక కీలకాంశంగా, బలంగా ఉంటుంది. కాని తెలంగాణ ఉద్యమ విజయం దూరమవుతున్న కొద్దీ ఆయా భాగస్వామ్య సమూహాలు తమ స్వతంత్ర అస్తిత్వాలను, తమ తమ కోరికలను ప్రకటించుకుంటున్నాయి. పునరుద్ధరించుకుంటున్నాయి. అంతవరకూ అయినా ఫరవాలేదు గాని, మిగిలిన అస్తిత్వాల మీద వ్యతిరేకతను ప్రకటిస్తున్నాయి. అంటే బహిరంగ అనైక్యతా ప్రదర్శన, చీలికలు వ్యక్తమవుతున్నాయి. ఈ పని ఎంత ఎక్కువగా జరిగితే ప్రాంతీయ ఆకాంక్షలు అంతగా బలహీనపడతాయి. తమ స్వతంత్ర అస్తిత్వం, ఆ అస్తిత్వ సమస్యలు, ఆకాంక్షలు వాస్తవికమైనవే అయినప్పటికీ, ఆ అస్తిత్వాలన్నిటినీ కలగలుపుకున్న ప్రాంతీయ అస్తిత్వమే వర్తమానంలో ఏకైక ప్రమేయమని భావించినప్పుడు, అలా ఐక్యంగా పోరాడినప్పుడు మాత్రమే ప్రాంతీయ ఉద్యమానికి బలం ఉంటుంది. విడివిడిగా విభిన్న అస్తిత్వాలు ఉన్నమాట, వాటి మధ్య విభేదాలు ఉన్న మాట నిజమే అయినా, ఇవాళ్టి ఉద్యమ స్థితిలో ఆ విభేదాలు బైటపెట్టుకోవడం పాలకవర్గాలకు, ప్రాంతీయ ఆకాంక్షల ప్రత్యర్థులకు ఉపయోగపడుతుందని మరచిపోగూడదు.

ప్రస్తుత ఉద్యమంలో మరొక ప్రధానమైన తప్పుడు ధోరణి, గతాన్ని బేషరతుగా, సంపూర్ణంగా కీర్తించే ధోరణి. తమ ప్రాంతపు విశిష్టతను, ఆధిక్యతను చెప్పుకోవడానికి దాని ప్రత్యేక చరిత్రను, సంస్కృతిని, వారసత్వాన్ని ఎత్తిపట్టడం అవసరమే. కాని ఆ చరిత్ర, సంస్కృతి, వారసత్వం సంపూర్ణంగా సమర్థించదగినవీ కావు, తిరస్కరించదగినవీ కావు. మన గతం మనదే అయినప్పటికీ గత కాలపు భూస్వామిక, రాచరిక, హైందవ, బ్రాహ్మణీయ, కుల అంతరాల, మత భావజాలాల ప్రభావాల వల్ల దానిలో పరిహరించదగినవీ, విమర్శించదగినవీ ఎన్నో ఉంటాయి. కాళోజీ తరచుగా ఉటంకించిన తెలంగాణ సామెతలో చెప్పినట్టు 'పిల్ల ముద్దు అయితే పియ్యి ముద్దు కాదు'. తెలంగాణ చరిత్ర, సంస్కృతులను ఎత్తిపడుతూనే, వాటిపట్ల జరిగిన విస్మరణను, అన్యాయాన్ని ఖండిస్తూనే, వాటిలోని తప్పుడు భావాలను కూడ విమర్శించ గలగాలి. కాని అటువంటి హేతుబద్ధ, సమన్వయ దృక్పథానికి బదులు, 'ఇక్కడ పుట్టినదయితే ఏదయినా మంచిదే' అనే అభిప్రాయాన్ని నాయకులలో కొందరయినా తీసుకుంటున్నారు. ప్రజలలో కొందరయినా ఆ అభిప్రాయంతో ప్రభావితమవుతున్నారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని గౌరవించడం అనే పేరుతో, ఆ అస్తిత్వంలోని చెడును, మూఢ నమ్మకా లను, కుల, మత భావనలను, ప్రజా వ్యతిరేకతను గౌరవించడం జరుగు తున్నది. చివరికి ప్రాంతీయ ఆకాంక్షలను వ్యతిరేకించినవారయినా సరే, ఈ ప్రాంతంలో పుట్టినవారయితే గౌరవించాలనే ధోరణి తలెత్తుతున్నది. ఇచట మొలిచిన చిగురు కొమ్మైన చేవ, లేదురా ఇటువంటి భూమి ఇంకెందు వంటి భావాలు ఆత్మవిశ్వాసానికి, స్థానిక అభిమానానికి ఎంత అవసరమో, అదే సమయంలో అవి దురభిమానానికి, దురహంకారానికి, ఇతరులను చిన్నచూపు చూసే ఆధిక్యతా ధోరణికి దారి తీస్తాయని కూడ గుర్తించాలి.

ఈ క్రమంలోనే ప్రత్యర్థుల శవదహనాలు, పిండ ప్రదానాలు, తెలంగాణ ఇప్పించమని దేవతలను కోరడం వంటి మూఢాచార రూపాలు వ్యాప్తిలోకి వస్తున్నాయి. అలాగే తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ సాంస్కృతిక చిహ్నాలుగా బతుకమ్మ పండుగ, గ్రామదేవతల పూజలు

చాల గౌరవించదగిన ప్రజా సంరంభాలే. కాని బతుకమ్మ పాటలలో, గ్రామదేవతల పూజలలో చాల ఎక్కువగా పితృస్వామ్య భావజాలాన్ని, భూస్వామ్య భావజాలాన్ని, స్త్రీ వ్యతిరేక మతాచారాలను, కుల అంతరాలను, మూఢాచారాలను చెప్పడానికి ఉద్దేశించినవి ఉన్నాయి. ప్రాంతీయ సాంస్కృతిక అస్తిత్వాన్ని గౌరవించడం పేరుతో ఆ మూఢాచారాల పునరుద్ధరణ జరగడం భవిష్యత్తు తెలంగాణ సమాజానికి మంచిది కాదు.

తెలంగాణ ఉద్యమ క్రమంలో, మరీ ముఖ్యంగా అది విజయం సాధిస్తుందనీ, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడుతుందనీ నమ్మకం కలిగిన తర్వాత, ఉద్యమ నాయకులలో, కార్యకర్తలలో అధికార లాలస పెరిగిపోతుండడం కూడ కనబడుతున్నది. నాయకులుగా గుర్తింపు పొందాలనీ, వేదికల మీద కనబడాలనీ, తద్వారా రానున్న తెలంగాణ రాష్ట్రంలో ఏదో పదవినో, అధికారాన్నో సంపాదించాలనీ, లేదా ఉద్యమ క్రమంలోనే ఆ గుర్తింపును ఆర్థిక ప్రయోజనంగా మార్చుకోవాలనీ కొందరయినా ప్రయత్నిస్తున్నారు. అసాధారణంగా, అద్భుతంగా జరిగిన సెప్టెంబర్ 30 మార్చ్ లోనే వేదిక మీదికి ఎక్కవలసిన అవసరం లేని వారు ఎక్కారనీ, వారు దిగిపోవాలనీ వందల సార్లు ప్రకటనలు చేయవలసి వచ్చిందంటే, ఈ గుర్తింపు తపన తెలంగాణ ఉద్యమంలో ఎంత ప్రమాదకర పరిమాణానికి చేరిందో అర్థమవుతుంది.

తెలంగాణ ఉద్యమం ఆంధ్రప్రదేశ్ పాలక విధానాలకూ తెలంగాణ ప్రజలకూ మధ్య వైరుధ్య చిహ్నమే తప్ప, తెలంగాణ ప్రజలకు మరే ప్రాంత ప్రజలతోనూ విభేదం ఉండనవసరం లేదు. కాని దురదృష్టవశాత్తూ తెలంగాణ ఉద్యమ క్రమంలో కొందరిలోనైనా ఇతర ప్రాంతాల ప్రజల పట్ల అవాంఛనీయమైన వ్యతిరేకత, నింద కనబడుతున్నాయి. తెలంగాణను దోపిడీ పీడనలకు గురిచేసిన ఆయా ప్రాంతాల రాజకీయ నాయకుల పట్ల, పెట్టుబడిదారుల పట్ల ఉండవలసిన ద్వేషం అక్కడి ప్రజల మీద వ్యక్తమవుతున్నది. ప్రజలు ఎక్కడైనా ప్రజలే. ప్రజా వ్యతిరేకులు ఎక్కడయినా ప్రజావ్యతిరేకులే. ఇక్కడ పుట్టినందువల్ల ప్రజావ్యతిరేకులు ఆమోదించదగినవారైపోరు. అక్కడ పుట్టినందువల్ల ప్రజలు వ్యతిరేకించదగినవారైపోరు. కాని తెలంగాణ ఉద్యమం విస్తరిస్తున్నకొద్దీ దానిలో ఈ ప్రజాసౌభ్రాతృత్వ దృష్టి తగ్గిపోతూ వస్తున్నది. ఇది స్పష్టంగా పాలకవర్గ దృక్పథం. పాలకవర్గాలు ప్రజలను చీల్చి, ఒక సమూహంలో మరొక సమూహం పట్ల ద్వేషభావాన్ని నింపడం ద్వారా పాలిస్తారు. తెలంగాణ ఉద్యమ శక్తులు తమ మధ్య ఐక్యతను నిలిపి ఉంచుకోవడం ఎంత అవసరమో, ఇతర ప్రాంతాల పీడిత ప్రజలతో ఐక్యతను, వారి సౌభ్రాతృత్వాని సంపాదించడం కూడ అంతే ముఖ్యం. నిజానికి తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగినది కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజల వల్ల కాదు. ఆ ప్రాంతాల రాజకీయ నాయకుల వల్ల, పెత్తందార్ల వల్ల, దోపిడీదారుల వల్ల. ఆ అన్యాయానికి తెలంగాణలో పుట్టిన రాజకీయ నాయకులు, పెత్తందార్లు, దోపిడీదార్లు కూడ సహకరించారు.

తెలంగాణ ఉద్యమంలో మరొక అతిశయోక్తి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సర్వరోగ నివారిణి అన్నట్టుగా జరుగుతున్న ప్రచారం. తెలంగాణ రాష్ట్రం తప్పనిసరిగా ఏర్పడవలసిందే. అది ప్రజల కోరిక. అది ఆరు దశాబ్దాల అన్యాయాలకు, వాగ్దానాల ఉల్లంఘనలకు, ప్రత్యేక అస్తిత్వ నిరాకరణకు జవాబు. కాని తెలంగాణ ప్రజాసమస్యలన్నిటినీ అది పరిష్కరించజాలదు. ప్రస్తుతం దేశంలో ఉన్న రాష్ట్రాలన్నిటిలోనూ ఎటువంటి పాలన సాగుతున్నదో అటువంటి పాలనే సాగుతుంది. కాకపోతే తెలంగాణ ప్రజలకు చెందవలసిన నీరు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజలకే చెందుతాయి. ప్రగతిశీలమైన, ప్రశ్నించే స్వభావం ఉన్న తెలంగాణ సమాజం పాలకులను నిరంతరం ప్రశ్నిస్తూ మెరుగైన పాలనను కూడ సాధించవచ్చు. కాని రాజకీయ, ఆర్థిక, సామాజిక సమానత్వం, తెలంగాణ వనరుల మీద తెలంగాణ ప్రజలకే సంపూర్ణ అధికారం, కుల, మత, ప్రాంత, వర్గ, స్త్రీపురుష విభేదం లేని సర్వతోముఖాభివృద్ధి వంటి లక్ష్యాలు ఈ రాజ్యాంగానికి, ప్రస్తుత రాజకీయార్థిక వ్యవస్థకు లోబడిన పాలనలో అమలు జరగవు. ఈ సమతౌల్యమైన అవగాహనను కూడ తెలంగాణ ఉద్యమం ప్రచారం చేయవలసి ఉంది.

ఈ అపసవ్య ధోరణులలో కొన్ని వెలువడడానికి కూడ ప్రధాన కారణం ఉద్యమం తగిన సమయంలో విజయం సాధించలేకపోవడమే. ప్రజల ఆకాంక్షల ప్రకటన, ఐక్యత వ్యక్తీకరణ, నిరసన ప్రదర్శన ఎంతో కాలంగా సాగుతూ వస్తున్నాయి. వాటితో మాత్రమే పరిష్కారాన్ని సాధించగల సున్నితత్వం పాలకులలో లేదని కూడ రుజువై పోయింది. ఇక పాలకుల మెదలు వంచాలన్నా, వారికి బెదురు పుట్టించాలన్నా, పరిష్కరించక తప్పని అనివార్య స్థితి కల్పించాలన్నా కావలసింది ప్రజల ప్రతిఘటన. తెలంగాణ రాష్ట్ర సాధనకు అడ్డంకిగా ఉన్న శక్తుల రాజకీయార్థిక ప్రయోజనాలు నెరవేరవని హెచ్చరిక కావాలి. వారు తెలంగాణలో నిరాటంకంగా సాగిస్తున్న వనరుల దోపిడీ ఇంక చెల్లదనే హెచ్చరిక కావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టుగా ప్రవర్తిస్తున్న వైఖరి కొనసాగడానికి వీల్లేదని హెచ్చరిక కావాలి. ఈ హెచ్చరికలు గంభీరమైన ప్రకటనలుగా కాక, కనీస మాత్రమైన, ప్రతీకాత్మకమైన ఆచరణ రూపాలుగానైనా ఉండాలి. అప్పుడు మాత్రమే తెలంగాణ ప్రజా ఆకాంక్షలకు నిజమైన సాఫల్యం సిద్ధిస్తుంది.

తెలంగాణ కనీసం మూడు సంవత్సరాలుగా చౌరస్తాలో నిలిచి ఉంది. ఆ ప్రయాణాన్ని ఆపిన లైటు ఎరుపో, కాసేపట్లో ఆకుపచ్చగా మారబోయే పసుపో తెలియడం లేదు. ఆకుపచ్చగా మారడానికి ఎక్కువసేపు లేదని నమ్మబలికే వాగ్దానాలకూ కొదవలేదు. కాని మూడు సంవత్సరాలుగా చౌరస్తాలో నిలబడిన ప్రతిష్టంభన ప్రజల అసహనాన్ని, అసంతృప్తిని మరింతగా పెంచుతున్నది. ఎవరూ చౌరస్తాలలో ఎక్కువకాలం నిలబడలేరు. ఉన్నచోట కదం తొక్కుతూ ఉండలేరు. చౌరస్తాలో నిలిపి ఉంచాలని ప్రయత్నిస్తున్నవారు ఎంత బలవంతులైనా ఏదో ఒకరోజు ప్రజల అసహనం కట్టలు తెంచుకుంటుంది. ఆరోజున ఎర్రలైట్లను, పసుపు లైట్లను మాత్రమే కాదు, అన్ని ఆటంకాలనూ పగలగొట్టి, ప్రజలు తమకు తాము ఆకుపచ్చ పురోగమనాన్ని ప్రకటించుకోగలరు.

ఆ ఆగ్రహం కట్టలు తెంచుకునే సందర్భం వచ్చినప్పుడు అది ఎంత విస్ఫోటకంగా, అరాచకంగా ఉంటుందో ప్రపంచ చరిత్ర ఎన్నో సార్లు తెలియజెప్పింది. ఆ సందర్భం రాకముందే మేలుకుని ఆ ఆగ్రహ కారణాలను తొలగించడం, మార్పును శాంతియుతంగా, సున్నితంగా ఆహ్వానించడం పాలకుల విధి. ఆ దిశగా పాలకులకూ సమాజానికీ చైతన్యం అందించడం బుద్ధిజీవుల కర్తవ్యం.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఆవశ్యకత

రాయలసీమ ఇవాళ్టి దుస్థితికి అవకాశవాద రాజకీయ నాయకుల కుట్రలూ, కుహకాలే కారణమని అంటున్నారు

ఆర్.ఎస్. చౌహాన్

మొదటి నుండి బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలు అసలైన రాయలసీమగా పిలువబడుతున్నాయి. సీమ అనగా ప్రాంతమని అర్థం. రాయల వంశానికి చెందిన రాజులు పరిపాలించిన ప్రాంతమైనందున, ఈ నాలుగు జిల్లాలకు రాయలసీమగా నామకరణం జరిగింది.

చారిత్రక కారణాల వలన శతాబ్దాల క్రితం రాయల వంశ రాజుల పరిపాలన పరిధి నుండి రాయలసీమ హైదారాబాద్ నవాబు పరిపాలన పరిధిలోకి వచ్చింది. తరువాత ఏర్పడిన కరువు కాటకాల కారణంగా రాయలసీమ ప్రజలు సర్వం కోల్పోయి పేదవారైనారు. ఈ ప్రాంతం వెనుకబడిన రాళ్లసీమగా మారింది. హైదారాబాద్ నవాబుకు రాయలసీమ నుండి ఎటువంటి ఆదాయం లేకపోగా పరిపాలన వ్యయ భారం పెరిగింది. ఈ దశలో హైదారాబాద్ నవాబు బ్రిటిష్ పాలకులకు తాను కట్టవలసిన పైకం(సుంకం) కింద రాయలసీమకు చెందిన బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలను బ్రిటిష్ పాలకుల పరం చేయడం జరిగింది. అదివరకే కోస్తాంధ్ర జిల్లాలన్నీ బ్రిటిష్ వారి పరిపాలన పరిధిలోని మద్రాస్ రాష్ట్రంలో విలీనమై ఉన్నాయి. పరిపాలన సౌలభ్యం కోసం తమ పరిధిలోకి వచ్చిన రాయలసీమ జిల్లాలను బ్రిటిష్ ప్రభుత్వం మద్రాసు రాష్ట్రంలో విలీనం చేయడం జరిగింది.

కరువు కాటకాల బారిన పడిన రాయలసీమ జిల్లాల్లో బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు మాత్రమే పట్టణ స్థాయిని కలిగి ఉన్నాయి. మిగిలిన ప్రాంతమంతా గ్రామీణ ప్రాంతం. రాయలసీమలో విద్య, వైద్యం, విద్యుత్, రవాణా తదితర మౌలిక సదుపాయాలు ఉండేవి కావు. తుంగభద్ర తదితర నదులున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాలకు సాగునీరు అందించే కాలువలు ఉండేవి కావు. అధిక శాతం రైతులు వర్షం నీటిమీద ఆధారపడి పంటలను పండించుకునేవారు. రాయలసీమలో ప్రజలకు ఉపాధి కల్పించే పరిశ్రమలు లేవు. అధిక గ్రామాల్లో రెడ్డి సామాజిక వర్గం వారు భూస్వాములుగా ఉండేవారు. గ్రామాల్లోని పేద ప్రజలు భూస్వాముల వ్యవసాయ క్షేత్రాల్లో రైతు కూలీలుగా, భూస్వాముల ఇండ్లవద్ద జీతగాళ్లుగా, పాలెగాళ్లుగా పనులు చేసి జీవించేవారు. ఈ విధంగా రాయలసీమ ప్రజలు శతాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేక వెనుకబాటుతనంతో దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తదనంతరం దేశ ప్రజలకు పరిపాలనాపరమైన అనేక అంశాలు అవగాహనలోకి వచ్చాయి. ఈ సందర్భంలో రాయలసీమ, కోస్తాంధ్ర తెలుగు ప్రజలు మద్రాసు రాష్ట్రంలో దోపిడికి గురవుతున్న పరిస్థితులను గుర్తించినారు. మద్రాసు రాష్ట్రం నుండి వేరుపడి తెలుగు భాష మాట్లాడే వారికోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని ఉద్యమించారు. తెలుగు ప్రజలు చేసిన ఉద్యమాల్లో పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం ఫలితంగా 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించింది.

పరిపాలన సౌలభ్యం కోసం కేంద్ర ప్రభుత్వం చేసిన భాషా రాష్ట్రాల నిర్మాణ నిర్ణయానుసారం పాత హైదారాబాద్ రాష్ట్రం నుండి తెలుగు భాష అధికంగా మాట్లాడే జనాభాగల కొన్ని తెలంగాణ జిల్లాలను వేరుచేసి ఆంధ్ర రాష్ట్రంలోని రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలతో విలీనం చేసి 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు జరిగింది. ఈ తరుణంలో రాష్ట్ర రాజధాని కర్నూలు నుండి హైదారాబాద్‌కు తరలిపోయింది. రాయలసీమలో ఆశించిన అభివృద్ధి ఆగిపోయింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు సందర్భంలో కన్నడ భాష మాట్లాడే జనాభా అధికంగా ఉన్న బళ్ళారి జిల్లాను రాయలసీమ నుండి విడదీసి కర్ణాటక రాష్ట్రంలోకి, తెలుగు మాట్లాడే జనాభా అధికంగా ఉన్న చిత్తూరు జిల్లాను మద్రాసు రాష్ట్రం నుండి విడదీసి రాయలసీమలోకి విలీనం చేయడం జరిగింది. అప్పటి నుండి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలను కలిపి రాయలసీమగా పరిగణించడం జరిగింది.

1953–2012 మధ్యకాలంలో రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రుల్లో నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి, నారా చంద్రబాబునాయుడు, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిలతో సహ ప్రస్తుత ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాయలసీమకు చెందినవారు. మన దేశ రాష్ట్రపతి పదవి చేపట్టిన నీలం సంజీవరెడ్డి రాయలసీమకు చెందినవారు. కర్నూలు జిల్లా నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గం నుండి ఎం.పి.గా ఎన్నికైన పి.వి నరసింహారావు తెలంగాణ ప్రాంతానికి చెందినా రాయలసీమ ప్రజలు ప్రాంతీయ భేద భావాలేవి చూపకుండా భారీ మెజార్టీతో గెలిపించి, మనదేశ ప్రధాన మంత్రిగా పరిపాలన చేయడానికి సహకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు ముందు తెలంగాణకు చెందిన పెద్ద మనుషులకు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఒప్పందం కుదిరిందనీ, ఆ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు కొన్ని హామీలను ఇచ్చిందనీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కి అన్యాయం చేసిందని, ఐదున్నర దశాబ్దాలుగా తెలంగాణ ప్రాంత ప్రజలు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల దాదాపు ఎనిమిది వందల మందికి పైగా తెలంగాణవాదులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇంతవరకు ఏర్పాటు చేయలేదు.

2009-2010 మధ్య కాలంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరింది. ఉద్యమ ఉధృతి ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రక్రియ మొదలవుతుందని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనను నిరసిస్తూ రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లోని సమైక్యవాదులు ప్రారంభించిన మెరుపు సమ్మెతో ఇరు ప్రాంతాల్లో క్లిష్ట పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు తగిన సూచనలు గల నివేదికను సమర్పించవలసిందిగా కేంద్ర ప్రభుత్వం జస్టిస్ శ్రీకృష్ణ కమిటీని నియమించింది.

గడువుకన్న ఒకరోజు ముందే శ్రీకృష్ణ కమిటీ తమ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కానీ ఒక సంవత్సర కాలాన్ని వృథా చేసి, కోట్లాది రూపాయల వ్యయంతో తయారు చేసిన శ్రీకృష్ణ కమిటీ తమ నివేదికలో రాష్ట్ర విభజనకు అవసరమైన అంశాలను దాటవేసిందనీ, నివేదికలోని సూచనలన్నీ, సీమాంధ్ర ప్రాంత సమైక్యవాదులకు అనుకూలంగా ఉన్నాయనీ, తెలంగాణవాదులంతా ముక్తకంఠంతో తమ నిరసనలు తెలిపారు. అయినా తెలంగాణ ఉద్యమం ఇక్కడితో ఆగిపోలేదు. ఈనాటికీ వివిధ రూపాల్లో కొనసాగుతూనే ఉంది. తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం చేస్తున్న ఉద్యమాల్లో 42 రోజుల సకలజనుల సమ్మె ప్రశంసనీయమైనది.

బిజెపి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు పార్లమెంట్‌లో సైతం పోరాడే సత్తా తమ పార్టీకే ఉన్నదని తెలంగాణ ప్రాంతంలో ప్రచారం చేస్తోంది. తెలంగాణ టిడిపి ఫోరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు అనుకూలంగా తమ పార్టీ స్పష్టమైన వైఖరిని త్వరలో వెల్లడించనున్నదని తెలంగాణ ప్రాంతంలో ప్రచారం చేస్తున్నది. తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో తమ పార్టీ అధిష్టానం త్వరలో అనుకూల వైఖరిని ప్రకటించనున్నదని ప్రచారం చేస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రాంతంలో కూడ తన పరిధిని విస్తరించుకునే ప్రయత్నాలను చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధనకు సారథ్యం వహిస్తున్న టిఆర్ఎస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం త్వరలో వచ్చేస్తున్నట్లు తమకు సంకేతాలు వస్తున్నాయనీ పార్టీ అధినాయకులు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ జిల్లాల్లో తెలంగాణ ప్రజాపోరు యాత్రలను నిర్వహిస్తున్న సిపిఐ పార్టీ తెలంగాణ జెఏసి చేపట్టబోయే ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించింది. తెలంగాణ జెఏసి మాత్రం ఎటువంటి పరిస్థితులలోనైన ఉద్యమాల నుండి వైదొలగే ప్రసక్తి లేదంటూ తాము భవిష్యత్తులో చేయబోయే ఉద్యమాల కార్యచరణను ప్రకటించడం జరిగింది. రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం త్వరలో నిర్ణయం తీసుకోనున్నదన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో సీమాంధ్ర ప్రాంతానికి చెందిన కొందరు సమైక్యవాద కాంగ్రెస్ ఎం.పి.లు ఢిల్లీలో సమావేశమై మన రాష్ట్రాభివృద్ధి కేవలం సమైక్య రాష్ట్రంలోనే సాధ్యమవుతుందనీ, రాష్ట్ర విభజనపై కేంద్ర ప్రభుత్వం చేసే ఏ ప్రతిపాదననూ తాము అంగీకరించబోమని, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలందరిని కలిసి తమ సమైక్య గళాన్ని వినిపించాలని నిర్ణయించినట్లు వార్త కథనాలు రాయడం జరిగింది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకునే ఉద్దేశంతో సీమాంధ్ర సమైక్యవాదులు ఇటువంటి ప్రయత్నాలను చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర విభజన అతి సమీపంలో ఉందని రాజకీయ పార్టీ నేతలు, అవకాశవాద పార్టీలు మేమంటే, మేము ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధిస్తామని చేస్తున్న హడావిడిని చూసిన రాయలసీమలోని అవకాశవాద రాజకీయ నాయకుల్లో కదలిక వచ్చింది. రాష్ట్రంలో విభజన జరిగిన పక్షంలో రాయలసీమను కూడ ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలనే వాదనను ముందుకు తెస్తున్నారు.

ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనకు జరిగిన కొన్ని ప్రయత్నాలు:

1) 1940వ దశకంలో జరిగిన శ్రీబాగ్ ఒప్పందం ఉల్లంఘించ బడిందని, అందుకే రాయలసీమ రైతులకు చెందవలసిన సాగునీటి వాటా ఇతర ప్రాంతాలకు ప్రవహిస్తోందనీ, మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి దశాబ్దాలు గడిచినా రాయలసీమ ప్రాంతంలో ఆశించిన అభివృద్ధి జరగలేదనీ, రాయలసీమకు రావలసిన ప్రాజెక్టులు, పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయనీ, అందుకు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఆవశ్యకమని 1970వ దశకంలో మాజీ శాసన సభ్యులు ఎం.వి.రమణారెడ్డి ఉద్యమించారు.

2) రాయలసీమ ప్రజలకు విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి తదితర మౌలిక సదుపాయాలు శతాబ్దాలుగా అందుబాటులో లేవనీ, రాయలసీమకు రావలసిన సాగునీరు, పరిశ్రమలు, ప్రాజెక్టులు ఇతర ప్రాంతాలవారు తరలించుకు పోతున్నారనీ, అందుకు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఆవశ్యకమని, కర్నూల్‌కు చెందిన డాక్టర్. కృష్ణమూర్తి, రిటైర్డ్ లెక్చరర్ శర్మ, డాక్టర్ మాధవస్వామి, తదితర విద్యావంతుల ఆధ్వర్యంలో ఏర్పడిన రాయలసీమ విద్యావంతుల వేదిక గత రెండు, మూడు సంవత్సరాలుగా పలు సభలు, సమావేశాలను నిర్వహిస్తూ రాయలసీమ ప్రజలను చైతన్యవంతం చేస్తోంది.

3) రాయలసీమ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ, రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం, రాయచూరు, బళ్లారి, కోలారు, క్రిష్ణగిరి జిల్లాలను కలిపి గ్రేటర్ రాయలసీమగా ప్రత్యేక రాష్ట్రం ఇవ్వవలసిందేననీ రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి తను పాల్గొంటున్న ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఏర్పాటు సభలలో డిమాండ్ చేస్తున్నారు.

4) రాయలసీమ హక్కుల వేదిక 8వ వార్షికోత్సవం ఈ మధ్యకాలంలో కర్నూల్‌లో జరిగింది. ఈ వార్షికోత్సవంలో రాష్ట్ర మంత్రి టి.జి వెంకటేశ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం రాయలసీమ అని, విభజించవలసి వస్తే, మొదట రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ప్రణబ్ ముఖర్జీ (ప్రస్తుత రాష్ట్రపతి) గతంలో అన్నారని గుర్తుచేశారు. ఎం.పి. కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కర్నూలు నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతమని ఆవేదన వ్యక్తంచేశారు. సభలో పాల్గొన్న ఇతర రాయలసీమ రాజకీయ నాయకులు, కార్మిక, కర్షక, ఉపాధ్యాయ, ఉద్యోగసంఘం నేతలు కూడ ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఆవశ్యకతను ముక్తకంఠంతో వెలిబుచ్చారు.

5) రాయలసీమ పరిరక్షణ సమితి ఈ మధ్య కాలంలో 96 గంటల మేల్కొలుపు దీక్షను కర్నూల్‌లో నిర్వహించింది. ఈ దీక్షలో పాల్గొన్న రాయలసీమ పరిరక్షణ సమితి అధ్యక్షుడు, మాజీ టిడిపి. శాసనసభ్యులు బైరెడ్డి రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ, ఉంటే రాష్ట్రం సమైక్యంగా ఉండాలి.

ముప్పై ఏళ్ల తరువాత గౌరవెల్లి

***ముప్పై ఏళ్ల క్రితం నాటికీ ఇప్పటికీ గౌరవెల్లి గ్రామ రాజకీయార్థిక, సామాజిక స్థితిగతుల్లో వచ్చిన మార్పులను వివరిస్తున్నారు* వై. రామచంద్రం, డి.వి. రామకృష్ణారావు**

భారతదేశ వ్యవసాయ సంబంధాలలో మార్పులు, రాజకీయ ఆర్థిక స్థితిగతులపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగిన సదస్సుకు పరిశోధనా పత్ర సమర్పణలో భాగంగా గ్రామ పరిశీలన చేసే క్రమంలో ఏ గ్రామాలు పరిశీలించాలనే ప్రశ్న వచ్చింది. అప్పుడు గతంలో అధ్యయనం చేసిన గ్రామాల నుంచి ఏవైనా ఎంపిక చేసుకోవాలని అనుకున్నాం. అలా ఎంపిక చేసుకున్నప్పుడు మారిన స్థితిని చూడవచ్చు అనేది ఉద్దేశం. అలా 1980-81లో గ్రామాలకు తరలండి క్యాంపెయిన్‌లో భాగంగా అప్పటి పీపుల్స్‌వార్ (నేటి మావోయిస్టు పార్టీ) అధ్యయనం చేసిన గ్రామాల్లో రెండు గ్రామాలని మా పరిశోధనకు ఎంచుకున్నాం. అప్పుడు విప్లవోద్యమం కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మండలంలోని గౌరవెల్లి, రామారం గ్రామాలను, భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యాపూర్, కొత్తపల్లి గ్రామాలను అధ్యయనం చేసింది. తన పరిశోధనలను క్రోడీకరించి **'దున్నేవారికి భూమి లభించనిదే రైతాంగానికి విముక్తి లేదు'** అనే పత్రాన్ని క్రాంతి ప్రచురణలుగా ఏప్రిల్ 1982లో వెలువరించింది. ఆ వెలుగులో మేము గౌరవెల్లి, మాణిక్యాపూర్ గ్రామాలను ఎంపిక చేసుకొని పరిశీలించాం.

మా పరిశోధనలో భాగంగా ఆ ఊరిలో ఇప్పుడున్న శ్రమ సంబంధాలు, భూ సంబంధాలు, సామాజిక స్థితిగతులు, మార్కెట్‌తో సంబంధాలు, కుల వృత్తులు, సంస్కృతి, జీవన విధానం, మొత్తంగా రాజకీయార్థిక స్థితిగతులలో అప్పటికీ, ఇప్పటికీ వచ్చిన మార్పులు చూసే ప్రయత్నం చేశాం. ఈ పరిశోధనా క్రమంలో గ్రామం గురించి మేం చేసిన సర్వేలో అనుసరించిన పాక్షిక నమూనా సర్వే పద్ధతి సమగ్ర అంచనా ఇవ్వకపోయినా, స్థూలంగా కొన్ని ఆలోచనలు చేయడానికి ఉపయోగపడుతుందని అనుకున్నాం. ఆ దిశగా చేసిన చిన్న ప్రయత్నమే ఈ పరిశోధనా పత్రం.

గౌరవెల్లి గ్రామ నైసర్గిక స్వరూపాన్ని చూస్తే తూర్పున జనగామ గ్రామం, పశ్చిమాన సంజీవరాయ గుట్టలు, ఉత్తరాన మాలపల్లి గ్రామం, దక్షిణాన గుడాటిపల్లి గ్రామం (గౌరవెల్లి రిజర్వాయర్ కింద మునిగి పోనుంది) ఉన్నాయి. ఈ గ్రామం హుస్నాబాద్ తాలుకాలో ఉండేది. 1964లో గ్రామ పంచాయతీగా మారింది. ఈ గ్రామానికి వేముల నర్సయ్య - సిపిఎం (తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు) తొలి సర్పంచ్‌గా వ్యవహరించారు.

గౌరవెల్లి గ్రామ జనాభా 2001 లెక్కల ప్రకారం 2177 మంది ఉన్నారు. అందులో పురుషులు 1128, స్త్రీలు 1049. ఇటీవలి (2010 చివరిలో) లెక్కల ప్రకారం గ్రామ జనాభా 1937గా తెలుస్తోంది. వీరిలో పురుషులు 975 మంది స్త్రీలు 962గా ఉన్నారు. గ్రామంలోని ఓటర్ల సంఖ్య 2011 లెక్కల ప్రకారం 1545 - (పురుషులు 797, స్త్రీలు - 748). ఊరిలో కులాల వారీగా గడపల సంఖ్యను చూస్తే స్థూలంగా గౌడ కులస్తులకు చెందిన-100 (బైరగోని, చీకట్ల, మంద, బత్తుల, కొన్నె, బండి, లింగాల ఇంటి పేర్లకు సంబంధించిన వారు ఉన్నట్లు తెలుస్తోంది) మాదిగ-95 (కొమ్ముల, మాచెర్ల, దండెపు, తాటికాయల ఇంటి పేర్లవారు), మాల-25

లేకుంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంతో పాటు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రాన్ని కూడ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిస్పందనగా:

ఎ) 'ఉంటే రాష్ట్రం సమైక్యంగా ఉండాలి' అంటూ చేస్తున్న బైరెడ్డి రాజశేఖరరెడ్డి డిమాండ్ అతనిలో నిక్షిప్తంగా ఉన్న సమైక్యవాదాన్ని బహిర్గతం చేస్తుందనీ, 'లేకుంటే తెలంగాణ రాష్ట్రంతో పాటు రాయలసీమ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి' అంటూ చేస్తున్న అతడి డిమాండ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకునే ప్రయత్నంగా కనిపిస్తున్నదనీ, నిజంగా అతడు ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఏర్పాటును ఆకాంక్షిస్తున్న పక్షంలో ఎటువంటి షరతులను విధించకుండా ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఏర్పాటును డిమాండ్ చేయడం సబబుగా ఉంటుందని పలువురు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

బి) రాయలసీమ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ బైరెడ్డి రాజశేఖర రెడ్డి వ్యక్తిగతమని, పార్టీకి ఎటువంటి సంబంధం లేదని, టిడిపి పార్టీకి చెందిన కొందరు కర్నూల్ నాయకులు ప్రకటించారు.

6) ఈ మధ్యకాలంలో తెలంగాణ జె.ఎ.సి. చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ నిర్వహించిన పత్రికా విలేఖరుల సమావేశంలో బైరెడ్డి రాజశేఖర రెడ్డి చేపట్టిన రాయలసీమ పోరాటంపై మాట్లాడుతూ, అలా కోరేహక్కు వారికి ఉందనీ, నాయకుల పోరు కాకుండా ప్రజా ఉద్యమం చేస్తే బాగుంటుందని చెప్పారు. వాస్తవానికి ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధన అనే అంశం దశాబ్దాలుగా కోల్డు స్టోరేజిలో ఉండి పోయింది. అయినా రాయలసీమ ప్రజలు కూడ, తెలంగాణ ప్రజల్లాగానే ప్రత్యేక రాయలసీమ ఏర్పాటును ఆకాంక్షిస్తున్నారు.

ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనాపరమైన సంక్షోభాలను ఎదుర్కొంటున్న తరుణంలో 2014 ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాష్ట్రాన్ని రెండుగా విభజిస్తుందా? లేక మూడు రాష్ట్రాలుగా విభజిస్తుందా? లేక అసలు ఏమి చెయ్యదా? వేచి చూడాలి. ఏది ఏమైన ప్రత్యేక తెలంగాణ, రాష్ట్ర సాధనకు ఐదున్నర దశాబ్దాలుగా ఉద్యమాలు చేస్తున్న తెలంగాణ ప్రజల ఆకాంక్ష, ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర ఏర్పాటును కోరుతున్న రాయలసీమ ప్రజల ఆకాంక్ష విజయవంతం కావాలని ఆశిద్దాం.

(రచయిత ట్రేడ్ యూనియన్ నాయకులు) వీ

(గడ్డం, యాస, కుట్ల ఇంటి పేర్లతో), గొల్లలు-60 (పెద్దపాటి, అత్తిన, వర్టపు, సిరివేణి, ఉల్లి, అప్పాల, పంది, జంగు, దాసరి, నీల ఇంటి పేర్లకు చెందినవారు), కురుమ-27 (మజ్జిగ, గాంభీరపు, బీరం, వేముల, శీలం, మోటె, పాములపర్తి ఇంటి పేర్లవారు), చాకలి-40 (జంగుపల్లి), వడ్డెర-70 (దండుగుల, ఉప్పు, కుంచం, దున్నపోతుల ఇళ్ల పేర్లవారు. వడ్డెర కులానికి చెందిన 50 గడపల జనాభా వలస పోయారు), వడ్ల-2 (సిలుముల), కమ్మరి-15 (గొల్లపల్లి, చిరువూరి ఇంటి పేర్లవారు) ఔసుల-2 (తంగన్‌పల్లి), రెడ్డి-15 (మట్ట, దొడ్ల, చిన్న దొడ్ల, బొడుగం), కోమటి-2 (దిడ్డిగం, పబ్బ ఇంటి పేర్లవారు), పద్మశాలి-7 (మెరుగు, గోసికొండ, వడ్డేపల్లి ఇంటి పేర్లవారు), దూదేకుల-10, ఎరుకల-2 (బదనాపురం), మంగలి-10, (సూరంపల్లి, ఔజూత ఇంటి పేర్లవారు), లంబాడి-5 (పూలే), కుమ్మరి-1, తెనుగు-23 (గూల్ల, పెద్ది, పుర, సుంకర, నూనె, మెడబోయిన ఇంటి పేర్లవారు) గడపలు ఉన్నాయి.

భూసంబంధాలు : ఊరి మొత్తం వ్యవసాయ భూమి సుమారుగా 2100 ఎకరాలు. గ్రామానికి చెందిన భూమి దాదాపు 250 ఎకరాలు వరద కాలువ కింద పోతోంది. అందులో దళితులది దాదాపు 50 ఎకరాలు పోయి ఉండవచ్చు. 30 ఎకరాలకు మించిన రైతులు ఇప్పుడు గ్రామంలో ఎవరూ లేరు. ఒక రెడ్డి కులానికి చెందిన మాజీ సర్పంచ్‌కు మాత్రం 25 ఎకరాలకు పైగా భూమి ఉన్నట్లు తెలుస్తోంది. 1979లో భూమి లేని కుటుంబాలు చాలానే ఉండేవి. ఇప్పుడు 100 కుటుంబాల వరకు భూమి లేనివి ఉండవచ్చు. దళిత కుటుంబాలకు సరాసరిన అర్ధ ఎకరం నుంచి ఎకరం వరకు భూమి ఉంది. దళితులలో ఎక్కువ శాతం మందికి 1 నుండి 2 ఎకరాలకు మించి భూమి లేదు. 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్నవారు దళితులలో 5 కుటుంబాలు ఉన్నాయి. భూమి లేని కుటుంబాలలో ప్రధానంగా మాల, మాదిగ, కమ్మరి, చాకలి, పద్మశాలి, ఎరుకల, వడ్డెర కులాలకు చెందినవారున్నారు. దాదాపుగా ఎంతో కొంత భూమి ఉన్న కులాలుగా గౌడ, రెడ్డి, తెనుగు, మంగలి, కురుమ, లంబాడి, దూదేకుల కులాలకు చెందినవారున్నారు. ఊరిలో మొత్తం పట్టా భూమే ఉందని తెలుస్తోంది.

ఈ గ్రామంలో మొదట కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కౌలుదారీ పోరాటం చేసి బంజరు, పొరంబోకు భూములు దళితులు సాధించు కున్నారు. అప్పుడు ఈ గ్రామంలో బ్రాహ్మణ, రెడ్డి కుటుంబాలకే సగానికి పైగా భూమి ఉండేది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో చేసిన భూ పోరాటాలకూ, ఆ తర్వాత వచ్చిన విప్లవోద్యమ ఒత్తిడికి భూస్వాములు భూములు అమ్ముకొని నగరాలవైపు వెళ్లిపోయి రాజకీయాల్లోనూ, ఇతర వ్యాపారాల్లోనూ ఎదిగారు. గ్లోబలైజేషన్ క్రమంలో కొత్త అవకాశాలూ అందిపుచ్చుకున్నారు. గౌడ, మాదిగ కులస్తులు 1970-80లలో బొంబాయి, దుబాయిలు పోయి కొంత డబ్బు సంపాదించుకుని ఊరిలో అర కొర భూములు కొనుక్కున్నారు. భూస్వామ్య కుటుంబాలలో తరువాత తరం చదువులు, వ్యాపారాలు, పై స్థాయి రాజకీయాల్లో క్రియాశీలమై పోయి, గ్రామంపై వారి ప్రత్యక్ష పట్టు కాస్త సడలింది. గౌరవెల్లి గ్రామంలో రెండవ స్థాయిలో ఉన్న గౌడ కులానికి చెందిన వారు ఆ ఖాళీలోకి కొంత ఎదగడం కనిపిస్తుంది. 30 ఏళ్ల క్రితం విప్లవోద్యమం తన అధ్యయనంలో పేర్కొన్నట్లు గానే భూమి లేనివారు, పేద రైతులు (2 ఎకరాల లోపు ఉన్నవారు) ఇప్పటికీ సగానికి పైగా ఉన్నారు.

ఈ గ్రామంలోని రాజకీయ పార్టీలకు సంబంధించి చూస్తే తొలి నుండి కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యం ఉంది. ఈ గ్రామంలో గుండి దామోదర రావు, అనభేరి ప్రభాకర రావులు కమ్యూనిస్టు పార్టీని నిర్మించి విస్తృత పరిచారు. ఈ గ్రామానికి చెందిన వేముల నర్సయ్య నాయకత్వంలో కౌలుదారీ పోరాటం చేశారు. 1959 నుంచి ఈ గ్రామంలోకి కాంగ్రెస్ వచ్చింది. ఇప్పుడు ఈ గ్రామంలో సిపిఐ, కాంగ్రెస్, టిఆర్‌ఎస్, టిడిపి పార్టీలు ఉన్నాయి. ఈ గ్రామంలో గతంలో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ ప్రభావం కూడా ఉండేది.

తెలంగాణాలో సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న కుమ్మరి రామచంద్రంను నిజాం సైన్యాలు కాల్చి చంపాయి. తరువాత వచ్చిన భారత సైన్యాలు 1950లో గౌరవెల్లికి చెందిన కుంట లస్మయ్య, వేముల రామయ్య, జంగ కొమురయ్య, దూదేకుల బాష్మియా, కొత్త సాయిరెడ్డిలను, అట్లాగే అక్కన్నపేటకు చెందిన ఒద్దుల నర్సయ్యలను ఇళ్ల నుంచి తీసుకెళ్లి గండిపల్లె-కుందనోనిపల్లె మధ్యనున్న యేనె మీద కాల్చి చంపాయి. సిపిఐ పార్టీకి చెందిన వేముల నర్సయ్య, జంగపల్లి సాయిలు, మంద మొగిలి, పాముల పర్తి తిరుపతి, నల్ల ఎల్లయ్యల స్మారకార్థం నిర్మించిన స్థూపాలు ఊరి మొదలు నుంచి చివరిదాకా ఉన్నాయి.

సిపిఐ నాయకుడు, ఎనభై రెండు ఏళ్ల గాంభీరపు రామయ్య (సర్పంచ్‌గా పదకొండేళ్లు పనిచేసారు.) గ్రామంలో జరిగిన మార్పులకు సంబంధించి చెపుతూ, ఊరిలో జరిగిన కొద్దిపాటి అభివృద్ధికరమైన మార్పులు మొదట కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రారంభమయ్యా యన్నారు. రాడికల్ల వల్లే ఈనాడు సామాన్య ప్రజలు తలెత్తుకుని బతుకుతున్నారని చెప్పారు. ఆ తరువాత క్రమంలో దళిత, వెనుకబడిన కులాలకు చెందిన వారు హైదరాబాద్, బొంబాయి, దుబాయిలు పోయి ఊరిలో అరకొర భూములు కొనుక్కున్నారు. ఊరిలో ఒక వృద్ధ దళితుడు ఉద్యమం గురించి వ్యాఖ్యానిస్తూ - విప్లవోద్యమం భూములు పంచిందనీ, వెట్టి చాకిరి బంద్ చేయించిందనీ, సారా అమ్మడం బందుచేయించిందనీ మొత్తంగా దోపిడీ పీడనలను అరికట్టడానికి కొంత వరకు కారణమైందని చెప్పాడు.

30 ఏళ్ల క్రితం వరి, మక్క, కంది, జొన్న, పెసర, మిరప కొద్దిగా వేరుశెనగ పంటలు పండించేవారు. ఇప్పుడు ప్రధానంగా వరి, తరువాత స్థానాలలో పత్తి, మక్క పండిస్తున్నారు. కంది అంతర పంటగా వేస్తున్నారు. నీళ్ల సదుపాయం ఉన్నవారు కొద్దిగా కూరగాయలు కూడా పండిస్తున్నారు. పది పదిహేనేళ్లుగా పండ్ల తోటలు కూడా పెడుతున్నారు. మామిడి 85 ఎకరాలకు పైగా ఉంది. బత్తాయి తోట దాదాపు 10 ఎకరాల వరకు ఉంది. గత పదేళ్లుగా వర్షాలు సరిగా లేక ఊరి చెరువు నిండడం కాని, ఆ నీళ్లు చేన్లకు పారించడం కాని జరగలేదు. ఊరిలో దాదాపు 300 వరకు బావులు, 30 బోరు బావులు ఉన్నట్లు ఆ ఊరి ఎలక్ట్రీషియన్ తెలిపారు. వరద కాలువ కింద పోయిన భూమికి బదులుగా గుబ్బడి కింద ఉన్న 50 ఎకరాల కోసం గౌరవెల్లి దళితులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. చెరువు శిఖం భూమి 63 ఎకరాల కోసం అన్ని కులాల వారు ఎంఆర్‌ఒ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నారు. వరద కాలువ కింద పోయిన భూములకు సగం వరకు నష్టపరిహారం వచ్చింది. ఇంకా సగం మంది నష్ట పరిహారం అందుకోవాల్సి ఉంది. పూర్తిగా నష్టపరిహారం రాని కారణంగా వరద కాలువ పనిని ఆపించారు. ఈ గ్రామంలో మూడు సంవత్సరాల క్రితం ఒక రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

శ్రమ సంబంధాలు

ఊరిలో అత్యధిక జనాభా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 30 ఏళ్ల క్రితం 50 నుండి 100 ఎకరాలకు పైగా భూమి కలిగిన భూస్వాములుండేవారు. ఇప్పుడు లేరు. అత్యధికంగా 25-30 ఎకరాల భూమి కలిగిన కుటుంబం ఒకటి ఉంది. మారిన పరిస్థితులు, వచ్చిన కొత్త అవకాశాలు, కుటుంబాల సంఖ్య పెరగడం వంటి కారణాలు భూమి పరిమాణంలో మార్పులకు కొంత కారణంగా ఊహించవచ్చు. ఇప్పుడు మారిన భూ సంబంధాల్లో భూస్వాముల నుంచి భూమి ధనిక, మధ్య తరగతి రైతులకు ఎక్కువ భాగం, చాలా తక్కువ స్థాయిలో పేద రైతులు, భూమి లేనివారికి బదిలీ అయింది. ఇదే కాలంలో కరువు

పరిస్థితులు తోడవడంతో, వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడంతో వ్యవసాయంలో రైతుకూలీల శ్రమకు అవకాశాలు తగ్గాయి. ఊరిలో పనులు సరిగా లేక చుట్టు పక్కల గ్రామాలకు కూలికిపోతున్నారు. వలసలు పెరిగాయి. ప్రత్యామ్నాయ ఉపాధి వెతుకులాట పెరిగింది. ఒకప్పుడు వంద మందికి పైగా పాలేర్లు/జీతగాళ్లు ఈ గ్రామంలో ఉండేవారు. ఇప్పుడు దాదాపు పది మంది ఉన్నారు. ఒక్కొక్క పాలేరుకు సంవత్సరానికి పది వేల నుంచి ఇరవై ఐదు వేల రూపాయల వరకు జీతం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరూ జీతగాళ్లుగా పనిచేయడానికి సిద్ధంగా లేరని, ముందుకు రావడం లేదని అన్నారు. మొత్తంగా వ్యవసాయం మీద పనిదినాల సంఖ్య తగ్గిపోయింది.

వ్యవసాయంపై ఒక రైతు కూలీకి తొంభై రోజుల పని దొరకడం కష్టంగానే ఉంది. భూమి దున్నడం 80 శాతంకు పైగా ట్రాక్టర్‌తో సాగుతోంది. ఊరిలో వరి ప్రధాన పంటగా ఉంది. వరి కోత వంద శాతం హార్వెస్టర్‌తోనే సాగుతోంది. మొత్తంగా వ్యవసాయం మీద ఉన్న పనులు **వరికి సంబంధించి** : నాట్లు వేయడం, కలుపు తీయడం ఉన్నాయి. కోత (హార్వెస్టర్), మోత (ట్రాక్టర్) పనులు, నూర్పిడి (హార్వెస్టర్) పనులు పూర్తిగా యాంత్రీకరణకు గురయ్యాయి. వరి కోతల సమయాల్లో ఒక నెల రోజుల పాటు 20 మందికి హమాలీ పని దొరుకుతోంది. **పత్తికి సంబంధించి**: విత్తులు నాటడం, కలుపు తీయడం, ఎరువు వేయడం, పురుగు మందులు చల్లడం, పత్తి ఏరడం పనులు ఉన్నాయి. **మక్కకు సంబంధించి** : విత్తులు నాటడం, కలుపు తీయడం, మక్క కోత, కంకులు బూరు తీయడం పనులు ఉన్నాయి. మక్కతో పాటు అంతర పంటగా కంది వేసుకుంటున్నారు. గత 15 ఏళ్ల నుండి పండ్ల తోటలు పెంచుతున్నారు. **మామిడి, బత్తాయి** తోటలు మొత్తంగా వంద ఎకరాల వరకు ఉండవచ్చు. వరుస కరువు పరిస్థితులువల్ల, ట్రాక్టర్‌తో భూమి దున్నడం వల్ల ఎడ్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. కౌలు పద్ధతిలో సాగవుతున్నది చాలా తక్కువ. ఊరిలో బర్రెల సంఖ్య ఈ మధ్య కాలంలో పెరిగింది. ఊరిలో రెండు పాల కేంద్రాలు ఉన్నాయి.

విద్య : గౌరవెల్లి గ్రామానికి పాఠశాల 1962లో వచ్చింది. 1989లో అప్పర్ ప్రైమరీ పాఠశాలగా మారింది. 2000లో హైస్కూలుగా మారింది. ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలు రెండింటిలో చదువు చెపుతున్నారు. దళితులకు చెందిన బాలురు 20, బాలికలు 20 : షెడ్యూల్డ్ తెగలకు చెందిన బాలురు 6, బాలికలు 7 : వెనుకబడిన తరగతులకు చెందిన బాలురు 110, బాలికలు 109 : పై కులాలకు చెందిన బాలురు 5, బాలికలు 13 కలిపి మొత్తంగా 290 మంది విద్యార్థినీ, విద్యార్థులు గౌరవెల్లి గ్రామంలో చదువుకుంటున్నారు. వీరే గాక వివిధ కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఆర్థిక స్థితిని బట్టి 60 మంది వరకు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న హుస్నాబాద్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. ఈ పాఠశాల మొత్తానికి 15 మంది టీచర్లున్నారు. ఒక పార్ట్‌టైమ్ స్వీపర్ ఉన్నారు. బాత్‌రూమ్‌లు ఉన్నా వాడుకునేలా లేవు. పాఠశాల టీచర్లందరూ హుస్నాబాద్ నుంచి వచ్చిపోతున్నారు.

వైద్యం, ఇతర సేవలు: ఊరిలో ముగ్గురు ఆర్‌ఎంపిలు ఉన్నారు. ఒక ఎఎన్ఎం హుస్నాబాద్ నుంచి వచ్చి పోతారు. గ్రామ కార్యదర్శి, విఆర్ఒ, బిల్లు కలెక్టర్, వెటర్నరీ డాక్టర్, లైను మ్యాన్, పోస్టు మ్యాన్ హుస్నాబాద్ నుంచి వచ్చిపోతున్నారు. పోలీసు స్టేషన్, కోర్టు, మండల రెవెన్యూ ఆఫీసు, ఇంటర్, డిగ్రీ కాలేజీలు, హాస్పిటల్‌లు, వారపు సంత, కిరాణ, బట్టలు, ఇతర ప్రధాన అవసరాలకు మండల కేంద్రమయిన హుస్నాబాద్‌కు పోతుంటారు. సుతారి పనులు, హమాలీ, ఇతర కూలీ పనులు చేసుకునే వారు కొంత మంది హుస్నాబాద్‌కు రోజూ పోయివస్తున్నారు.

గ్రామంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు: రేషన్ కార్డుపై బియ్యం కిలో 2 రూపాయల చొప్పున మొత్తం గ్రామానికి నెలకు 82.99 క్వింటాళ్లు, పంచదార కిలో 13.75 రూపాయల చొప్పున 2.58 క్వింటాళ్లు, కిరోసిన్ లీటరు 13 రూపాయల చొప్పున 1038 లీటర్లు సరఫరా చేస్తున్నట్లు డీలరు చెప్పారు. 65 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్య పింఛన్‌లు నెలకు 200 రూపాయల చొప్పున 100 మందికి, వికలాంగులకు 500 రూపాయల చొప్పున 100 మందికి, వితంతు పింఛన్‌లు నెలకు 200 రూపాయల చొప్పున 30 మందికి, 65 ఏళ్లు దాటిన గీత కార్మికులకు పింఛన్‌లు అందుతున్నాయి.

ఇళ్లు, సౌకర్యాలు: ఈ గ్రామంలో మొత్తం 541 ఇళ్లు ఉన్నాయి. అందులో ఆర్‌సిసి 77, పెంకుటిళ్లు 454, ఆజ్‌బెస్టాసు రేకుల ఇళ్లు 8, గుడిసెలు 2 ఉన్నాయి. ఈ గ్రామంలో దాదాపు ప్రతి ఇంటిలో ఒక సెల్‌ఫోను ఉంది. గ్రామంలో దాదాపు ఎనభై శాతం ఇళ్లలో టివిలు ఉన్నాయి. 41 ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో కొద్ది మందికి వచ్చిన చికున్ గున్యా వ్యాధి కారణంగా యాభై శాతం మంది హుస్నాబాదు నుంచి తెచ్చి అమ్ముతున్న ఫిల్టర్ వాటర్ తాగుతున్నారు. రోజు విడిచి రోజు 20 లీటర్ల డబ్బా నీళ్లను 12 రూపాయల చొప్పున కొనుక్కుంటున్నారు. దాదాపు అన్ని ఇళ్లకు విద్యుత్తు సౌకర్యం ఉంది. 93 వీధి లైట్లు ఉన్నాయి. వాడుకునే నీటిని గ్రామ పంచాయతీ అన్ని ఇళ్లకు పైపు లైను ద్వారా అందిస్తోంది. గ్రామం నుండి హుస్నాబాద్ వెళ్లడానికి తారు రోడ్డు సౌకర్యం ఉంది. గ్రామం నుండి నేరుగా హైదరాబాదుకు పోవడానికి బస్సు సౌకర్యం ఉంది. హుస్నాబాద్ వెళ్లడానికి రోజుకు రెండు సార్లు ఆర్‌టిసి బస్సు సౌకర్యం ఉంది. ఈ ఊరి మీదుగా ఆటోలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతున్నాయి. గ్రామంలో ఐడియా, బిఎస్ఎన్ఎల్, వొడాఫోన్, ఏయిర్‌టెల్ కంపెనీలకు చెందిన సెల్‌టవర్లు ఉన్నాయి.

పన్నులు: నీటి పన్ను నెలకు రు. 20 చొప్పున కడుతున్నారు. ఇంటి పన్ను రు. 13 నుండి రు. 200 మధ్య ఎనభై శాతం ఇళ్ల వాళ్లు, రు. 200 పైన మిగిలిన వాళ్లు కడుతున్నారు. ఇంటికి వాడుకునే కరెంటుకు బిల్లులు చెల్లిస్తున్నారు. వ్యవసాయానికి వాడుకునే కరెంటుకు నెలకు రు. 20 చెల్లిస్తున్నారు.

2004 నుంచి ప్రభుత్వ పథకాల్లో భాగంగా ఊరిలో మరుగుదొడ్లు కట్టుకుంటున్నారు. చాలా వరకు ఇటీవల ఒకటి రెండు సంవత్సరాల్లో కట్టుకున్నవే ఉన్నాయి. దళిత కుటుంబాల్లో కొద్ది మంది మరుగుదొడ్లు కట్టుకున్నా కొన్ని ఇప్పటికీ పూర్తిగాని స్థితిలో ఉన్నాయి.

కులవృత్తులు బాగా దెబ్బతిన్నాయి. గౌడ, మంగలి కుల వృత్తులు మాత్రం సాగుతున్నాయి. వ్యవసాయంలో పశువులతో దున్నడం తగ్గిపోతున్న క్రమంలోనే కొయ్య నాగళ్ల అవసరం తగ్గిపోయింది. ఇనుప నాగళ్లను మెషన్లతోనే తయారు చేసి అమ్ముతున్నారు. వడ్ల, కమ్మరి వృత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కరువు వల్ల చెరువు నిండక పోవడంతో తెనుగు వాళ్లకు చేపలు పట్టుకునే అవకాశం, చాకలి వాళ్లకు బట్టలు ఉతుక్కునే అవకాశం లేకుండా పోయింది. బావుల దగ్గర కూడా బట్టలు ఉతకనీయడంలేదని, చేనుకు నష్టమంటున్నారని చాకలివాళ్లు చెప్పారు. గొల్ల, కురుమ కుల వృత్తి కొనసాగడం లేదు. వాళ్లలో కూడా ఎక్కువ మంది భూమి లేని పేద రైతులే ఉన్నారు. గొర్ర, మేకల పెంపకానికి గౌరవెల్లి గ్రామంలో తగిన గుట్టలు, కంచెలు లేవు. ఊరిలో దాదాపు అంతా పట్టా భూమే ఉంది. వడ్డెర వాళ్లు బండ రాయి కొట్టే పని ఇప్పుడు పెద్దగా చేయడంలేదు. బావులు తవ్వే పని, రోడ్లు వేసే పని, పునాదులు తవ్వే పనులకి పోతున్నారు. ఇళ్ల నిర్మాణానికి రాయి వాడకం తగ్గిపోయింది. ఈ ఊరిలో ముస్లిం (దూదేకుల) కుటుంబాలకు సరాసరిన 2 నుండి 3 ఎకరాల భూమి ఉంది.

ఎరుకల వాళ్లకు కులవృత్తైన పందుల పెంపకం లేదు. ఊరి వాళ్లు గొడవచేస్తే పందుల పెంపకం మానేశారు, తట్టలు అల్లడం కొద్దిగా ఉంది. వీరికి భూమి లేదు. కుమ్మరి కులస్తులకు కుల వృత్తిపై గడవడం లేదు.

ఉన్నది కూడా ఒక్క కుటుంబమే. పెళ్లిళ్లు, చావులు, పండగలకు తప్ప ఇంట్లో కుండల వాడకం లేదు. ఆ కొద్ది అవసరాలకు హుస్నాబాద్ నుంచి తెచ్చుకుంటున్నారు. పద్మశాలీల పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. మగ్గాలపై బతికే అవకాశం లేక మగ్గాలు అటకెక్కాయి. ఉపాధి కోసం భీవాండి, సూరత్ వెళ్లి తిరిగి వచ్చారు. ఇప్పుడు కొద్ది మంది సిరిసిల్లలో హ్యాండ్లూమ్స్‌పై పనిచేస్తున్నారు. ఒక పద్మశాలి కుటుంబంలోని భార్యభర్తలు ఇద్దరూ ప్రతిరోజూ కల్లు అమ్ముకునే మండువకు వెళ్లి గుడ్లు, గుడాలు అమ్ముకొని జీవితం నెట్టుకొస్తున్నారు. ఊరిలో రెండు కోమటి కుటుంబాలు ఉన్నాయి. అందులో ఒక కుటుంబం వారు సైకిళ్లకు మరమ్మత్తులు చేసి బతుకుతున్నారు. మరొక కుటుంబం వడ్లు, మక్కలు, కందులు, బబ్బెర్లు, పెసర్లు కొని హుస్నాబాద్‌లో అమ్ముతున్నారు. గ్రామంలో ప్రధానంగా కుమ్మరి, కమ్మరి, వడ్ల, తెనుగు, చాకలి, మాదిగ కులవృత్తులు దెబ్బతిన్నాయి. వీరు వలస వెళ్లడమో లేదా చేతి నిండా పనిలేక వ్యవసాయంలోనే మిగులు మనుషులుగా ఉండిపోయిన స్థితి ఉంది.

ఈ ఊరిలో ఆంజనేయుని గుడి ఉంది. ఇది చాలా పాతదని, పూర్వీకుల నుంచి ఉందని చెప్పారు. ఎల్లమ్మ గుడి 1985లో కట్టారు. సంవత్సరానికి ఒకసారి అన్ని కులాల వాళ్లు బోనాలు చేసి జాతర చేస్తారు. పోచమ్మకు అన్ని కులాల వాళ్లు ప్రతి సంవత్సరం బోనాలు చేస్తారు. ఊరి చెరువు కట్టపై మైసమ్మ గుడి ఉంది. క్రిస్టియన్ మతం నమ్ముతున్న మాదిగ కుటుంబాలు కొద్దిగా ఉన్నాయి. ముస్లింలు (దూదేకుల) పండుగలప్పుడు హుస్నాబాద్‌కు పోయి నమాజ్ చేసుకొని వస్తారు. ఊరిలో ప్రత్యేంగా వారికి మసీదు లేదు.

చనిపోయిన వారిని కొద్ది మందిని బొంద పెడతారని, ఎక్కువ శాతం కాలబెడతారని చెప్పారు. ఊరికి ఉత్తరాన ఉన్న వాగులో సొంత భూమి లేని అన్ని కులాల వారు బొంద పెట్టడం, కాలబెట్టడం చేస్తారని చెప్పారు. గండెపల్లి రోడ్డులో ఒక ఎకరం స్థలంలో వొడ్డెర, మాదిగ కులస్తులకు చెందిన శవాలను బొంద పెడతారు. భూములున్న వారు తమ సొంత భూముల్లో బొంద పెట్టడం, కాల్చడం చేస్తారు. ముస్లింల కోసం ఒక ఎకరం స్థలం బొందలకోసం కేటాయించారు. ఈ ఊరిలో ఎవరు చనిపోయినా పాడె కట్టెలు తేవడం, బొంద తోడడం, డప్పులు కొట్టడం మాదిగ కులస్తులు చేస్తున్నారు. మాల, మాదిగ, గొల్ల కులాల నుండి 10 మంది వరకు వేములవాడ రాజరాజేశ్వరస్వామి పేరు మీద (ఐదు నుండి పది ఇండ్ల వరకు) తిరిగి బిచ్చమెత్తే పద్ధతి ఉంది.

ఈ ఊరిలో బ్రాహ్మణ కులస్తులు ఇప్పుడు లేరు. అరవై ఏళ్ల క్రితం ఒక బ్రాహ్మణ జమీందారును రెడ్డి, చాకలి కులస్తులు కలిసి చంపినట్లు తెలిసింది. ఇప్పుడు ఈ ఊరికి అంతకపేట నుంచి అయ్యవారు వచ్చి పోతున్నారు.

కులం అనేది ఆచార వ్యవహారాల్లోనూ, కట్టుబాట్లలోనూ, పెళ్లిళ్ల లోనూ, కుల పంచాయతీల్లోనూ, చనిపోయినపుడు అంత్య క్రియల్లోనూ ఎక్కువగా ఉంది. ఉత్పత్తిలో కులం పాత్ర తగ్గిపోవడం కనిపిస్తోంది. కేవలం కుల వృత్తి మీద ఆధారపడి బతికే పరిస్థితి లేదు. అన్ని కులాల వాళ్లు దాదాపు అంతో ఇంతో భూమి కొని వ్యవసాయంపైననే ఆధార పడుతున్నారు. పాత తరం వారు అంటరానితనం పాటిస్తున్నారని, ఇప్పటి తరంలో అంటు ముట్టులు గతంతో పోలిస్తే కొంత వరకు తగ్గిపోయాయని దళితులు పేర్కొన్నారు. బతుకుదెరువుకోసం హైదరాబాద్‌కు వలస పోయిన దళిత, గౌడ, రెడ్డి యువకులు కలిసి ఒకే గదిలో ఉంటూ వండుకుని తింటున్నారని చెప్పారు. గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి అన్ని కులాల వాళ్లు వంటలు చేస్తున్నారనీ, అన్ని కులాల విద్యార్థులు తింటున్నారనీ అన్నారు. ఈ గ్రామం నుంచి నాలుగు జంటలు ఈ మధ్య కాలంలో కులాంతర వివాహాలు చేసుకున్నట్లు తెలిసింది.

మాల మాదిగ కుటుంబాల విషయానికి వస్తే మేము అరవై తొమ్మిది (14మాల, 55మాదిగ) కుటుంబాలను గడప గడపకు వెళ్లి కలిసాం. వీరిలో మాదిగలు చెప్పులు కుట్టి బతుకుతున్నది లేదు. మాలలకు చెందిన రెండు కుటుంబాలకు సుంకరి తనం, నీరటి తనం ఉన్నాయి. మాల కుటుంబాల్లో కొంత మంది సింగరేణి బొగ్గు బావులలో పనిచేసి రిటైర్ అయి గత మూడు సంవత్సరాలుగా ఊరిలో బతుకుతున్న కుటుంబాలు ఉన్నాయి. ఐదు ఎకరాలకు పైగా ఉన్న మాదిగ కుటుంబాలు నాలుగు ఉండగా, మాలలకు చెందిన వారిలో రెండు కుటుంబాలు ఉన్నాయి. దళితులకు చెందిన భూమి వరద కాలువ కింద దాదాపు యాభై ఎకరాలు పోయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇంకా మాదిగలకు దాదాపు యాభై ఎకరాలు, మాలలకు పద్దెనిమిది ఎకరాల భూమి ఉంది. మాల మాదిగల కుటుంబాలకు మొత్తంగా యాభై లక్షల రూపాయల అప్పు ఉంది. ఈ అప్పు ప్రధానంగా దుబాయి వెళ్లడానికి, బావులు తవ్వడానికి, బోర్లు వేయడానికి, పిల్లల పెళ్లిళ్లు చేయడానికి, రోగాలకు, చదువులకు, వ్యవసాయ పెట్టుబడులకు, వ్యవసాయ పనులు లేనపుడు కుటుంబ అవసరాలకు తీసుకున్నట్లు చెపుతున్నారు.

దళితులకు ముప్పయి ఏళ్ల క్రితం దాదాపు ఇరవై జతల ఎడ్లు ఉండేవనేది ఒక అంచనా. ఇప్పుడు అవి పది జతలకొచ్చాయి. ఇప్పుడు ఊళ్లో ఉన్న పది మంది పాలేర్లలో ఐదుగురు దళితులే. వరద కాలువ కింద కోల్పోయిన భూమికి కొంత మందికి డబ్బులు వచ్చాయి. మిగతా వారికి రావాల్సే ఉంది. వరద కాలువ కింద పోయిన భూమికి ఎకరానికి రెండు లక్షల పదివేల రూపాయల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. అయితే కొత్తగా భూమి కొందామంటే ఒక ఎకరం ధర నాలుగు లక్షల రూపాయలు ఉందని చెప్పారు. అది కూడా గౌరవెల్లిలో కొనుక్కోవ డానికి అవకాశం కనిపించడంలేదు. చెరువు శిఖం కింద ఉన్న భూమి కోసం ఊరిలో ఉన్న అన్ని కులాలతోపాటు దళితులూ పోటీపడాల్సి వస్తోంది. వరద కాలువ కింద పోయిన భూమికి వచ్చిన డబ్బులతో కొద్ది మంది ఎంతో కొంత భూమి కొనే ప్రయత్నంలో ఉండగా, మరికొంత మంది హుస్నాబాద్‌లో ప్లాట్లు కొనడానికి, పాత అప్పులు తీర్చడానికి, పెళ్లి ఖర్చులకి, కొంత తినడానికి, తాగడానికి ఖర్చుచేసినట్టు చెప్పారు.

దళిత కుటుంబాల నుంచి నలభై మందికి పైగా దుబాయి, ముంబై, భీవాండి, హైదరాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, హన్మకొండ, హుస్నాబాద్ లకు వలస వెళ్లి బతుకుతున్నారు. అలా వెళ్లినవారు ట్రక్కు డ్రైవర్లుగా, ఆటో డ్రైవర్లుగా, డిసిఎం వ్యాను డ్రైవర్లుగా, వాచ్‌మెన్‌లుగా, పెయింటింగ్ పనివాళ్లుగా, భవన నిర్మాణ కూలీలుగా పనిచేస్తునట్లు తెలుస్తోంది. ఒకరు బ్రాందీ షాప్‌లో, మరొకరు మెడికల్ షాపులో పనిచేస్తున్నట్లు చెప్పారు. కొద్ది మంది ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలతో వెళ్లిన వారూ ఉన్నారు. ఇద్దరు టీచర్లుగా, ఒకరు ఆర్‌టిసి డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇద్దరు సింగరేణి బొగ్గుబాయిలో పనిచేస్తున్నారు. 25 ఏళ్లు ముంబైలో ఉండి ఇటీవలే గ్రామానికి వచ్చిన మాదిగ కుటుంబం ఒకటి ఉంది. ఊరిలోనే టైలరింగ్ పనిచేస్తున్న ఒక మాదిగ యువతి ఉంది. దళిత కుటుంబాలలోని మహిళలు, పురుషులు ఉపాధి హామి పనికి పోతున్నట్లు చెప్పారు. అయితే గత ఏడాది ఉపాధి పని వంద రోజుల వరకు దొరికిందని, ఈ ఏడాది పది రోజులు కూడా పని దొరకలేదని చెప్పారు.

దళిత కుటుంబాలలో ఎక్కువ పేదరికం కనబడింది. తీవ్రమయిన అనారోగ్య సమస్యలతో, వైద్యం చేయించుకోలేని స్థితిలో అందునా ముఖ్యంగా మహిళలు ఎక్కువ మంది ఉన్నారు.

ముప్పయి ఏళ్ల క్రితం నాటి పరిస్థితితో పోల్చి చూస్తే కొత్తతరం దళితులు ఇప్పుడు ఎక్కువ చదువుకుంటున్నారు. పిఎచ్‌డి చదువుతున్న ఒక మాదిగ విద్యార్థి ఈ గ్రామంలో ఉన్నాడు. డిగ్రీలు చదువుతున్నవారు, పోస్టు

గ్రాడ్యుయేషన్ చేస్తున్నవారు ఉన్నారు. ఒక అమ్మాయి బిఎస్‌సి నర్సింగ్ చేస్తోంది. నలుగురు బిఇడి, ఒకరు ఎంబిఎ పూర్తి చేసినట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ (1996–2002 వరకు) కందుకూరి కనకయ్యను పిల్లల్ని ఎందుకు చదివించాలనుకున్నారని అడిగితే–'పెళ్లికాక ముందు పనికోసం విదేశాలకు పోయిన, చదువుకోని తన పరిస్థితి అవమానకరంగా తోచింది, పిల్లల్నయినా చదివిద్దామని అనుకున్నా' అని చెప్పారు. దళితులలోనూ, మొత్తంగానూ కొత్తతరానికి వ్యవసాయం మీద ఆసక్తి కొంత సన్నగిల్లుతున్న స్థితి ఉంది. గ్రామం నుంచి వలసపోయిన వారిలో దళితులు, వడ్డెర, గౌడ కులాలకు చెందినవారు ఎక్కువ మంది ఉన్నారు. మొత్తంగా అన్ని కులాల నుంచి కూడా అంతో ఇంతో వలస అనేది ఉంది. గ్రామం నుంచి పద్మశాలి, ఔసుల, కోమటి, తెనుగు, వడ్డెర కులాలకు చెందిన దాదాపు డెబ్బై కుటుంబాల వారు వలసపోయి బతుకుతున్నారు.

ఆర్థికం : ముప్పై ఏళ్ల క్రితం ఊరి మొత్తం మీద అప్పు దాదాపు తొమ్మిది లక్షల రూపాయలుంటే ఇప్పుడు కేవలం దళిత కుటుంబాలకే యాభై లక్షల రూపాయల దాకా అప్పు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా గ్రామం మొత్తం మీద వ్యవసాయం కోసం తీసుకున్న రుణాలు, ప్రైవేట్ రుణాల గురించి తెలుసుకోవాల్సే ఉంది. ఎక్కువ శాతం ప్రైవేట్ వ్యక్తుల దగ్గర పరిచయస్తుల దగ్గర అప్పులు చేసినట్లు చెప్పారు.

ఈ గ్రామంలో వడ్డీ వ్యాపారం లేదన్నారు. అప్పు తెచ్చుకున్న వాళ్లంతా కూడా నూటికి రెండు రూపాయల నుంచి మూడు రూపాయల దాక వడ్డీలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అప్పుకు సంబంధించిన డబ్బులను ఆరు నెలలకు లేక సంవత్సరానికి ఒకసారి చొప్పున చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామంలో ముప్పయి ఆరు డ్వాక్రా గ్రూపుల వారిపై ఎనభై లక్షల అప్పు రొటేషన్‌లో ఉంది. ఈ డ్వాక్రా అప్పుల వాయిదాలు నెల నెలా కడుతున్నారు. ఇలా అప్పుతీసుకున్న గ్రూపులలో ఆరు మాదిగ కులాలకు చెందిన గ్రూపులు ఉన్నాయి. ఊరిలో ఎక్కువ శాతం బిసిలకు చెందిన డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. కొన్ని దళిత, బిసి, ముస్లిం, వడ్డెర, చాకలి, మంగలి, తెనుగు కులాలతో కూడిన మిశ్రమ గ్రూపులు కూడా ఉన్నాయి. మొత్తంగా ఈ డ్వాక్రా గ్రూపుల్లో ఐదు వందల పద్దెనిమిది మంది మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ గ్రామాన్ని దక్కన్ గ్రామీణ బ్యాంక్ దత్తత తీసుకుంది. ఇంకా వేరు వేరు బ్యాంకులలో పంట రుణాలు ఉన్నాయి. గౌరవెల్లి గ్రామ సర్పంచ్‌గా గౌడ కులానికి చెందిన చీకట్ల సరస్వతి ఉంది. ఆమె భర్త ఊరిలో పండిన వరి, మక్క పంటలలో డెబ్బై శాతం పంటను కొంటున్నట్లు తెలుస్తోంది. కొద్ది మంది మాత్రం తమ పంటను హుస్నాబాద్‌లో అమ్ముతున్నట్లు తెలిపారు. పత్తి పంట మొత్తంగా హుస్నాబాద్‌లో అమ్ముతున్నారు.

ఊరిలో ఖరీఫ్ పంటగా ఎనిమిది వందల ఎకరాల వరి, ఐదు వందల ఎకరాల పత్తి, ఐదు వందల ఎకరాల మక్క పంటలు పండు తున్నాయి. కందులు, బబ్బెర్లు, పెసర్లు కొద్ది శాతం పండిస్తున్నారు. ఖరీఫ్ పంట మీద వస్తున్న ఆదాయాన్ని లెక్కిస్తే – వరి పంట మీద 1.8 కోట్ల రూపాయలు (ఎకరానికి సరాసరిన ఇరవై ఐదు క్వింటాళ్ల దిగుబడి చొప్పున; క్వింటా వడ్లకు తొమ్మిది వందల రూపాయల చొప్పున), పత్తి పంట మీద 1కోటి రూపాయలు (ఎకరానికి సరాసరి ఐదు క్వింటాళ్లు; క్వింటా పత్తికి నాలుగు వేల రూపాయల చొప్పున); మక్క పంట మీద 1కోటి రూపాయలు. (ఎకరాకు సరాసరి పదహారు క్వింటాళ్ల చొప్పున; క్వింటాకు పన్నెండు వందల రూపాయల చొప్పున); సాగు భూమిలో యాభై శాతం భూమిపై వేసంగి పంట కూడా వేస్తున్నారు. వేసంగి వరిపై 1 కోటి రూపాయలు, మక్క జొన్నపై డెబ్బై అయిదు లక్షల రూపాయల ఆదాయం ఉంది. ఈ గ్రామం మొత్తం మీద 85 ఎకరాలు మామిడి,10 ఎకరాల బత్తాయి తోటలు ఉన్నాయి. పండ్ల తోటలపై సంవత్సరానికి 30 లక్షల రూపాయల దాకా ఆదాయం ఉంది. ఇతరత్రా పంటలన్ని కలిపి దాదాపు ఇరవై ఐదు లక్షల రూపాయల ఆదాయం వస్తోంది. అంటే ఖరీఫ్ పంటపై మొత్తం ఆదాయం నాలుగు కోట్ల రూపాయలు కాగా, వేసంగి పంటపై రెండు కోట్ల ఐదు లక్షల రూపాయలు. వ్యవసాయానికి శాస్త్రీయ పద్ధతిలో ప్రోత్సాహమూ, సహకారమూ అందిస్తే అనేక మందికి ఉపాధి కలిగించడమే కాకుండా, దిగుబడులను, మొత్తంగా ఆదాయాన్ని పెంచవచ్చు. పంటలన్నీ ప్రధానంగా మార్కెట్‌కు అమ్మడానికే పండిస్తున్నారు. కొద్ది శాతం మంది ఇంటి అవసరాలకోసం పండించుకోవడం, పండిన దాంట్లో కొంత ఉంచుకోవడం కూడా ఉంది. బావుల దగ్గర నీటి వసతి ఉన్నవారు కొద్దిగా కూరగాయలు పండిస్తున్నారు. వాటిని ఊరిలోని తెనుగు, దళిత స్త్రీ, పురుషులు హుస్నాబాద్‌కు తీసుకపోయి అమ్ముతున్నారు.

ఊరి మొత్తానికి 1500 తాటి చెట్లు ఉన్నాయి. వరద కాలువ కింద 500 చెట్లు పోయాయి. ఇప్పుడు దాదాపు కల్లుపారే చెట్లు 1000 వరకు ఉన్నాయి. గౌడకులస్తులకు గడపకు 10 చెట్ల చొప్పున వాటా ఉంది.

గ్రామంలోని దళితుల అభిప్రాయాలు!

70 మందికి పైగా గౌండ్లు, మాదిగలు పొట్టకోసం వలసపోయినారు. బాగుపడ్డది ఏమిలేదు.

– కొమ్ముల పరశురాములు, (ఉప సర్పంచ్)

ఊళ్లో పని ఐదు నెల్లకు మించి పని దొరకడంలేదు.

– కొమ్ముల పరశయ్య

తాతల నాటి నుంచి సాగుచేసుకుంటున్న నా ఎకరం భూమి డ్యాం కింద పోయింది. పట్టాలేదని పైసలివ్వమన్నరు.

– ఆకారపు రాజయ్య

వలసపోయినా ఇదివరకటిలాగా సంపాదించుకుంటామనే ఆశలేదు. ఇక్కడ బ్రోకర్లు, అక్కడ బ్రోకర్లు ఒక్కటయ్యారు. మన దేశంలో దొరికే కూలి పైసలే దుబాయి, మస్కట్‌లలో ఇస్తున్నారు. తినే వస్తువుల ధరలు పెరిగాయి. అప్పు చేసిపోతే అప్పు తీర్చడానికి కూడా కష్టమవుతోంది.

– కందుకూరి కనకయ్య, (మాజీ సర్పంచ్)

నీళ్లు ఎప్పుడు వస్తాయోగానీ, వరద కాలువ కట్టవచ్చాక ఎక్కడలేని కరువు దాపురించింది. ఇంకెంత కరువు వస్తుందో...ఏదైనా ఇంత తాగుదామని ఉంది.

– దండెపు దుర్గయ్య

భర్త చనిపోయాడు. కొడుకు చనిపోయాడు. బిడ్డల పెళ్లిళ్లు అయి వెళ్లిపోయారు. నాకు పనిచేసుకునే పరిస్థితి లేదు. భూమి లేదు. పంచరాయి భూమికి పట్టాలేదు.

– శనారపు బూదవ్వ

సీలింగ్ భూమి రాలేదు. పంచరాయికి పట్టాకాలేదు. అయ్య సంపాయించింది ఏమీలేదు. చెయ్యి విరిగింది. రెండేళ్లుగా పనిచేయ లేకపోయిన. ఎక్కడలేని అప్పు జమయింది.

– దండెం కనకయ్య

ఒక ఎకరం భూమి ఉంది. బోరుకోసం లక్ష అప్పు అయింది. భర్త మస్కట్‌పోయి సంవత్సరమైంది. మొత్తం అప్పు మూడు లక్షలుంది. తిన్నది కాదు, తాగింది కాదు. బర్రె లేదు, కోడి లేదు. ఇంటికి లాట్రిన్, బాత్‌రూమ్‌లు లేవు. దసరాల నుంచి ఇక పనీ లేదు.

– కొమ్ముల పద్మ

మాకు భూమి లేదు. అప్పు లేదు, ఆస్తి లేదు. కూలీ పనికి పోతం. కష్టంతోనే బతుకు. రెక్కలే చుట్టాలు, రెక్కలే బంధువులు.

– తాదూరు లక్ష్మి

కల్లు పారేతీరును బట్టి చూస్తే కనీసం సంవత్సరానికి 40 లక్షల రూపాయల దాక ఆదాయం వస్తోంది. అలాగే ఊరిలో రెండు పాల కేంద్రాలు ఉన్నాయి. ఒకటి విజయ డైరీ (20 సంవత్సరాలుగా), రెండోది ముల్కనూరు సొసైటీ డైరీ (నాలుగు సంవత్సరాలుగా) ఉన్నాయి. పాల మీద మొత్తంగా ఊరికి సంవత్సరానికి 15 లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తోంది.

ఊరిలో ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను చూస్తే ఒక పది మంది వరకు మహిళలు బీడీలు చుట్టి బతుకుతున్నారు. వెయ్యి బీడీలు చుడితే 70 రూపాయలు ఇస్తారు. రోజుకి ఒక్కొక్కరు కనీసం 5 నుండి 6 వందల వరకు బీడీలు చుడుతున్నారు. స్త్రీలు, పురుషులు కలిపి ఎనిమిది మంది వరకు టైలరింగు పని చేసి బతుకుతున్నారు. ఐదు ఆటోలు నడుపుకుంటున్నారు. ఊరిలో 4 బెల్టు షాపులు ఉన్నాయి. 8 ట్రాక్టర్లు ఉన్నాయి. ట్రాక్టర్లు వ్యవసాయ పనులకు, వరద కాలువ పనులకు ఉపయోగిస్తున్నారు. 7 మంది కిరాణ దుకాణాలు (గౌడ 4, ముస్లిం 2, మాదిగ 1) నడుపుకుంటున్నారు.

ఉపాధి హామి పని కింద 2010లో 90 రోజుల పని దొరికినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారు. దళితులలో మాదిగ కులానికి చెందిన వారు 260, మాలలు 55, గౌడ 160, చాకలి 70, గొల్ల, కురుమ 200, వడ్డెర 40, దూదేకుల 20, వడ్ల కమ్మరి 20, తెనుగు 15, లంబాడ 15 మంది కలిపి మొత్తంగా 855 మంది ఉపాధి హామి పనిలో పాల్గొన్నట్లు తెలిపారు. ఉపాధి హామి పని కింద పాత చెరువు మట్టి తీసి కట్టమీద పోయడం, రైతుల భూమి చదును చేయడం, మామిడి తోటల పనులు చేసినట్లు చెప్పారు. ఊరిలో ఒక మిని రైస్ మిల్లు ఉంది.

ముప్పై ఏళ్ల క్రితం కూలి రేట్లు ఆడవారికి రు. 10, మగవారికి రు. 25 ఉండగా, ఇప్పుడు అవి ఆడవారికి రు.100, మగవారికి రు. 200గా ఉన్నాయని చెప్పారు. ఉపాధి హామీ పనులు వచ్చాకే కూలీ రేట్లు పెరిగాయని, ఉపాధి హామీ పనుల వలన జనాలకు లాభం జరుగుతోందని, అయితే భవిష్యత్తుకు మంచిది కాదని ఒక ధనిక రైతు వ్యాఖ్యానించారు. ఉపాధి హామీ శ్రమను వ్యవసాయానికి మళ్లించి సగం కూలీని ప్రభుత్వం, సగం కూలీని రైతు చెల్లించే పద్ధతి పెడితే ఇటు రైతులకు, అటు వ్యవసాయానికి మేలు జరగవచ్చు అని ఆ ధనిక రైతు అన్నారు. వరద కాలువ పనులు ఊరి వారికి ఎవరికీ దొరకడం లేదని ట్రాక్టర్లు, పొక్లెయిన్‌లతోనే పని జరుగుతోందని చెప్పారు. ఊరిలో ఎలక్ట్రీషియన్ పనిమీద ముగ్గురు బతుకుతున్నారు.

ముప్పై ఏళ్ల కిందటికి ఇప్పటికి పోల్చి చూస్తే సామాన్యుల నుంచి పై స్థాయి వరకు చాలా కొత్త ఖర్చులు వచ్చిచేరాయి. రాబడితో సంబంధం లేకుండా ఖర్చు మాత్రం పెరుగుతూపోతోంది. ఆరోగ్యం, విద్య, పండుగలు, జాతర్లు, పుట్టుక, పెళ్లిల్లు, చావులు, అలవాట్లు అన్నిటా ఖర్చు బాగా పెరిగింది. గతంలో అన్నీ గ్రామంలోనే దొరికేవనీ రెండు మూడు వస్తువులనే బయట కొనుక్కునేవారమనీ ఇప్పుడు తాగే నీటి నుంచి అన్నీ బయటే కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉంది. సెల్‌ఫోన్‌ల పైనా ఖర్చు చాలా ఎక్కువగా ఉంది. వస్తు సంస్కృతి గ్రామానికి వ్యాపించింది. మరో వైపు ఉత్పత్తి ఖర్చులు పెరిగి వ్యవసాయం భారంగా మారిపోతోంది. కల్లు తాగడం తగ్గి బీరు, బ్రాందీలు, గుడంబా తాగడం పెరిగింది. దీంతో ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, సంపాదించిన కొద్ది మొత్తం మార్కెట్‌కు తరలిపోతోంది. కుటుంబాలు అప్పులపాలై, ఉత్పాదక శక్తి క్షీణిస్తోంది. ఊరిలో ప్రజల ఆరోగ్యస్థితి దుర్భరంగా ఉంది. వైద్యం చేయించుకోలేక ఇండ్లలోనే అవస్తపడుతున్న మహిళలు, వృద్ధులు చాలా మంది కనబడ్డారు.

మా సర్వేలో భాగంగా గ్రామంలో మేం ఎవరిని కలిసినా **'మాకు ఏమి ఇస్తారు, మీ వల్ల మాకు ఏమి మేలు జరుగుతుంది'** అని అడిగారు. వాళ్లకున్న సమస్యలు మా వల్ల ఏమైనా పరిష్కారమౌతాయా అని చూస్తున్నారు. వాళ్లకున్న సమస్యలను వారి కృషితో, వారి ప్రయత్నంతో మారుతాయని కాకుండా, ఎవరైనా ఏమైనా చేస్తే మారతాయనే ఆలోచనలో

గాంభీరపు రామయ్య (82)

1946లో గౌరవెల్లిలో అన్ని గుడిసెలే ఉండేటివి. అప్పుడు నిజాం పరిపాలనలో ఉంది. తెలంగాణ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ లేదు. నిజాం కాలంలో పెద్ద ముస్లింలు చిన్న ముస్లింలను చిన్న చూపే చూసేది. గత 20 ఏళ్లుగా పెట్టుబడి బాగా వచ్చింది. అప్పట్లో సుంకరి, పట్వారీ, మాలీ పటేల్, పోలీస్ పటేల్, దొర, వతన్‌దార్, దేశ్‌ముఖ్, దేశాయి, సర్దేశాయి, జాగీర్దార్, మక్తేదార్ స్థాయిలల్లో ఇలా అంచెలంచెలుగా పరిపాలించారు. రెవెన్యూ పన్ను, పొయ్యి పన్ను, జుట్టు పన్ను వంటి అనేక పన్నులు వేసేవారు. జాగీరు అంటే రాజుకు కప్పం ఇంతని చెల్లించి వాళ్లే పరిపాలించేవారు. గుండి దామోదర్ రావు (కమ్యూనిస్ట్) నాయకత్వంలో హరిజనులతో వంట వండించి పెట్టించేవారు. 1959 నాటికి భూమిలేని కుటుంబాలు చాలా ఉండేవి. కమ్యూనిస్టుల ప్రభావంతో పేదలకు భూములు కొంత దక్కాయి. రాడికల్స్ వల్ల తలఎత్తుకుని జీవించే పరిస్థితులు వచ్చాయి. ఇవాళ ఊరు మీద ఉన్న అప్పు ఊరి భూమిని అంతటినీ అమ్మినా తీరే పరిస్థితి లేదు. వర్షాలు పడాలి. రైతులకు ఎరువులు ఇవ్వాలి. రైతు పండించే పంటకు ముందే ధర నిర్ణయించాలి. బట్టకు, చెప్పుకు ఖచ్చితమైన ధర ఉంది కాని రైతు పండించిన పంటకు ధర లేదు. వ్యవసాయ ఖర్చు పెరిగిపోయింది. రైతులకు శాశ్వత వసతులు కల్పించాలి. సబ్సిడీలు ఉత్తమాటే. రైతుకు ఏ రకంగానూ అందడంలేదు. పంటకు గిట్టుబాటు ధర ఇచ్చి, చవుకధరలకు అవసరమయిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇంకా ఇతర వ్యవసాయ అవసరాలు తీర్చి రైతును అన్ని విధాలా ఆదుకోవాలి. అన్ని ప్రభుత్వాలు రైతులను బిచ్చగాళ్లను చేస్తున్నాయి. ఇది వరకు ప్రత్యక్ష పన్నుల బాధ తెలిసేది. ఇప్పుడు పరోక్ష పన్నుల నొప్పి అర్థం కావడం లేదు. ఇందిరమ్మ ఇళ్ల పేర సొమ్ములు వాళ్లే తినబట్టిరి. జనం అప్పుల పాలవుతున్నారు. ఇల్లు ఇచ్చినారు. బర్రె ఇచ్చినారు. గొర్రె ఇచ్చినారని అనుకుంటున్నారు. ఇస్తున్నది కనిపిస్తది. తీసుకునేది తెలుస్తలేదు. ఇదంతా 'మోచేతికి బెల్లం బెట్టి నాకమన్న' తీరుగా ఉంది. ఈ ప్రభుత్వ సహకారమంతా అంతే.

ఇక మన పురాణగాథలు చూస్తే రామయణం కావచ్చు, భారతం కావచ్చు, భాగవతం కావచ్చు. వాటిలో పేదవాని కొరకు ఎక్కడా రాయలేదు. అర్జునుణ్ణి యుద్ధానికి పంపనీకి చెప్పిందే భగవద్గీత. భాగవతమంతా శ్రీకృష్ణుని రాసలీలలే. రామాయణంలో ప్రజల సమస్యే లేదు. భార్యను ఎత్తుకు పోవడం, వెనక్కు తెచ్చుకోవడం. భారతం-కౌరవులు, పాండవుల అన్నదమ్ముల పంచాయతీ తప్ప ప్రజల సమస్య ఏమీ లేదు. అప్పటి నుంచి ఇప్పటి దాకా పాలకులు తమ ప్రయోజనాల కోసం, వారి అధికారాన్ని నిలిపి ఉంచుకోవడం కోసం పంచాయతీలు, యుద్ధాలు జరిగాయి కానీ ప్రజల సమస్యల పరిష్కారం కోసం మాత్రం కాదు. ప్రజల కోసం పోరాడుతున్నది నక్సలైట్లే. మన దగ్గర నక్సలైట్లు వెనక్కి తగ్గాక లంచగొండి విధానం పెరిగింది. కుల సంఘాలు పెరుగుతున్నాయి. కుల సంఘాలను రాజకీయ పార్టీలు ఓట్లకోసం ప్రోత్సహిస్తున్నాయి. గతంలో ఓట్ల కోసం రాజకీయ పార్టీల నాయకులు గ్రామాలకు వస్తే మాగ్రామానికి ఏం చేస్తావని అడిగేవారు, ఇప్పుడు తమకు ఏమిస్తావని అడుగుతున్నారు. కొత్తగా వస్తున్న మార్పులు జనాన్ని అనవసరమైన పరుగువైపు, పోటీలోకి లాగుతున్నాయి. పరోక్ష దోపిడీ, కొత్త కొత్త దోపిడీ రూపాలు ప్రజలకు అర్థంకావడంలేదు.

ఉన్నారు. ప్రజలు సామాజిక అభివృద్ధిలో కేంద్రం కాకపోవడం, వారి సృజనాత్మక భాగస్వామ్యాన్ని లేకుండా చేయడం వలన ఎప్పుడూ ఎవరో ఏదో ఇచ్చేవారుగానూ, వాళ్లు పుచ్చుకునే వాళ్లుగానూ ఒక తాత్వికత స్థిరపడింది. బాహ్యకారణాల మూలంగానే ఏదో జరగాలనే దృష్టి ఉంది. అంతర్గతంగా ఘర్షించి, చర్చించి, ఆలోచించి మార్చుకునే వైపుగా కాకుండా 'సామరస్య' ధోరణి కనబడు తోంది. పై వర్గాలు గ్రామ నాయకత్వం నుంచి ఇంకా పైకి ఎదగగా, మధ్య, ధనికవర్గాలు గ్రామస్థాయి నాయకత్వానికి కాస్త ఎదిగాయి.

ముప్పై ఏళ్ల కిందటికి ఇప్పటికి వచ్చిన మార్పులను స్థూలంగా ఇలా చెప్పుకోవచ్చు–రైతు కూలీల సంఖ్య పెరిగింది. పాలేర్లు/జీతగాళ్ల సంఖ్య తగ్గింది. మధ్యతరగతి రైతులు పెరిగారు. భూస్వాములు తగ్గారు. కలిగి ఉన్న భూమిలో అంతరాల స్థాయి తగ్గింది. ఎడ్లు, పశువులు తగ్గాయి. బర్రెల సంఖ్య పెరిగింది. కొయ్య నాగలి వాడకం చాలా తక్కువ స్థాయిలో ఉంది. మోట వాడడంలేదు. వ్యవసాయంలో ట్రాక్టర్, అధునాతన పరికరాల వినియోగం పెరిగింది. విత్తనాలకు మార్కెట్‌పై ఆధారపడడం పెరిగింది. చేతివృత్తులు క్షీణించాయి. అప్పులు విపరీతంగా పెరిగాయి. బ్యాంకు రుణాలు పెరిగాయి. స్వయం సహాయక బృందాలు ఇటీవల వచ్చాయి. మైక్రో ఫైనాన్స్ అప్పులు ఇటీవల వచ్చాయి. వడ్డీ వ్యాపారులు తగ్గారు. పాల ఉత్పత్తి పెరిగింది. ఉద్యోగాలపై ఆధార పడేవారి సంఖ్య పెరిగింది. గతంతో పోల్చినపుడు వైద్య సదుపాయాలు కాస్త పెరిగాయి. చదువుకుంటున్న వారు పెరిగారు. భూస్వామ్య ఆచార వ్యవహారాల పట్టు కొంత తగ్గింది. అంటరానితనం కొంత వరకు తగ్గింది.

వ్యవసాయంలో పెట్టుబడులను మినహాయించుకొని, కల్లు ఉత్పత్తిలో, పాల ఉత్పత్తిలో శ్రమ విలువను మినహాయించుకొని లెక్కగడితే, 50 శాతం నికర ఆదాయం వస్తుందనుకున్నా గ్రామంపైన 3 కోట్ల రూపాయల వరకు ఆదాయం ఉంది. ఈ 3 కోట్ల రూపాయల ఆదాయాన్ని గ్రామంలో ప్రతి గడపకు పంపకంచేస్తే సంవత్సరానికి 60 వేల రూపాయల అదనపు ఆదాయాన్ని ప్రతి కుటుంబం పొందగలదు. అంటే నెలకు ప్రతి కుటుంబం అదనంగా 5 వేల రూపాయల ఆదాయం ఇప్పుడున్న స్థితిలో పొందడం సాధ్యమే. ఐతే అది ఉమ్మడి వ్యవసాయ పద్ధతిలో, ఫలితాల ఉమ్మడి పంపకాల పద్ధతిలోనే సాధ్యమవుతుంది. దీన్ని మరో రకంగా చెప్పుకుంటే ఊరి కింద ఉన్న 19 వందల ఎకరాల భూమిని ఉన్న 5 వందల గడపలపైన విభజిస్తే కుటుంబానికి సరాసరిన మూడున్నర ఎకరాల భూమి ఇవ్వవచ్చు. (వ్యవసాయంపై ఆధారపడని, ఇతర వృత్తులలో స్థిరపడ్డ వారిని మినహాయిస్తే ఇంకా ఎక్కువ భూమే ఇవ్వవచ్చు) వ్యవసాయానికి నీరు అందించి, ఆధునిక పద్ధతులను ప్రవేశపెట్టి, రైతులపై రుణభారాన్ని తగ్గించి, ధరలను అదుపులో ఉంచి, సమష్టి వ్యవసాయ క్షేత్రాల నిర్మాణానికి పూనుకుంటే ఈ గ్రామంలో వ్యవసాయం ఆధారంగానే బోలెడు అభివృద్ధిని సాధించవచ్చు. వ్యవసాయానికి సాగు నీరు అందిస్తే వలసలు నివారించవచ్చు. వ్యవసాయాధారిత ఉపాధిని పెంచడమే కాక ప్రత్యామ్నాయ అభివృద్ధికి బాటలు వేయవచ్చు.

గ్రామ అధ్యయనంలో సేకరించిన పరిశోధనా ఫలితాలను అంశాల వారీగా క్రోడీకరించి, విశ్లేషించాలి. గుణాత్మకంగా వచ్చిన మార్పులను సూక్ష్మంగా పట్టుకోవడానికి అప్పుడే అవకాశం ఉంటుంది. స్థానిక వనరులు, ప్రభుత్వం పాత్ర, పెట్టుబడి పాత్ర, స్థానిక నాయకత్వాల పాత్ర, అన్నిటిని మించి ప్రజల చైతన్యం, వారి పాత్ర గ్రామ చరిత్రను అర్థం చేసుకోవడానికి కీలకంగా ఉంటాయి. ఏ గ్రామానికి ఆ గ్రామం ఒక ప్రత్యేకతే అయినప్పటికీ స్థూలంగా వీటికున్న సారూప్యతలను పట్టుకోవడానికి వీలవుతుంది. ప్రతి గ్రామంలోని విద్యావంతులు, ఉపాధ్యాయు లు, సామాజికవేత్తలు గ్రామ అధ్యయనానికి పూనుకుంటే అద్భుతమైన గ్రామ చరిత్రలు వెలుగులోకి వస్తాయి. ఆ చరిత్రలు, మార్పు కోసం, అభివృద్ధి కోసం ఆలోచించేవారికి, భవిష్యత్తు తరాలకు ఉపయోగ పడతాయి.

ఇప్పటి సంక్లిష్ట, సామాజిక సందర్భంలో గ్రామాలను లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. ఒక పక్కన సమాచార హక్కు చట్టాలు ఉన్నాయంటూ ప్రభుత్వం ఊదరగొడుతున్నా ఏ చిన్న సమాచారం తెలుసుకోవడమైనా కష్టంగానే ఉంది. ఇటు ప్రభుత్వ విభాగాలైనా, ప్రజా ప్రతినిధులైనా, గ్రామ వి.ఆర్.ఒ అయినా వాస్తవాలు చెప్పడానికి సిద్ధంగా లేరు. ఏ సమాచారం చెపితే ఏ ప్రమాదం ముంచు కొస్తుందోననే భయం వారిలో కనబడింది. ఒక పక్కన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినా, వేరే గ్రహాలపై పరిశోధనలు జరుగుతున్నా మన దేశంలో భూమి కొలతలే ఇంతవరకు సరిగా రికార్డుకాలేదు. బ్రిటిష్‌కాలంలో రూపొందించిన కైఫియత్తులే తప్ప, 'స్వాతంత్ర్యం' వచ్చిన ఇన్నేళ్లలో మన ప్రభుత్వాలు అటువంటి పరిశోధనకు పూనుకోలేదు. ఏదీ లెక్కకు ఒదగకుండా ఉంచడం, దేని లెక్కలూ తేల్చక పోవడంలో పాలకుల ప్రయోజనాలు, పాలనా సౌలభ్యం ఇమిడి ఉన్నాయి. ఏ లెక్కా తేల్చకుండా ఉండడం సామాజిక వెనుకబాటుకు దానికదే ఒక చిహ్నం. ఈ లెక్కలు తేల్చాల్సిన, సరిచేయాల్సిన బాధ్యత సమాజ మార్పును కోరుకునే, శ్రామికుల విముక్తిని, నిజమైన అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరిపైనా ఉంది.

(ఈ గ్రామ అధ్యయనంలో మా ఈ ప్రయత్నంలో సహాయపడిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేయడం మా బాధ్యత. మొదటగా, గౌరవెల్లి గ్రామంలో మేము వచ్చిన ఉద్దేశం తెలిపి సహాయం కోరగానే మాకు సహకరించిన గ్రామ ప్రజలందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాం. మమ్ములను గ్రామాలకు తీసుకువెళ్లి, గ్రామస్తులను పరిచయం చేసిన డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు కవ్వా లక్ష్మారెడ్డి, ఎంపిటిసి శ్రీనివాస్ గౌడ్, హైస్కూల్ టీచర్, రచయిత తైదల అంజయ్య, మాజీ సర్పంచ్ కందుకూరి కనకయ్య, గ్రామ సుంకరి గడ్డం కిష్టయ్య, గ్రామ నీరటి గడ్డం కనకయ్య, దొడ్ల మల్లారెడ్డి, ఎన్‌ఆర్‌ఇజి ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, ఎలక్ట్రీషియన్ తంగన్‌పల్లి కిషన్, మహిళా పొదుపు సంఘాల సామాజిక కార్యకర్త సుగుణ, రేషన్ డీలర్ సత్తయ్యలకు మా కృతజ్ఞతలు. తాడూరి చిలుకవ్వ, ఆమె భర్త మల్లయ్య, బండి లక్ష్మయ్యలు గ్రామ అధ్యయన క్రమంలో మాకు మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు చేసి సహకరించారు. వారికి మా కృతజ్ఞతలు. హుస్నాబాద్ నుంచి గౌరవెల్లి వెళ్లి రావడానికి ఎప్పుడంటే అప్పుడు తన బండి ఇచ్చి సహకరించిన కొహెడ కొమురయ్య, అమరావతి దంపతులకు కృతజ్ఞతలు.

ఈ పరిశోధన చేయడానికీ, పరిశోధనా పత్రం రాయడానికీ కారకులు, గ్రామ అధ్యయనం చేసే క్రమంలో ఉమ్మడిగా ఆలోచనలు పంచి ఇచ్చిన ఆర్.ఎస్ రావు, డా. ముదునూరి భారతిలకు కృతజ్ఞతలు చెప్పడం చాలా తక్కువే.

ఈ గ్రామాల అధ్యయనం చేసే క్రమంలో వీక్షణం కార్యలయంలో జరిపిన చర్చా గోష్టికి వచ్చి, తమ అమూల్యమైన ఆలోచనలు పంచి ఇచ్చిన వీక్షణం మిత్రులందరికీ మా కృతజ్ఞతలు.

పలుమార్లు గ్రామ అధ్యయనం కోసం మేము వెళ్లే క్రమంలో సహకరించిన కుటుంబ సభ్యులకు మా కృతజ్ఞతలు.

ఈ పరిశోధనకు పునాదిగా ఉపయోగపడిన విప్లవోద్యమ కృషికి, ఆ కృషి చేసిన విప్లవోద్యమ జ్ఞాత, అజ్ఞాత పరిశోధకులందరికీ వినమ్రంగా మా కృతజ్ఞతలు. – రచయితలు)

(రచయితలు కరస్పాండెంట్/సర్క్యులేషన్ మేనేజర్, సహాయ సంపాదకులు)

వీ

ఆదివాసి మహిళల పోరాటాలు-రాజ్యహింస

బ్రిటిష్ కాలం నుండి నేటి దండకారణ్య పోరాటాల దాకా ఆదివాసుల పోరాటాలనూ, అందులో మహిళల వీరోచిత పాత్రనూ వివరిస్తున్నారు **డా. నళిని**

ఆదివాసి మహిళల పోరాటాలను, వాటిని అణచివేసేందుకు చెలరేగిన రాజ్యహింసను అర్థం చేసుకోవాలంటే ఈ పరిణామ క్రమం వెనక ఉన్న శక్తులను ముందుగా అర్థం చేసుకోవలసి ఉంది. అందుకే, ముందుగా, ప్రజలే చరిత్ర నిర్మాతలనే విషయాన్ని మరోసారి గుర్తు చేస్తూ, కార్పొరేట్ వ్యవస్థ వల్ల శిథిలమైపోతున్న మన ఆర్థిక వ్యవస్థని వివరిస్తాను. ఈ విధ్వంసం వల్ల చిన్నాభిన్నమవుతున్న గిరిజన ప్రజాజీవనాన్ని ప్రస్తావిస్తాను. ఈ పర్యావరణ విధ్వంసం ఏ రూపంలో జరుగుతోందో చెప్తూ ప్రాంతాల వారిగా ఈ పేదప్రజలకు చెందిన సారవంతమైన భూములు ఎలా చేతులు మారుతున్నాయో వివరిస్తాను. ఈ నేపథ్యంలో ఆదివాసి మహిళల ప్రతిఘటనని, దాన్ని అణచివేస్తున్న గ్రీన్‌హంట్‌ని ఉదహరిస్తూ, మన కర్తవ్యాలను గుర్తు చేసుకుందాం.

అరవై ఏళ్ల స్వాతంత్ర్యానంతరం కూడ మన దేశంలో వలసవాదం కొత్త రూపాల్లో తాండవిస్తూనే ఉంది. మన సాఫ్ట్‌వేర్ కంపెనీలన్నీ అమెరికా ప్రయోజనాలకి దోహదపడే ఘరానా మేధావుల కూడళ్లు, మన కార్పొరేట్ ఆసుపత్రులు విదేశాలకి విస్తరించడానికి ఉవ్విళ్లూరుతున్నాయి. మన ఫార్మా కంపెనీలన్నీ అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాలకు కావలసిన ముడిపదార్థాలను తయారు చేస్తున్నాయి. మన సరుకులమీద మనకు పేటెంట్స్ నిషిద్ధం. మన పంట పొలాల్లో వ్యాపార పంటలు ఎక్కువై పోయాయి. ఊర పిచ్చుకలు సైతం వలసపోతున్నాయి. మన గనులు మన అవసరాలకు మించి ఉత్పత్తులు చేసి, కార్పొరేట్ సంస్థల ఖజానాలు నింపుతున్నాయి. సంపద మనది, ఫలాన్ని అనుభవించేది వలసవాదులు.

అందుకే ఈ అరవై ఏళ్ల అభివృద్ధి అభివృద్ధే కాదు. పేదలు మరింత పేదలుగా, ధనికులు మరింత ధనికులుగా తయారవుతున్నారు. వీరి మధ్య వ్యత్యాసం పెరిగి పెద్దదవుతుంది.

ప్రజలే చరిత్ర నిర్మాతలు

అయితే, నిజమైన అభివృద్ధి అంటే ఏమిటి? ఉత్పత్తిశక్తుల సంబంధాలు అభివృద్ధి ద్వారానే మానవ సమాజాభివృద్ధి వ్యక్తమవుతుంది. ఉత్పాదక శక్తుల, ఉత్పత్తి సంబంధాల మధ్య వైరుధ్యం; సమాజం. ప్రకృతి మధ్య వైరుధ్యం; సామాజిక పునాది, ఉపరితలం మధ్య వైరుధ్యం – ఇలా ఎన్నో వైరుధ్యాలను పరిష్కరించుకుంటూ సమాజం ముందుకు సాగుతుంది. అదే అభివృద్ధికి మూలం. అలా అని ఈ పరిష్కారం దానంతట అదే జరిగిపోదు. దానికి కొన్ని శక్తులు అవసరం. సామాజిక రాజకీయ చైతన్యం కలిగిన శక్తులే చారిత్రక అభివృద్ధికి చోదక శక్తులు. స్థూలంగా చెప్పాలంటే, ఈ వైరుధ్యాలను పరిష్కరించే దిశగా జరిగే సంఘర్షణలు, పోరాటాలు అన్నీ సామాజిక విప్లవంలో భాగమే.

సామాజిక పరిణామక్రమాన్ని పరిశీలిస్తే, ఒక్కొక్క దశ అంతరించి నూతన దశ ఆవిర్భవించడంలో ప్రజల పాత్ర ఎంతగానో ఉంది. ఆదిమ కమ్యూనిజంలో వేటకి బదులు అప్పుడు వ్యవసాయం చోటు చేసుకోవడంతో నూతన దశకి దారులు తెరుచుకున్నాయి. మిగులుతున్న సంపదకి వారసులు అవసరమయ్యారు. ఆస్తి తలెత్తింది. అలా చేతివృత్తులు, పని విభజన వర్గాలు, బానిస సమాజం, భూస్వామ్య విధానం రూపొందాయి.

అయితే పాశ్చాత్య దేశాల్లో యూరప్ వంటి చోట్ల భూస్వామ్య విధానం నిర్మూలించబడి దాని శిథిలాలపై పెట్టుబడిదారీ విధానం తలెత్తింది. కాని మన దేశంలో పరాయి భాషా, సంస్కృతి దిగుమతి అయినట్టే పెట్టుబడిదారీ విధానం కూడా దిగుమతి అయింది. అందుకే ఇక్కడ రెండురకాల ఆర్థిక విధానాలు పక్కపక్కనే ఉంటాయి.

ఇప్పటికి మన ఆర్థిక విధానాలను అర్థం చేసుకునే ముందు ఆ విధానాలు ఎలా అమల్లోకి వచ్చాయో అర్థం చేసుకోవాలి. 2003-04 నుంచి మన ఆర్థిక విధానం వేగంగా ఎదుగుతోంది. ఉదాహరణకి మన గరిష్ఠ జాతీయ ఉత్పత్తి ఉచ్ఛస్థాయిలో ఉంది. ఈ ఎదుగుదల సేవ రంగాల్లోనే కాక ఉత్పత్తిలో కూడ కనిపిస్తోంది. ఊహించని విధంగా పొదుపు పథకాలు, పెట్టుబడులు వృద్ధి చెందుతున్నాయి. అయితే దీన్ని వెన్నంటే లిబరలైజేషన్, పక్కనే పోషకాహార లోపం ఆవలిస్తున్నాయి. ఉద్యోగవకాశాలు బాగా తగ్గిపోయాయి. నిజ వేతనాలు స్తంభించిపోయాయి. వ్యవసాయంలో ఎదుగుదల పెట్టుబడులు కూడ స్తబ్దుగా ఉన్నాయి. చిన్న రైతుల ఆర్థిక స్థితి అధోగతి పాలై ఆత్మహత్యలకు దారితీస్తోంది. అందుకే పెరుగుదల ఎటుపోతోంది? అభివృద్ధి అంటే ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వీటికి సమాధానం అదనపు విలువలో ఉంది. అదనపు విలువ ఎలా తయారవుతుంది. వివిధ వర్గాల మధ్య దాని పంపిణీ ఏ విధంగా జరుగుతోంది. ఎంత మళ్లీ ఉత్పత్తికి ఉపయోగపడుతోంది, ఎంత పెట్టుబడిదారుల ఖజానాల్లోకి పోతోంది అనేది అర్థమైతేనే మన ఆర్థిక విధానంలోని హెచ్చుతగ్గులు తెలుస్తాయి. అలానే వర్గాల పుట్టుక అదనపు విలువ దోపిడి విధానాలను సామాజిక పరిణామ క్రమంలో వాటి రూపురేఖల్లో మార్పుని విశ్లేషిస్తేనే ఈనాటి రాజకీయ విధానం అర్థమవుతుంది.

ఒక పక్క భూస్వాములు, మరో పక్క చిన్న రైతులతోపాటు చేతివృత్తుల వారుగా మొదలైంది. మన భూస్వామ్య విధానం, న్యాయ వ్యవస్థ రీతి రివాజులు బల ప్రయోగాల పేరుతో అదనపు ఉత్పత్తులన్నీ భూస్వాముల గోదాములకి చేరాయి. భూములన్నీ భూస్వాముల చేతికి చిక్కాయి. భూస్వాములకి, ఉత్పత్తిదారులకి మధ్య వైరుధ్యాలు పెరిగాయి. అయితే కొందరు చిన్న రైతులు కొంత అదనపు ఉత్పత్తులను పోగేసుకోగలిగారు. వీరితోపాటు కొందరు వృత్తి వ్యాపారులు కలసి మధ్యతరగతి రైతులుగా రూపొందారు. నిరుపేద రైతులకు, మధ్య రైతులకు, భూస్వాములకు విభజన పెరిగింది. శ్రమ కూలీకి (వేజ్ లేబర్) ప్రాతిపదిక ఏర్పడింది.

కార్పొరేట్ వ్యవస్థ

ఈ నేపథ్యంలో క్రమంగా వ్యాపార పంటలు, నూతన వ్యవసాయ విధానంతో వ్యవసాయోత్పత్తి పెరిగి, భూమిపై ఆధారపడిన పెట్టుబడి దారులు తలెత్తారు. ఈ క్రమంలో వ్యవసాయం నుంచి దూరమైన రోజువారి కూలీలు పరిశ్రమల్ని ఆశ్రయించారు. చిన్న పరిశ్రమల నుంచి తరిమేస్తే పెద్ద పరిశ్రమల్ని ఆశ్రయించారు. అక్కడ చుక్కెదురయితే తిరిగి పల్లెలకి చేరుకున్నారు. లేదా స్వయం ప్రతిపత్తిపై చిన్నచిన్న వ్యాపారాలు చేసుకున్నారు. మరోవైపు చిన్న పరిశ్రమలు పెద్ద పరిశ్రమల కోరల్లో చిక్కుకున్నాయి. కార్పొరేట్ వ్యవస్థ నెలకొంది. ఈ కార్పొరేట్లు నేడు ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్ని రంగాలను శాసిస్తున్నాయి. దేశాన్ని ప్రైవేటీకరణ వైపు నెట్టివేస్తున్నాయి. దేశ, విదేశాల్లోని బడా పెట్టుబడిదారులకు దేశాన్ని అమ్మేస్తున్నాయి. ఈ దోపిడీని మసిపూసి మారేడుకాయ చేస్తూ తమ వల్లనే మన సమాజం బాగుపడుతోందని టముకు వేయదానికి ముద్దుపేరు అభివృద్ధి, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పి.పి.పి.), కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) వగైరా వగైరా. ఉదా, మన రైల్వే వ్యవస్థ. ఇది ప్రజల కోసం నెలకొనలేదు. బ్రిటిషువారు తమ పాలనను సుస్థిరం చేసుకోవడానికి, మన వనరులను దోచుకోవడానికి దీన్ని వాడుకున్నారు. దాన్ని 'కక్షతో రక్తపుటేరులు పారించే వ్యవస్థ (బ్లీడింగ్ ప్రాసెస్ విత్ ఎ వెన్‌జెన్స్)'గా మార్క్స్ వర్ణించారు. దాన్ని అణిచివేతకు ఒక సాధనంగా వాడుకున్నారని లెనిన్ కూడ అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం మన అభివృద్ధి ఒక క్రమంలోగాని, సమానంగా కాని జరగడంలేదు. కొన్ని చోట్ల అభివృద్ధి కుంటుపడితే కొన్ని చోట్ల ఎక్కువగా ఉంటుంది. మన దేశానికి ఉపయోగపడే ఉత్పత్తులు కాక సామ్రాజ్యవాదుల అవసరాలను తీర్చే ఉత్పత్తులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దానిలో మన బూర్జువాజీ పాత్ర ఉంది. బహుళజాతి సంస్థల ప్రేరణ ఉంది. మన ప్రజల అవసరాలు కాక, బహుళజాతి సంస్థల ప్రయోజనాలు మన రాజకీయ ఆర్థిక విధానాలను నడిపిసున్నాయి. మనం వరి పండించాలో, పత్తి పండించాలో అనేది వాళ్లు నిర్దేశిస్తారు. మన వనరులని, ప్రకృతి విరుద్ధంగా ఒకేసారి దోచుకోవాలో, పర్యవరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి వైపు అదుగులు వేయాలో వాళ్లు నిర్ణయిస్తారు. ఈ లిబరలైజేషన్ కార్పొరేట్ సెక్టర్ పెత్తనం ప్రపంచీకరణ పేరుతో జరుగుతున్న పరాయీకరణ కారణంగా అభివృద్ధిలో హెచ్చుతగ్గులు పెచ్చు మీరుతున్నాయి. పేద ధనిక వ్యత్యాసం తీవ్రమవుతోంది. సమాజం అల్లకల్లోలమవుతోంది. అసమానత రాజ్యమేలుతోంది. బ్రిటిష్ పాలనలో మన దేశ స్థితిగతులపై ఆనాడు మార్క్స్ చెప్పింది మనకు ఇప్పటికీ ఎలా వర్తిస్తుందో చూడండి.

ఈ సాంప్రదాయానుగతమైన భారత ఆర్థిక వ్యవస్థను బ్రిటిష్ పాలన రూపంలో వచ్చిన విదేశీ పెట్టుబడిదారీ విధానం నిర్మూలించింది. ఈ విషయంలోనే అంతకు ముందువచ్చిన దండయాత్రికులకు బ్రిటిష్ అక్రమణకు బేధముంది.

పూర్వం విదేశీ దండయాత్రికులు వచ్చిన వారు ఈ ఆర్థిక పునాదిని కదిలించకుండా ఆ వ్యవస్థలోనే ఇమిడిపోయారు. బ్రిటిషువారు మాత్రం ఆ పునాదిని పెకిలించి విదేశీ సేనగానే బయట నుంచి పాలిస్తూ ధనాన్ని పీల్చివేయసాగారు. యూరపులోని ధనికతత్వ విజయానికి భిన్నమైన విజయాన్ని భారతదేశంలో విదేశీ పెట్టుబడిదారీ విధానం సాధించింది. యూరప్‌లో లాగ విధ్వంసక కార్యక్రమాలతో పాటు నూతన శక్తులను భారతదేశంలో సృజించలేదు. ఇందులో భారత ప్రజలు బ్రిటిష్ రాజ్యంలో అనుభవించిన 'ప్రత్యేక విషాదగాథ' నిబిడితమయింది. భారతీయులు తమ పాత ప్రపంచాన్ని పోగొట్టుకున్నారు. కాని కొత్త ప్రపంచం మాత్రం రాలేదు.

హిందుదేశంలో ఎన్ని అంతర్యుద్ధాలు, దండయాత్రలు, తిరుగుబాట్లు, అక్రమాలు, కరువు కాటకాలు ఎంత క్లిష్ట రూపంలో, ఎంత విధ్వంసక రూపంలో కనిపించినప్పటికీ అవన్ని సమాజంపై పోరును దాటిపోలేదు. కాని ఇంగ్లండు మొత్తం భారత సమాజ వ్యవస్థనే శిథిలంచేసేసింది. ఇప్పటికీ కూడా పునర్నిర్మాణ సూచనలేవి కనిపించడం లేదు. ఇలా భారతీయుడు పాత ప్రపంచాన్ని కోల్పోయి కొత్త ప్రపంచాన్ని సాధించ లేకపోవడం నేటి దుస్థితిలో ఒక ప్రత్యేక విషాద పరిస్థితిని వెల్లడిస్తోంది. ఇందువల్లనే అనుసూత్రంగా వచ్చిన ప్రాచీన సాంప్రదాయాల నుండి భారతదేశ గత చరిత్ర నుండి నేటి బ్రిటిష్ పాలిత భారతదేశం పూర్తిగా వేరు పడిపోయింది.

చిన్నాభిన్నమవుతున్న గిరిజన ప్రజాజీవం

ఆనాటి భారతదేశానికి ఈనాటి భారతదేశం ఏమాత్రం తీసిపోదు. మన దేశంలో బీహర్, చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, ఒడిశాలు అతిగా వెనకబడిన రాష్ట్రాలని చెప్పవచ్చు. దేశానికి గుండెకాయగా చెప్పుకునే మధ్య భారతం మన రాష్ట్ర సరిహద్దుల్లోనే ఉంది. ఈశాన్యం నుంచి మొదలుపెట్టి మధ్య భారతం నుండి కిందికి దిగివస్తే దక్షిణాదికి తూర్పున బంగాళాఖాతం అంచుల దాక, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, చత్తీస్‌గడ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గడ్చిరోలి తదితర ప్రాంతాల దాకా దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి. దీన్నే దండకారణ్యం అంటారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్, ఖమ్మం, తూర్పుగోదావరి, విశాఖపట్నం ప్రాంతాలు మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రపూర్, భాంద్రా జిల్లాలు, మధ్యప్రదేశ్‌లోని బస్తర్, మాండ్లా, రాజ్‌నందగాంవ్, బాలాఘాట్ జిల్లాలు ఒడిశాలోని మల్కన్‌గిరి (పాత కోరాపుట్) ప్రాంతం ఈ దండకారణ్యంలో భాగం. ఒకపక్క తూర్పు కనుమలు, రెండోపక్క అబూజ్‌మాడ్, రాఖేల్ పర్వతశ్రేణులు, సుర్జాఘర్, టిప్రాఘర్, ఖానాపూర్, నిర్మల్ తదితర ఎత్తైన ప్రాంతాలు దీని సరిహద్దులు.

వాగులు, వంకలు, ఉపనదులు, పాయలు అన్నీ కలసి ప్రచండ గోదావరిగా ప్రవహిస్తుంటే దాని పాయలైన ఇంద్రావతి, ప్రాణహిత, శబరి, సీలేరు – ఈ ప్రాంతాల కథలను దిగువ ప్రాంతాలకు వినిపిస్తాయి. దండకారణ్యంలోంచి ప్రవహించే పెన్‌గంగా, వైన్‌గంగా, పాముల గౌతమి, పరాల్‌కోట, బాగ్ తదితర ఉపనదులు, అడవులు, కొండలు, కొండవాలులు, అన్నీ కలసి దండకారణ్యంలో విలువైన వనరులను ప్రోది చేశాయి. రకరకాల పూలు, పళ్లు, వాటి వెంట నెమళ్లు, దుప్పలు, గొర్రెలు, పులులు, ఎలుగుబంట్లు, టేకుచెట్లు, మామిడిచెట్లు, వెదురు, రోజ్‌వుడ్, తునికాకు – వాటి మధ్య తరతరాల నాటి తెగలు, వారి జీవన విధానం . బొగ్గు, ఇనుము, రాగి బాక్సైట్ నిల్వలకు కొదవేలేదు. కొన్ని చోట్ల విలువైన రాళ్లు కూడా ఉన్నాయి.

సీలేరు, రామగుండం, చంద్రాపూర్, కొత్తగూడెం వంటి చోట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతుంది. కానీ అక్కడి గిరిజన ప్రజలకు అది అందదు, అక్కడి వెదురు నుంచి తయారైన కాగితం వారి చరిత్రని రాయదు. అక్కడి బొగ్గు వారి పొయ్యిలను మండించదు. అక్కడి ఇనుప ఖనిజం సముద్రాలు దాటి జపాన్, రష్యాలను కూడా చేరుతుంది. అక్కడి కాఫీ, జిగురు, జీడిపప్పు, పనస, బీన్స్, బార్లీ, పొగాకు కార్పొరేట్ సంస్థల బొక్కసాలకు చేరతాయి. 'అభయారణ్యం' పేరుతో వన్యప్రాణుల రక్షణార్థం కన్జార్వుల వంటి వాటిని ఏర్పరచి అక్కడి ఆదివాసులను తరిమేస్తున్నారు. తమ పొలాలకు నీరు అందకపోగ అనేక నదుల మీద కట్టిన చిన్నా పెద్దా ఇరిగేషన్ ప్రాజెక్టుల వల్ల అక్కడి గ్రామస్తులు నిర్వాసితులవుతున్నారు. చివరికి అక్కడి బాక్సైట్ గనుల నుంచి తయారైన అల్యూమినియం ఆ ప్రజల మీదకి ఎక్కుపెట్టే బాంబులు, ఆయుధాల తయారీకి ఉపయోగపడుతోంది.

అడవి మీద, అటవీ సంపద మీద ఆధారపడి ప్రకృతిలో భాగంగా బతుకుతున్న అనేక గిరిజన తెగల ప్రజల జీవనం ఇప్పుడు చిన్నాభిన్నమైపోతోంది. బ్రిటిష్ కాలం నుంచి వీరి మీద దౌర్జన్యాలు ఆరంభమైనా, ఇటీవల కార్పొరేట్ సంస్థలు ధనార్జన కోసం పెద్ద ఎత్తున చేస్తున్న విధ్వంసం వల్ల ఈ ప్రాంతం అందరి దృష్టిలో పడింది. సెజ్‌ల పేరుతో, చాటు మాటు ఒప్పందాల పేరుతో లక్షల ఎకరాల భూములు కాజేస్తున్నారు.

స్వాతంత్ర్యం వచ్చాక ఈనాటి వరకు వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో దాదాపు రెండున్నర కోట్ల మంది నిర్వాసితులైతే, అందులో తొంభై లక్షల మంది ఆదివాసులే. వారిలో నాలుగో వంతు ప్రజలకైనా ప్రత్యామ్నాయ జీవనం దొరకలేదు.

బ్రిటిష్ పాలనలో ఆదివాసుల హక్కులు ఒకటొకటిగా హరించిపోయి తమ ప్రాంతంలో తామే పరాయివారుగా బతికే పరిస్థితి ఏర్పడింది. తరతరాలుగా తమదైన అటవీ సంపదపై పెట్టుబడిదారుల పెత్తనం రాజ్యమేలింది. శిస్తులు, జరిమానాలు, నిర్బంధాల పేరుతో జరుగుతున్న దోపిడి అణచివేతలను నిరసిస్తూ కొమురం భీం, బిర్సా ముండా, అల్లూరి సీతారామరాజు తదితరుల నాయకత్వం కింద అనేక పోరాటాలు జరిగాయి. 1825 లో దండకారణ్యంలో పరాల్‌కోట తిరుగుబాటులో 1910 లో భూంకాల్ పోరాటంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 1961 లో లోహండి గుడ్‌లో నల్ల దొరల వ్యతిరేక పోరాటం జరిగింది.

ఇప్పుడు కార్పొరేట్ కంపెనీలు, ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ తదితర అంతర్జాతీయ శక్తులు ప్రోద్బలంతో మరోసారి మన అటవీ ప్రాంతంపై దాడి జరుగుతోంది.

నిజానికి మన ప్రకృతి వనరులను పరిరక్షించుకుంటూ, జీవనాన్ని దెబ్బతీయకుండా వనరులను క్రమక్రమంగా వాడుకోవాలి. ఏ ప్రాజెక్టు నెలకొల్పినా అక్కడి ప్రజల మనో వాంఛలను పూర్తిగా తెలుసుకుని, వారి సంపూర్ణాంగీకారం తోటే పని ప్రారంభించాలి. అలానే, ప్రైవేటు సంస్థలకు అనుమతి ఇచ్చినపుడు వారివద్ద పెద్ద మొత్తంలో రాయల్టీ తీసుకుని, నిర్వాసితులవుతున్న ప్రజలకు ఆ సొమ్మును పంచి, వారి ఉపాధికి దోహదపడాలి. ఇవేమీ జరగకపోగా, ప్రకృతి వనరులమీద ఆధారపడి బతికే ప్రజలు తమ జీవనాధారాన్ని భారీగా కోల్పోతున్నారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసంలో కల్పించే ఉపాధి కంటే కోల్పోయే ఉపాధే ఎక్కువగా ఉంటోంది.

మనిషికి, ప్రకృతికి మధ్య ఉండే సమతుల్యాన్ని ఈ అభివృద్ధి నాశనం చేస్తోంది. మానవ మనుగడకు పునాది అయిన జీవావరణమూ ధ్వంస మవుతోంది. కార్పొరేట్ లాభార్జన దాహమే ఏకైక నిర్ణాయక శక్తి అయింది. అదే పాలకతత్వం అయింది. భూసేకరణ చట్టం, పునరావాస బిల్లులు ఈ దోపిడీకి తోడ్పడేవిగానే ఉన్నాయి. 1/70 ఆదివాసి భూమి బదలాయింపు చట్టం అడవిని ప్రభుత్వ భూమిగా మార్చి, అడవిపై ఆదివాసిల జన్మహక్కును తొలగించింది. అలా, ప్రతి కొండ ప్రాంతం మీద, ప్రతి నది మీద, ప్రతీ అటవీ స్థలం మీద పరస్పర అవగాహనా ఒప్పందాలు (ఎం.వో.యులు) కుదిరిపోయాయి.

పర్యావరణ విధ్వంసం

బాక్సైట్ గనుల తవ్వకంవల్ల ఆ ప్రాంతంలో పర్యావరణం కలుషితమై పోవడమేకాక, నీటి వనరులు కూడా దెబ్బతింటాయి. ఉదాహరణకి, మన రాష్ట్రంలో 60 వేల 293 చదరపు కిలోమీటర్లు వ్యాపించి ఉన్న విశాఖ అటవీ ప్రాంతంలో దాదాపు 1000 మిలియన్ టన్నుల బాక్సైట్ నిక్షేపాలున్నాయి. అవి 900 నుండి 1400 మీటర్ల ఎత్తులో కొండలపై భాగాన ఉన్నాయి. వాటి మందం కొన్ని చోట్ల తక్కువగా, కొన్ని చోట్ల 54 మీటర్ల వరకు ఉంటుంది. భారీ వానల తర్వాత పొడి వాతావరణం ఏర్పడే కారణంగా అక్కడ ఇవి పొరలు పొరలుగా ఏర్పడతాయి. అందుకని వాటిని వెలికి తీయాలంటే కొండల పై భాగాన ఉన్న మట్టిని, వృక్ష సంపదను శాశ్వతంగా తొలగించి, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పద్ధతినే చేపట్టవలసి ఉంటుంది. అయితే, బాక్సైట్ నిల్వలున్న కొండలకు తడిని నిలుపుకునే సామర్థ్యం చాలా ఉంటుంది. అక్కడ నిలిచిన నీళ్లు వివిధ నదుల, వాగుల ప్రవాహంలో భాగమవుతాయి. అవి జలాశయాలను నింపుతాయి. కాని ఈ తవ్వకాల వల్ల ఈ ప్రక్రియ మొత్తం దెబ్బతింటుంది. జలాశయాలు ఎండిపోయే ప్రమాదం ఉంది. అలా అరకు, చింతపల్లి, గుర్తేడులలో బాక్సైట్ తవ్వకాల వల్ల విశాఖ నోరు తడిపే తాటిపూడి జలాశయం, రైవాడ, సీలేరు జలాశయాలు ప్రభావితమవుతాయి. అలా కొద్ది మంది బడా పెట్టుబడిదార్ల ధనార్జన లక్షలాది సామాన్య ప్రజల నీటి అవసరాన్ని శాశ్వతంగా దెబ్బతీస్తుంది.

మరొక విషయం – ఈ ఖనిజం వెలికితీతలో భాగంగా ఆ చుట్టుపక్కల నేల, నీరు కలుషితమైపోయి, జీవనం దుస్సాధ్యమైపోతుంది. అల్యూమినియం తయారీ ప్రక్రియ విషాన్ని వెదజల్లుతుంది. టన్ను అల్యూమినియం తయారీలో 5 టన్నుల బాక్సైట్, 1.3 టన్నుల బొగ్గు, 0.6 టన్నుల కార్బన్, 5 టన్నుల ఇంధనం, 0.25 టన్నుల కాస్టిక్ సోడా, 2 టన్నుల ఫ్లోరైడ్ ద్రావకాన్ని వాడతారు. అప్పుడు ఒక టన్ను అల్యూమినియం 6.95 టన్నుల వ్యర్థాలను వదులుతుంది. బాక్సైట్ నుంచి నాలుగు టన్నుల రెడ్‌మడ్ వస్తుంది. రిఫైనరీల వద్ద ఈ ఎర్రటి ఇనుప ఖనిజ వ్యర్థాన్ని గుంటల్లోకి పంపాలి. ఈ వ్యర్థం ఆ గుంటలు దాటి బయటికి పొర్లకూడదు. చుట్టుపక్కల నేలలోకి ఇంకకూడదు. అందుకోసం ఈ గుంటలకి లైనింగ్ పొరలు ఉండాలి. నీరు పొంగి పొర్లకుండా ఎత్తయిన గోడలు ఉండాలి. అంతేకాక, సూక్ష్మ పరిమాణంలో ఉండే అతిసాంద్ర లోహాలు గాలిలోకి ఎగురకుండా ఎప్పటికప్పుడు నీళ్లు చల్లాలి. కాని ఉదాహరణకి చత్తీస్‌గడ్‌లో బాల్కో ప్రాజెక్టు దగ్గర చూస్తే ఈ జాగ్రత్తలేమీ కనిపించవు. చిన్న వర్షానికే ఆ ఎర్ర నీళ్లు పొంగి దిగువనున్న చెలమల్లో కలసిపోతాయి. ఈ ప్రమాదం గురించి తెలియక మట్టిలో ఆడుకునే పిల్లలు, చెలమల్లో బట్టలు ఉతికే స్త్రీలు మనల్ని బయపెడతారు. ఇది కాక, స్మెల్టరు నుంచి ఫ్లోరైడ్ కలసిన పాట్‌లైనింగ్ అనే ప్రమాదకరమైన వ్యర్థం కూడా వెలువడుతుంది. అలా, బాక్సైట్ గనుల వల్ల తక్షణం జరిగే పర్యావరణ నష్టమే కాక, దీర్ఘకాల పర్యావరణ విధ్వంసం కూడా తీవ్రంగా ఉంటుంది.

మరొక విషయం – మన ముడి ఇనుము పెర్మటైట్ నిల్వలు 1200 కోట్ల టన్నులు ఉన్నాయి. ఇవి మనకి 30 సంవత్సరాల వరకు సరిపోతాయి. నాణ్యత తక్కువ గల మాగ్నటైట్ 1100 కోట్ల టన్నులు ఉన్నాయి. దీని మీద రాయల్టీ తగ్గిస్తే మన జాతీయ ఉక్కు తయారీదారులు దీన్ని ఎక్కువగా వాడితే, మన నిలువల జీవిత కాలం పెరుగుతుంది. అయితే తలసరి 50 టన్నుల ఇనుప ఖనిజ నిల్వలు గల అమెరికా ముందు చూపుతో తన ముడి ఇనుము ఎగుమతులను నిషేధించింది. తలసరి 21 టన్నులు ఉన్న మన దేశం మాత్రం ధారాళంగా ఎగుమతులు చేస్తోంది. ఇటీవల అవి 20 శాతం పెరిగాయి.

(ఇంకా ఉంది)

(రచయిత పిల్లల వైద్య నిపుణులు) వీ

జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం - ఒక సమీక్ష

***స్థానికంగా ఉన్న జ్ఞానాన్ని, పరిష్కారాలను పరిగణనలోకి తీసుకోకుండా గ్రామీణ ఆరోగ్య సమస్యలకు గ్లోబల్ పరిష్కారాలను రుద్దుతున్న ప్రభుత్వ తలకిందుల ఆరోగ్య విధానాన్ని వివరిస్తున్నారు* ముదునూరి భారతి**

జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ - ఎన్ఆర్ఎచ్ఎం) ద్వారా ప్రతిపాదించిన మార్పులు

మన దేశంలో ప్రస్తుతం అమలు జరుగుతున్న ఆర్థిక సంస్కరణలు సఫలం కావాలంటే పారిశ్రామికీకరణ క్రమం మీద కేంద్రీకరించడంతో పాటు, దీనికి అవసరమైన మానవ వనరులు కూడా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దీనికనుగుణంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో, గతంలో అమలులో ఉన్న పేదరిక నిర్మూలన కార్యక్రమాలలో మార్పులు అమలులో పెట్టింది. సంస్కరణలలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపొందించడం ద్వారా శ్రమ చేయగలిగిన అందరికీ తప్పనిసరిగా వంద రోజుల ఉపాధిని కల్పించడం, రోజుకి రు. 135 వరకు కూలీ, స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేసి వడ్డీ లేని రుణాలు లాంటి సదుపాయాలు సమకూర్చడం, దారిద్ర్య రేఖ దిగువన ఉండే కుటుంబాలకు తెల్లకార్డులు, దాని ద్వారా అతి తక్కువ ధరకు ముప్పై కేజీల బియ్యంతో పాటు, మిగతా కొన్ని అత్యవసర సరుకులు అందించడం లాంటి పథకాలు అమలులోకి వచ్చాయి. వీటికి తోడుగా విద్య, ఆరోగ్యం అనే రంగాలకు సంబంధించిన విధానాలలో కూడా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యారంగంలో ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా హక్కు ప్రతిపాదించారు. విద్యా హక్కు అనే విధానం ద్వారా దేశంలో ఐదు సంవత్సరాలు మించిన బాల బాలికలందరూ తప్పనిసరిగా బడికి వెళ్లాలనీ, ప్రతి ప్రైవేట్ పాఠశాలలో కూడా నాలుగవ వంతు కోటా బీద పిల్లలకు కేటాయించాలనీ నిర్దేశించారు. ప్రతి రాష్ట్రం దీన్ని అమలు చేసే క్రమంలో బడిలో మౌలిక సదుపాయాలైన భవనాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న ఉచిత భోజనం, ఉచిత యూనిఫారాలు, పుస్తకాలు, సైకిళ్లు పంచడం లాంటివి ఎన్నో అమలు చేస్తున్నారు. అంతే కాకుండా పంచాయితీ పరిధిలో శిక్షితులైన విద్యా వాలంటీర్లను తయారు చేసి వీరి సహాయంతో అందరికీ విద్యని అందించే కార్యక్రమాన్ని రూపొందించారు.

ఈ సంస్కరణలలో భాగంగానే 2005లో జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం (ఎన్ఆర్ఎచ్ఎం) అనే పథకాన్ని ప్రధానమంత్రి ఆవిష్కరించారు. గతంలో జరిగిన పొరపాట్లను - సిబ్బంది కొరత, అత్యవసర మందుల కొరత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చికిత్సకి అయ్యే ఖర్చు ప్రజలకు భారంగా ఉండడం, నిపుణులైన డాక్టర్లు లేకపోవడం, మిగతా మౌలిక సదుపాయాల కొరత లాంటివి - సవరించుకొని గ్రామీణ ప్రజలకు, అందులో ముఖ్యంగా ఆర్థికాభివృద్ధి క్రమంలో సమాజపు అంచులలోకి తోసి వేయబడుతున్న ప్రజలు, ఆడవాళ్లు, పిల్లలు అందరికీ సమర్థవంతమైన, నైపుణ్యతతో కూడిన మెరుగైన ఆరోగ్య సేవలు, వారు భరించగలిగే సేవలు - అందించగలిగే విధంగా దీనిని రూపొందించారు. హెల్త్ మిషన్ ప్రతిపాదించిన మార్పులను మూడు విభాగాలలో మార్పుల ద్వారా గుర్తించవచ్చును.

1) వైద్య సేవలు అందించగలిగిన మానవ వనరుల (వైద్య పరివారం) సంఖ్యలో పెరుగుదలకి సంబంధించిన మార్పులు

వైద్య సేవలు అందించగలిగిన డాక్టర్లు, నర్సులు, ఎఎన్ఎంలు, పారా మెడికోలు వంటి వారి సంఖ్య గణనీయంగా పెంచాలి. ఇప్పటి వరకు 1,50,000గా ఉన్న వీరి సంఖ్యను ఈ మిషన్ ద్వారా అదనంగా (మెడికల్ ఆఫీసర్లు - 8,722; స్పెషలిస్టులు - 2,914; ఆయుష్ డాక్టర్లు - 10,995; మేనేజ్‌మెంట్ స్టాఫ్ - 13,000; నర్సులు - 33,411; పారా మెడిక్స్ - 14,529; ఎఎన్ఎంలు - 69,660; 'ఆశా' (అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ ఆక్టివిస్ట్) - 8,61,548) పెంచే ప్రతిపాదనలు చేశారు. అవి కాక వారి నైపుణ్యాన్ని పెంచే విధంగా నర్సింగ్, మెడికల్ కళాకారులను బహుముఖంగా పెంచేశారు.

2) వైద్య సదుపాయాలు మెరుగుపరిచే మార్పులు

ఉచితంగా మందులు, ఉచిత పరీక్షలు లాంటి సదుపాయాలతో పాటు, రెఫరల్ సిస్టమ్స్‌తో ఉండే వివిధ అంగాల మధ్య సరియైన అనుసంధానంతోపాటు - గ్రామాలలో ఉన్న రెఫరల్ సిస్టమ్స్‌లో 2329ని ఎంచుకొని కొత్త ఆధునిక సదుపాయాలు కల్పించడం.

- అవసరమైన పరికరాలు, రోగులకు సాధారణ పరీక్షలు చేయగలిగిన ప్రయోగశాలలు ఏర్పాటు చేయడం.

- 24 గంటలు పని చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు.

- ప్రసవానికి, పుట్టిన బిడ్డకు అవసరమయ్యే సదుపాయాలు, వైద్య సహాయం.

- అంబులెన్స్ సదుపాయం, మొబైల్ మెడికల్ యూనిట్ల ఏర్పాటు.

- ఆస్పత్రులకు అవసరమైన 20,251 కొత్త భవనాల నిర్మాణం, 18,863 భవనాలకు మరమ్మత్తులు.

3) సంస్థాగత మార్పులు

కమ్యూనిటీ ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్య సేవల వికేంద్రీకరణ. ఆషా వర్కర్లు కమ్యూనిటీ అజమాయిషీలో ఆరోగ్య సేవలు అందించే ఏర్పాటు.

కమ్యూనిటీని స్థానిక ప్రజలలో 8వ తరగతి చదివిన వారిని ఎంచుకొని, ప్రభుత్వం వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి గ్రామంలో 'ఆశా'లుగా నియమిస్తుంది. ప్రజలకు 24 గంటలు సేవలు అందించడం, సాధారణ రోగాలకు చికిత్స చేయడం, నయం కాని రోగులను రెఫరల్ సిస్టం ద్వారా పై స్థాయి కేంద్రానికి పంపడం, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించిన టిబి, మలేరియా, పోలియో లాంటి వాటికి మందులు పంచడం, జననీ, శిశు సురక్షా కార్యక్రమాలు చేయడం, ఆస్పత్రులలో కాన్పులకు ప్రోత్సాహమివ్వడం లాంటి కార్యక్రమాలలో కమ్యూనిటీ ఆరోగ్యానికి ఈ ఆశా కార్యకర్త బాధ్యులుగా ఉంటుంది.

ఈ మార్పులన్నింటి అమలుకి కావలసిన ధన సహాయం కోసం కేంద్ర ప్రభుత్వం తన వంతుని రెట్టింపు చేసి జాతీయాదాయంలో 3 శాతం కేటాయించింది. కొసమెరుపుగా ఇన్స్యూరెన్స్, ప్రైవేట్ డాక్టర్లను భాగస్వాముల్ని చేసింది. వీరు పోటీదారులుగా కాకుండా కలిసి పని చేసే భాగస్తులు అని కూడా సూచించింది.

4) ఈ మార్పులన్నింటి ప్రభావంతో గ్రామీణ ప్రజలకు తాము కోరుకునే అంతరాలు లేని సమర్థవంతమైన, భరించగలిగిన ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయనీ, వారు డాక్టరు దగ్గరికి వచ్చి, చికిత్స పొందుతారనీ, ఆరోగ్యవంతులౌతారనీ ఈ కొత్త పాలసీ అభిప్రాయం. ఈ మార్పుల వలన ప్రజల ఆరోగ్యం బాగుపడడమే కాకుండా, చికిత్సకి అయ్యే ఖర్చు భారం తగ్గి వారికి ఉపశమనం కలుగుతుందనీ, అదనంగా దీని వలన మిలియన్ల సంఖ్యలో ఉద్యోగావకాశాలు వస్తాయనీ, ఉత్పాదకత పెరుగుతుందనీ, సమానత్వం సాధ్యమవుతుందనీ నిపుణుల అభిప్రాయం.

ఈ మిషన్‌ని ఆచరణలో పెట్టే క్రమంలో మరికొన్ని కొత్త పథకాలు రూపొందాయి. ఇప్పటి వరకు గ్రామాలలో ప్రభుత్వ ఆరోగ్య సేవలు ఉపయోగించుకునే వారు 22 శాతం మాత్రమేనని, దానిని వచ్చే ఐదు సంవత్సరాలలో 52 శాతానికి తేవాలనే ఉద్దేశంతో కేంద్రం 'రియల్ గేమ్ చేంజర్స్' అనే పేరుతో నూతన పథకం తయారు చేసింది. ఉచిత మందులు, అవి కూడా జెనెరిక్ మందులు మాత్రమే, ఉచిత వైద్యం ఇవ్వాలనే ప్రతిపాదన పెట్టారు. దీనికి ఇప్పటికే రు. 100 కోట్లు కేటాయించబడ్డాయి. 12వ ప్లాన్‌లో రు. 28,560 కోట్లు అదనంగా కోరే ఆలోచన కూడా ఉంది. ఇంక మన రాష్ట్ర ప్రభుత్వం 'అమ్మ కొంగు' అనే పథకం ద్వారా మాతా శిశు మరణాల రేటు తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఎన్ఆర్ఎచ్ఎం, యునిసెఫ్, జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ భాగస్వాములుగా ఉన్నాయి.

ప్రజలందరికీ అవసరమైన వైద్య సేవలు అందించే కార్యక్రమంలో గతంలో వచ్చిన అడ్డంకులనుకున్న వాటిని తొలగించి, అవసరమైన కొన్ని కొత్త అంశాలను జోడించి తయారు చేయబడిన ఈ మిషన్ ఎంత వరకు గ్రామీణ ఆరోగ్య సమస్యలను పరిష్కరించగలదు అనే ప్రశ్నకి జవాబు గతంలో మేం చేసిన మైచర్లపాలెం మెడికల్ సర్వే ద్వారా చూద్దాం.

ఈ జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ గ్రామీణ పేద ప్రజలందరికీ వైద్య సదుపాయం కలిగించాలనే లక్ష్యంతో రూపొందిన కేంద్ర ప్రభుత్వ పథకం. ఈ లక్ష్యం చేరుకోవాలంటే వైద్య పరిజ్ఞానం ఉన్న 'డాక్టర్లు' అవసరం ఎంతైనా ఉంటుంది. వీరు తాము నేర్చుకున్న జ్ఞానం ఆధారంగా రోగి వెలుబుచ్చిన లక్షణాలను బట్టి, రోగ నిర్ధారణ చేసి చికిత్స అందిస్తారు. అందుచేత ఇప్పటికే ప్రపంచంలో క్రోడీకరింపబడిన వైద్య విజ్ఞానం (అంటే రోగం చికిత్సా పద్ధతులు స్పష్టంగా తెలిపే సమాచారం) ఒక పార్శ్వమైతే, ఇంకా చికిత్స తెలియని రోగాలకు సమాధానం వెతికే ప్రయత్నంలో ఈ జ్ఞానం వృద్ధి పొందే క్రమం మరొక పార్శ్వమవుతుంది. అందుచేత ఇక్కడ రెండు ప్రశ్నలు ముందుకు వస్తాయి. మొదటిది, మెడికల్ జ్ఞానం వృద్ధి గురించి, రెండవది ఈ జ్ఞానం ప్రజలకి అందుబాటులోకి వచ్చే క్రమం గురించీ, అంటే, మొదటిది మెడికల్ జ్ఞానం వేరు వేరు స్థాయిలలో పోగు పడుతున్న నేపథ్యంలో, వాటి మధ్యన ఉండవలసిన సంబంధాలు, రెఫరల్ వ్యవస్థ లక్షణాలు ఏమిటి? రెండవది, ఈ జ్ఞానం ఆచరణలో పెట్టే ఒక 'డాక్టర్'కి, చికిత్స కావలసిన పేషెంట్‌కి మధ్య సంబంధాలు ఎలా ఉండాలి? రోగ లక్షణాలు అర్థవంతంగా వెల్లడి అవడం ఎప్పుడు జరుగుతుంది?

ముందుగా రెఫరల్ వ్యవస్థ లక్షణాలను చూద్దాం.

మెడికల్ జ్ఞానం, రెఫరల్ వ్యవస్థ – ఒక అవగాహన

ఆరోగ్య పరిరక్షణకి కావలసిన మెడికల్ జ్ఞానం ఒక అనారోగ్య స్థితిని గుర్తించే నైపుణ్యమూ, చికిత్స చేయగల సమర్థత సమాజంలో వేరు వేరు స్థాయిలలో ఉన్నందువలన వైద్య సేవలలో రెఫరల్ వ్యవస్థ ఒక ముఖ్యభాగంగా ఉంటుంది. ప్రతి స్థాయిలోను అక్కడ అందుబాటులో ఉండే జ్ఞానాన్ని బట్టి ఆ స్థాయిలో అనారోగ్యానికి చికిత్స చేయబడుతుంది. స్థాయి పెరిగిన కొద్దీ జటిలమైన జబ్బులకు చికిత్స చేయగల సామర్థ్యం పెరుగుతుంది. కిందిస్థాయిలో చికిత్స ద్వారా నయం కాని జటిలమైన జబ్బులను పైస్థాయిలోని ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేస్తారు.

ప్రతిస్థాయిలోనూ ఉండే జ్ఞానాన్ని బట్టి ఒక ఆరోగ్యవంతమైన మనిషికి ఉండవలసిన ప్రామాణిక లక్షణాలు – (స్టాండర్డ్ నార్మల్) కలయికగా ఒక నమూనా రూపొందుతుంది. దీనినే చిన్నగా నార్మల్ అని పిలుస్తారు. వివిధ కారణాల మూలంగా దీనిలో వచ్చే తేడాలు (దీనినే తేడా లేక డీవియంట్ అనుకోవచ్చును) రోగ లక్షణాలుగా, వీటిని గుర్తించే డయాగ్నోస్టిక్ పరీక్షలు, చికిత్సా విధానం, మందులు క్రోడీకరింపబడి మెడికల్ జ్ఞానంగా అందుబాటులో ఉంటాయి. దీనినే గ్లోబల్ జ్ఞానం అని పిలుస్తారు. ఏ వ్యక్తులయితే ఈ క్రోడీకరించిన జ్ఞానాన్ని అభ్యసించి తమదిగా చేసుకుంటారో వారే సమాజంలో డాక్టర్లుగా చలామణీ అవుతారు. ఒక రోగి డాక్టరు దగ్గరికి వచ్చి తన ఆనారోగ్య లక్షణాలను (నార్మల్‌కు తేడాగా ఉన్న లక్షణాలను) వెల్లడి చేసినపుడు, డాక్టరు ఈ లక్షణాలను తను నేర్చుకున్న లక్షణాలతో పోల్చి చూసుకొని రోగనిర్ధారణ చెయ్యడం, మందుల ద్వారా చికిత్స చెయ్యడం జరుగుతుంది.

ఇలా పోల్చడంలో మూడు వేర్వేరు సందర్భాలు ఎదురవుతాయి. మొదటిది, నమూనాలోని ప్రామాణిక లక్షణాలు, రోగి వెల్లడి చేసిన రోగ సూచిక లక్షణాలు ఒక దానితో ఒకటి సరిగా సరిపోయినప్పుడు, డాక్టరు చేసే చికిత్స ద్వారా వ్యాధి నయం అయిపోవడంతో నమూనాకి బలం చేకూరుతుంది. కాని ఇలా రెండు లక్షణాలు సరిగా సరిపోవడం అరుదుగా జరుగుతుంది. వాస్తవంలో నమూనాతో విభేదించే లక్షణాలు తరుచూ వస్తూ ఉంటాయి. అటువంటి పరిస్థితులలో అక్కడ ఉండే మెడికల్ జ్ఞానం, సాంకేతికత, మందుల వివరాలు ఆరోగ్య పరిరక్షణ సేవలలో ముఖ్య భాగమవుతాయి. రెండవది, పైన పొందుపరిచిన రెండు లక్షణాలు ఒకదానితో ఒకటి మక్కికి మక్కి ఏకీభవించకపోతే, ఈ తేడాలను సరిదిద్దడానికి ఆ స్థాయిలోనే కొంత ప్రయోగాత్మకంగా ట్రయల్ ఎండ్ ఎర్రర్ పద్ధతి ద్వారా దానికి సమాధానం కనుక్కోవడం మరొక సందర్భం. మూడవది, ప్రయోగాత్మకంగా కూడ ఒక స్థాయిలో సమాధానం దొరకని సందర్భంలో ఈ స్థాయి సేవల నుండి పై స్థాయి సేవలకు రోగం తరలింప బడుతుంది. మెడికల్ జ్ఞానం నేపథ్యంలో చూస్తే మొదటి సందర్భం ప్రామాణిక లక్షణాలతో కూడిన నమూనా, రోగ అంచనాకి సరిగా సరిపోతుందనీ, రెండవ దానిలో నమూనాలో చిన్న మార్పులు, చేర్పులు అవసరమవుతాయనీ, ఇంక మూడవ దానిలో నమూనాలోనే మార్పులు అవసరమనీ భావించవచ్చును.

ఆరోగ్య పరిరక్షణ సేవలను మొత్తంగా చూస్తే, ప్రామాణిక లక్షణాలకు భిన్నంగా ఉండే రోగ సూచిక లక్షణాలు, సాంకేతిక సహాయంతో రోగ నిర్ధారణ, మందుల ద్వారా చికిత్సా పద్ధతులు అన్నీ వేరు వేరుగా ఒక్కొక్క స్పెషలైజేషన్ పేరుతో క్రోడీకరింపబడి పబ్లిక్ జ్ఞానంగా అందుబాటులో ఉంటాయి. ఈ క్రమంలోనే అంతర్లీనంగా ఒక లోపం ఇమిడి ఉంటుంది.

పైన చెప్పిన రెండవ సందర్భంలో ఒక స్థాయిలో భిన్నతకి ప్రయోగ పూర్వకంగా దొరికిన సమాధానం గురించిన సమాచారం కాని, మూడవ సందర్భంలో కింది స్థాయిలోని చికిత్సా పద్ధతుల జయాపజయాలకు సంబంధించిన సమాచారం కాని డాక్టర్ల ఆలోచనా పరిధిలోనే ఉండిపోవడంతో, అప్పటి జ్ఞానంలో ఇవి భాగం కాలేక నిక్షిప్తంగానే ఉండిపోతాయి.

పైస్థాయికి రెఫర్ చేయబడిన అనారోగ్య సమస్యలకు సమాధానం దొరికినట్లయితే, ఈ జ్ఞానం ఒక సమాచార రూపంలో కింది స్థాయి సేవలకు చేరుకుంటుంది. ఇలా చూసినపుడు, సమాధానం దొరకని అనారోగ్య సమస్యలు కింది స్థాయి ఆరోగ్య కేంద్రాల నుండి పై స్థాయి కేంద్రాలకి తరలింపబడగా, ఈ సమస్యకి అక్కడ అందుబాటులో ఉండే జ్ఞానం సహాయంతో వచ్చిన సమాధానానికి సంబంధించిన సమాచారం పై స్థాయి నుండి కింది స్థాయికి ప్రవహిస్తుంది. ఇది వివిధ స్థాయిలలో జ్ఞానంలో ఉండే అంతరాల దొంతరని ప్రతిఫలిస్తుంది. ఈ జ్ఞానంలో ఉండే ఈ దొంతర అధికారంలో ఉండే దొంతరగా రూపొంది, చికిత్సా పద్ధతులూ, నియమ నిబంధనలూ అన్నీ కూడా ఈ క్రమానుసారంగానే రూపొందే వ్యవస్థని బ్యూరోక్రటిక్ వ్యవస్థ అని పిలువ వచ్చును. ఇక్కడ పై స్థాయి సేవా కేంద్రాలే జ్ఞానోత్పత్తికి మూలమనీ, ఈ జ్ఞానాన్ని కింది స్థాయిలు సమాచార రూపంలో అందుకొని ఆచరణలో పెడతాయనే ఊహ కూడా ఇమిడి ఉంటుంది. అంతేకాకుండా ఈ సమాచార వితరణ ప్రక్రియలో సమాచార నష్టం కూడా జరిగి వక్రీకరణలు కూడా చోటు చేసుకుంటాయి. ఈ నేపథ్యాన్ని కొంచెం విస్తరిస్తే, అనేక ఆరోగ్య సమస్యలకు మనకు సమాధానం తెలియదనీ, అభివృద్ధి చెందిన దేశాలలోనే జ్ఞానం ఉత్పత్తి అవుతుందనీ, అందుకే సమాధానాలు వారికే తెలుస్తాయనీ, వారే మనకు ఆ జ్ఞానాన్ని అందిస్తారనే భావం కూడా ఉంటుంది.

మన దేశం లాంటి దేశాలు జ్ఞానాన్ని ఉత్పత్తి చేసే కేంద్రాలుగా కాకుండా అభివృద్ధి చెందిన దేశాలు అందించే సమాచారాన్ని అంది పుచ్చుకునే కేంద్రాలుగా మారిపోతాయి. పై దేశాల మీద ఆధారపడే గుణం బాగా అలవడడంతో కొన్నిసార్లు తప్పుడు సమాచారం కూడా ప్రసారమైపోతుంది. సరియైన సమాచారం లేకపోయినప్పటికీ చికిత్సా పద్ధతులు మాత్రమే తెలిసి చికిత్స చేసే వాళ్లు కూడా ఆరోగ్య సేవలలో డాక్టర్లుగా, నిపుణులుగా సమాజంలో చలామణీ అయిపోతూ ఉంటారు.

ఈ మొత్తం క్రమంలో గ్లోబల్ ఆరోగ్య సమస్యలు, వాటి సమాధానాల మీద మెడికల్ జ్ఞానం కేంద్రీకరింపబడడంతో, స్థానిక ఆరోగ్య సమస్యలకు సమాధానం దొరకదు. గ్లోబల్ జ్ఞానం చాలా పవిత్రమైనదిగానూ, నమ్మదగినదిగానూ, తిరుగులేనిదిగానూ, ఇంక స్థానిక జ్ఞానం పనికిరానిది గానూ భావించి అణచివేయబడడంతో ఈ విలువైన సమాచారం నిరర్థకమై పోతుంది. ఈ కారణంగా స్థానిక ప్రజలు, ముఖ్యంగా స్త్రీలు, పిల్లల సమస్యలకు చికిత్స కొరకు అధిక ఖర్చు భరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, డాక్టర్ల దగ్గర తమ ప్రత్యేక సమస్యలకు సమాధానం ఉండదని భావించి తమ అనారోగ్య లక్షణాలను వెల్లడి చేయరు. అందుచేత ఆ లక్షణాలు క్రమం తప్పకుండా మళ్లీ మళ్లీ వస్తూనే ఉంటాయి. ఇది మందుల కంపెనీలకు లాభదాయకంగా మారుతుంది.

సమాజంలో జ్ఞానోత్పత్తి మూలాలలో భిన్నత, జ్ఞానం, డయాగ్నస్టిక్ పద్ధతులు, చికిత్సా విధానాలు అన్నీ కలిసి స్వంత వైద్యం, మొబైల్ డాక్టర్లు, శిక్షిత డాక్టర్లు, నిపుణులు అనే భిన్నమైన ఆరోగ్య సేవలకు దారి తీస్తుంది. ఈ క్రమంలోనే ప్రతి స్థాయిలోని డాక్టర్లు మందుల కంపెనీలకి ప్రతినిధులుగా, డయగ్నాస్టిక్ కేంద్రాల ఏజెంట్లుగా మారిపోతారు. దానితో ఒకే అనారోగ్య సమస్యకి చికిత్సా విధానం మారిపోవడంతో రోగి పెట్టవలసిన ఖర్చులో కూడా బాగా తేడా ఉంటుంది.

గ్రామంలో ఉండే ఆరోగ్య పరిరక్షణ సేవలు

మేం సర్వే చేసిన మైచర్లపాలెం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం జిల్లాలో బాగా వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న గ్రామం. పేదరికం మూలాన గ్రామంలోని వ్యవసాయ కూలీలు, ముఖ్యంగా స్త్రీలు, చుట్టు పక్కల ఉన్న జిల్లాలకు వ్యవసాయపు పనులు చేసే నిమిత్తం ఏడాదిలో మూడుసార్లు తప్పనిసరిగా వలసపోవడం చాలా కాలం నుంచీ జరుగుతోంది. ఈ గ్రామం చోడవరం పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఈ గ్రామం చేరడానికి సరియైన రోడ్లు కానీ, బస్సు సౌకర్యం కానీ లేవు. రెండు వందల కుటుంబాల వరకు ఉన్న ఈ గ్రామంలో ప్రతి కుటుంబానికి ఎంతో కొంత స్వంత భూమి ఉంది. వీరు ప్రధానంగా వ్యవసాయం మీదే ఆధారపడి, తమ వినియోగార్థం వేరుశనగ, జొన్న లాంటి పంటలు పండించుకుంటారు. వ్యవసాయం మీద వచ్చే ఆదాయం వారి అవసరాలకు సరిపోకపోవడంతో, కుటుంబ సభ్యులు వ్యవసాయపు పనులు వెతుకుతూ, పక్క జిల్లాలకు వలసపోతూ ఉంటారు. కుటుంబ పోషణ భారం స్త్రీల మీద అధికంగా ఉండడంతోనూ, ఆయా కాలాలలో వచ్చే వ్యవసాయపు పనులలో స్త్రీల పాత్ర అధికంగా ఉండడంతోనూ వలస పోవడంలో కూడా స్త్రీలే ముఖ్యపాత్ర పోషిస్తారు. అలా వారికి వచ్చిన ఆదాయంతోనే కుటుంబ అవసరాలు తీర్చుకో గలుగుతున్నారు. ఈ స్త్రీల వలసల మూలంగా తమ శ్రమ శక్తిని వినియోగించుకొని తగిన కూలీ సంపాదించుకోవడమే కాకుండా, బయటి ప్రపంచపు పోకడలను అవగాహన చేసుకునే అవకాశం దొరుకుతుంది. ఈ క్రమంలోనే గ్రామం బయట వైద్య ఆరోగ్య సేవలు అనేకం ఉన్నాయనీ, అవసరమైతే తమ అనారోగ్య సమస్యలకు అక్కడ చికిత్స కూడా లభ్యమవుతుందనే జ్ఞానం సంపాదించుకుంటారు.

ఇక్కడ గ్రామంలో సర్వే చేయడంలో ఎదుర్కొనే కొన్ని సమస్యలను ఇక్కడ ప్రస్తావించాలి. ఒక గ్రామాన్ని అవగాహన చేసుకునే కార్యక్రమంలో ప్రప్రథమంగా ఆ గ్రామాన్ని గురించిన ఒక ఊహాచిత్రాన్ని రూపొందించు కొని, ఆ గ్రామంలో ఎటువంటి మార్పులు రావడానికి అవకాశం ఉందో అంచనా వేసి, దాని ఆధారంగా ఒక ప్రశ్నావళిని రూపొందించి సర్వే చేయడం జరుగుతుంది. ఈ పద్ధతిలో మనం రూపొందించుకున్న ఊహాచిత్రం మన అవగాహనా క్రమానికి కొన్ని పరిమితులు కలిగిస్తుంది. ఊహాచిత్రంలో భాగం కాని, మనకు తెలియని గ్రామ వాస్తవ లక్షణాల గురించిన కొంత సమాచారాన్ని ఇది మరుగుపరుస్తుంది. మా సర్వేలో కూడా ఇదే జరిగింది. ఈ లోటుని పూరించుకోవాలంటే గ్రామాన్ని ప్రశ్నావళితో కుదించకుండా, ప్రత్యక్షంగా చూడవలసిన అవసరం ఉంది. అలా ఏ ముందస్తు అభిప్రాయాలు లేకుండా చూసినప్పుడే ఆ గ్రామంలోని కొత్త విషయాలు, మన ప్రశ్నావళిలో లేకపోయినా, మనకు కనిపిస్తాయి. వాటిని గుర్తించి గణనలోకి తీసుకొని వాటి వివరాలు సేకరించినపుడే గ్రామ సంబంధాల గురించి ఒక అవగాహన రావడమే కాకుండా గ్రామ వర్ణన గ్రామానికొక విశ్లేషణగా మారుతుంది. గ్రామాలలో వస్తున్న మార్పులు అవగతమౌతాయి.

మా సర్వేలో ఒక కుటుంబంలో మూడు నెలల కాలంలో వారికి వచ్చిన అనారోగ్య సమస్యలు, దానికి వారు ఏ డాక్టరు దగ్గరికి వెళ్లారు, మందులకి అయిన ఖర్చు ఎంత మొదలైన వాటి గురించిన సమాచారం తీసుకున్నాం.

ఇక్కడ 'డాక్టరు', 'మందులు' అని అడిగినపుడు వచ్చిన సమాచారం స్వంత గృహ వైద్యం మినహాయించి అలోపతి డాక్టర్లు, అలోపతి వైద్యం ద్వారా వాడిన మందులకే కుదించబడింది. ఆయుర్వేదం, హోమియోపతి లాంటి మిగతా ఆరోగ్య సేవలు అశ్రద్ధ చేయబడి మా గణనలో భాగం కాలేకపోయాయి. అంతే కాకుండా డాక్టరు అంటే రోగులు డాక్టరు దగ్గరికి వెడతారనే ఊహ సర్వసామాన్యంగా ఉండడంతో, రోగానికి మందులు ఇచ్చే వాళ్లందరూ డాక్టర్లేనని, రోగి ఇంటికే వచ్చి మందులు ఇచ్చే డాక్టర్లు కూడా ఉంటారనేది మనకు తట్టదు. అలాగే ఏ కారణంగా వచ్చిన నీరసానికయినా 'బుడ్డీ' (డెక్స్‌ట్రో నార్మల్ సెలైన్ వాటర్ – సెలైన్) ఎక్కించే ప్రెసిడెంటూ, మానసిక రోగాలకు స్వాంతననిచ్చే 'కాసులమ్మ' లాంటి వాళ్ల గురించిన ప్రశ్నలు మేము తయారు చేసిన ప్రశ్నావళిలో లేకపోయినా గ్రామంలో ప్రత్యక్షమయ్యారు. తమ ఉనికిని చాటుకున్నారు. మనకు ఈ ప్రశ్నలు లేకపోవడంతో నీరసానికి ఒక 'బుడ్డీ' ఎక్కించు కోవడం అనే సమాధానం స్వంత వైద్యంలో భాగం కాలేకపోయింది. ఇది ఒక తాత్కాలిక సమాధానమే అయినా కూడా, గ్రామ ప్రజల ఆలోచనలో ఇది తమ అనారోగ్య సమస్యకి ఒక సమాధానంగానే కనబడుతుంది. నీరసం ఒక అనారోగ్యానికి సంకేతమనీ, మెడికల్ జ్ఞానం ఆధారంగా దానికి చికిత్స సాధ్యమనే సమాచారం ప్రజలకు లేకపోవడంతో ఎవరికి వారే ఈ చికిత్సని తాము కూడా చేసుకోవడం వలన ఇది మెడికల్ జ్ఞానంలో భాగం కాలేకపోయింది. అనారోగ్య లక్షణానికి బుడ్డీ ఎక్కించుకోవడం అనే ప్రయోగం ఎక్కడా నమోదు కాకపోవడంతో ఈ చికిత్స వలన వచ్చే పరిణామాలు కూడా ఎక్కడా నమోదు కావు.

గ్రామంలోని ఆరోగ్య సేవలు

మైచర్లపాలెం సబ్ సెంటర్‌లో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ ఆరోగ్య సేవలు అప్పుడప్పుడు గ్రామానికి వచ్చే ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు మాత్రమే. వీరు ముఖ్యంగా చేసే పని పబ్లిక్ రెఫరల్ వ్యవస్థకి మద్దతునిస్తూ, తల్లీ, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన ప్రభుత్వ విధానాలను అమలు చేయడం, ఈ కార్యక్రమంలో భాగంగానే అవసరమైనపుడు గర్భిణీ స్త్రీలను చోడవరంలో ఉండే రెఫరల్ హాస్పిటల్‌కి పంపించే ఏర్పాట్లు చెయ్యడం, పిల్లలకి వచ్చే చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు సాధారణ పరీక్షలు చేయించి చికిత్స చేయించడం వీరి బాధ్యత. గ్రామంలో ప్రభుత్వ ఆరోగ్య సేవలు తక్కువగా ఉన్నప్పటికీ, ఇక్కడి ప్రజలు గ్రామం బయటి సర్వీసుల సహాయం కూడా పొందుతారు. స్త్రీలు తాము వలసపోయి పనులు చేసుకోవాలంటే, తమ ఆరోగ్యం తామే కాపాడుకోవాలనే ఉద్దేశంతో, ఖర్చు ఎక్కువ అయినప్పటికీ బయటి సర్వీసులను వాడుకుంటారు.

గ్రామస్తులకు అందుబాటులో ఉండే మిగతా ఆరోగ్య సేవలను చూద్దాం

1) స్వంత వైద్యం – శిక్షితులైన డాక్టరుని సంప్రదించకుండానే, తమ అనారోగ్య సమస్యలకు తమకు తామే తమకు తెలిసిన వైద్యం చేసుకుంటారు. దీనిలో గృహ వైద్యం ఒక పక్కనయితే, ఇప్పటికే అందరికీ తెలిసిన అలోపతి మందులు వేసుకోవడం మరొక పక్క. కడుపు నొప్పికి వాము వేసుకోవడం మొదలు దానికి ఉదాహరణ అయితే, సారిడాన్ వేసుకోవడం రెండవ దానికి ఉదాహరణ. వీరి జ్ఞానానికి మూలం తాను కాని, తన తోటివారు కాని గతంలో చేసిన ఆచరణ ద్వారా సేకరించిన జ్ఞానం.

2) గ్రామానికి క్రమం తప్పకుండా వచ్చే మొబైల్ 'డాక్టర్లు' – గ్రామానికి సమయబద్ధంగా వచ్చి రోగిని వారి ఇంటి దగ్గరే పరీక్షించి, తగిన మందులు ఇచ్చి, మరుసటి రోజు వచ్చి క్షేమ సమాచారాలు విచారించి అవసరమైతే మందులు మార్చి, తగిన ఫీజు తీసుకునే వీరిని మొబైల్ 'డాక్టర్లు' అనవచ్చును.

వీరు శిక్షితులైన డాక్టర్ల దగ్గర కాంపౌండరుగా పనిచేసి సర్వ సాధారణంగా వచ్చే కొన్ని జబ్బులకు వాడవలసిన మందులు, వాటి వాడకంలో కొన్ని 'మెళుకువలు' సంపాదించుకుంటారు. అప్పటి నుండి మొబైల్ డాక్టర్లుగా మారిపోయి ఒక గ్రామాన్ని ఎంచుకొని తమకు తెలిసిన కొన్ని జబ్బులకు మాత్రమే చికిత్స చేస్తారు. వీరిని ప్రభుత్వం నాటు వైద్యులు అని పిలిచినా ప్రజల దృష్టిలో వీరు డాక్టర్లే. గ్రామంలో ఉన్న నలుగురు ఇటువంటి వాళ్లలో ఒకరు పంజాబీ అవడంతో అతడు పంజాబీ డాక్టరుగా పేరుపొందాడు. వీరి జ్ఞానానికి మూలం తాము చూసిన శిక్షిత డాక్టర్ల ఆచరణ.

3. మెడికల్ షాపులో మందులు కొనుక్కోవడం – జబ్బు విషయమై డాక్టరుని సంప్రదించకుండానే, మెడికల్ షాపుకి వెళ్లి వారి సలహాతో మందులు కొనుక్కుంటారు. దీనినే 'ఓవర్ ది కౌంటర్ డ్రగ్స్' అని అంటారు. ఇటువంటి మెడికల్ షాపులు చోడవరంలో 13 దాకా ఉన్నాయి.

వీరి జ్ఞానానికి మూలం తమ వద్దకు మందులు కొనుక్కునేందుకు వచ్చే రోగులకు డాక్టర్లు రాసే ప్రిస్క్రిప్షన్‌లు.

4. చోడవరంలోని శిక్షితులైన ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ – వీరే అసలైన డాక్టర్లు. మెడికల్ కాలేజీలలో వైద్యశాస్త్రం అధ్యయనం చేసి జబ్బుల మీద జ్ఞానం పొంది, వాటిని నయం చేయగల నైపుణ్యత ఉన్నవాళ్లు, వీరి ఆచరణలోనే అంతర్గతంగా డాక్టరు – డయాగ్నస్టిక్ సెంటరు – మందుల షాపు అనే ముగ్గురి కలయిక ఉండడంతో మిగతా సర్వీసుల కంటే సమర్థవంతంగా పనిచేయడమే కాకుండా ఈ సర్వీసు ఉపయోగించు కునేందుకు అయ్యే ఖర్చు కూడా మిగతా వాటి కంటే ఎక్కువగానే ఉంటుంది.

ఈ డాక్టర్ల జ్ఞానానికి మూలం ఇప్పటి వరకు (ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలలో) క్రోడీకరింపబడిన వైద్య శాస్త్రం. దీనిలో మిగతా దేశాలలో వైద్యశాస్త్ర అభివృద్ధి జరగదనే అపోహ కూడా ఇమిడి ఉంటుంది.

5. చోడవరం బయట అంటే విశాఖపట్నం, హైదరాబాద్ లాంటి పెద్ద పట్టణాలలో ఉండే నిష్ణాతులైన డాక్టర్లను సంప్రదిస్తారు. కాని ఇటువంటి డాక్టర్లు మైచర్లపాలెం ప్రజలకు అందుబాటులో లేరు.

6. ఇవన్నీ కాక ప్రభుత్వం ప్రవేశపెట్టిన హెల్త్‌కేర్ సర్వీసులలో భాగంగా గ్రామానికి వచ్చే ఎఎన్ఎం, అక్కడి నుండి ప్రైమరీ హెల్త్ సెంటర్ నుండి జిల్లా ఆసుపత్రి కూడా అందుబాటులో ఉండేటట్లుగా ఏర్పాటు చేసిన రెఫరల్ వ్యవస్థ కూడా ఉంది.

వీరందరూ కాక, అలోపతి విధానంలో తగ్గని జబ్బులను దైవశక్తితో తగ్గిస్తానని, జబ్బుకి ఉపశమనం కలిగితే బంగారు కాసుని తన ఫీజుగా తీసుకునే 'కాసులమ్మ', సర్పంచిగా పనిచేస్తూనే చికిత్స కొరకు తన దగ్గరికి వచ్చిన వారికి మందులు ఇవ్వడం. 'బుడ్డీ' ఎక్కించే డాక్టరు కూడా ఈ గ్రామంలో ఉన్నారు.

ఈ సేవలన్నింటిని కలిపి చూస్తే, మొదటి ఐదు సర్వీసులు ప్రత్యామ్నాయ సర్వీసులుగా కనిపించినా, వేరు వేరు సంబంధాల మూలాన దొంతరతో కూడిన ఒక గొలుసుకట్టుని ఊహించవచ్చును. దీనినే ప్రైవేట్ రెఫరల్ వ్యవస్థ అనుకోవచ్చును. ఈ రెఫరల్ వ్యవస్థకి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఏర్పాటు చేసినది ఆరవ సర్వీసు, ఇది కూడా దొంతరగానే ఉండి ఉండడంతో దీనిని 'పబ్లిక్ రెఫరల్' వ్యవస్థ అని అనుకోవచ్చును.

గ్రామంలోని రెఫరల్ వ్యవస్థలు

గ్రామానికి అందుబాటులో ఇన్ని సర్వీసులు ఉన్నప్పటికీ అత్యంత ఉపయోగకరమైన బేసిక్ వైద్య సేవలు మొబైల్ డాక్టర్ల ద్వారానే లభ్యమౌతాయి. వీరు రోగిని ఇంటి దగ్గరే పరీక్షించి తమతో తెచ్చుకున్న మందులివ్వడమే కాకుండా, పేషెంట్ పరిస్థితి చెయ్యి దాటిపోతోందని అనిపిస్తే వెంటనే పేషెంట్‌ని చోడవరంలో తమకు పరిచయమున్న శిక్షిత డాక్టరు దగ్గరికి తీసుకొని వెళ్లడం కూడా చేస్తారు. ఈ శిక్షిత డాక్టరు దగ్గరే మొబైల్ డాక్టర్లు పనిచేసి సీజనులో వచ్చే జబ్బులు, వాటికి వాడవలసిన మందుల గురించి నేర్చుకున్న కారణంగా వీరి మధ్య సత్సంబంధాలు ఉంటాయి. అందుచేత వీరు ప్రైవేట్ రెఫరల్ వ్యవస్థకి మొదటి మెట్టుగా పనిచేసి, గ్రామంలో తను నయం చేయలేకపోయిన పేషెంట్లను చోడవరంలోని ప్రైవేట్ డాక్టర్లకు రెఫర్ చేస్తారు.

ఇంక ఆరవ వైద్య సేవల గురించి, ప్రభుత్వం గ్రామీణ ప్రజలందరికీ తక్కువ ఖర్చుతో మంచి వైద్య సదుపాయాలను అందించాలనే ఉద్దేశంతో నిచ్చెన మెట్లను పోలి, వాసిలో తేడాలుండే వైద్య సేవల సముదాయాన్ని అంటే, ఒక రెఫరల్ వ్యవస్థని తయారు చేసింది. ఈ గొలుసు క్రమం గ్రామంలో ఎఎన్ఎంతో మొదలుపెట్టి అనారోగ్య సమస్యకి సమాధానం దొరికే వరకు విశాఖ, హైదరాబాద్ హాస్పిటల్సుని కూడా చేరుకుంటుంది.

ఈ రెండు రెఫరల్ వ్యవస్థలను పరీక్షించి చూస్తే, గ్రామంలో ఇవి రెండూ వేర్వేరుగా, సమాంతర వ్యవస్థలుగా ఏక కాలంలో పని చేస్తూ ఉంటాయి. ఒకటి ప్రభుత్వం డిజైను చేసినది కాగా, రెండవది ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ఏర్పడింది. కొంతకాలం గడిచేసరికి ప్రభుత్వం ద్వారా డిజైను చేయబడి, తక్కువ ఖర్చుతో గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించేదిగానూ, రెండవది ఎక్కువ ఖర్చు భరించగలిగిన వారికి సాంకేతికపరంగా మేలైన సేవలు అందించేదిగానూ మారిపోయాయి. గ్రామ ప్రజలు ప్రైవేట్ డాక్టర్ల వైపుకే మొగ్గు చూపెడుతూ, అప్పో సొప్పో చేసైనా సరే ఎక్కువ ఖర్చుతో కూడిన మేలైన సేవలనే ఎంచుకుంటున్నారు.

పబ్లిక్ రెఫరల్ వ్యవస్థ అంతరాల దొంతరతో ఉండి ఒకే ఒక వరుస క్రమం ఉంటే, దీనికి విరుద్ధంగా ప్రైవేట్ రెఫరల్ వ్యవస్థలో ఒక స్థాయిలో సేవలకు మరొక స్థాయిలో సేవలకి సంబంధం లేని ప్రత్యామ్నాయ క్రమాలనేకం ఉంటాయి. అయినప్పటికీ ఈ రెండింటిలో ఉండే ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, ఇవి రెండూ కూడా బ్యూరోక్రాటిక్ వ్యవస్థలే. అంటే వ్యవస్థ పని చేసేందుకు కావలసిన అధికారం, నియమ నిబంధనలతో పాటు మెడికల్ జ్ఞానం కూడా పైస్థాయి సర్వీసుల నుండి కింది స్థాయికి అందించబడతాయి. పైస్థాయి నిర్దేశించిన పరిధిలోనే కింది స్థాయి పనిచేయాలి. ఇదే పైనుండి కిందికి సాగే దృక్పథం.

గ్రామ ప్రజల అనారోగ్య వివరాలు –

మైచర్లపాలెం పేద గ్రామమైనప్పటికీ, వారికి విభిన్నమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్న సందర్భంలో ఈ గ్రామ ప్రజలు అనారోగ్య వివరాలు ఎలా ఉన్నాయో చూద్దాం. ఇవి అలోపతి వైద్యసేవలకు వెల్లడి చేసిన వివరాలు మాత్రమే.

1) గ్రామంలో పబ్లిక్ వైద్యసేవల కంటే ప్రైవేట్ వైద్య సేవలకే ఎక్కువగా మొగ్గు చూపడం కనిపిస్తుంది.

2) గ్రామంలో ప్రజలు ఎక్కువగా వెల్లడి చేసే సమస్య సీజనులో వచ్చే జ్వరాలు.

3) పురుషుల కంటే స్త్రీలే అధికంగా అనారోగ్య సమస్యలను రిపోర్టు చేశారు.

4) శ్రమ చేయగలిగి, ఆదాయం సంపాదించగలిగిన వయస్సు గ్రూపులో ఉన్నవారు, అంటే మధ్య వయస్కులు, మిగతా వారికంటే ఎక్కువగా ఆరోగ్య సమస్యలను వెల్లడి చేస్తారు. అంటే వయస్సు ఎక్కువ ఉండి పని చేయలేని వారు తమ ఆరోగ్య సమస్యలను బయటికి చెప్పరని కూడా అనుకోవచ్చును.

5) మధ్య వయస్కులు చికిత్స కోసం ఖర్చు పెట్టే తలసరి వ్యయం మిగతా వారి కంటే ఎక్కువగా ఉంటుంది.

6) ప్రైవేట్ డాక్టర్లు ఎక్కువ ఖర్చుతో కూడిన చికిత్స చేస్తారు.

7) పంచేంద్రియాలు, నాడీ మండలానికి సంబంధించిన సమస్యల కంటే జీర్ణ వ్యవస్థ సమస్యలే ఎక్కువగా వెల్లడి అవుతాయి.

8) స్త్రీలకు సంబంధించిన ప్రత్యేక సమస్యలు (గైనిక్) వెల్లడి కావు.

ఈ గ్రామం పేద గ్రామం అయినప్పటికీ ఒక నెలలో రు. 1.4 లక్షలు, అంటే డాక్టర్‌ను కలిసిన ప్రతిసారీ రు. 300 చొప్పున ఖర్చు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో వచ్చే జ్వరం, జలుబు, పిల్లల చర్మ వ్యాధులు, విరేచనాలు లాంటివి మళ్లీ మళ్లీ రావడంతో మెడికల్ షాపులలో వీటికి సంబంధించిన అమ్మకాలు పెరిగిపోతాయి. అంతేకాక వివిధ స్థాయిలలో చికిత్స చేయబడుతున్న ఆరోగ్య సమస్యలలో కొన్నింటికి స్థానికంగా సమాధానం దొరకవచ్చును. కొన్నింటికి దొరకక పోవచ్చును. ఈ సమాచారమంతా ఆ స్థాయిలోనే వైద్య సేవలందించే వ్యక్తి దగ్గరే మరుగు పడిపోతాయి. కొన్ని సమస్యలకు సమాధానం లేదనో, డాక్టర్ల సహాయంతో నయం కాలేకపోయిన జబ్బులు దేవుడి దయవల్ల నయం అవుతాయనే నమ్మకంతో 'అమ్మ'ను చేరుకుంటాయి. మరొక పద్ధతి ఎవరికి వారే నిర్ణయించుకొని సీజన్‌లో తమ వ్యవసాయ పనులు చేయడానికి సహాయపడే విధంగా, తమ ఇంట్లోనే 'బుడ్డీ' ఎక్కించుకుంటారు. దీనికొక తాడు, పంచలో ఉండే చూరు, చేతిలో బుడ్డీ తప్పితే ఇంకేమీ అక్కరలేదు. చాలావరకు ప్రతి ఇంట్లోను ఈ ఏర్పాటు ఉంటుంది. దీనివలన మెడికల్ జ్ఞాన పెరుగుదలకి తీవ్రమైన అడ్డంకి ఏర్పడుతుంది.

పరిణామాలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.ఎచ్.ఒ.) జెనీవాలో 2005లో తన 65వ సమావేశంలో 'యూనివర్సల్ హెల్త్ కవరేజ్ (సార్వత్రిక ఆరోగ్య సదుపాయం) ప్రాధాన్యతని గుర్తించి 'అందరికీ ఆరోగ్యం' అనే ఆశయాన్ని సంకల్పించుకొంది. దానిని అనుసరిస్తూ చాలా దేశాలు ప్రజారోగ్యానికి సంబంధించిన అనేక సంస్కరణలు చేపట్టాయి. డబ్ల్యు.ఎచ్.ఒ. నిర్దేశించిన 'అందరికీ ఆరోగ్యం' ఎలాగైనా సాధించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం రూపంలో ఆరోగ్య రంగంలో కొత్త విధానాలను ప్రతిపాదించడం జరిగింది. అనుకున్న లక్ష్యాలను సాధించాలనే ఉద్దేశంతో ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో ఒక నిపుణుల కమిటీ – శ్రీనాథ్ రెడ్డి కమిటీ–ని ఏర్పాటు చేసి ఒక రూట్‌మ్యాప్‌ని తయారు చేయమని కోరింది. దాని ప్రకారం అభివృద్ధి చెందిన దేశాలలో అమలులో ఉన్న మాదిరిగానే మన దేశంలో కూడా సమగ్ర ఆరోగ్య పరిరక్షణ అమలు చేయాలని కమిటీ సిఫారసు చేసింది. అంటే మిగతా ఆర్థిక రంగాలలో మాదిరిగానే ఆరోగ్య రంగంలో కూడా అభివృద్ధికి చెందిన అదే కథ – బయటి దేశాల మీద ఆధారపడడం – మొదలయింది.

పేద ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితికి ఖర్చు చేసే స్థాయిలో లేరనీ, ఖర్చు చేస్తున్న వాళ్లు అప్పుల పాలవుతున్నారనీ కమిటీ అభిప్రాయపడింది. అందుచేత పేద ప్రజల ప్రాథమిక ఆరోగ్యంపై దృష్టిపెట్టాలనీ, అత్యవసర మందులు, ఔట్ పేషెంట్ సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వవలసిన

అవసరం ఉందని చెప్పారు. మన రాష్ట్రం కూడా శ్రీనాథ్ రెడ్డి కమిటీ రిపోర్టును క్షుణ్ణంగా పరిశీలించి తగిన సలహాలు ఇవ్వవలసిందిగా ఆరోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేసింది.

కానీ దేశంలో మైచర్లపాలెం లాంటి అనేక గ్రామాలలో ఇప్పటికీ అవసరానికి మించిన ఆరోగ్య సేవలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలకు మాత్రమే అక్కడి ప్రజలు ఆరోగ్య సేవలను వినియోగించు కుంటున్నారు. ఈ సందర్భంలో హెల్త్ మిషన్ ద్వారా ప్రవేశపెట్టబడిన సేవలు ప్రజల నమ్మకం పొంది వీటిని పూర్తిగా వినియోగించుకొనే అవకాశం ఉందా? లేక ఈ విధానాలు అమలు చేసే క్రమంలో కొత్త సమస్యలు తెచ్చిపెడతాయా? గ్లోబల్ దృక్పథంతో చూస్తే, ఈ క్రమం మెడికల్ జ్ఞానం పెరగడానికి అనుకూలంగా ఉంటుందా లేక అవరోధాలు కలిగిస్తుందా అనే ప్రశ్నలు ముందుకు వస్తాయి. అంతేకాకుండా ఈ సేవలు మనిషి ఇప్పటికే ఆర్జించి క్రోడీకరించుకున్న వైద్య విజ్ఞానంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపరచడానికి మాత్రమే ఉపయోగ పడుతుందా? లేక ఈ జ్ఞానం వృద్ధి పొందే క్రమం కూడా ఈ సేవలలో నిబిడీకృతమై ఉంటుందా? అనే ప్రశ్నలు కూడా వస్తాయి.

వైద్య పరివారాన్ని పెంచడం, మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడం, గ్రామంలోని కమ్యూనిటీకి ప్రజల ఆరోగ్య బాధ్యతలు అప్పగించడం వంటి విధాన మార్పులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను క్రమబద్ధంగా పని చేయించే రోజువారీ కార్యక్రమాలన్నింటిని తగ్గించుకోవడంతో కేంద్రం ఇంతవరకూ నిభాయిస్తూ వచ్చిన పాత్రను కుదించి వేసుకుంది. వీటన్నిటికి అవసరమైన ఆర్థిక వనరులను పెద్ద మొత్తంలో కేటాయించి, స్థానిక కమ్యూనిటికి ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతని అప్పగించి, గ్రామంలో రెఫరల్ సిస్టమ్‌కి మొదటి మెట్టుగా 'ఆశా'లను ప్రవేశపెట్టింది. ఇటువంటి సందర్భంలో, గ్రామంలో అందుబాటులో ఉండే సేవలను పరిశీలించితే, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి సబ్ – సెంటర్‌కి వచ్చే ఎఎన్ఎంలు ప్రైవేట్ రెఫరల్ సిస్టంలో భాగంగా ఉండే మొబైల్ డాక్టర్లు, వీరుకాక తమంతట తామే కొన్ని ప్రత్యేక సేవలు – తల్లీ, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన ప్రత్యామ్నాయ సేవలు – అందించే వాళ్లు ఉన్నారు. ఈ సేవలన్నింటిని కూడా గ్రామంలో ప్రజలు వినియోగించుకుంటూనే ఉన్నారు. ఈ సేవలకు అదనంగా 'ఆశా' వర్కర్లను హెల్త్ మిషన్‌లో భాగంగా ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సందర్భంలో ప్రజలు ఏ సేవలను వాడుకోవాలో తమ ఇష్టానుసారంగా ఎంచుకొనే సౌలభ్యం ఉన్నప్పటికీ, ఒకే సమయంలో, ఒకే చోట ఒకే ఆరోగ్య సమస్యకు చికిత్స చేయగలిగిన వేరు వేరు వనరులు గ్రామంలో ఉండడంతో వీటి మధ్యన పోటీ పెరగడానికి, ఘర్షణలు చోటు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దీని మూలాన స్థానిక ఆరోగ్య సమస్యలకి సమాధానం దొరకడం కష్టతరమౌతుంది. రోగులు డాక్టరు దగ్గరకు వెళ్లి తమ అనారోగ్య లక్షణాలను వెల్లడి చేయడానికి ప్రోత్సాహం లభించదు. అంతే కాకుండా, కమ్యూనిటీ కమిటీలో స్థానిక నేతలే సభ్యులవడంతో వారికి అనుకూలంగానే, అంటే ఒక్కోసారి గ్రామ ప్రజలకు వ్యతిరేకంగా ఈ సేవలు ఆచరణలో మారిపోయే ప్రమాదం ఉంది. గ్రామంలో ఉండే మిగతా వ్యత్యాసాలు కూడా ముందుకు వచ్చి మిషన్ రూపొందించిన ఉద్దేశాలు వక్రీకరింప బడతాయి.

హెల్త్ మిషన్ ద్వారా అనేక మార్పులు ప్రతిపాదించినప్పటికీ, ఈ సేవలు ఒక బ్యూరోక్రాటిక్ వ్యవస్థలో భాగంగా ఉన్న కారణంగా స్థానికంగా వచ్చే అనారోగ్య సమస్యలకు పరిష్కారం దొరకక పోవడంతో, సీజనల్‌గా గ్రామంలో వచ్చే నిర్దిష్ట సమస్యలు – జ్వరం, దగ్గు, విరేచనాలు, కురుపులు, చర్మ వ్యాధులు, రక్తహీనత లాంటివి – క్రమం తప్పకుండా వస్తూనే ఉంటాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ఈ బ్యూరోక్రాటిక్ రెఫరల్ విధానంలో, మెడికల్ జ్ఞానం ఎల్లప్పుడూ పైస్థాయి నుండి కిందిస్థాయికి ప్రవహిస్తుంది అనే భావన అంతర్లీనంగా ఉంటాయి. అంటే ఒక స్థాయిలో ఉండే జ్ఞానం స్థానిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాల మీద కేంద్రీకరించబడక, గ్లోబల్ ఆరోగ్య సమస్యలు వాటి సమాధానాలే గ్లోబల్ జ్ఞానం రూపంలో అందుబాటులో ఉంటుంది. ఈ సమస్యలకు ప్రచారం కూడా ఎక్కువగానే జరుగుతుంది. దీనికి అవసరమైన ఆర్థిక వనరులు కూడా పుష్కలంగానే లభిస్తాయి. ఈ కారణం వల్ల గ్లోబల్ ఆరోగ్య సమస్యలైన ఎయిడ్స్, క్షయ, కాన్సర్, డయాబిటీస్, గుండె జబ్బులు లాంటివాటికి సంబంధించిన ఆరోగ్య సేవలతోపాటు ప్రభుత్వం రూపొందించిన సమస్యలకే సేవలు అందుబాటులో ఉంటాయి. కాని స్థానిక నిర్దిష్ట సమస్యలు, అందులోనూ ముఖ్యంగా గ్రామీణ స్త్రీల ప్రత్యేక సమస్యలు – ఇవి స్త్రీలందరికీ వర్తించడంతో సమస్య తీవ్రత అధికంగా కనిపిస్తుంది – వీటి లక్ష్యంగా జ్ఞానం పెరగదు. అందుచేత స్త్రీలు తమ అనారోగ్య లక్షణాలను సాధారణంగా బయట పెట్టకపోవడంతో సమస్యలు కొనసాగుతూనే ఉంటాయి. దీనికి కారణం కొంతవరకు అజ్ఞానం, కొంతవరకూ అంధ విశ్వాసాలు, ముఖ్యంగా కాన్పు సమయంలోనూ, తరువాత కూడా అంధ విశ్వాసాలు, అపరిశుభ్రమైన అలవాట్లు, చేటలు, చీపుర్లు దుష్ట శక్తులను పారదోలేవిగా భావించడం చూస్తూనే ఉంటాం. స్త్రీలకు సంబంధించి దెయ్యం పట్టడం లాంటి హిస్టిరికల్ సమస్యలను దుష్టశక్తుల ప్రభావంగా భావించి డాక్టరు దగ్గరికి వెళ్లరు. ఇంక చిన్న పిల్లల చర్మవ్యాధులు, కురుపులకు చికిత్స ఉన్నప్పటికీ, వీటికి చికిత్స అక్కరలేదనీ, కాలం గడిచే కొద్దీ వాటంతట అవే తగ్గిపోతాయనీ డాక్టరు దగ్గర చికిత్స తీసుకోరు.

అలాగే సీజనల్‌గా వచ్చే జ్వరాలు లాంటి జబ్బులు ప్రతిసారీ వచ్చి నీరసించి పోతున్నప్పటికీ డాక్టరుని సంప్రదించరు. తమ వ్యవసాయపు పనుల వలసలకు ఈ నీరసం అడ్డురాకుండా తమకు తామే తమ ఇంటిలోనే 'బుడ్డీ' ఎక్కించుకోవడం వీరు ఎంచుకున్న పాపులర్ సమాధానం. ఇంక చాలనిపిస్తే బుడ్డీ తీసివేస్తారు. వీరికి నీరసం ఏ కారణంగా వచ్చినా దానికి 'బుడ్డీ' ఎక్కించుకోవడం ఒక్కటే సమాధానం.

గ్రామ ఆరోగ్య సేవలలో పంజాబీ డాక్టరు లాంటి మొబైల్ డాక్టర్లు ఒక ముఖ్య అంగం. వీరు స్థానిక ఆరోగ్య సమస్యలకి చికిత్స అందించే వారైనప్పటికీ, ఈ స్థానిక ఆరోగ్య సమస్యలు, తాము అనుసరించిన చికిత్సా విధానం, వాడిన మందులు, విధానం సక్సెస్ అయిందా, ఫెయిల్ అయిందా మొదలైన విషయాల గురించిన సమాచారం ఎక్కడా రికార్డు కాదు. ఈ ముఖ్యమైన సమాచారం ఈ స్థాయిలోనే అణచివేయబడి మరుగున పడిపోతుంది. గ్రామంలో వివిధ రకాల ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నా కూడా, తమ ఉపాధి పనులకు, ముఖ్యంగా స్త్రీలకు, ఈ సీజన్‌లో వచ్చే ఆరోగ్య సమస్యలు అడ్డుగా తగలడం కుటుంబం మీద కొంత ఆర్థిక భారం పడడం జరుగుతూనే ఉంటుంది. తమ ఆరోగ్య సమస్యలకు స్పందించే మొబైల్ డాక్టర్ల చికిత్సా పద్ధతులు శాశ్వత పరిష్కారం చూపించకపోయినా, తాత్కాలిక ఉపశమనం తప్పకుండా ఇస్తాయి. శాశ్వత పరిష్కారం లేకపోవడంతో అంధ విశ్వాసాలు, 'అమ్మ'లు కూడా కొంత ఉపశమనమిస్తారు. ఈ సమాచారమేదీ కూడా ఎక్కడా రికార్డు అవదు.

స్థానిక ఆరోగ్య సమస్యల పరిష్కార ప్రయత్నాలు, వాటి వివరాల గురించిన సమాచారం ప్రతిస్థాయిలోనూ అణచి వేయబడుతుంది. సమస్యలు ప్రతిసారి తిరగబెడుతూ ఉండడంతో ప్రజలకు ఈ ఆరోగ్య

సేవల మీద నమ్మకం పోతుంది. ఒకవేళ సమాధానం దొరికినా కూడా ఆ స్థాయిలోనే అణచి వేయబడి వైద్యశాస్త్ర జ్ఞానంలో భాగంగా మారదు.

ముగింపు

ఆరోగ్య పరిరక్షణ సేవలను సామాజిక సంబంధాల నేపథ్యంలో చూస్తే, అనారోగ్యం పాలైన రోగి ఒక పక్క, దీనికి చికిత్స చేసే డాక్టరు మరొకపక్క ఉంటారు. ఒక రోగి డాక్టరు దగ్గరికి వెళ్లి తన అనారోగ్య లక్షణాలను చెప్పినప్పుడు, ఆ డాక్టరు తను నేర్చుకున్న జ్ఞానం సహాయంతో రోగ నిర్ధారణ చేసి తగిన మందులు ఇచ్చినప్పుడు రోగం నయం అయిపోతుంది. ఇది చూడడానికి సర్వ సామాన్యమైన సంబంధంలా కనిపించినా, మన అందరి అనుభవంలో ఉన్న విషయం ఏమిటంటే, రోగి డాక్టరు దగ్గరకు వెళ్లి తన అనారోగ్య లక్షణాలన్నింటిని దాచకుండా స్పష్టంగా వెల్లడి చేయడం (ఏ పరిశోధనకైనా ప్రముఖపాత్ర వహించేది ఈ వెల్లడించే క్రమమే), డాక్టరు దగ్గర దీనికి చికిత్సా విధానం తయారుగా ఉండడం జరుగదు.

మనిషి ఆరోగ్యానికి కొలమానం ఆ మనిషి చేసే శ్రమ. ఈ శ్రమ చేసే క్రమానికి ఆటంకం కలిగినప్పుడు ఆ వ్యక్తి గతంలో తాను చేసిన శ్రమతో కాని, తన తోటి వారు చేస్తున్న శ్రమతో కాని తన శ్రమని పోల్చి చూసుకొని, దీనిలో కనిపించిన తేడాలను బట్టి తన అనారోగ్యాన్ని ధృవీకరించుకోవడం జరుగుతుంది. దీనికి తోడుగా, తన అనారోగ్యానికి చికిత్స ఉన్నదన్న నమ్మకం, తాను ఎంచుకొన్న డాక్టరు నయం చేయగలరనే భరోసా, ఆ చికిత్సకయ్యే ఖర్చులు తాను భరించగలననే ధైర్యం ఉన్నప్పుడు మాత్రమే ఆ డాక్టరు దగ్గరకు వెళ్లి తన అనారోగ్య వివరాలను వెల్లడించడం జరుగుతుంది. హెల్త్ మిషన్ ప్రతిపాదనలో ఈ అంశానికి తగినంత ప్రాముఖ్యతనివ్వడం లేదు. రెండవ పార్శ్వమైన డాక్టరు వైపు కేంద్రీకరించడంతో ఎక్కువ సంఖ్యలో డాక్టర్లు, నర్సులు, ఆశాలు తయారు చేయడం, మంచి సదుపాయాలతో కూడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం, అంతే కాకుండా అవసరమైతే కార్పొరేట్ హాస్పిటల్స్‌లోని స్పెషలిస్టు డాక్టర్ల సేవలు వినియోగించుకునే సౌకర్యం కలిగించడం జరిగితే, ప్రజలు ఈ సేవలను తప్పకుండా వినియోగించుకుంటారనే ఒక అపోహ ఉంది.

పరిశీలించి చూస్తే, ఈ ప్రతిపాదిత మార్పులతో అందరికీ ప్రాథమిక సేవలు అందడానికి అవసరమైన మొట్టమొదటి షరతు (నెసెసరీ కండిషన్) తప్పకుండా నెరవేరుతుంది. కాని ఈ క్రమం సక్రమంగా నెరవేరడానికి సరిపోయే రెండవ షరతు (సఫిషియంట్ కండిషన్) – ఒక రోగి డాక్టరు దగ్గరకు వచ్చి రోగ లక్షణాలను వెల్లడి చేయడం – అనేది జరగకపోవచ్చును. ఉదాహరణగా, ఈ మార్పులను ప్రాథమిక విద్యా రంగంలోని మార్పులతో పోల్చి చూస్తే, విద్యారంగంలో కూడా ఎన్నో గుణాత్మకమైన విధాన మార్పులు చేసి, కమ్యూనిటీకి అధికారం ఇచ్చి విద్యా వాలంటీర్లను ప్రవేశపెట్టడం లాంటి ఎన్నో మార్పులు చేసినప్పటికీ, గ్రామాలలోని పేదపిల్లలందరూ బడికి వెళ్లి చదువుకునేటట్లు చెయ్యడం సంభవమవడం లేదు. ఇంకా ఇంకా లోపాలు కనిపిస్తూనే ఉన్నాయి. వాటిని సరిచేసే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఇదే విధంగా ఎన్నో సదుపాయాలు కల్పించినా కూడా గ్రామాలలోని ప్రజలందరూ తాము అనారోగ్యం పాలైనపుడు ప్రాథమిక వైద్య కేంద్రాలలోని డాక్టర్లను కలిసి తమ అనారోగ్య లక్షణాలను వెల్లడి చేయడం జరగకపోవచ్చును.

ఈ అడ్డంకులు తొలగించడానికి హెల్త్ మిషన్‌లో ప్రతిపాదించిన మార్పులతో పాటు మరికొన్ని మార్పులు అవసరమవుతాయి. 'ఆశా' లాంటి కొత్త ఏజెంట్లను ప్రవేశపెట్టకుండా, పబ్లిక్ హెల్త్ వ్యవస్థలో ఇప్పటికే ఉన్న ఎఎన్ఎం లాంటి ఏజెంట్ల నైపుణ్యాన్ని మెరుగుపరిచి సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించేటట్లు చేయడం ఒక పద్ధతి. ఇందులో భాగంగానే పబ్లిక్ రెఫరల్ వ్యవస్థకి తగిన ప్రాధాన్యతనిచ్చి, తగిన ప్రోత్సాహకాలు సమకూర్చాలి.

గ్రామంలో ప్రైవేట్ హెల్త్ వ్యవస్థలో ముఖ్య అంగంగా ప్రాముఖ్యత సంపాదించుకున్న 'మొబైల్ డాక్టర్ల'ను కూడా పబ్లిక్ వ్యవస్థలో భాగంచేసి, వారికి అవసరమైన తర్ఫీదు ఇవ్వడం ద్వారా ఆరోగ్య సేవలకు సంబంధించి ఒక ఏకీకృత వ్యవస్థని తయారు చేసే అవకాశం దొరుకుతుంది.

దీనికి అనుసంధానంగా ప్రస్తుతం అమలులో ఉన్న బ్యూరోక్రాటిక్ రెఫరల్ వ్యవస్థని క్రియేటివ్ రెఫరల్ వ్యవస్థగా (పెత్తందారీ రెఫరల్ వ్యవస్థను సృజనాత్మక రెఫరల్ వ్యవస్థగా) మార్చడం అవసరమవుతుంది. పైస్థాయి కేంద్రాలలో మాత్రమే మెడికల్ జ్ఞానం ఉత్పత్తి అవుతుందని కాక, కింది అన్ని స్థాయిలలో కూడా జ్ఞానం ఉత్పత్తి అవుతుందని అంగీకరించాలి. జ్ఞానం ఎల్లప్పుడూ పైనుండి కింది స్థాయిలకు, అంటే ఒకే దిశలో ప్రవహిస్తుందని కాకుండా, క్రియేటివ్ రెఫరల్ వ్యవస్థలో జ్ఞానం రెండు దిశలలో ప్రవహించే క్రమంగా గుర్తించాలి. ఇక్కడ గ్లోబల్ జ్ఞాన ప్రవాహ దిశ పైనుండి కింది స్థాయికి ఉంటే, స్థానికంగా ఉత్పత్తి అయిన జ్ఞాన ప్రవాహ దిశ కింది నుండి పైస్థాయికి ఉండడం మూలాన ఈ రెండూ ఒకదానికొకటి బలపరచుకొనే క్రమంలో జ్ఞానం వృద్ధి పొందుతుంది. అంతే కాకుండా స్థానిక జ్ఞానం కూడా ఎంతో విలువైనదిగా గుర్తింపు పొంది పబ్లిక్ సమాచారంగా మారడంతో, ఇతర ప్రాంతాలలో కూడా ఇటువంటి సమస్యలకు ఆరోగ్య కేంద్రాలలో చికిత్స లభ్యమవుతుందనే నమ్మకం ప్రజలకు కలిగి, వారు ఈ సేవలను వినియోగించుకునే అవకాశం పెరుగుతుంది.

స్థానిక సమస్యలకు గ్లోబల్ జ్ఞానం ద్వారా సమాధానం దొరకనప్పుడు లేదా ఉన్న సమాధానం ఉపయోగపడనప్పుడు ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతి ద్వారా 'డాక్టర్లు' సమాధానం రాబట్టే ప్రయత్నాలు చేస్తారు. వీరు స్థానికంగా వైద్యం చేసే అలోపతి ప్రాక్టీషనర్స్ అవవచ్చును. వీరు కాకుండా హోమియోపతి, ఆయుర్వేద, ప్రకృతి వైద్యం తదితర వైద్య విధానాలకు చెందిన వారు కూడా కావచ్చును. గ్రామ ప్రజల ఆరోగ్య సమస్యలకు వీరు చేసే వివిధ ప్రయత్నాలు, విజయవంతమైనా, విఫలమైనా కూడా, వీటన్నింటిని డాక్యుమెంట్ చేయవలసిన అవసరం ఉంది. అంటే రోగికి సంబధించి ఒక కేసు హిస్టరీ తయారు చేసి, అందులో రోగ లక్షణాలు, రోగ నిర్ధారణ విధానాలు, చికిత్సా పద్ధతులు, దాని పర్యవసానాలు రికార్డు చేసి పబ్లిక్ సమాచార పరిధిలో భాగంగా చేసి, ఇటువంటి ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయదలచిన 'డాక్టర్ల'కు అందే సదుపాయం కల్పించాలి. ఇలా గ్రామంలో ప్రజలు ఆరోగ్య స్థితికి సంబంధించిన వివరాలు నమోదు కావడంతో వారి చికిత్సకి సంబంధించి వ్యూహాత్మకంగా ముందడుగు వేసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా వివిధ వైద్య విధానాల కలయికతో మెడికల్ జ్ఞానం బహుముఖంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉంటాయి.

ఈ క్రమంలో 'అందరికీ ఆరోగ్యం' అందించాలనే లక్ష్యం చేరుకోవడానికి అవసరమైన రెండు షరతులు – సమర్థవంతమైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండడం, ప్రజలు తమ రోగ లక్షణాలను బయట పెట్టడానికి ప్రోత్సాహం కలగడం నెరవేరుతాయి. ఈ జ్ఞానంలో వృద్ధి ఆచరణలో మానవ వనరుల అభివృద్ధితో జోడింపబడి, దేశ అభివృద్ధికి దారితీసే అవకాశం కలుగుతుంది.

(రచయిత సామాజిక శాస్త్రవేత్త) వీ

లక్షింపేటలు జరుగుతున్నాయి.. మరి నక్సల్బరీలో?

దళితులపై దాడులూ, మారణకాండలూ నిత్యం జరుగుతూనే ఉన్నాయనీ, వీటికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలనీ, అంతిమంగా కుల నిర్మూలనకు పాటుపడాలనీ అంటున్నారు **చిమ్మె జాన్ బర్నబాస్**

భారత విప్లవోద్యమ చరిత్రలో 'నగ్జల్‌బరీ'కి ఒక ప్రత్యేక స్థానం ఉంది. భూస్వామ్య, రాజ్య మద్దతుతో ఉన్న దోపిడీ పాలకశక్తులకు వ్యతిరేకంగా, సామూహికంగా రైతాంగ కూలీలు సాయుధులై చేసిన తిరుగుబాటే నగ్జల్‌బరీ. అంతవరకూ ఈ దేశంలో ఉన్న అన్ని ఉద్యమ శక్తులనూ మేల్కొల్పి, ఈ దేశంలో 'విప్లవం సాధించడానికి ప్రజలకు మావో ఆలోచనా విధాన వెలుగులో, ప్రత్యామ్నాయ రాజకీయ పోరాటాలను తీర్చిదిద్దడం ఎలాగో, నగ్జల్‌బరీ గొప్ప గుణపాఠాలను నేర్పించింది. ఇట్లుండగా, దేశంలో కుల వ్యవస్థ నిర్మూలనకు ఏ విధంగా కృషి కొనసాగించాలో డా. అంబేద్కర్ కొన్ని మార్గాలనూ, సూచనలనూ సూచించి, పాటించి నిర్దేశించాడు. అయితే 1956 డిసెంబర్ 6న తాను మరణించిన తర్వాత ఇప్పటికీ అంటే దాదాపు 56 సంవత్సరాల తర్వాత కూడా కుల నిర్మూలనా పోరాటాలు ఈ దేశంలో ఎందుకు నిర్మించబడడం లేదు? ప్రజాస్వామిక హక్కుగా దళితులు జరిపే పోరాటాలకు కనీస మద్దతు కూడా నేడు కరువైన పరిస్థితులలో, దళితుల పోరాటాలు నెడుతున్నాయి. కారంచేడు జరిగినపుడు (1985 జూలై 17) ఈ దేశంలో మరో కారంచేడు జరగడానికి వీల్లేదన్నాం. 1991 ఆగస్ట్ 6న గుంటూరు జిల్లా చుండూరులో దళితులపై హత్యాకాండ కొనసాగింది. దీని కొనసాగింపుగానే, నీరుకొండ, ఇప్పుడు లక్షింపేట (విజయనగరం - శ్రీకాకుళం జిల్లాల సరిహద్దు గ్రామం) ఘటన జరిగింది (జూన్ 12, 2012).

ఈ మొత్తం ఘటనల వెనుక భూస్వామ్య, కుల వ్యవస్థ, రాజ్యం (ప్రభుత్వం) సహకారం ఉందనేది సుస్పష్టం. అటువంటప్పుడు లక్షింపేట దళితులపై జరిగిన హత్యాకాండను నిరసించే వారమంతా, అక్కడి దళితులకు న్యాయం కోరేవారంతా, అక్కడ భూమి దళితులకు పంచాలని మాత్రమే, కాకుండా మరో లక్షింపేట ఈ రాష్ట్రంలోగానీ, ఈ దేశంలోగానీ జరగకుండా, ఒక 'ప్రత్యామ్నాయ రాజకీయ పోరాటం'గా తీర్చిదిద్ద బడవలసిన అవసరం ఉంది. ఎందుకనగా, మనపై (దళితులపై) దాడులు చేసిన వారు, చేయించిన వారు, తమకున్న కులబలం చేత, ప్రభుత్వం అండచేత, కొన్ని సమీకరణల చేత, ఏదో ఒక విధంగా కొన్ని సంవత్సరాలలో బలోపేతమవుతున్నారు. వారికిలాంటి సంఘటనలు ప్రమోషన్ (ఎదుగుదల)గా ఉపయోగపడుతున్నాయి. కానీ అందులో మరణించిన వారి కుటుంబాబు ఏ ఎదుగుదల లేక, ప్రభుత్వ, ప్రభుత్వేతర సహకారం కొంత అందినప్పటికీ) తమకున్న విద్యనూ, విజ్ఞానాన్నీ, చౌరవనూ కూడా ఉపయోగించుకోలేని దుస్థితిలోనికి నెట్టబడుతున్నవి.

ఈ రాష్ట్రంలో గానీ, దేశంలోగానీ ఇప్పటివరకూ జరిగిన, జరుగుతున్న అనేక పోరాటాలలో సమిధలవుతున్నది దళితులూ, మరికొన్ని బడుగు, అణచివేయబడ్డ కులాలు మాత్రమేనన్నది సుస్పష్టం. కొంతమంది అగ్రకులస్తులలోని మేధావులు సైతం ఈ దేశ వ్యవస్థ సమూల మార్పును కాంక్షించేవారు, తమ జీవితాలను కూడా త్యాగం చేశారు. వారి త్యాగాలను కొనియాడకుండా ఉండలేం. ఒకవేళ వారి కృషిని గుర్తించకపోతే, చరిత్ర మనల్ని క్షమించదు.

దళితులు తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం, ఈ దేశంలో వేళ్లూనుకొని ఉన్న కుల వ్యవస్థను నిర్మూలించడానికి జరిపే అన్ని ప్రత్యక్ష పోరాటాల కన్నా, అగ్రకుల భూస్వామ్యశక్తులనూ, వారి తాబేదార్లనూ, అధికార వ్యవస్థనూ కుప్పకూల్చవలసిన అవసరం ఉంది. అందుకు మరింత త్యాగంతో కూడుకున్న ప్రజా సంఘటనను నిర్మించాలి. ఈ దేశంలో ఏదో ఒక మూలన, ప్రతిరోజూ దళితులపై, మహిళలపై, బలహీనవర్గాలపై అగ్రకుల భూస్వాములు దాడులు చేస్తూనే ఉన్నారు. తమ దురహంకారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదంతా, ఒక పథకం ప్రకారం, పద్ధతి ప్రకారం జరుగుతూ ఉంది. ఉన్న చట్టాలు కూడా ఏదో ఒక రకమైన ఒత్తిడి ఉంటే తప్ప పనిచేయడం లేదు. ప్రశ్నించేవారు కూడా తమ శక్తి కొద్దీ ప్రశ్నించినప్పటికీ, పోరాడుతున్నప్పటికీ ఈ ప్రభుత్వాల అండ, చట్టం అండ కూడా కొద్దో గొప్పో వారికి ఉంది కాబట్టి, ఏదో ఒక మూలన ఇలాంటి సంఘటనలు కొనసాగిస్తున్నారు. పోరాడే వారు, పోరాటాలకు సహకరించే వారు, ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ నిర్మాణం జరగాలని కోరుకునే వారు మరింత త్యాగంతో ఈ పోరాటాలను ఉధృతపరచవలసి ఉంది.

ఈ దేశంలో భూస్వామ్య వ్యవస్థ పునాదులు పటిష్ఠంగా ఉన్నాయనేది అప్పుడప్పుడూ మనకు గుర్తు చేయడానికి ఇలాంటి సంఘటనలు సుస్పష్టం చేస్తున్నప్పుడు, మనం కూడా ఉన్నామని రుజువు చేయడానికి, మరిన్ని నగ్జల్బరీలను సృష్టించవలసిన అవసరం ఉంది. అగ్రకుల దురహంకారుల సమీకరణలకు ప్రత్యామ్నాయంగా, ఈ దేశంలో అత్యాచారాలను, అన్యాయాలను, కుల వ్యవస్థను వ్యతిరేకించే శక్తులన్నీ ఎందుకు ఏకీకరణ కావడం లేదు? లేదా జరగడం లేదు? ఆ దిశగా కూడా ఆలోచించడం లేదు. వ్యవస్థలో ఉన్న లోపాలను ప్రశ్నిస్తున్న మనం, 'కుల వ్యవస్థ నిర్మూలన' కోరుతున్న మనం అందుకు ఎంతమేరకు పోరాడుతున్నామో కూడా ప్రతి ఒక్కరం సింహావలోకనం చేసుకోవాలి.

కారంచేడు సంఘటనకు బాధ్యులైన (ఏదో ఒక మేరకు) దగ్గుబాటి వెంకటేశ్వరరావు (ఎన్‌టిఆర్ అల్లుడు) భార్య ఇప్పుడు కేంద్రంలో మంత్రిగా, మానవ వనరుల శాఖను నిర్వహిస్తున్నారు. చుండూరుకు

ఏదో ఒక మేరకు బాధ్యుడైన ఆలపాటి ధర్మారావు (అప్పటి న్యాయశాఖ మంత్రి) వారి వారసుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. ఇదే విధంగా లక్షింపేట ఘటనకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరించిన బొత్సా సత్యనారాయణ కూడా రేపు కేంద్రమంత్రో, లేదా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరంలేదు. 1989-1994 మధ్య రాష్ట్ర హోంమంత్రిగా ఉన్న మైసూరారెడ్డి - ఇప్పుడు రెండు పార్టీలు మార్చాడు. ఇటీవలే రాజ్యసభ సభ్యునిగా (తెలుగుదేశం) పదవీ విరమణ పొందాడు. ఇతను కూడా రేపు వైకాపాలో మరికొన్ని పదవులు పొందే అవకాశం లేకపోలేదు. మరి వీరి చేత, ఎన్‌కౌంటర్ల పేరు మీద, కుల వ్యవస్థ పేరు మీద, అధికార అండతో చంపబడిన వాళ్లు, వారి కుటుంబాలూ అస్తవ్యస్థంగా తయారయ్యాయి. వారు కూడా వ్యవస్థ మార్పు కోరుతున్నవారే కదా. మరి వారు చేసిన త్యాగాలకూ, పోరాడిన విలువలకూ నిజమైన నివాళులు ఎప్పుడు? విప్లవ కార్యాచరణను కొనసాగించడం ఒక్కటే పరిష్కారమా? విప్లవ కార్యాచరణ వెలుగులో, ఈ దేశంలో దళితులు ఒక నగ్జల్బరీ సృష్టించాలి. లేకుంటే వేళ్లానుకొని ఉన్న భూస్వామ్య శక్తులు, ఏదో ఒక రూపేణా, సమీకరించబడి మనపై దాడులు జరిగే ప్రమాదం పొంచి ఉంది. ఒక ఉద్యమకారున్ని, లేదా ఒక విప్లవ మేధావిని తయారు చేసుకోవడం నేటి పరిస్థితులలో ఎంత కష్టమో మన కార్యాచరణలో మనకు తెలిసిందే. ఒక భూస్వామి పోతే మరో వారసుడు వారికి వెంటనే తయారవుతున్నాడు. వారి రాజ్య వ్యవస్థ (ప్రభుత్వం-పోలీసులు) సహకారం కూడా తోడవుతున్నది. కానీ, ఎన్నో సమస్యలతో, సంక్లిష్టతతో కూడుకున్న నేటి సమాజంలో దళితులకు, వారి సమస్యలకు, వారిపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించడం, ప్రతీకారం తీర్చుకోవడమే నిజమైన పరిష్కారం. 'చట్ట ప్రకారం శిక్షలు పడడం', ఆ విధంగా కోరుకోవడం కూడా తప్పిదమే అవుతుంది. ఇది చరిత్ర చెపుతున్న సత్యం, ఈ రాజ్య వ్యవస్థలోనే పరిష్కారం కోరుకోవడం, వెతుకులాడడం కూడా అజ్ఞానం అవుతుంది. ఇది మన అనాలోచిత ధోరణికీ, వాస్తవికతకూ విరుద్ధం అవుతుంది. పోగొట్టుకున్న చోటే వెతుకులాడడం వాస్తవికతకు నిదర్శనం. ఎక్కడ మనం అణచివేతకు గురవుతున్నామో, అక్కడే ప్రతిఘటనను నిర్మించాలి. ప్రత్యామ్నాయ వ్యవస్థను తయారుచేసుకోవాలి. లేదంటే భవిష్యత్తును ఊహించడం కష్టమవుతుంది.

విప్లవ కార్యాచరణ వెలుగులోనే కుల వ్యవస్థ నిర్మూలనా పోరాటం ఈ దేశంలో నిర్మించబడాలి. కుల నిర్మూలనా పోరాటాలకు కొనసాగింపుగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం కూడా తీర్చిదిద్దాలి. ఎందుకంటే కులం అనేది భూస్వామ్య వ్యవస్థ పునాదిగా ఏర్పడినదే కాబట్టి. ఆ భూస్వామ్య వ్యవస్థను కాపాడడమే కాకుండా, దానికి ఈ దేశంలో మరో రూపంలో కొనసాగించబడుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ, వీటన్నింటికీ గాడ్‌ఫాదర్ లాగా ఉన్న సామ్రాజ్యవాద వ్యవస్థను ప్రతిఘటించడం కూడా కుల నిర్మూలనా పోరాట కార్యక్రమంగా ఉండాలి. కేవలం కులాన్ని వ్యతిరేకించడం, కుల వ్యతిరేక ప్రచారంతో ఈ దేశంలో మార్పు సంభవించదు. అగ్రకుల దురహంకారాన్ని ప్రతిఘటించడానికి, ఇప్పుడున్న దళిత సమూహాలకు ప్రత్యామ్నాయ నిర్మాణ పోరాట క్రమం లేదు. ఉదాహరణకు, లక్షింపేట దళితుల పోరాట డిమాండ్లన్నీ పరిష్కారమయ్యాక మరో లక్షింపేట లాంటి సంఘటన జరిగేంత వరకూ వేచి ఉండకుండా దళిత ఉద్యమశక్తులూ, కుల నిర్మూలనా పోరాట శక్తులూ, వీరికి సహకరించే మరికొంత మందికి ప్రత్యామ్నాయ నిర్మాణ కృషి లేదు. కేవలం అధ్యయనం తప్ప. కానీ జరుగుతున్న సంఘటనలకూ, జరిగిన సంఘటనలకూ ప్రతీకారం తీర్చుకోవడం కూడా లక్ష్యం కావాలి. తమకు తాముగా (వాలంటీర్లుగా) త్యాగంతో ముందుకు వచ్చే వారిని సమీకరించాలి. వారికి కావలసిన మానసిక ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇవ్వగలగాలి. వారికి పోరాట కార్యాక్రమాన్ని నిర్దేశించాలి. ఆ విధమైన కృషి జరగకుంటే భవిష్యత్తులో దళిత పోరాట శక్తులకు రక్షణ ఉండదు. కేవలం విద్యావంతులుగా, ఉద్యోగులుగా ఆర్థిక వనరుతో జీవించడమే కాకుండా, వ్యవస్థ మార్పు కోరుకునే వారిగా, దళితులను నగ్జల్బరీ వైపు నడపించాలి. గ్రామ, గ్రామాన దళిత యువకులు సామ్రాజ్యవాద విషసంస్కృతికి లోను కాకుండా, ఆ విషవలయంలో చిక్కుకోకుండా వారికి ప్రజాస్వామిక విప్లవ సంస్కృతిని నేర్పించాలి. ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించాలి. ఈ పోరాటం అగ్రకుల వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా తీర్చిదిద్దబడాలి. యాభై సంవత్సరాల నగ్జల్బరీ వెలుగులో జరుగుతున్న పోరాటాలు దళితులపై జరుగుతున్న దాడులకు ప్రత్యామ్నాయ విధానాలను ఆలోచించాలి. లేదంటే ఈ పాలకులు, వారి తాబేదార్లు, అధికార వర్గాలు, భూస్వామ్య శక్తులు వారందరికీ సహకరించే శక్తులన్నీ బలపడే అవకాశాలున్నాయి.

(రచయిత న్యాయవాది,
ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

కొడవటిగంటి రోహిణీప్రసాద్ సంస్మరణ సభ విశేషాలు

కొడవటిగంటి రోహిణీప్రసాద్ సంస్మరణ సభ సెప్టెంబర్ 15 సాయంత్రం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కొడవటిగంటి రోహిణీప్రసాద్ మిత్రుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ అధ్యక్షత వహించగా, వక్తలుగా జనసాహితి దివికుమార్, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు గీతా రామస్వామి, కొడవటిగంటి కుటుంబ సన్నిహిత మిత్రులు కాకరాల, ప్రముఖ హేతువాది బాబు గోగినేని, విప్లవ రచయితల సంఘం నేత వరవరరావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు కొడవటిగంటి రోహిణీప్రసాద్ సాహిత్య వ్యాసంగంలో చేసిన కృషినీ, ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్నీ గుర్తు చేసుకున్నారు. అణు భౌతిక శాస్త్రవేత్తగా, పాపులర్ సైన్స్ రచయితగా, సంగీతకారుడిగా, వక్తగా ఆయన సాగించిన బహుముఖ కృషిని కొనియాడారు. ఇంకా ఎన్నో రాయాలనీ, మరెన్నో పంచుకోవాలనీ అనుకుంటూ ప్రణాళిక వేసుకొని పనిచేస్తున్న క్రమంలో అర్థాంతరంగా అనారోగ్యంతో చనిపోవడం బాధాకరమని అన్నారు.

బూటకపు ప్రజాభిప్రాయ సేకరణలు

ఇప్పటికే పలు కాలుష్యకారక పరిశ్రమలతో సతమతమవుతున్న విశాఖ జిల్లా ప్రజలు అదనంగా కోక్ ప్లాంట్ నెలకొల్పడాన్ని వ్యతిరేకిస్తూ చేసిన వీరోచిత ప్రతిఘటనను వివరిస్తున్నారు* **పి.వి. రమణ

విశాఖ జిల్లా, రాంబిల్లి మండలం బొటిమెట్ట గ్రామం వద్ద పెట్రోలియం తనకు కోక్‌ప్లాంట్ ఏర్పాటుకు హైదరాబాద్‌కు చెందిన సన్వీరా ఇండస్ట్రీస్ కావల్సిన పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ అనే తతంగాన్ని జూన్ 6న ఏర్పాటు చేసింది. పర్యావరణ చట్టం – 1986 ప్రకారం, కంపెనీ నిర్వహణ గురించి, పర్యావరణంపై దాని ప్రభావం గురించి ప్రజలకు స్థానిక భాషలో ముందుగా తెలియజేయాలి. కంపెనీ అదేమీ పాటించకుండానే, బాండిక్స్ కంపెనీ, ఇతర కంపెనీల వలన నష్టపోయిన వారికి నష్ట పరిహారం చెల్లించడానికి జాయింట్ కలెక్టరు వస్తున్నారని అబద్ధపు ప్రచారం చేసి, మోసపూరిత ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడానికి ప్రయత్నించారు.

పెట్రోలియం కోక్ ప్లాంట్ ఏర్పాటయితే ప్రమాదకరమైన, విషపూరితమైన రసాయనాలు, భారలోహాలు విడుదల అయి, చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆరోగ్యాన్ని కబళిస్తాయి. 334 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్లాంట్ కోసం 77 ఎకరాల భూమిని సేకరించారు. 4.60 లక్షల టన్నుల కాల్సినైట్ పెట్రోలియం కోక్ ఉత్పత్తితో పాటు, 25 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నారు. ఈ కంపెనీ విడుదల చేసే కాలుష్యం వలన తమ ఆరోగ్యాలు దెబ్బతింటాయని, లాలం కోడూరు, కొత్త కోడూరు, పూడిమడక, కడపాలెం, గుర్జాపాలెం, రామచంద్ర పాలెం, వెంకయ్యపాలెం, వాసిట్టిపాలెం, నక్కపల్లి, అప్పన్నపాలెం, లక్ష్మీపురం తదితర 36 గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ తీర ప్రాంత గ్రామాలలో అధిక శాతం మత్స్యకారులే జీవిస్తున్నారు.

ప్రపంచంలో ప్రముఖ పెట్రోలియం కోక్ ఉత్పత్తిదారుల్లో రైన్ సిబఐ కార్బన్ కంపెనీ ఒకటి. దీనికి అమెరికాలో ఏడు ప్లాంట్లు ఉన్నాయి. ఇదే కంపెనీ విశాఖపట్టణంలో ఏడాదికి 5.80 లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తున్నది. అమెరికా ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ సంస్థ నియంత్రణలో భాగంగా సేకరించిన సమాచారం ప్రకారం పెట్రోలియం కోక్ పరిశ్రమల నుండి సీసం, పాదరసం, పాలీసైక్లిక్ ఆరోమెటిక్ హైడ్రోకార్బన్ (పిఎఎచ్) లాంటి ప్రమాదకరమైన, విషపూరితమైన రసాయనాలు, భారీలోహాలు విడుదలవుతాయి. వీటి వలన ప్రజలు ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. పిల్లల్లో బుద్ధిమాంద్యం, పెద్దలకు కాన్సర్, గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. భూగర్భ జలాలు కలుషితమవుతాయి.

అస్సోంలో 'బ్రహ్మపుత్ర కార్బన్ లిమిటెడ్ అనే కంపెనీ అనుమతులు లేకుండా నడుస్తోంది. దీని వలన కాలుష్య బాధితులైన ప్రజలు తీవ్ర ఆందోళన చేశారు. దగ్గరలోనే ప్రవహించే తునియా వాగు కలుషితమై నీటి కొరతతో బాధపడుతున్నారు. వాగు అంచున మొక్కలూ, పొదలూ కూడా మొలవడం లేదు. దాంతో అక్కడి విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో, అస్సోం కాలుష్య నియంత్రణ మండలి ఫ్యాక్టరీని మూసివేసేందుకు చర్యలు తీసుకొంది.

సన్వీరా ఇండస్ట్రీస్ వారు పర్యావరణ ప్రభావం గురించి వాస్తవ సమాచారాన్ని దాచిపెట్టి, ఈ ప్రాజెక్టు వలన ఎటువంటి ప్రమాదాలూ జరగవని, పూర్తి అవగాహనలేకే కొంతమంది అభ్యంతరాలు చెపుతున్నారని ప్రచారం చేస్తున్నారు.

స్టీల్ ప్లాంట్, సింహాద్రి పవర్ ప్లాంట్, ఫార్మాసిటీ, గంగవరం పోర్టు, అచ్యుతాపురం సెజ్‌లున్న పారిశ్రామిక ప్రాంతం పరిసరాలలో ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని పరిశ్రమలన్నీ కలిగించే కాలుష్య స్థాయిని (కుములేటివ్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్) అంచనా వేసి ప్రభావాన్ని నిర్ధారించాలి. కాని సన్వీరా ఇండస్ట్రీస్ తయారు చేసిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో ఈ అంశాలు ఏవీ లేవు. ఇదొక్కటే పరిశ్రమ అక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు భ్రమ కల్పించే నివేదిక తయారు చేశారు. ఇటీవల విడుదలైన 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఇటువంటి పరిశ్రమలు కుములేటివ్ అంచనా తప్పనిసరిగా పొందుపరచాలి. ఇవేమీ చెయ్యకుండా పబ్లిక్ హియరింగ్ నిర్వహించ బూనడం ప్రజల్ని మోసం చేయ్యడానికేనని అర్థం అవుతుంది.

ప్రజలు కేంద్రంగా అభివృద్ధి సాధన ఉద్యమం, ఇతర ప్రజా సంఘాలతో కలిసి ఈ పరిశ్రమ వలన విడుదలయ్యే కాలుష్యం గురించి, దాని ప్రభావం గురించి ప్రజల్లో విరివిగా ప్రచారం చేశారు. ప్రజలకు నిజాలు తెలవకుండా, జిల్లా అధికార యంత్రాంగం సహాయంతో కంపెనీ జరపబోతున్న ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని, కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా కలెక్టర్ ఆఫీసుల వద్ద నిరసనలు ప్రదర్శనలు జరిపారు.

వీటినేమాత్రం ఖాతరు చేయకుండా జూన్ 6న ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఏర్పాట్లు ప్రారంభించారు. దీంతో చైతన్యవంతులైన ప్రజలు నాల్గవ తేదీ రాత్రే సమావేశానికి తెస్తున్న సామాగ్రి టెంటులు, కుర్చీలు, బల్లలు, జనరేటర్‌లను అడ్డుకొన్నారు. అయినా అధికారులు, పోలీసుల సహాయంతో కార్యక్రమాన్ని కొనసాగించారు.

6వ తేదీ ఉదయం, 'ప్రమాదకరమైన పరిశ్రమను ఏర్పాటు చేసి మా బతుకులు నాశనం చెయ్యొద్దు' అంటూ ముప్పై ఆరు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తీవ్రమైన నిరసన తెలియజేశారు. గ్రామాల్లో

ఆరోగ్యరంగంలో ఏం జరుగుతోంది?

***ఒక పకడ్బందీ విస్తృత కుట్రలో భాగంగా సామ్రాజ్యవాదులు, వారి తొత్తులైన దళారీ పెట్టుబడిదారులు ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారని అంటున్నారు* లోకసంచారి**

సామ్రాజ్యవాదులు, వారి తొత్తులైన వివిధ దేశాల దళారీ పెట్టుబడిదారులు కలిసి నడుపుతున్న 'ప్రజాస్వామ్యం' అనే నాటకం, మీ వ్యక్తిగత జీవితాన్ని (అంటే మిమ్మల్ని, మీరు అత్యంతగా ప్రేమించే మీ కుటుంబ సభ్యుల్ని) ఎలా నాశనం చేస్తుందనే విషయం తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే, సామ్రాజ్యవాదులు, దళారీ పెట్టుబడిదారులు కలిసి ప్రపంచ ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న విస్తృత కుట్రను అర్థం చేసుకుంటే, మొత్తం జనాభాలో 0.5 శాతంగా మాత్రమే ఉన్న పాలకవర్గాల వికృత నిజస్వరూపం, విశ్వరూపం మీకు సులభంగా అర్థమవుతుంది. మానవ సమాజ మనుగడకు ఇప్పుడున్న అత్యంత అమానవీయ, క్రూర సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంత ప్రమాదకరమో మీకు అర్థమవుతుంది. ఆరోగ్యరంగంలో అమలవుతున్న ఈ విస్తృత కుట్రనే ఎందుకు అర్థం చేసుకోవాలంటే ఈ 0.5 శాతం పాలకవర్గాల విస్తృత కుట్ర చేస్తున్న వినాశనం ఇప్పటికే మీరు అత్యంతంగా ప్రేమించే మీ కుటుంబ సభ్యుల, మీ శరీరంలోని ప్రతి కణంలోకి వెళ్లిపోయింది. ఇంతకంటే వ్యక్తిగతమైన నష్టం మనకు వేరే ఏ రంగంలో కనబడదు.

కులాలు, మతాలు, దేశాలు, జాతులు, చర్మ రంగులకు అతీతంగా 99.5 శాతం ప్రపంచ ప్రజలపై 0.5 శాతం పరాన్నభుక్కు, దోపిడీ పాలక వర్గాలు ప్రపంచ ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేసే ఒక విస్తృత కుట్రను ఏకంగా మన ఇంటిలోకి, మన వంటింటిలోకి, మన తిండిలోకి, చివరికి మన శరీరంలోనికి ఎక్కించి మనల్ని రోగగ్రస్తులను చేసి, వారి డయాగ్నాస్టిక్స్-హాస్పిటల్స్-ఫార్మా విషవలయంలోకి నెట్టి, మనం చచ్చేంత వరకు పేషెంట్‌గా (ఓపిగ్గా) వారికి లాభాల పంటను పండించే పేషెంట్ (రోగి)గా మారుస్తున్నారు.

కొన్ని సంవత్సరాల క్రితం వీరి విస్తృత కుట్రకు బలి అయిన నేను, ఈ కుట్రలో భాగమయిన 'జీవన విధాన రోగాల' (లైఫ్‌స్టైల్ డిసీజెస్) చాంతాడంత లిస్ట్‌లోని కొన్ని రోగాల బారినపడ్డాను. నిజానికి అప్పటి వరకు నాది అనారోగ్యకర జీవన విధానం ఏమీ కాదు. అయినా, వారి 'జీవన విధాన రోగాల' కుట్రకు బలి అయ్యాను. అమెరికా, యూరప్‌లోని డాక్టర్లకు, ఇండియాలోని ఫైవ్‌స్టార్ హోటళ్లను తలదన్నే కార్పొరేట్ హాస్పిటల్స్‌లోని ఫారిన్-రిటర్న్‌డ్ డాక్టర్లకు కూడా నేను చూపించుకున్నాను. అందరూ వివిధ రకాల డయాగ్నాస్టిక్స్ టెస్ట్‌లు చేపించి, బతికినంత కాలం ఈ ట్యాబ్లెట్లను బుక్కుతూ ఉండాలని చెప్పి, డబ్బులు నొక్కుతూ ఉన్నారే కాని, కొన్ని నెలలు వాడిన తర్వాత ఇక ట్యాబ్లెట్లు వాడనవసరం లేదని మాత్రం అనడం లేదు. అయినా పేషెంట్‌గా ట్యాబ్లెట్లు బుక్కుతూ పోయాను. ట్యాబ్లెట్ల డోస్ పెంచుతూ ఉన్నారు, నా రోగాల తీవ్రత పెరుగుతూ ఉంది. ప్రపంచం గురించి మనకు ఎన్ని విషయాలు తెలిసినా, మన శరీరం గురించి, ఆరోగ్యం గురించి మనకు తెలియనప్పుడు, మనకు తెలిసింది చాలా తక్కువ అని నాకు అప్పుడు అర్థమయ్యింది. 'మనం ఎంత అజ్ఞానంలో ఉన్నామో తెలుసుకోవడమే

దండోరా వెయ్యకుండా, విషయాన్ని ప్రజలకు తెలియపరచకుండా ఎందుకింత రహస్యంగా సమావేశం జరుపుతున్నారని ప్రశ్నించారు. సమావేశాన్ని ప్రారంభించడానికి వస్తున్న నర్సీపట్నం ఆర్‌డిఓ కూర్మనాథ్‌ను, కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఉస్మాన్ ఆలీఖాన్‌ను సీతపాలెం వద్ద ప్రజలు అడ్డుకొని చాలాసేపు కదలనీయలేదు. మిగతా అధికారులను కూడా గ్రామంలోకి రానీయకుండా రోడ్డుపైన బైఠాయించారు. అధికారులతో వాదనలు కొనసాగించారు. దీని తరువాత ఆర్‌డిఓ, ఎఎస్‌పి తక్బీర్ ఇక్బాల్‌లు ప్రజల్ని రెచ్చగొట్టేలా మాట్లాడారు. పోలీసులు బలవంతంగా వేదిక వద్దకు వెళ్లడానికి ప్రయత్నించారు. దాంతో మత్స్యకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ తలెత్తింది. పోలీసులు లాఠీలతో ప్రజల్ని బాదడం మొదలెట్టారు. దాంతో మొత్తం ప్రాంతమంతా రణరంగంలా మారిపోయింది. ప్రజలు చేతికందిన కర్రలతో పోలీసులపై ఎదురు దాడిచేశారు. పోలీసులు వెనక్కి పారిపోయే వరకు తరిమికొట్టారు. మొత్తం ఘర్షణలో గ్రామస్తులకు, కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. ప్రజల ఆగ్రహానికి రెండు పోలీసు జీపుల అద్దాలు పగిలిపోయాయి.

ఇంత బీభత్సం జరుగుతున్నా, భారీ పోలీసు బలగాల మధ్య ఇన్‌చార్జీ జాయింట్ కలెక్టర్ డి. వెంకటరెడ్డి అధ్యక్షతన కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలంతా వ్యతిరేకించడంతో, తూతూ మంత్రంగా, హడావుడిగా పూర్తి చేసినారు. ప్రజల్ని చైతన్యపరిచేందుకు ప్రయత్నించిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులపై హత్యా ప్రయత్న నేరం 307 కింద తప్పుడు కేసులు పెట్టారు. దీన్ని అన్ని రాజకీయ పార్టీలూ, ప్రజాసంఘాలూ తీవ్రంగా ఖండించాయి.

కాలుష్యాన్ని విడుదల చేసి, తమ జీవితాలను నాశనం చేసే పెట్రోలియం కోక్ ప్లాంట్ నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోమని, ప్రాణాలైనా ఇస్తాం - ప్లాంట్ నిర్మాణాన్ని సాగనివ్వం అని అంటూ బూటకపు ప్రజాభిప్రాయ సేకరణ తతంగాన్ని చైతన్యంతో తిప్పికొట్టి రాంబిల్లి మండల ప్రజలు పోరాడే ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. ప్రజాస్వామ్యవాదులందరూ వారి పోరాటానికి మద్దతునివ్వాలి.

(రచయిత ట్రేడ్ యూనియన్ నాయకులు) వీ

జ్ఞానం' అని ఎవరో మేధావి అన్న మాటలతో నాకు జ్ఞానోదయం అయ్యింది.

ఈ పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థను నమ్ముకుంటే, పుట్టగతులు లేకుండా పోతాను అని అర్థం చేసుకున్న నేను, ఇక నా ఆరోగ్య సమస్యలను నేనే స్వయంగా, పూర్తి సహజమైన పద్ధతుల ద్వారా నయం చేసుకోవాలని, నా పరిశోధన ప్రారంభించాను. మూడు సంవత్సరాలు వేరే ఏ పనీ చేయకుండా దేశ, విదేశ పుస్తకాలు, వ్యాసాలు వందల కొద్ది చదివి, ఎన్నెన్నో ప్రయోగాలు నాపైన చేసుకున్నాను. అమెరికా, యూరప్, ఇండియాకు చెందిన డాక్టర్లు నయం చేయలేని నా ఆరోగ్య సమస్యలు చివరకు ఏ రకమైన అల్లోపతి మందులు, ఆపరేషన్లు లేకుండా, పూర్తి సహజంగానే నయం అయ్యాయి. ఇరవై కిలోల బరువు తగ్గాను. అప్పట్లో ఎప్పుడూ నీరసంగా ఉండేది. ఇప్పుడు నీరసం ఛాయలు కూడా లేవు. నా పంటి సమస్య కూడ నయం అయ్యింది.

నాకున్న మోకాళ్ల నొప్పి పోవాలంటే ఐదు లక్షల రూపాయలకు పైగా ఖరీదయ్యే కీలు మార్పిడి ఆపరేషన్ తప్ప మరో మార్గం లేదని కార్పొరేట్ డాక్టర్లు 'రేటు' చెప్పారు. ఆ సమస్య కూడా నాకు సహజంగానే నయం అయ్యింది. నాకు ప్రొస్టేట్ గ్రంధి సమస్య ఉండేది. దానికి అమెరికా, యూరప్ దేశాల డాక్టర్లు జీవితాంతం మందులు వాడాలని చెప్పారు. ఆ సమస్య కూడా నయం అయింది. ఎం.డి. చదివిన స్పెషలిస్ట్ లకు కూడా అర్థం కాని ఒక చర్మ వ్యాధి సమస్య నాకు చిన్నప్పటి నుండి ఉండేది. ఈ సమస్య దానికదే నయం అయిపోయింది. నా షుగర్, బి.పి, కొలెస్ట్రాల్ అన్ని కూడా ఆరోగ్యకర స్థాయిలోనే ఎప్పుడూ ఉంటున్నాయి.

మొత్తం మానవ నాగరికతలో, అత్యంత అమానవీయమైన, క్రూరమైన నేటి సామ్రాజ్యవాదులు, వారి తొత్తులైన వివిధ దేశాల దళారీ పెట్టుబడిదారులు ప్రపంచ ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న విస్తృత కుట్రను అర్థం చేసుకొని, ఆ కుట్రకు మొత్తానికి మొత్తంగా బలి కాకుండా ఉండాలనుకుంటే, ఆ ఉన్న పరిమితమైన ప్రత్యామ్నాయ సహజ జీవన విధానంలోకి వెళ్లగలిగితే మన ఆరోగ్యం విషయంలో మంచి మార్పులు జరుగుతాయి. నా విషయంలోనూ అదే జరిగింది. అంతే తప్ప, ఇది కొందరికే జరిగే అద్భుతం ఏమీ కాదు. వ్యక్తిగత స్థాయిలో ఎవరు ఈ ప్రయోగం చేసినా వారికి ఒనగూడే ప్రయోజనం ఇది. అయితే, ఒక అత్యంత క్రూర వ్యవస్థ తన నాశన కాలపు కుట్రల్ని 99.5 శాతం ప్రజల మీద రుద్దుతున్నప్పుడు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం అసంభవం. అది కేవలం 99.5 శాతం ప్రజలు తమకు తాము స్వయంగా నడిపించుకునే నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థలోనే సాధ్యం. అదే సమయంలో, ఈ దోపిడీ వ్యవస్థలో కూడా వారి కుట్రకు బలికాకుండా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కాని, ఇప్పటికే వారి కుట్రకు బలి అయి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని ప్రత్యామ్నాయ సహజ జీవన విధాన పద్ధతుల ద్వారా నయం చేసుకోవడంలో కాని వ్యక్తిగతంగా మనం చేయగలిగేది కూడా చాలానే ఉంది. కనీసం అవి చేసినా మన ఆరోగ్యం విషయంలో మంచి మార్పులు జరుగుతాయి.

ఆరోగ్య రంగంపై నేను జరిపిన పరిశోధనలో నాకు స్పష్టంగా అర్థమయినదేమంటే ఈ కుట్రల కాలంలో ఆరోగ్యంగా ఎలా ఉండాలో ఎవరికి వారు తెలుసుకొని, ఆచరించగలిగేవన్నీ ఆచరించకపోతే ఆరోగ్యంగా బతకడం అసంభవం. ఈ రోజు ఆరోగ్యం గురించి తెలుసుకోవడమంటే, ఈ అమానవీయ సామ్రాజ్యవాదుల, వారి తొత్తులైన దళారీ పెట్టుబడిదారీ క్రూరుల కుట్రలను తెలుసుకోవడమే. అసలు ఈ రంగం, ఆ రంగం అనే తేడా లేకుండా, ప్రతి రంగంలో అడుగడుగునా ఈ క్రూరులు మన ఆరోగ్యాన్ని నాశనం చేసే విస్తృత కుట్రను అమలు పరుస్తున్నారు. ఎంత దారుణమంటే, ఈ పెట్టుబడిదారీ మోసగాళ్లు 'ఆరోగ్యానికి మేలు చేసే ఉత్పత్తులు' అని చెప్పి, ఆ ఉత్పత్తులను తినడం వలన వచ్చే పోషకాహార విలువల గురించి వాటిపై ముద్రించి అమ్ముతున్న ఉత్పత్తులు కూడా ఆరోగ్యానికి ప్రమాదకరం. చివరికి (మల్టీ) విటమిన్ ట్యాబ్లెట్లు కూడా హానికరమే. మూడు సంవత్సరాలు పరిశోధిస్తే నాకు తెలిసింది సముద్ర మంత కుట్రలో ఒక నీటి బొట్టంత మాత్రమే. నాలుగు పేజీల్లో సముద్రమంత విస్తృతి కలిగిన కుట్రను వివరించడం అసంభవం. కొంతైనా వివరించే ప్రయత్నం చేస్తాను. రానున్న సంచికల్లో కూడ వివరిస్తాను.

మెజారిటీ డాక్టర్లు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు తమ స్వార్థం కోసం పాలక వర్గాల కుట్రలో భాగమై, వారి కుట్రలను క్షేత్రస్థాయిలో అమలు పరుస్తూ ఉన్నప్పటికీ, 99.5 శాతం ప్రజలపక్షం వహించే కొందరు మాత్రం ఈ జరుగుతున్న కుట్రలను బహిర్గతం చేస్తూ (ఎందుకంటే, వారూ, వారి కుటుంబ సభ్యులు కూడా పాలకవర్గాల వివిధ రకాల కుట్రలకు బలి అవుతున్నారని అర్థం చేసుకున్నారు కాబట్టి) ఎన్నెన్నో పుస్తకాలు, వ్యాసాలు రాసారు. డాక్యుమెంటరి ఫిల్ములు తీసారు. వీటిలో చాలావరకు ఇంటర్నెట్‌లో లభ్యమవుతాయి. మన జీవితకాలం కూడా సరిపోనంత సమాచారం ఉంది.

అనాగరిక సమాజాలు అని పిలువబడిన బానిస, భూస్వామ్య సమాజాల్లో కూడా ఆనాటి పాలకవర్గాలు మొత్తం ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేయాలనే కుట్రను అమలుపరిచిన దాఖలాలు ఎక్కడా చదవ లేదు. కానీ, ఎంతో 'నాగరిక'మైన, 'అభివృద్ధి' చెందిన, 'ప్రజాస్వామ్యం' అని పిలువబడే నేటి పెట్టుబడిదారీ సమాజంలో పరాన్నభుక్కు పాలకవర్గాలు చాలా వినూత్న పద్ధతులతో, చాలా మోసపూరితంగా ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి. ఉదాహరణకు చాలా మందికి టీ, కాఫీలు తాగే అలవాటుంది. దీని వలన ఏమి ప్రమాదం అని తెలుసుకోవాలనుకుంటే, ఇంటర్నెట్‌లో మీకు ఇబ్బడిముబ్బడిగా సమాచారం దొరుకుతుంది. టీ, కాఫీలను తాగడం వలన కలిగే లాభాలు అని రాసిన వెబ్‌సైట్‌లు పక్కనపెట్టి (ఎందుకంటే, అవి అన్ని కూడా ఏటా వేలకోట్ల డాలర్ల టీ,కాఫీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల ఎంగిలి మెతుకులతో నిర్వహించబడుతున్న వెబ్‌సైట్లు), వాటిని తాగడం వలన వచ్చే నష్టాల గురించి తెలిపే వెబ్‌సైట్లను చూడండి. మీరు టీ, కాఫీలలో ప్యాకెట్ పాలు వాడుతారు అనుకుందాం. పాల ప్యాకెట్‌లలోని పాలు ఎలా ప్రమాదకరం అని ఇంటర్నెట్‌లో వెతకండి. మీకు ఎంతో సమాచారం దొరుకుతుంది. దాదాపు అందరు నూనె, చక్కెర, ఉప్పులు వాడుతారు. అసలు చక్కెర, ఉప్పు, నూనె ఎలా తయారుచేస్తారు, వాటి వలన మనకు ఎలా ప్రమాదం, వీటిని ఏయే ప్రాసెస్డ్ తిండి పదార్థాల్లో వాడుతున్నారు, వాటిని తింటే ఏమి ప్రమాదం అనే విషయాలపై మీ జీవితకాలం కూడా సరిపోనంత సమాచారం ఇంటర్నెట్‌లో ఉంది.

ప్రపంచం మీద సగం రోగగ్రస్తులకు, సగం రోగాలకు చక్కెర, ఉప్పు, చెడు నూనెలే కారణం. టీ, కాఫీ, చక్కెర, ఉప్పు, చెడు నూనెలను

నియంత్రించి, ఇతర ఆరోగ్య వినాశకర ఆహార ఉత్పత్తులను (అంటే ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్ ఫుడ్‌లను), లిక్కరును నిషేధిస్తే, కేవలం మూడు నెలల్లోనే హాస్పిటల్స్, డయాగ్నాస్టిక్ సెంటర్లు, ఫార్మా కంపెనీలు దాదాపు దివాళా తీసే దశకు వస్తాయి. ఈ దోపిడీ పాలక వర్గాలు, ప్రజలపై రుద్దుతున్న మానసిక ఒత్తిడి, డిప్రెషన్ లాంటి సమస్యలను కూడా పొడగొట్టగలిగితే (అది కేవలం 99.5 శాతం ప్రజలచే నడపబడే నిజమైన ప్రజాస్వామ్యం లోనే జరుగుతుంది), అలాగే రోజువారి పోషకాహారం, శారీరక వ్యాయామం కూడా దీనికి తోడవుతే ఇక ప్రపంచంలోని రోగుల సంఖ్య 90 శాతానికి పడిపోతుంది. ఇవి కాకి లెక్కలు కావు. శాస్త్రీయ పరిశోధనల్లో 99.5 శాతం ప్రజలపక్షం వహించే వారు పరిశోధించి చెప్పిన విషయాలు. సహజమైన, ఆరోగ్యకరమైన జీవన విధానంలో ప్రమాదకర రోగాలు రావు. దశాబ్దాల కొద్ది కనీసం జ్వరాలు, తలనొప్పి కూడా రావు. (ఇంతటి కుట్రపూరిత, కాలుష్య, కల్తీ వ్యవస్థలో కూడా ఇరవై, ముప్పై సంవత్సరాల నుండి కనీసం జ్వరం కూడా రాని వ్యక్తులు ఉన్నారు.)

ఏ వ్యవస్థలోనైతే రోగిష్టుల సంఖ్య, రోగాల సంఖ్య, హాస్పిటల్స్, డాక్టర్ల సంఖ్య పెరుగుతూ ఉంటాయో, ఆ వ్యవస్థ పతనావస్థకు, వినాశనానికి చేరువ అవుతున్నదని అర్థం. హాస్పిటల్స్, డాక్టర్ల సంఖ్య పెరగడం, 'అభివృద్ధి'కి చిహ్నమని సామ్రాజ్యవాదుల, దళారీ పాలకవర్గాల విస్తృత కుట్రను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న వాళ్లు చేసే ప్రచారం. మనిషి ప్రకృతికి దగ్గరగా ఉంటూ, సహజ జీవన విధాన సూత్రాలు పాటిస్తే, మన శరీరమే ఒక అద్భుత డాక్టర్‌గా పనిచేస్తూ, తనలో వచ్చిన మార్పులను అదే గ్రహించుకొని, ఆ సమస్యలను నయం చేసుకుంటుంది. శరీరంలో ఉన్న సహజ డాక్టర్ వ్యవస్థే ఆరోగ్య సమస్యలను నయం చేస్తుంది. ఈ వ్యవస్థ ప్రతి మనిషిలో ఉంటుంది. మనం అసహజమైనది తినకుండా, పీల్చకుండా, తాగకుండా ఉంటూ, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసే పనులు చేయకుండా ఉంటూ, రోజువారీ పోషక పదార్థాలను సరిగా తింటే, మన శరీరమే నోబెల్ ప్రైజ్ పొందిన డాక్టర్ కన్నా వెయ్యి రెట్లు అత్యద్భుతంగా రోగాలను నయం చేస్తుంది.

అయితే, అత్యంత అమానవీయమైన నేటి పాలకవర్గాలు, మన శరీరంలో ఉన్న ఈ అత్యద్భుత శక్తిని విస్తృత కుట్రలో భాగంగా నాశనం చేసి, మనల్ని రోగాల పుట్టగా మార్చి, డయగ్నాస్టిక్స్-హాస్పిటల్స్- ఫార్మా కంపెనీల విష వలయంలోకి దింపి, మనం జీవితాంతం వారికి ఒక ఎ.టి.ఎం. డబ్బుల యంత్రంలా మారేట్టు చేస్తున్నారు.మనలో ఉన్న ఈ సహజ ఆరోగ్య వ్యవస్థను నాశనం చేస్తూ, మనం రోగాల పాలయ్యేట్లు చేస్తూ, మనల్ని వారి విష వలయంలోకి దింపి, మనచే అప్పులు చేపిస్తూ, భూములు, బంగారాలు అమ్మేట్టు చేసి వారు లక్షల కోట్లు గడిస్తున్నారు. ఇంత సులువుగా లక్షల కోట్లు సంపాదించే వ్యాపారం ప్రపంచంలో వేరే ఏదీ లేదు. చివరికి యుద్ధ ఆయుధ వ్యాపారాల్లో కూడ ఇంత లాభాలు లేవు.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 83,000ల మంది అత్యంత బడా పెట్టుబడిదారులు ఉన్నారు. వీరిలో దాదాపు రెండు వేల మంది భారత దేశానికి చెందిన బడాదళారీ పెట్టుబడిదారులు. గత సంచికలో వివరించినట్టు, ఈ ప్రపంచ బడా పెట్టుబడిదారులంతా పాశ్చాత్య సామ్రాజ్యవాదుల ఆధ్వర్యంలోని 'బిల్డెర్‌బెర్గ్ గ్రూప్' సంస్థ కింద ఏకమయ్యారు. దీని అనుబంధ సంస్థనే స్విట్జర్లాండ్‌లోని 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్'. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం లాంటివి మన లాంటి అమాయకులు నోటి సంతృప్తికి మాట్లాడుకొని, సంతృప్తి చెంది, ఇంటికెళ్లి దుప్పటి కప్పుకొని పడుకోవడానికి. కాని, వాస్తవంగా ప్రపంచానికి ప్రభుత్వమే బిల్డెర్‌బెర్గ్ గ్రూప్. వారి ఐదు వందల సంవత్సరాల రహస్య ఎజెండానే ప్రపంచ రాజ్యాంగం. వారు చెప్పిందే ప్రపంచ రాజకీయ పార్టీలకు చట్టం, వేదం. వీరు వేసుకున్న రహస్య ఎజెండాలో ముఖ్యమైన ప్రణాళిక, ప్రపంచంలోని 99.5 శాతం ప్రజల ఆరోగ్యం నాశనం చేయడం. పాశ్చాత్య దేశాల్లో విజయవంతంగా అమలు చేసిన ఈ ప్రణాళికను, 1990 దశకంలో భారత దళారీ పాలకవర్గాలు ప్రపంచీకరణ మొదలు పెట్టినప్పటి నుండి మన దేశంలో కూడ అమలు చేయడం ఆరంభించి, ఇప్పటికే కోట్లాది మందిని భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో రోగాల పాలు చేయడంలో విజయం సాధించారు. ఈ కింది కొన్ని పద్ధతులతో ఇప్పటికే వారు ఈ ప్రణాళికను అమలు పరుస్తున్నారు.

ఒకటి, ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేయడం ద్వారా ప్రజలకు ప్రకృతిసిద్ధ పోషకాహారం, ఆరోగ్యకర వాతావరణం దొరకకుండా చేయడం. దీన్ని పాశ్చాత్య దేశాల్లో విజయవంతంగా అమలుపరిచారు. మూడవ ప్రపంచ దేశాల్లో 2040 వరకు మొత్తంగా నాశనం చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. ఇక రెండవది, ప్రజలు తినే తిండి గింజలను, కూరగాయలను, ఫలాలను అన్నింటిని ల్యాబ్‌లల్లో తయారు చేసిన హైబ్రిడ్ విత్తనాల ద్వారా మాత్రమే పండించేట్టు చేయడం. (ఈ విత్తనాలల్లో సాంప్రదాయ విత్తనాలలో ఉన్నంతగా పోషక విలువలు ఉండవు). వాటిని కూడా పురుగు మందులతో పండించి, ప్రజలను రోగాల పాలు చేయడం. ప్రజలకు వివిధ రకాల రోగాలు వచ్చే జన్యువులను జన్యు మార్పిడి విత్తనాలల్లో ఎక్కించి, చిన్న వయసు నుండే ప్రజల్ని రోగిష్టులుగా మార్చడం. ఇక మూడవది, ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్ ఫుడ్ ద్వారా. దుకాణాల్లో అమ్మే తినడానికి సిద్ధంగా ఉన్న ఏ పదార్థమైనా అది ఎంత ఆరోగ్యవంతమైనదని వాళ్లు ప్రకటించినా దానిపై ఉండే ఇంగ్రీడియంట్స్ అనే లిస్ట్‌ను చదవండి. చివరికి మీరు వాడే ట్యాబ్లెట్లపై కూడా రాసి ఉంటుంది. అక్షరాలు కనబడకపోతే బూతద్దం కొనుక్కొని మరీ చదివి, ఒక్కొక్క పదాన్ని ఇంటర్నెట్‌లో వెతికి దానిపై పరిశోధించండి. అప్పుడు అర్థమవుతుంది మనం తినే ఫుడ్ ఎంత ప్రమాదకరమో. కేవలం ఫుడ్‌పై మాత్రమే వందల కొలది పేజీల వ్యాసం రాయవచ్చు. ఇక నాలుగవది, మన మానసిక ఆరోగ్యం దెబ్బతీయడం. దీన్ని పాశ్చాత్య దేశాల్లో విజయవంతంగా అమలు చేశారు. 2040 వరకు భారతదేశం కూడా ప్రపంచంలో అత్యంత మానసిక సమస్యలున్న దేశాల్లో ఒకటిగా మార్చబోతున్నారు. పై పద్ధతుల ద్వారా ప్రపంచ ప్రజల్ని రోగగ్రస్తులను చేసి వారి విష వలయంలోకి దింపుతున్నారు. ఇలా చేయడం వలన వారికేటి లాభం?

ఒకటి, రోగాలు వచ్చిన వ్యక్తి కుక్కిన పేనులా పడి ఉంటాడు. డయాగ్నాస్టిక్ సెంటర్ల, హాస్పిటల్ల చుట్టూ తిరగడం, ట్యాబ్లెట్లు బుక్కడంతోనే బిజీగా ఉండే వ్యక్తి విప్లవాలు, ఎదురు తిరుగడాలు, సమ్మెలు చేయలేడు కదా? ఇక వారికి అంతకంటే ముఖ్యమైన లాభం, డబ్బు. విపరీతమైన డబ్బు. ఒక రోగి నడుస్తున్న ఎ.టి.ఎం. ప్రతిరోజూ కనీసం పది రకాల ట్యాబ్లెట్లు తినే వ్యక్తులు ఉన్నారు. అంటే, ఎంత లాభమో ఊహించుకోవచ్చు. ఎంత చిన్న వయస్సు నుండి మనం రోగాల పాలవుతే

వారికి అంత లాభం. విజయవాడ పట్టణంలో కేవలం తొమ్మిది, పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ముప్పై అయిదు వేల మంది విద్యార్థులకు షుగర్ వ్యాధి ఉన్నట్టు మీకు తెలుసా?

ప్రజలు రోగాల పాలుకావడం వలన ఈ పరాన్నభుక్కు వ్యవస్థలో ఎందరు దోపిడీ పెట్టుబడిదారులకు లాభమో చూడండి. హాస్పిటల్స్, డయాగ్నాస్టిక్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, బల్క్ డ్రగ్స్, సివిల్, కన్స్ట్రక్షన్, ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, మైనింగ్, మెటలర్జీ, బయో మెడికల్, నానో టెక్నాలజీ, కమ్యూనికేషన్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, రీసైక్లింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్స్యూరెన్స్, ఇన్వెస్ట్‌మెంట్, అకౌంటింగ్, స్టాఫింగ్, షేర్ మార్కెట్, మెడికల్ ఎడ్యుకేషన్, మెడికల్ పబ్లిషింగ్, ఆటోమొబైల్, విమానయానం మొదలైన రంగాల్లోని దాదాపు రెండు వందల ఉప రంగాలలో ఉన్న వందలాది బహుళజాతి సంస్థలకు లాభాల పంట. ఈ బహుళజాతి సంస్థల యజమానులే 'బిల్డెర్‌బెర్గ్' గ్రూప్‌లోని 83 వేల మంది ప్రపంచ అత్యంత బడా పెట్టుబడిదారులు. వీరందరికీ ఇతరుల కంపెనీలలో షేర్లు ఉంటాయి. ఆరోగ్యాన్ని నాశనం చేసే ఉత్పత్తులు తయారు చేసే కంపెనీల్లో వీరందరు షేర్ హోల్డర్లు. అలాగే, ఆరోగ్య రంగంతో ముడిపడి ఉన్న వందలాది బహుళజాతి కంపెనీల షేర్ హోల్డర్లు కూడా వీరే. అందుకే, 99.5 శాతం ప్రజలను రోగులు చేయడం ద్వారా వీరందరికీ లాభం. ఇప్పటికే అల్లోపతి మందులు వాడడం ద్వారా ప్రజలకు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్నట్లు రకరకాల ఇతర రోగాలు వచ్చి ఇంకా రోగాల పాలవడం, అర్థాంతరంగా మరణించడం చూస్తూనే ఉన్నాం. నానో టెక్నాలజీ వాడి తయారు చేసే ట్యాబ్లెట్ల ద్వారా ఇంకా వెయ్యింతల నష్టం జరగబోతోంది. ఈ రకమైన ట్యాబ్లెట్లను ఫార్మా కంపెనీలు త్వరలో మార్కెట్‌లోకి తేబోతున్నాయి. అంటే, పెట్టుబడిదారీ దోపిడీదారులకు ఇంకా లాభాల పంట పండనుంది.

ఈ ప్రపంచ బడా పెట్టుబడిదారుల కంపెనీలు చేస్తున్న పారిశ్రామిక కాలుష్యం వలన రోజు రోజుకూ పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్, భూమి, నీరు, గాలి కాలుష్యాల కారణంతో ప్రజలకు కలిగే రకరకాల రోగాల వలన తిరిగి లాభపడేది వారే. ఇదే కాకుండా వీరి కంపెనీలే తయారు చేసే కాస్మొటిక్స్, టూత్‌పేస్ట్, డిటర్జెంట్స్‌తో చర్మవ్యాధుల నుండి మొదలుకొని క్యాన్సర్ వరకు వస్తాయనే విషయం ఎందరికి తెలుసు? ఈ బడా పెట్టుబడిదారుల కంపెనీలు తయారు చేసే చిప్స్, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, చాక్‌లెట్స్, క్యాండీస్ లాంటి వాటివలన షుగర్ వ్యాధి నుండి క్యాన్సర్ వరకు రకరకాల రోగాలు వస్తాయని ఎందరికి తెలుసు? ప్రపంచ వ్యాప్తంగా కోలా డ్రింకుల్లో జార్జ్‌బుష్ వ్యాపార భాగస్వామి, బిల్డెర్‌బెర్గ్ గ్రూప్ సభ్యుడు అయిన బిన్‌లాడెన్ కంపెనీ తయారు చేసే ఒక ప్రత్యేక పదార్థాన్ని కలుపుతారు. దాన్ని క్రూడ్ ఆయిల్ నుండి తయారు చేస్తారు. జనాలు ఇష్టంగా తాగే కోలా డ్రింకులో ఉండే ఈ పదార్థం వలన క్యాన్సర్ వస్తుందని, అది బిన్‌లాడెన్ కంపెనీ తయారు చేస్తుందని ఎందరికి తెలుసు? పాలకవర్గాలే మాదక ద్రవ్యాలను తయారు చేయించి ప్రజలను మత్తులో ముంచుతూ, వారి ఆరోగ్యాన్ని నాశనం చేస్తూ, వారిని తమ ఆరోగ్య రంగ విషవలయంలోకి దింపి లాభాలు గడిస్తున్నాయని ఎంత మందికి తెలుసు? మద్యం కంపెనీలు పాలక వర్గాలవేనని ఎంత మందికి తెలుసు? మద్యం తాగుతూ చివరికి అదే పాలకవర్గాల ఆరోగ్య రంగ విషవలయంలోకి వెళుతున్నట్లు ఎంత మందికి తెలుసు?

ఈ ప్రపంచ బడా పెట్టుబడిదారులు ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలకు, స్వచ్ఛంద సంస్థలకు డబ్బులు ఇస్తూ వారిచే ఉచిత మందుల పంపిణీ, ఉచిత ఆరోగ్య పథకాలు అమలు చేపిస్తున్నారు. ఎందుకంటే, మనిషిలో ఉండే సహజ రోగ నిరోధక శక్తిని, ఆరోగ్య వ్యవస్థను నాశనం చేయించి, ప్రజలు తమ సాంప్రదాయ, సహజ వైద్య విధానాన్ని వదిలేట్టు చేసి, తమ విష వలయంలోకి దింపితే, ఆ తర్వాత ప్రజలే డబ్బు పెట్టి ఆ విష వలయానికి వినియోగదారులుగా (అంటే రోగిగా) మారుతారు. బ్రిటిష్ దోపిడీదారులు మనకు ముందు ఉచితంగానే 'టీ' పోసి, అలవాటు చేసి, ఇప్పుడు దేశమంతా ఈ ప్రమాదకర పానీయాన్ని కొని తాగేట్టు చేశారనే విషయం మరువరాదు. భారతదేశంలో రక్తహీనత సమస్యకు టీ, కాఫీలు కూడా ఒక ప్రధాన కారణమనే వాస్తవం ఎందరికి తెలుసు? రక్తహీనత తగ్గిస్తుందని అమ్మే ఐరన్ ట్యాబ్లెట్లలో చాలా రకాలు కేవలం ఐరన్ తుక్కుతో తయారు చేస్తున్నారని తెలుసా? (ఆ ట్యాబ్లెట్ వద్దకు అయస్కాంతం తీసుకెళ్తే దానికి అతుక్కుంటుంది.) బ్రెస్ట్ క్యాన్సర్ రావడానికి గల ప్రధాన కారణాలలో ఈ బడా పెట్టుబడిదారుల కంపెనీలు తయారు చేసే 'బ్రా'లను స్త్రీలు తొడుక్కోవడమనే విషయం ఎందరికి తెలుసు? షుగర్, బి.పి., కొలెస్ట్రాల్, గుండె సమస్యలు సహజ జీవన విధానం అవలంబించే వారికి రావని, ఇప్పటికే వచ్చిన వారు కూడా సహజ జీవన విధానాన్ని అవలంబించిన నెల రోజులలోనే ఆ సమస్యలు నయం అవుతాయని ఎంత మందికి తెలుసు? క్యాన్సర్లలోని 99 శాతం రకాలు పెట్టుబడిదారీ వ్యవస్థలోని జీవన విధానం వల్లనే వస్తాయని ఎంతమందికి తెలుసు? కంటిచూపు సమస్య పూర్తి సహజంగానే నయం చేసుకోవచ్చని, కళ్లద్దాల అవసరం లేదని (దీనికి నేనే సాక్ష్యం), బడా పెట్టుబడిదారుల కళ్లద్దాల వ్యాపారం ఒక మోసం అని ఎందరికి తెలుసు?

మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలకు కారణమైన ప్రపంచ బడా పెట్టుబడిదారులు, తద్వారా ఎన్ని మిలియన్ల ప్రజల చావుకు కారణమయ్యారో, అంతకంటే వందల రెట్ల ప్రజలను 1945 నుండి 2012 వరకు తమ ఆరోగ్య రంగ కుట్రకు బలిచేసి, ట్రిలియన్ల కొద్ది డాలర్లను సంపాదించి, వారి చావుకు కారణమయ్యారు. ఈ కుట్రకు బలై ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు రోగాలతో వారికి ఎ.టి.ఎం. మెషీన్లుగా మారి బతుకులీడుస్తున్నారు. సహజ ఆరోగ్య జీవన విధానంపై, సాంప్రదాయ వైద్య విధానంపై మనకు అవగాహన, నమ్మకం లేకుండా చేసే విస్తృత మైండ్ కంట్రోల్ కుట్రకు మనల్ని బలి చేస్తూ, ప్రపంచ ప్రజలను వారి విష వలయంలోకి నెట్టారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి నిమిషం కొన్ని డజన్ల కొద్ది ప్రజల ప్రాణాలు ఈ క్రూరుల కుట్రకు బలి అవుతున్నాయి.

అత్యంత మానసిక రోగగ్రస్తులైన సామ్రాజ్యవాదులు, వారి తొత్తులైన వివిధ దేశాల దళారీ పెట్టుబడిదారులు అమలు పరుస్తున్న ఈ విస్తృత కుట్రపైన నిరంతరం పరిశోధించండి. మిమ్మల్ని, మీ కుటుంబ సభ్యుల్ని ఈ కుట్రలకు బలి కాకుండా ఎంత మేరకు కాపాడుకోగలిగితే అంతవరకు కాపాడుకోండి. అంతకంటే ముఖ్యంగా, సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే 99.5 శాతం ప్రజల ప్రజాస్వామ్య రాజ్యం కొరకు, రోగగ్రస్తులైన సామ్రాజ్యవాదులను, వారి తొత్తులను కూల్చడానికి ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలలో మీరే వైపు ఉంటారో నిర్ణయించుకోండి.

(రచయిత అనేక దేశాల్లో పని చేసిన సామాజిక కార్యకర్త) వీ

పులిచింతల ప్రాజెక్టు ఎవరి లాభం కోసం?

పులిచింతల ప్రాజెక్టు ప్రతిపాదించిన నాటికీ, ఈనాటికీ మారిన పరిస్థితులను, ఆ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న అవకతవకలను వివరిస్తున్నారు **ముప్పాళ్ల భార్గవశ్రీ**

పులిచింతల ప్రాజెక్టు ప్రారంభం నుండీ అనేక అవాంతరాలను ఎదుర్కొంటూనే ఉంది. గత సంవత్సరం కృష్ణానదికి వచ్చిన భారీవరద ఫలితంగా కాపర్‌డ్యాంతో సహా పలు ప్రాజెక్టు నిర్మాణాలు వరద ఉధృతిలో కొట్టుకు పోయాయి. ప్రకాశం బ్యారేజీ మొత్తం 40 గేట్లు ఎత్తివేశారంటే వరద ఉధృతి ఎంతగా ఉందో అర్థమౌతుంది. అలానే ప్రాజెక్టు రెండు వైపుల గ్రామాలు వరదనీటిలో మునిగిపోయాయి. పులిచింతల ప్రాజెక్టు శంఖుస్థాపన జరిగిన 1988 నుండీ న్యాయపరమైన అడ్డంకులు, పునరావాస సమస్యలు మొదలుకొని రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ప్రాజెక్టు నిధులను మంజూరు చేయక పోవడం, అప్పటినుండీ కృష్ణానదికి వరదలు వచ్చిన ప్రతి సందర్భంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టు నిర్మాణాలు వరదనీటి పాలు అవుతూనే ఉన్నాయి. రు.180 కోట్ల అంచనాలతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టుకు 2005-06 నాటికే రు.172.31 కోట్లు ఖర్చు పెట్టారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తి కానందున కృష్ణానదికి పలుసార్లు వచ్చిన వరదల ఫలితంగా కోట్ల రూపాయల నష్టాన్ని చవి చూడాల్సి వచ్చింది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయన నామకరణం చేసిన 'జలయజ్ఞం'లో భాగంగా తొలిప్రాజెక్టుగా పులిచింతల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. తడిసి మోపెడైనట్లుగా ఇప్పుడు ఈ ప్రాజెక్టు వ్యయం రు.1600 కోట్లకు పెరిగిపోయినా ఆశ్చర్య పోనవసరం లేదు. ఈ ప్రాజెక్టు ఇంత భారంగా పెరిగిపోవడానికి ఎవరు బాధ్యత వహిస్తారు? 2013 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇరిగేషన్ శాఖామంత్రి పి.సుదర్శనరావు హామీలు ఇస్తుంటే, మరో నాలుగేళ్లకు పూర్తి అయినా గొప్పేనని ప్రాజెక్టు ఇంజనీర్లు నిష్టూర సత్యాన్ని చెప్పకనే చెబుతున్నారు. అయితే ఈ ప్రాజెక్టుకు అపరభగీరథుడుగా పేరుగాంచిన డా.కె.ఎల్.రావు పేరునయితే పెట్టారు కానీ ఆచరణలో ఆయన ఆశయాలను నీరుగార్చే విధంగా ప్రాజెక్టు పనులను చేబడుతున్నారు. మొదటి నుండీ పులిచింతల ప్రాజెక్టు సుడిగుండాల మధ్య కొట్టుమిట్టాడుతూనే ఉన్నది.

ప్రాజెక్టు మొదటి అంచనాలు

బ్రిటిష్ ఇంజనీర్లు 1908-1913 మధ్య పులిచింతల ప్రాజెక్టుపై రూపొందించిన అంచనాల ప్రకారం కృష్ణానదికి ఇరువైపులా 9 లక్షల 15 వందల ఎకరాల భూమి నూతనంగా సాగులోకి వస్తుంది. కృష్ణా డెల్టాలోని భూములకు రెండవ పంటకు నీరు లభిస్తుంది. 1908 నాటి తొలి అంచనాల్లో డ్యాం ఎత్తు 225 అడుగులు. నీటి నిలువ సామర్థ్యం 163 టిఎంసిలు, అంచనా వ్యయం రు.8.63 కోట్లు.

కుడికాలువ ద్వారా సాగులోకి వచ్చే భూమి విస్తీర్ణం గుంటూరు తాలూకాలో 2,78,000 ఎకరాలు, బాపట్ల తాలూకాలో 1,71,691 ఎకరాలు, ఒంగోలు తాలూకాలో 77,500 ఎకరాలు, సత్తెనపల్లి తాలూకాలో 76,569 ఎకరాలు, నర్సరావుపేట తాలూకాలో 70,544 ఎకరాలు, తెనాలి తాలూకాలో 6,671 ఎకరాలు, మొత్తం 6,80,975 ఎకరాలు; ఎడమ కాలువ ద్వారా నందిగామ (జగ్గయ్యపేట), విజయవాడ తాలూకాల్లో 2,34,767 ఎకరాలు, మొత్తం సాగుభూమి 9,15,742 ఎకరాలు. ఈ నివేదిక ప్రకారం పులిచింతల (గుంటూరు జిల్లా కృష్ణానది ఒడ్డు గ్రామం) వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డాక్టర్ కె.ఎల్.రావు, ఎంపి మోటూరి హనుమంతరావులు కృషి చేశారు. ఈ ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రణాళికా సంఘం నాటి ప్రభుత్వానికి పంపగా తిరస్కరించింది. పులిచింతల కోసం ప్రజా ఉద్యమం ఉధృతంగా సాగింది. నాటి ముఖ్యాల జమీందారు, ప్రాజెక్టుల ప్రసాద్‌గా పేరుగాంచిన రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్ స్పందించి గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం సాగించారు. ప్రముఖ గాంధేయవాది వావిలాల గోపాలకృష్ణయ్య కలంతో మేధావులను తట్టి లేపారు. రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా ఆందోళన సాగించాయి. ఈ క్రమంలోనే కె.ఎల్.రావు సహకారంతో ప్రాజెక్టు డ్యాం ఎత్తు 212 అడుగులుగా సుమారు 10 లక్షల ఎకరాల సాగుతో మరో అంచనా తయారు చేశారు. 1951లో కేంద్ర ప్రభుత్వం ఖోస్లా కమిటీని నియమించింది. ఈ కమిటీ 1952లో కృష్ణా నదీపరీవాహక ప్రాంతంలోని మెట్టప్రాంత రైతుల కడగండ్లు చూసిన కమిటీ, సిద్దేశ్వరం, నందికొండ, పులిచింతల వద్ద దశలవారీగా ప్రాజెక్టులు నిర్మించాలని ప్రతిపాదించింది. కమిటీ 1952లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఇంతలో నందికొండవద్ద నాగార్జునసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టును నిర్మించాలనే ప్రతిపాదన ప్రముఖంగా ముందుకొచ్చింది. పులిచింతల కోసం పోరాడిన కృష్ణా, గుంటూరు మెట్ట ప్రాంతాల రైతులు సందిగ్ధంలో పడ్డారు. నాటి ఉద్యమ నాయకులు అఖిలాంధ్ర దేశానికి మేలుకూర్చే నాగార్జునసాగర్ కోసం 'పులిచింతల'ను త్యాగం చేద్దామని నచ్చచెప్పారు. సరిగ్గా రోడ్డు లేదనే కారణంతో ఖోస్లా కమిటీ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించ రావడానికి నిరాకరించిన స్థితిలో ప్రాజెక్టుల ప్రసాద్ నాగార్జునసాగర్ డ్యాం కోసం 25 గ్రామాల నుంచి వాలంటీర్లను సమీకరించి వారం రోజులు రాత్రింబవళ్లు కష్టపడి రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణానికి అయిన 51 లక్షల రూపాయల ఖర్చు తానే భరించాడు. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 1956 డిసెంబర్ 10న ప్రధానమంత్రి నెహ్రూతో నందికొండ వద్ద

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శంఖుస్థాపన జరిగింది. ఆచరణలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు 'పులిచింతల' ప్రాజెక్టు పరిధిలోని కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల మెట్ట ప్రాంతాలలోని కాలువ చివర భూములకు నాగార్జునసాగర్ నీరు ఎండమావిగా మారిపోయింది.

మొదటికొచ్చిన 'పులిచింతల' పోరాటం

నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల నుంచి సమృద్ధిగా నీళ్లు వస్తాయని ఆశించిన కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల మెట్ట ప్రాంత రైతులకు నాగార్జునసాగర్ రెండవ ఫేజ్ పనులు ఈనాటికీ పూర్తి స్థాయిలో ప్రారంభించికపోవడం వలన లక్షలాది ఎకరాల భూములు చివరికి కాలువ భూములుగా మారిపోయి వర్షాధార భూములుగానే మిగిలిపోయాయి. ఎగువ ప్రాంతాల్లో అక్రమ సాగు, అనధికార సేద్యం, సకాలంలో కాలువల మరమ్మతులు లేకపోవడం, సమగ్రమైన ఎత్తిపోతల పథకాలు చేపట్టని ఫలితంగా మెట్ట ప్రాంతాల రైతులకు చుక్కనీరు అందడం గగనకుసుమంగా మారింది. ఫలితంగా మూడు జిల్లాల మెట్టప్రాంతాలు కరువు కోరల్లో చిక్కుకు పోయాయి. ఎన్.టి.రామారావు అధికారంలోకి వచ్చిన తర్వాత పులిచింతల ప్రాజెక్టు తిరిగి ఎజెండాలోకి వచ్చింది. 1984 మార్చి 15న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో పులిచింతల డివిజన్ కార్యాలయం ప్రారంభించారు. డా. కె.ఎల్.రావు సూచనలతో పులిచింతల అంచనాలను మళ్లీ తయారు చేయించారు. 1988 నవంబర్‌లో ఎన్.టి.రామారావు నల్గొండ జిల్లాలోని వజినేపల్లి గ్రామం వద్ద 'పులిచింతల కర్షక హిత జలనిధి' పేరుతో పులిచింతల ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేశారు. దీనితో తమ చింతలు తీరినట్టేనని మెట్టప్రాంత రైతులు ఎంతో ఆశపడ్డారు.

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎందుకోసం?

పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం కృష్ణాడెల్టా ప్రాంతాల ఆయకట్టు భూములకు సాగునీరు గ్యారంటీ చేయడానికి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మాత్రమే ఉంటుందని, ఆ లక్ష్యంతోనే దీని నిర్మాణం చేపట్టామని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. కానీ వై.ఎస్. ప్రభుత్వ కాలంలో ప్రారంభించిన 'జలయజ్ఞం'లో భాగంగా ఇతర ప్రాజెక్టులతోపాటు పోలవరం ప్రాజెక్టుని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. పోలవరం ప్రాజెక్టు ప్రారంభం నుండీ ఎటువంటి అవాంతరాలు ఎదుర్కొంటూ ఉందో తెలిసిన విషయమే. అయితే పోలవరం ప్రాజెక్టు డిజైన్‌లో భాగంగా, గోదావరి జలాలు కృష్ణానదికి కలిపే కర్తవ్యంలో భాగంగా పోలవరం కుడి కాలువ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లా గుండా ప్రవహించి ప్రకాశం బ్యారేజీపైన కలుస్తుందని, ఈ కాలువ ద్వారా 80 టి.ఎం.సి.ల నీరు కృష్ణానదిలో కలవడం ద్వారా కృష్ణా ఆయకట్టు భూములకు సాగు నీటికొరత లేకుండా చేయవచ్చని రాష్ట్ర ప్రభుత్వం 'జలయజ్ఞం' ఫలితాలుగా ప్రచారం చేస్తున్నది. మరి 80 టి.ఎం.సి.ల నీరు పోలవరం కాలువ ద్వారా వచ్చేటప్పుడు కృష్ణాడెల్టా భూములకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉపయోగ పడ్తుందన్న పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం ప్రయోజనం ఏమిటి అనేది ఎవరికైనా కలిగే సందేహం. అలానే పోలవరం ప్రాజెక్టు వలన అదనంగా చుక్కనీరు ఈ ప్రాంత భూములకు అందదని, ప్రధానంగా ఈ కాలువ ద్వారా నావిగేషన్ ప్రయోజనం పొందే పథకం ఇందులో ఇమిడి ఉందని ప్రఖ్యాత ఇరిగేషన్ ఇంజనీర్లు వెల్లడి చేసి ఉన్నారు. దాదాపు 24 సంవత్సరాలుగా నిర్మాణం సాగుతున్న పులిచింతల ప్రాజెక్టు ఎప్పటికి పూర్తి అవుతుందో తెలియదు గానీ, ఒకవేళ అదిపూర్తి అయితే కృష్ణాడెల్టా భూములకు ఎంతవరకు ప్రయోజనం కలుగుతుందో తెలియదు కానీ ప్రాజెక్టు డిజైన్‌లో భాగంగా రూపొందించిన 150 మెగావాట్ల హైడల్ విద్యుత్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తిని మాత్రం నిరాఘాటంగా ఉత్పత్తిచేసి సొమ్ము చేసుకోవడం ఖాయం అనిపిస్తోంది.

ఇపిసి విధానం ఎవరి ప్రయోజనాల కోసం?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచీకరణ విధానాలు అమలు పరిచే దానిలో భాగంగా వివిధ నిర్మాణ రంగాలతో పాటు మన రాష్ట్ర ప్రభుత్వం 'జలయజ్ఞం'లో కూడా ప్రైవేటీకరణ పద్ధతులకు పెద్ద పీట వేసింది. ఆ విధానాలలో భాగంగానే పులిచింతల ప్రాజెక్టును ఇపిసి (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) పద్ధతులతో కాంట్రాక్టర్లకు అప్పగించింది. ఈ విధానంలో అవినీతికి గేట్లు బార్లా తెరిచింది. చేయి తిరిగిన బడా కాంట్రాక్టర్లకు ఇపిసి విధానం వరప్రసాదినిగా మారిపోయింది. ఇపిసి విధానం ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పందం కుదిరిన తర్వాత బయట ధరలు పెరిగినా, తగ్గినా కాంట్రాక్టరుదే పూర్తి బాధ్యత. పని మొదలుపెట్టిన తర్వాత వ్యయాన్ని పెంచకూడదన్న ఉద్దేశ్యంతోనే ఇపిసి పద్ధతిని ప్రవేశ పెట్టామని ప్రభుత్వం చెప్పింది. అయితే ఈ నిబంధనలను పక్కనపెట్టి స్టీల్, సిమెంటు, పెట్రోలులోనే కాకుండా ఇసుక, లేబర్, ఇతర మెటీరియల్ ధరలను ఎప్పటికప్పుడు పెంచుకునేందుకు ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటి ఆమోదం తెలపడంతో కాంట్రాక్టర్లు బాగా లాభపడ్డారు. ఇతర కారణాలతోపాటు ప్రాజెక్టు అంచనాలు తారాజువ్వల్లా పెరిగిపోవడానికి ఇపిసి విధానం ముఖ్య కారణంగా ఉన్నదంటే ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఇందుకు పులిచింతల ప్రాజెక్టు నిర్మాణ వ్యయం హనుమంతుని తోకలా పెరిగిపోతూ ఉండడం చక్కని ఉదాహరణగా నిలుస్తుంది.

వైఎస్ ప్రభుత్వ హయాంలో 2008 డిసెంబరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్న ప్రభుత్వం 2014 నాటికి కూడా పూర్తి అవుతుందో లేదో చెప్పలేని స్థితిలో ఉంది. ఈ ప్రాజెక్టుకు 2004లో కుదిరిన ఒప్పందం ప్రకారం ప్రాజెక్టుకు నిర్ణయించిన 33 గేట్లను 22కి తగ్గించడం, మట్టికట్టను పెంచడం, కాంక్రీట్ డ్యాం పొడవు తగ్గించడం లాంటి చర్యలు తీవ్రస్థాయి వివాదాలకు దారితీశాయి. 'కాగ్' నివేదిక సైతం ఈ చర్యల అపసవ్యతల గురించి ఎత్తిచూపించాల్సివచ్చింది. ఈ చర్యల వలన కొంతకాలం నిర్మాణ పనులు స్తంభించిపోయిన సంగతి అందరికీ తెలిసిందే. 2005లో ప్రాజెక్టు అంచనా వ్యయం రు. 681.604 కోట్లు కాగా, భూ సేకరణ, పునరావాస వ్యయాలు పెరిగాయనే పేరుతో 2009 ఆగస్టులో అంచనా వ్యయాన్ని రు. 1281 కోట్లకు పెంచారు. ఈ అంచనా వ్యయంలో హెడ్‌వర్క్‌కు రు. 390 కోట్లు, భూమి సేకరణకు రు. 264.13 కోట్లు, పునరావాసానికి రు. 364.72 కోట్లు, ఇతర ఖర్చులకు కేటాయింపులు చేశారు. దీని ప్రకారం ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి నిర్మాణ

వ్యయం రు. 1600 కోట్లు-రు. 1800 కోట్లకు పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని సీనియర్ ఇంజనీర్లు అంటున్నారు. నిర్మాణ గడువును ఇప్పటికి ఏడుసార్లు పొడిగించినా 2014 నాటికి అయినా పూర్తి అవుతుందన్న గ్యారంటీని అధికారులు ఇవ్వలేక పోతున్నారు. ఇప్పటికి క్రస్ట్‌లెవల్ వరకు మాత్రమే డ్యాం పనులు పూర్తి అయ్యాయి. అంటే 45.77 టి.ఎం.సి. నీటిని నిల్వచేయగల్గిన సామర్థ్యం కలిగిన ప్రాజెక్టుకు ఇప్పుడు 3.61 టి.ఎం.సి.లు మాత్రమే నిల్వ చేయగల్గిన స్థితిలో ఉంది. అంటే క్రస్ట్‌లెవల్ తర్వాత 22 గేట్లను అమర్చి, ఆ తర్వాత ప్రాజెక్టు పొడవునా బ్యారేజీ నిర్మాణం చేపట్టి, 150 మెగావాట్ల విద్యుత్తు ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంది. కాబట్టి పులిచింతల ప్రాజెక్టు రాబోయే సుడిగుండాలను కూడా అధిగమించి ఎప్పటికి పూర్తి అవుతుందో ప్రాజెక్టు ఇంజనీర్లే చెప్పలేని స్థితిలో ఉన్నారు. ప్రాజెక్టు నిర్మాణం సంవత్సరాల తరబడి ఆలస్యం కావడం వలన ముఖ్యంగా కృష్ణానదికి గత సంవత్సరం సెప్టెంబరులో భారీ వరదలు వచ్చిన ఫలితంగా పులిచింతల ప్రాజెక్టు వద్ద కాపర్‌డ్యాం కొట్టుకుపోయి నందున రు. 70 లక్షలు నష్టం జరగటంతోపాటు ప్రాజెక్టు ప్రాంతంలోని అనేక గ్రామాలు జలదిగ్బంధనంతో మునిగిపోయి ప్రజలు తీవ్ర నష్టాన్ని చవిచూసారు.

నేటికీ పరిష్కారం కాని పునరావాస సమస్య!

పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం ఫలితంగా నల్గొండ జిల్లాలో 13 గ్రామాలు, గుంటూరు జిల్లాలో 15 గ్రామాలు పూర్తిగా ముంపుకు గురి అవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం 2005లో ప్రకటించిన పునరావాస పథకం పూర్తి లోపభూయిష్టంగా ఉన్న ఫలితంగా ముంపు ప్రాంత గ్రామాల బాధితులు జీవితంలో కోలుకోలేని దెబ్బలు తిన్నారు. ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే భూములను మూడు కేటగిరీలుగా విభజించి, సాగులో ఉన్న భూములకు రు. 1.50 లక్షలు, సాగులో లేని భూములకు రు. 1.15 లక్షలు, బీడు భూములకు రు. 0.75 లక్షలు రైతులకు నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లించింది. 2005 నాటికి ఈ విలువ కొంత సమంజసంగా అనిపించవచ్చుగానీ, ఆ తర్వాత ఆ ప్రాంతాల్లో భూమికి పెరిగిన విలువనుబట్టి చూస్తే రైతులు దగా చేయబడ్డారని తేలుతుంది. ఆనాడే ఇది అన్యాయం అని కోర్టుకి వెళ్లి ఆందోళన చేస్తున్న రైతులకు ఇప్పుడు ఎకరానికి రు. 10 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ముందుకు వచ్చినా రైతులు ఆ ధర తీసుకోవడానికి సందిగ్ధంగానే ఉన్నారు. అంటే ప్రారంభంలో భూములు కోల్పోయిన పేద, మధ్యతరగతి రైతులు దయనీయ స్థితిలో ఉండడానికి ముఖ్యకారణం రాష్ట్ర ప్రభుత్వం అమలు జరిపిన పునరావాస పథకం అశాస్త్రీయంగా ఉండటమే ముఖ్యకారణం.

అలాగే ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి ఈ నాటికీ పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణం జరగలేదంటే రాష్ట్ర ప్రభుత్వం బాధితుల జీవితాలపట్ల ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతుంది. ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్న ప్రతి ప్రాంతంలో నిర్వాసితుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. పులిచింతల ప్రాంతంతో సహా అనేక ప్రాంతాల్లో నిర్వాసితులు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. కృష్ణానదికి వరదలు వచ్చిన ప్రతి సందర్భంలో పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులు పక్కా ఇళ్ల నిర్మాణాల కోసం గగ్గోలు పెడుతూనే ఉన్నారు. వాస్తవానికి ప్రభుత్వ పునరావాసం విధానం ప్రకారం నిర్మించబోయే ప్రాజెక్టు ప్రాంతంలో ముందు పునరావాస చర్యలు పూర్తి చేసిన తరువాతనే ప్రాజెక్టు పనులు చేపట్టాలి. అయితే పునరావాసం పట్ల పాలకుల అలసత్వం, నిర్లక్ష్య విధానాల ఫలితంగా కొన్ని ప్రాంతాలలో ప్రాజెక్టుల నిర్మాణం సాగుతూ ఉండగా మరికొన్ని ప్రాంతాలలో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి అయినా పునరావాస చర్యల అమలు కోసం బాధితులు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో ఒక్క వెలుగోడు రిజర్వాయర్ నిర్వాసితులు మాత్రమే రైతుకూలీ సంఘం సీనియర్ నాయకులు అమరుడు మండ్ల సుబ్బారెడ్డి నాయకత్వాన రాజీలేని పోరాటం సాగించిన ఫలితంగా నిర్వాసితులు తమ హక్కులను సాధించుకున్నారు. ఎక్కువ ప్రాజెక్టుల విషయంలో నిర్వాసితులు దగాపడిన జీవితాలు గడపడానికి ముఖ్యకారణం, పాలకులకు నిర్వాసితుల పట్ల అలసత్వంతో కూడిన చిన్న చూపు ఉండడమే కాక, సామాజిక న్యాయం దృష్టి కొరవడింది. పునరావాసం తమ ప్రాథమిక హక్కు అని, పునరావాసం భిక్షం కాదని గుర్తించి తమ హక్కుల సాధన కోసం నిర్వాసితులు పోరాట మార్గం చేపట్టాలి.

పులిచింతల ప్రాజెక్టుకు దిగువన విజయవాడ ప్రకాశం బ్యారేజీ వరకు 85 కి.మీ.ల దూరంలో పాలేరు, మునేరు, వైరా, కట్టలేరుల ప్రవాహాలు కృష్ణానదిలోకి వచ్చి కలుస్తాయి. ఈ నీటిని కూడా నిల్వ చేసుకొనే సామర్థ్యం ప్రకాశం బ్యారేజీ వద్ద లేనందున మెట్ట ప్రాంత భూములకు సకాలంలో నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకాలు కూడా పూర్తిస్థాయిలో లేనందున మెట్ట ప్రాంతాల రైతులు కరువుతో అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా కరువు పీడిత ప్రాంతాల ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా చేయడానికి తగిన సాగునీటి పథకాలను రూపొందించడానికి ప్రభుత్వాలు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే ఈ పథకాల సాధనకోసం మెట్ట ప్రాంతాల రైతాంగం సమైక్యంగా ఉద్యమించడానికి ముందడుగు వేయాలి. అలాగే కృష్ణా డెల్టా ప్రాంత భూములకు సాగునీటి కొరత లేకుండా ఉండాలంటే ఒక్క చుక్క సాగునీరు అదనంగా ఇవ్వని పోలవరం ప్రాజెక్టు పేరుతో, హైడల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం ముఖ్య లక్ష్యంగా నిర్మిస్తున్న పులిచింతల ప్రాజెక్టులతో కృష్ణాడెల్టా భూములకు సరిపడా సాగునీరు వస్తుందంటే నమ్మాలా! ప్రభుత్వాల మాటలకు, చేతలకు పొంతన ఉండదు అనేదానికి ఈ ప్రాజెక్టుల ఉదాహరణ చాలు! అందువల్ల సముద్ర సాగునీటి పథకాలు రూపకల్పనచేసి, వాటిని ఆచరణలో అమలు చేసేలా రైతాంగం సమైక్యంగా ఉద్యమాలు నిర్మించడానికి నడుంకట్టాలి.

(రచయిత సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

వీక్షణంకు వచ్చే రచనలలో కొన్ని జిరాక్స్ కాపీలు వస్తున్నాయి. జిరాక్స్ నాణ్యత సరిగా ఉండడంలేదు. కొన్నిటిలో చేతి రాతలు కూడా కష్టంగా ఉంటున్నాయి. అందువల్ల అర్థం చేసుకొని టైప్ చేయడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయి. అక్షరాలు అర్థమయ్యేలా రాయండి. జిరాక్స్ మీరు ఉంచుకుని ఒరిజినల్స్ మాకు పంపి సహకరించండి.

- సం.

తిరుమల భారతీయులదే!

తిరుమల తిరుపతి దేవస్థానం పెరిగి పెద్దదవడంలో దళితుల, గిరిజనుల, ముస్లింల రక్తం, చెమటా ఉన్నాయనీ, లౌకిక స్ఫూర్తికి విరుద్ధమైన జి.ఒ.లకు వ్యతిరేకంగా ఉద్యమించాలనీ అంటున్నారు ఎం.కె. కుమార్

ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా బిజెపి బలంగా ఉన్న రాష్ట్రాలలో 'హిందువుల న్యాయమైన ఆగ్రహం' పేరిట విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు క్రైస్తవులపై దాడులు చేయడాన్ని మనం చూస్తూనే ఉన్నాం. ఈ ఉన్మాదం ఇప్పుడు తిరుపతి, తిరుమల వరకు పాకింది. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే)లో ముప్పై సంవత్సరాలకు పైగా ఎటువంటి రిమార్క్ లేకుండా పని చేస్తున్న దళిత క్రిస్టియన్‌లపై తితిదే మండి పడుతూ, వారిని సెకండ్ సిటిజన్స్‌గా చూస్తోంది. దీనికి 2 జూన్ 2007లో ప్రభుత్వం జారీ చేసిన జిఒ 747 ఆజ్యం పోసింది. ఈ జిఒ ననుసరించి 'తిరుమల దివ్యక్షేత్రం' ఏడు కొండలతో కలిపి, తిరుమల శేషాచల అడవుల్లోని శేష, కుంకుమధార, సనకసనందన, పాపవినాశన, గోపాల, తుంబుర, పసుపు, రామకృష్ణ, బీమ, కపిలతీర్థాలలో ఎక్కడా అన్యమత ప్రచారం చేయకూడదు. ఇదే జిఒలో హిందూ రిలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ ఆక్ట్, 1987లోని మొదటి షెడ్యూల్డ్‌లోని దేవాలయాలలోను, రాష్ట్రంలోని ప్రముఖ యాత్రా స్థలాలు అయిన పదిహేడు ప్రాంతాలలో హిందూత్వ ప్రచారం తప్పితే వేరే ఎటువంటి ఇతర మతాల ప్రచారం ఉండకూడదని చెపుతుంది.

అందులో భాగంగా, తితిదేలో గత ఇరవై సంవత్సరాలకు పైగా విధులు నిర్వహిస్తున్న శానిటరీ విభాగానికి చెందిన స్వీపర్లు ఈశ్వరయ్య, కృష్ణమ్మలను తిరుమలలోని తితిదే క్వార్టర్స్‌లో వారికి కేటాయించిన గృహాలలో క్రైస్తవ మత కరపత్రాలు, క్యాలెండర్ కలిగి ఉన్నారని తితిదే విజిలెన్స్ విభాగం అదుపులోకి తీసుకుని వారిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. వాస్తవానికి వారిద్దరూ తిరుమల గుడి నుండి ఒక కిలోమీటర్ దూరంలో విధులు ముగించుకున్న తర్వాత తమకు కేటాయించిన తితిదే 'ఎఫ్' టైప్ క్వార్టర్స్‌లో తమ స్వంత పనుల్లో మునిగి ఉన్నారు. వారు కనీసం క్రైస్తవ ప్రార్థన కూడా చేయలేదు. ఇంటి బయట, తిరుమల వీధులలో ఎటువంటి క్రైస్తవ మత ప్రచారం చేయలేదు. అయితే వారు చేసిన తప్పంతా, వారింట్లో చినిగిపోయిన, శిథిలమైన క్రైస్తవ మత క్యాలెండర్‌ను కలిగి ఉండడమే.

జి.ఒ. 747 రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులకు, లౌకిక మత విలువలకు పూర్తిగా విరుద్ధమైనది. రాజ్యాంగం ప్రకారం దేశంలో ఏ ప్రాంతం కూడా ఒక మతానికి సంబంధించింది కాదు. ప్రతి భారతీయుడు తనకిష్టమైన మతాన్ని ఆచరించడానికి, ప్రచారం చేయడానికి హక్కుగా కలిగి ఉన్నాడు. పర మత సహనంతో ఇతర మతాలను గౌరవించే విధంగా ఉండాలి. కాబట్టి అప్రజాస్వామికమైన జి.ఒ. 747 వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలనీ, తితిదే తన స్వంత దళిత ఉద్యోగులపై అన్యమత ప్రచారం పేరుతో వేధింపులకు గురిచేయడాన్ని వెంటనే మానుకోవాలనీ రాజకీయ, దళిత, ప్రజా హక్కుల సంఘాలు తిరుపతిలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి.

రెండు సంవత్సరాల క్రితం తిరుమలలో తితిదే ఇంజనీరింగ్ విభాగం వారు రాతి స్తంభాలను పార్కులలో, వీథికిరువైపులా పెట్టాలని ప్రయత్నించినపుడు హిందూత్వవాదులు అవి శిలువ రూపంలో ఉన్నాయని పెద్దఎత్తున ఆందోళన చేశారు. నిజానికి అవి తిరుమలలో శిథిలావస్థలో ఉన్న కొన్ని చారిత్రక మండపాల స్తంభాలు. అదే విధంగా 8 జూలై 2011న తిరుమలలోని ఒక ప్రైవేట్ హోటల్లో తమ బతుకుదెరువు కోసం పని చేస్తూ, ఒడిశా నుండి వలస వచ్చిన ఆరుగురు యువకుల్ని (సిరాజ్, అక్తర్, షాజహాన్, అలీ, ముస్తక్, అక్బర్) ముస్లిం ప్రచారం చేస్తున్నారని తితిదే విజిలెన్స్ అదుపులోకి తీసుకుంది. వీరు ముస్లిం పేర్లు పెట్టుకోవడం, ముస్లిం మతంలో పుట్టడమే చేసిన నేరం. వారిని అన్యాయంగా తిరుమల నుండి గెంటివేసి ఒడిశా పంపించారు. అయితే విచారణలో వారు ఎటువంటి ప్రచారం చేయలేదని తెలిసింది. వారి మీద బైండోవర్ కేసు కూడా పెట్టలేకపోయారు.

సున్నితమైన విషయాల పట్ల తీవ్రంగా, అమానవీయంగా తితిదే ప్రవర్తించడం పౌరుల హక్కులకు భంగం కలిగించడమే. తితిదే తన పరిపాలనను ఆక్ట్ 30/1987 అనుసరించి నిర్వర్తించాలి. అందులో తితిదే నిధులను ఎలా ఖర్చు చేయాలో సెక్షన్ 111లో చెప్పారు. అదే విధంగా ప్రచారం ఎలా చేయాలో సెక్షన్ 112లో చెప్పారు. దీని ప్రకారం 1979లో ఏర్పరిచిన హిందూ ధర్మ ప్రతిష్ఠానం అనే సంస్థను రద్దు చేస్తూ ధర్మ ప్రచార పరిషత్‌గా కొనసాగించాలని, ధర్మ ప్రచారానికి సంబంధించి హిందూ ధర్మాన్ని మాత్రమే ప్రచారం చేయాలని, మతాన్ని ప్రచారం చేయకూడదని చెప్పింది. 1984 ప్రాంతంలో రామారావు ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 'హిందూ' అనే పదాన్ని తీసివేసి సంస్థకు 'ధర్మ ప్రచార పరిషత్' అని పెట్టారని, దీని ద్వారా తితిదే ప్రచారం చేయాలని చర్చించి నిర్ణయించారు. హిందూ అనే పదం కలిపితే ఇదొక విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ వంటి మత ప్రచార సంస్థ అవుతుందని భావించి, పరమత సహనాన్ని పాటిస్తూ, 'మానవసేవే మాధవసేవ, అహింస పరమోధర్మః, ధర్మో రక్షతి రక్షితః' అంటూ, ఏ మతంలోనైనా ఉన్న విశ్వజనీనమైన ధర్మాన్ని మాత్రమే ప్రచారం చేయాలని నిర్దేశించారు. దీన్ని తుంగలో తొక్కి తితిదే, ఒక మత సంస్థ మాదిరి ఆర్ఎస్ఎస్ అవతారం ఎత్తి రాష్ట్రంలోని మతమార్పిడులు జరుగుతున్న ఎక్కువ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఉద్రిక్తమైన ప్రచారం చేస్తూ ఉంది.

అందులో భాగంగా ఆదివాసులు, గిరిజనులు, దళితులకు అర్చకత్వం కోర్సులు నిర్వహిస్తూ వారిని మభ్యపెట్టి హిందూ మత గొప్పతనాన్ని

నూరి పోస్తోంది. గత రెండు సంవత్సరాలుగా కొన్ని వేల మంది దళిత, బహుజనులకు ఈ కోర్సును బోధించిన తితిదే, తన ఆలయాల్లో ఎక్కడా కూడా వారిని అర్చకులుగా వినియోగించలేదు. కనీసం గర్భగుడిలోకి కూడా ప్రవేశం కల్పించలేదు. వారిని తమ దళిత వాడల్లోని ఆలయాలలోనే అర్చకత్వం చేసుకుని ధూప, దీప నైవేద్యం పెడుతూ హిందూ మతం నుండి, వేరే మతంలోకి దళితులు పోకుండా రక్షకులుగా ఉండాలని తితిదే ఉద్దేశం. ఈ సంవత్సరం తితిదే పరిధిలోని కాలేజీలల్లో, స్కూళ్లల్లో ఎక్కడా ముస్లింల, క్రిస్టియన్‌ల పిల్లలను చేర్చుకోకూడదని మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. దీంతో దళితులు, ముస్లింలు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉంది. బహుశా భవిష్యత్తులో తితిదే ఆసుపత్రుల్లో హిందువులకే ప్రవేశం అనే బోర్డు పెడతారు. తిరుమల హిందువుదయితే, తిరుమల హిందూ ఆదాయం హిందువులకే ఖర్చు పెట్టాలని మఠాధిపతులు తీర్మానం చేశారు.

రాష్ట్రంలో క్రిస్టియన్ ఆధ్వర్యంలో నడిచే అన్ని ఆసుపత్రులలో, కళాశాలల్లో హిందువులు 70 శాతానికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. అన్నీ కూడా హిందువులకు సీట్లు ఇస్తూ ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తూ తమ గౌరవాన్ని ఇతర మతాల పిల్లల పట్ల చూపిస్తున్నాయి. గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కాలేజీలో ఎన్.టి. రామారావు చదువుకున్నారు. హైదరాబాద్-నిజాం కాలేజీ, లూథరన్ కాలేజీ-గుంటూరు, చీరాల, ఎబిఎన్ కాలేజీ-ఒంగోలు, బిటి కాలేజీ-మదనపల్లి, లయోల కాలేజీ-విజయవాడ ఇంకా క్రిస్టియన్ మిషనరీలు, వేలురూ సిఎన్‌సి ఆసుపత్రి, ఇతర క్రిస్టియన్ ఆసుపత్రులు లౌకిక విలువలను, ప్రజాస్వామ్యాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తూ రాజ్యాంగ విలువలను కాపాడుతున్నాయి.

హిందూత్వవాదులు హిందూ రాజ్యాన్ని పైనించే నిర్మించే ప్రయత్నంలో విఫలమై ఇప్పుడు కింది నుంచి పైకి నిర్మించే ప్రయత్నంలో తెస్తున్న వ్యూహం సక్సెస్ అవుతోంది. పైనుంచి రాజ్యాంగ సవరణ అవసరం కాబట్టి కుదరదని తెలుసు. 1993లో రాజ్యాంగాన్ని 73, 74వ సవరణల ద్వారా మార్చిన తర్వాత దేశంలో ఎక్కడైనా పరిపాలన ఆయా ప్రాంత స్థానిక సంస్థల ఆధ్వర్యంలోనే జరగాలి. గ్రామాలలో పంచాయితీల మాదిరి. దీన్ని బట్టి తిరుమల స్థానిక సంస్థల ఆధీనంలోకి రావాలి. దీనివల్ల గ్రామంలో ఉన్న అన్ని మతస్తులకు ఆ నిధుల పట్ల హక్కు ఉంటుంది. తిరుమలలో కొన్ని వందల సంవత్సరాలుగా తమ శ్రమను త్యాగం చేసిన స్థానికులను తిరుమల నుండి తితిదే రక్షణ పేరుతో గెంటివేసింది. మునుపు తిరుమలలో ముస్లింలు, క్రైస్తవులు, దళితులు అందరూ సహజీవనం చేస్తూ ఈరోజు తిరుమలను ఈ స్థాయికి తీసుకొచ్చారు.

కాశీ, మథుర, హరిద్వార్, రుషికేశ్ ఇంకా చాలాచోట్ల అన్ని మతస్తుల వారు సహజీవనం చేస్తున్నారు. కాశీలో హిందూ, ముస్లిం దేవాలయాలకి ఒక గోడే అడ్డు, అక్కడ జి.ఒ. 747 వర్తిస్తుందా? ఎక్కడలేని వింత జి.ఒ.లను సృష్టిస్తూ తిరుమలను ఒక చిన్నపాటి మత రాజ్యంగా తయారు చేసే పనిని చేస్తున్నారు.

బాలాజీ భార్య బీబీ నాంచారమ్మ. ఆమె ముస్లిం యువతి. ఈమె విగ్రహాన్ని తిరుపతి గోవిందరాజు స్వామి గుడిలో పెట్టి ఇప్పటికీ పవిత్రంగా పూజిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ముస్లింలు, క్రైస్తవులు తిరుమల శనివారాలు పాటిస్తూ ఆరోజు మాంసాహారం భుజించరు. అలాగే పీర్ల పండుగలో పెద్ద ఎత్తున హిందువులు పాల్గొంటారు. మరి ముస్లింలకు హుండీలో వాటా ఇవ్వాలి కదా? మరి ఇస్తారా?

తిరుమలలో నాలుగు వేల సంవత్సరాల క్రితం ఆదిమ మానవులు నివసించినట్లు ఆధారాలున్నాయి. వర్ణ చిత్రాలు, ఎన్‌గ్రేవింగ్స్ (రాతి మీద చెక్కబడిన చిత్రాలు) ఎగువరాతి యుగం నాటివి. మధ్యశిలా యుగానికి చెందిన పెయింటింగ్స్ యుద్ధగళ తీర్థంలోను, గంగులోడి కొనలోను ఉన్నాయి. ఇవి తిరుమల అడువుల్లో గర్భగుడి నుండి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.

ఇవి సింధులోయ, తుంగభద్రలోయ నాగరికతల చిత్రాలను పోలి ఉన్నాయి. ఆదిమ మానవులు శ్రీవారి ఆలయ స్థలంలోనే ఓ రాతి శిలను ఆరాధించి ఉండవచ్చని చెప్పొచ్చు. క్రీ.శ. 18కి చెందిన మెకంజీ కైఫీయతుల్లో కూడా ఆటవికులు ఉన్నట్లు పేర్కొనబడింది. వెంకటేశ్వరుడు గిరిజన స్త్రీలతో సరసాలాడినట్టు జానపద గేయాల్లో కన్పిస్తాయి. మాతృస్వామిక వ్యవస్థలు ఉన్న ఆ కాలంలో అక్కడ గ్రామదేవత ఉండే శక్తి దేవతగా ఆరాధించబడేది. తర్వాత ఆర్యుల రాకతో దేవతల భార్యలుగా గ్రామ దేవతలు చెలామణీ అయ్యారు. అటు తర్వాత తిరుమల బౌద్ధారామంగా, శైవ క్షేత్రంగా, క్రీ.శ. 11 నుండి వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి పొందింది.

కాబట్టి తిరుమల ఆదాయంలో ఆదివాసులకు, గిరిజనులకు, దళితులకు వాటా ఉన్నట్టే. వారంతా తాము హిందువుల్లో భాగం కాదని తెగేసి చెపుతున్నారు. 13వ శతాబ్దంలో మహమ్మదీయుల దండయాత్రలో కూడా హిందూ దేవుళ్లను గౌరవించారు.

లౌకికత, ప్రజాస్వామ్యం రెండూ విడదీయరానివి. సౌదీ తప్ప అరబ్బు దేశాలన్నీ లౌకిక రాజ్యాలే. సౌదీలో ఎంతోమంది హిందువులు పనులు చేసుకుంటున్నారు. ముస్లిం దేశాలే హిందువులను గౌరవించి ఉపాధి కల్పించి విద్య, వైద్య సౌకర్యాలను కల్పిస్తున్నాయి. క్రిస్టియన్‌లు ఎక్కువగా ఉన్న దేశాలన్నిటిలో హిందువులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

మనిషికీ, ప్రకృతికీ గల వైరుధ్యాలలో భాగంగా మతం పుట్టింది. ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాలలో మతం బలహీనపడి ఆస్తి సంబంధాల రంగంలోకి మారిపోయింది. ఇక్కడ చర్చి రాజ్యం నుండి వేరుపడి మత ప్రచారానికే పరిమితమయింది. భూస్వామ్య వ్యవస్థలో రాజ్యం మద్దతుతో మతం ఉపరితలంలో చేరింది. పెట్టుబడిదారీ వ్యవస్థ సమాజంలోని మతంతో ఘర్షణపడి మతం ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేసింది. ఉత్పత్తి శక్తుల ఆస్తి సంబంధాల నుండి తీసివేయడానికి ప్రయత్నించి, ఉపరితలంలో నుండి మాత్రం తీసివేయలేక పోయింది. మతం పూర్తిగా వ్యక్తిగతమైపోయింది. సమాజ పునర్నిర్మాణానికి ఏ మాత్రం ఉపయోగపడదు. అయితే రాజ్యాధికారానికి ఒక అవసరమైన పనిముట్టుగా మారింది. ఉపరితలంలోని మతం తిరిగి ఉత్పత్తి శక్తులను ప్రభావితం చేసే పరిస్థితులు ఇప్పుడు కల్పించ బడుతున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో శత్రువైరుధ్యంతో ఉన్న మతానికి సెక్యులరిజం అవసరమైంది. ఇది సామ్రాజ్యవాద దశలో మిత్ర వైరుధ్యంగా మారుతుంది. అందువల్ల దళిత ఉద్యమాలు, హిందూయేతర ఉద్యమాలు బ్రాహ్మణ భావజాలానికి, భూస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. బ్రాహ్మణ ఆధిపత్య భావజాలం దీనిని గుర్తించి, రాజ్యాంగ శక్తిగా అవతరించే క్రమంలో హిందూత్వ మఠాధిపతులతో, హిందూత్వ పెట్టుబడిదారులతో కలిసి మైనారిటీల మీద, క్రిస్టియన్‌ల మీద దాడులు చేస్తోంది. ఈ చట్రంలోనే తిరుమలలో దళితులపై తితిదే చేస్తున్న వేధింపులను అర్థం చేసుకోవాలి.

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

ఎన్‌కౌంటర్లు - కొన్ని ప్రశ్నలు

పోలీసులు, సైన్యం చేస్తున్న 'ఎన్‌కౌంటర్'లలో అత్యధికంగా చనిపోతున్నవారు ముస్లింలు, ఆదివాసులు, దళితులు, మొత్తంగా అణగారిన వర్గాల ప్రజలేనని అంటున్నారు **ప్రహ్లాద్**

సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, గణతంత్ర రాజ్యంలో రాజ్యం తన కడుపులోని బిడ్డలను తనే కాల్చి చంపుకుంటోంది. ఎన్‌కౌంటర్ పేరిట కట్టుకథలు అల్లి న్యాయస్థానాలను సైతం ప్రక్కదారి పట్టిస్తున్నారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారిలో ఎక్కువ శాతం ఆదివాసులు, దళితులు, పీడిత వర్గాల ప్రజలు ఉండడం ఈ దేశ దౌర్భాగ్యం. ఏ ప్రభుత్వమైనా తన ప్రజలను తానే చంపుకుంటుందా? దేశంలో అత్యున్నత న్యాయస్థానానికి కలిగిన సందేహం. ఇలాంటి సందేహం రావడంలో వింత లేదు. కొడుకు ఎంత దుష్టుడు అయినా వదులుకునేందుకు తల్లిదండ్రులు సిద్ధంగా ఉండరు. దారితప్పిన తనయుని దారిలోకి తెచ్చేందుకూ ప్రయత్నిస్తారు. అంతే తప్ప హతమార్చడానికి సిద్ధపడరు. ఇది సహజం కాని ఈ దేశ పాలక వర్గాలు అమెరికన్ సామ్రాజ్యవాదులకు సలాం చేస్తూ, ఈ దేశ మూలవాసులైన ఆదివాసులపై తుపాకి ఎక్కుపెట్టి సహజవనరులు, ఖనిజ సంపద మొత్తం బహుళజాతి కంపెనీలకు దోచి పెడుతున్నారు. ఎదురు తిరిగిన వారిపై ఎన్‌కౌంటర్ కథ అల్లుతున్నాయి. ఇది ఎవరి ప్రభుత్వం, ఎవరి సంక్షేమం కోసం పని చేస్తున్నది? ప్రతి సామాన్యుడిలో కదిలే ప్రశ్నలు ఇవి.

ఇటీవల బస్తర్ ప్రాంతంలో బాసగూడలో జరిగిన 'ఎన్‌కౌంటర్' కూడా ఇవే ప్రశ్నలను వేస్తుంది. నిజానికి ఎన్‌కౌంటర్ అంటే ఎదురు కాల్పులు అనే అర్థం ఎప్పుడో మారిపోయింది.

నక్సలైట్లు అంటూ కొందరిని చెట్లకు కట్టేసి కాల్చిచంపేయడంతో ఎదురుకాల్పుల అనే అర్థం ఎప్పుడో మారిపోయింది. వారు హతమై పోయారని ప్రకటించిన నాడే 'ఎదురుకాల్పులు' అనే పదానికి అర్థం మారిపోయింది. ఎన్‌కౌంటర్ అంటే తమకు సరిపడని వారిని గురిచూసి కాల్చివేసే పద్ధతి అని అర్థం అయిపోయింది. ఆ అర్థం సామాన్య ప్రజల లో, ప్రజాస్వామిక వాదులలో, మేధావుల్లో స్థిరపడిపోయింది. ప్రతి ఎన్‌కౌంటర్‌లోనూ ఎన్నో ప్రశ్నలు శేష ప్రశ్నలుగా మిగిలిపోతున్నాయి.

ఎన్‌కౌంటర్‌పై ఈ విధమైన ప్రశ్నలు ఈ నాటివి కావు. కొన్ని దశాబ్దాల క్రితం నుంచి ఇవి ఉత్పన్నం అవుతున్నాయి. ఎలాంటి సమాధానాలు రాకుండానే కేసులు మూసి వేయబడుతున్నాయి. ఆజాద్, కిషన్‌జీ, పటేల్ సుధాకర్ రెడ్డి, ఇతర మావోయిస్టు నేతల ఎన్‌కౌంటర్ కేసులు కూడా మూసేస్తున్నారు. వాస్తవానికి ఇది ఏ ఒక్క రాష్ట్రానికో, ఏ ఒక్క వర్గానికో పరిమితం అయిన సమస్య కాదు. కాశ్మీర్‌లో ముస్లిం యువతను ఉగ్రవాదుల పేరుతో, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, ఒడిశా, బీహార్, బెంగాల్ తదితర రాష్ట్రాలలో మావోయిస్టుల పేరు మీద 'ఆదివాసులను' ఎన్‌కౌంటర్ చేసి చంపుతున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఉద్యమాలు చేస్తున్నవారిని, విముక్తి పోరాటాలు చేస్తున్నవారిని ఎన్‌కౌంటర్ చేస్తున్నారు. చివరకు దొంగలను కూడా ఎన్‌కౌంటర్ చేస్తున్నారు. ముంబాయిలో మాఫియా పేరుమీద ఎన్‌కౌంటర్ చేస్తున్నారు.

ఈ ఎన్‌కౌంటర్‌లను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యావంతులు ప్రశ్నించకపోతే ఇదే రాజ్య విధానంగా మారిపోయే ప్రమాదం ఉంది. ముంబాయి, చత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్‌లలో 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టులు' ఉన్నట్లుగా ప్రతి చోట కూడా తలెత్తే ప్రమాదం ఉంది.

హింసకు ప్రతిహింస సమాధానం కాదు. అవతలి వారికి చట్టంపై విశ్వాసం లేనంత మాత్రాన మనం కూడా చట్టానికి అతీతంగా వారిని హతమార్చడం చట్టబద్ధం కాదు. మనకంటూ కొన్ని చట్టాలున్నాయి. ఆ చట్టాలకు లోబడి మనం పనిచేయాలి. అవతలివారు చట్టాన్ని ఉల్లంఘించారంటూ, ప్రభుత్వం కూడా చట్టాన్ని ఉల్లంఘిస్తే, ప్రభుత్వానికి ఉన్న చట్టబద్ధతనే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉంది. ఒక వ్యక్తి తప్పు చేస్తే శిక్షించేందుకూ న్యాయస్థానాలు ఉన్నాయి. ఆ పనిని ఇతర ప్రభుత్వ యంత్రాంగాలు (పోలీసు వ్యవస్థ) చేయడం న్యాయస్థానాల అస్తిత్వాన్నీ, విశ్వసనీయతనూ ప్రశ్నించినట్లు అవుతుంది. అరాచకత్వం, నిరంకుశత్వం రాజ్యమేలి సమాజ సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉంది. అలా జరిగిన నాడు మనం నమ్ముకున్న ప్రజాస్వామిక వ్యవస్థకు అర్థం లేకుండా పోతుంది. తమ స్వార్థం కోసం ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్ విధానాలను ప్రోత్సహిస్తే, ఏదో ఒకనాడు అది చివరకు ప్రభుత్వాలనే 'ఎన్‌కౌంటర్' చేస్తుంది.

జూన్ 28న చత్తీస్‌గడ్ రాష్ట్రంలో బస్తర్ ఎన్‌కౌంటర్ ఎన్నో ప్రశ్నలను మన ముందుంచింది. ఆ ఎన్‌కౌంటర్ 'మరో జలియన్‌వాలా బాగ్'గా ఈ దేశ చరిత్రలో మిగిలిపోయింది. ఆదివాసులపై జరిగిన హత్యాకాండగా మేధావులు ప్రశ్నించారు. గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో భాగం గానే ఆదివాసులను మావోయిస్టుల పేరుతో చంపుతున్నారని మీడియా గర్జించింది. ఆదివాసి సంఘాలు, ఆదివాసి విద్యావంతులు ఈ బస్తర్ ఎన్‌కౌంటర్ పట్ల దేశవ్యాప్తంగా తీవ్రమైన నిరసన వ్యక్తం చేస్తున్నారు.

జూన్ 28 బస్తర్ ఎన్‌కౌంటర్ – కొన్ని ప్రశ్నలు

1) అత్యున్నత స్థానంలోని కేంద్ర హోం మంత్రికే తప్పుడు నివేదికలు పోలీస్, ఇంటిలిజెన్స్ అధికారులు పంపించగలుగుతారా? అలా పంపిస్తే ఆ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

2) అధికారుల నివేదికలోని నిజానిజాలు తేల్చకుండానే ఆ నివేదిక అంశాలనే హోం మంత్రి మాట్లాడుతారా? నిజాలు తెలుసుకొనేందుకు కనీసం ప్రయత్నం చేయరా?

3) సాటి మంత్రి ఆ బస్తర్ ఎన్‌కౌంటర్‌పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా అతనిని పరిగణనలోకి తీసుకోరా? నిజం తెలుసుకొనే ప్రయత్నం

సర్కారు బడుల గోడు వినేదెవరు?

ఒకవైపు కనీస మౌలిక సదుపాయాలు లేని స్థితి, మరోవైపు ఉపాధ్యాయుల గైర్హాజరీ, బాధ్యతారాహిత్యాలు ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పడిపోవడానికి కారణమవుతున్నాయని అంటున్నారు సిలువేరు హరినాథ్

స్వాతంత్రం వచ్చి అరవై ఐదు సంవత్సరాలు నిండినా ఆంధ్రప్రదేశ్ సర్కారు సంపూర్ణ అక్షరాస్యత సాధించడంలో విఫలమైంది. సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా అనేక ప్రభుత్వాలు పనిచేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు సాధించడంలేదు. సంపూర్ణ అక్షరాస్యత కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా ఫలాలు మాత్రం అంతంత మాత్రమే ఉన్నాయి. 2011 అక్షరాస్యతా లెక్కల ప్రకారం భారతదేశం 74.04 శాతం అక్షరాస్యత సాధించింది. అందులో 82.14 శాతం పురుషులు కాగా 65.46 శాతం మహిళల అక్షరాస్యత ఉంది. ఆంధ్రప్రదేశ్ 67.66 శాతంతో దేశంలో 23వ స్థానం సంపాదించుకుంది. అందులో 75.56 శాతం పురుషులు ఉండగా, 59.74 శాతం మహిళా అక్షరాస్యత ఉంది. భారతదేశంలో ప్రాథమిక విద్య చాలా మందికి అందని ద్రాక్షగానే మిగిలింది. ప్రభుత్వం విద్యను అందరికి అందించడానికి ఎన్నో పథకాలు ఏర్పాటు చేసినా ఫలాలు పొందుతున్నది మాత్రం కొంత మంది మాత్రమే. ఆధునిక ప్రపంచంలో నిరక్షరాస్యులు మన దేశంలో ఇంకా 26 శాతం మంది ఉన్నారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులు బడికి దూరం కావడం దీనికి ప్రధాన కారణం. ప్రాథమిక విద్యను పిల్లలకు అందించడంలో అటు ఉపాధ్యాయుల, అధికారుల అలసత్వంతో పాటు సమాజంలోని అసమానతలు పిల్లలను బడికి దూరం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సర్కారు బడులు కూడా నిర్లక్ష్యపు నీడలో నడుస్తుండడంతో ప్రాథమిక విద్యా లక్ష్యం బలహీనం అవుతున్నది. ప్రభుత్వ పాఠశాలల గడీలు తాకి చూస్తే అంతు చిక్కని చేదు నిజాలు బయటపడుతున్నాయి.

రాష్ట్రంలో 48,272 ప్రాథమిక పాఠశాలలు, 11,346 ప్రాథమికోన్నత పాఠశాలలు, 8,492 హైస్కూల్లతో కలిపి మొత్తం 68,210 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 5 లక్షలకు పైగా ఉపాధ్యాయులు విద్యా బోధన అందిస్తున్నారు. ఈ ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 70 లక్షల మంది విద్యార్థులు తమ విద్యనభ్యసిస్తున్నారు. 2009-10 సంవత్సరం లెక్కల ప్రకారం 18.5 శాతం మంది ఎస్‌సిలు, 9.8 శాతం మంది ఎస్‌టిలు, 45.1 శాతం మంది ఒబిసిలు, 9 శాతం ముస్లిం విద్యార్థులు ఉన్నారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన మొత్తం 82.3 శాతం మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చదువుతున్నారు. అయితే ఈ సర్కారు బడులల్లో విద్యార్థులకు కావాల్సిన అనేక మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడం, ఉపాధ్యాయుల బోధన తీరు సరిగా లేకపోవడం, వారి రోజువారి గైర్హాజరు తీవ్రంగా ఉండడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సమస్యల వివరాలను చూసినట్లయితే 27 శాతం పాఠశాలల్లో కనీసం తాగునీటి వసతి కల్పించక పోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడం ద్వారా 25 శాతం పైగా పాఠశాలల్లో విద్యార్థులు ఆరుబైటనే కూర్చొని ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వచ్చిరాని పాఠాలు నేర్చుకుంటున్నారు. ప్రధానంగా విద్యార్థినులకు టాయిలెట్స్ లేకపోవడం వలన పాఠశాలల్లో ఇబ్బందులకు గురవుతూ అయిష్టంగా బడికి వస్తున్నారు. సుమారు 59 శాతం పాఠశాలల్లో టాయిలెట్స్ లేవు. కొన్ని పాఠశాలల్లో ఉన్నా అవి ఉపయోగంలో లేవు. 26 శాతానికి పైగా పాఠశాలల్లో కనీసం టీచర్లు రాయడానికి బ్లాక్ బోర్డు కూడా లేవు. విద్యతో పాటు మానసికోల్లాసానికి

చేయరా?

4) ఎదురుగా ఎవరున్నారో తేల్చుకోకుండానే జవాన్లు కాల్పులు జరుపుతారా?

5) కనీసం 'నిఘా' సమాచారం లేకుండానే కాల్పులకు దిగుతారా?

6) వాస్తవాలు అంగీకరించడంలో ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందులేమిటి?

7) అర్ధరాత్రి ఎన్‌కౌంటర్ జరిగితే, మరుసటి రోజు ఉదయం 6 గంటలకు కూడా కొంతమంది ఆదివాసులు ఎలా ప్రాణాలు కోల్పోయారు?

8) సిఆర్‌పిఎఫ్ క్యాంప్‌కు మూడు కిలోమీటర్ల దూరంలోనే మావోయిస్టులు సమావేశం నిర్వహించగల్గుతారా?

9) వెన్నెల రాత్రి వేళల్లో నైట్ విజన్ గ్లాసులు ఉన్నా, చిన్న పిల్లలనూ గుర్తించలేకపోయారా?

10) చనిపోయిన ఆదివాసులందరికి సొంత రేషన్ కార్డు, ఎన్నికల గుర్తింపు కార్డులు ఉన్నాయి. అడవుల్లోని మావోయిస్టుల వద్ద అలాంటి కార్డులుంటాయా?

11) క్రాస్ ఫైరింగ్ వల్లే పోలీసులు గాయపడ్డారా?

12) చత్తీస్‌గడ్‌లో కాంగ్రెస్ పార్టీలోని సభ్యులు (సొంతపార్టీ సభ్యులు) ఇచ్చిన నివేదికనూ కాంగ్రెస్, అది నేతృత్వం వహిస్తున్న ప్రభుత్వం విశ్వసించలేదా?

ఇది కేవలం 'గ్రీన్‌హంట్' ఆపరేషన్‌లో భాగంగానే ఆదివాసులను అంతమొందించి 'మావోయిస్టులపై గన్ను - ఖనిజాలపై కన్ను' సూత్రం ద్వారా ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా ఆదివాసి సంఘాలు, మేధావులు, విప్లవసంస్థలు సమైక్యంగా పోరాటం చేయాలి.

(రచయిత ఆదివాసి రచయితల సంఘం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి) వీ

ఉపయోగపడే ఆటస్థలం 56 శాతానికి పైగా పాఠశాలల్లో లేవు. శిశు తరగతి విద్యార్థులకు కావాల్సిన బొమ్మల చిత్రాలు 60 శాతం పాఠశాలల్లో లేవు. 77 శాతం పైగా పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన లైబ్రరీలు లేవు. 85 శాతానికి పైగా మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ లేవు. 76 శాతం పైగా పాఠశాలల్లో కంప్యూటర్స్ లేవు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి కొన్న కంప్యూటర్లు సక్సెస్ స్కూళ్లల్లో మూలుగుతూ నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇక మధ్యాహ్న భోజన తయారీకి కావాల్సిన వంట గదులు 70 శాతం పైగా పాఠశాలల్లో నిర్మాణంలో లేవు. విద్యా హక్కు చట్టం కింద రాష్ట్రంలో ఒకటి నుండి ఎనిమిదవ తరగతి వరకు చదువుతున్న సుమారు 52 లక్షల మంది విద్యార్థులకు రు.210 కోట్ల వ్యయంతో రెండు జతల బడి దుస్తులు అందచేశారు. అయితే కనీస సామర్థ్యం లేని సంస్థలు సైతం వీటి తయారీకి పంపిణీ బాధ్యత దక్కించుకున్నాయి. దీనిపై సర్వత్రా విమర్శలు వచ్చినా అధికారులు స్పందించకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఇన్ని సమస్యలతో విద్యార్థులు పాట్లు పడుతుంటే మరో పక్క టీచర్ల రోజువారీ గైర్హాజరు విద్యార్థులను మానసికంగా దెబ్బతీస్తున్నది. టీచర్లు స్కూల్‌కి రాని కారణంగా విద్యారంగంలో విద్యార్థుల వెనుకబాటుతనం కనబడుతుంది. దీని కారణంగా విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో కనీసం చదవడం, రాయడం కూడా నేర్చుకోలేక పోతున్నారు. హైదరాబాద్ మహానగరంలోనే 81 శాతం పైగా విద్యార్థులకు కనీసం బేసిక్స్ రావడం లేదని గత ఏడాది సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో చేసిన సర్వేలో తేలిందంటే ఇక గ్రామీణ ప్రాంత విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

టీచర్ల గైర్హాజరుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే సాదా సీదాగా వ్యవహరిస్తున్నారు. టీచర్ల గైర్హాజరు ఇతర దేశాలలో చూసినట్లయితే బంగ్లాదేశ్‌లో 16 శాతం, జాంబియాలో 17 శాతం, ఇండోనేషియాలో 19 శాతం, ఉగాండాలో 27 శాతం ఉండగా మన భారతదేశంలో 25 శాతం ఉంది. ఇక రాష్ట్రాల వారీగా చూసినట్లయితే మహారాష్ట్రలో 14.7 శాతం, గుజరాత్‌లో 17 శాతం, జార్ఖండ్‌లో 42 శాతం ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 25.3 శాతం ఉంది. అంటే జాతీయ సగటు కంటే ఆంధ్రప్రదేశ్‌లో టీచర్ల గైర్హాజరు ఎక్కువగానే ఉంది. పబ్లిక్ రిపోర్టు ఆన్ బేసిక్ ఎడ్యుకేషన్ సర్వేలో 25 శాతం పైగా ప్రధానోపాధ్యాయులు గైర్హాజరు అవుతున్నారని తమ సర్వేలో తెలిపింది. స్కూల్లో ఉన్న నలుగురు టీచర్లలో ఒక టీచరు మాత్రమే సక్రమంగా తమ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపింది. దీని కారణంగానే కావచ్చు ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కేవలం 6.3 శాతం ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే నూరు శాతం ఫలితాలు సాధించాయి.

టీచర్ల గైర్హాజరు గ్రామీణ ప్రాంతాల్లో 33 శాతం ఉండగా పట్టణ ప్రాంతాల్లో 21 శాతం ఉంది. ఇది కూడా ప్రాథమిక పాఠశాలల్లోనే ఎక్కువగా ఉండడం కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ లభించడం లేదు. దీని కారణంగా అనేక మంది విద్యార్థులు బడిబాటమాని పనిబాట పడుతున్నారు. టీచర్లు పనిచేసే చోటే నివాసం ఉండాలనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నా అవి ఏ టీచరూ పాటించడం లేదు. కనీసం 60 శాతం పైగా టీచర్లు 30 కిలోమీటర్లు పైగా రోజువారీ ప్రయాణం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వ రవాణా సౌకర్యం సమయానికి లేకపోవడం కారణంగా కూడా టీచర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీని వలన సమయానికి స్కూల్‌కి చేరుకోలేకపోతున్నామని టీచర్లు వాపోతున్నారు. అయితే ప్రభుత్వ టీచర్లు తమ పిల్లల ఉన్నత చదువుల కోసం పట్టణ బాటపట్టి, ఉద్యోగంపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి బాహాటంగానే వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 82 శాతానికి పైగా విద్యార్థులు బడుగు బలహీన వర్గాలకు చెందిన పేదవారు కావడం వల్లనే ఉపాధ్యాయులు వారి వృత్తిపై దృష్టి సారించడం లేదని, పాఠాలు కూడా సరిగా చెప్పడం లేదని అనేక విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి. మరో పక్క ప్రభుత్వ టీచర్లు ప్రైవేటు స్కూళ్ల మోజులోపడి విద్యా వ్యాపారం చేయడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదుతున్న విద్యార్థులను సైతం వారు నెలకొల్పిన ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో క్రమంగా ఎన్‌రోల్‌మెంట్ శాతం కూడా తగ్గిపోతోంది. ప్రభుత్వ టీచర్లు ప్రైవేటు పాఠశాలల్లో కానీ, కళాశాలల్లో కాని పాఠాలు చెప్పరాదు అనే ఆంక్షలు ఉన్నా అవి ఏవీ లెక్క చేయకుండా ప్రభుత్వ పాఠశాలకు దుమ్మా కొట్టి టైమ్‌కు ప్రైవేటు పాఠశాలల్లో క్లాసులు నిర్వహిస్తూ, ప్రభుత్వ పాఠశాలలను బలహీనంచేసే పనిలో ఉపాధ్యాయులు ఉన్నారు. టీచర్ల సంఘాలకు రాజకీయ బలం చేకూరడంతో వారికి ఎదురులేకుండా పోయింది.

పోటీ ప్రపంచంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులను తీర్చి దిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. కోట్లాది రూపాయలు విద్యారంగానికి కేటాయించినా అవి దుర్వినియోగానికి గురవుతున్నాయి. దాని కారణంగా అనేక పాఠశాలల్లో మౌలిక సమస్యలు ఎప్పటిలాగే దర్శనమిస్తున్నాయి. మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారుల మధ్య సరైన అవగాహన లేకపోవడం కారణంగానే విద్యారంగ సమస్యలు జటిలమౌతున్నాయి. స్కూళ్లపై ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడం కారణంగా టీచర్లు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థి సంఘాలు కేవలం సంక్షేమ పాఠశాలల మీదనే కాకుండా ప్రభుత్వ పాఠశాలలపైన కూడా దృష్టిపెట్టి పోరాటం చేయవలసిన అవసరం ఉంది. ఉన్నతాధికారులు టీచర్లపై కఠిన చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వ పాఠశాలలు ఆశించే స్థాయిలో ఉంటాయి. లేకుంటే పాఠశాలలో చదువుతున్న బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు యాచించే స్థాయిలో ఉండే పరిస్థితి ఉంది. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

(రచయిత డాక్టొరల్ ఫెలో, హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ) వీ

విద్యా వ్యవస్థలో మార్పులు

***గతంతో పోల్చి చూస్తే విద్యారంగం చాలా విషయాలలో అభివృద్ధి సాధించిందనీ, విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలనీ అంటున్నారు* తిరుక్కోవెల పద్మావతి**

దేశంలో విభిన్న సాంస్కృతిక, భాషా బేధాలున్నాయి. ప్రజాస్వామిక విలువలకు, సామాజిక న్యాయానికి మన దేశం కట్టుబడి ఉంది. దేశమంతటికి ప్రజాస్వామిక లక్ష్యాలు, సామాజిక న్యాయాన్ని కల్పించేందుకు విద్య ఒక సాధనం. వివిధ స్థాయిల్లో విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కమిషన్‌లను నియమించింది. 1976లో విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చారు. విద్యాభివృద్ధి కోసం కొత్త సంస్కరణలను ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వం 1986లో జాతీయ విద్యా విధానాన్ని రూపొందించింది. విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు పెంచేందుకు పిల్లలకు పాఠశాల విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఆరు దశాబ్దాలుగా ఈ అంశాలలో చెప్పుకోదగ్గ ప్రగతిని దేశం సాధించిందని చెప్పవచ్చు. విద్యా పిల్లవాడు జ్ఞాన గ్రహీతగా భావించే మన ఆలోచనగా ధోరణిలో పాఠ్యగ్రంథాలలో మార్పులు జరిగినప్పుడల్లా ప్రమాణాల పెంపుదల పేరుతో ఉన్నత స్థాయి అంశాలను చేర్చడం వలన పాఠ్యగ్రంథ పరిమాణం క్రమేపి పెరుగిపోతోంది. వృత్యంతర శిక్షణతో ఉపాధ్యాయుల సామర్థ్యాల నిర్మాణం మొదలైన వాటివల్ల విద్యార్థులలో ఆశించిన అభ్యసన మార్పులను కూడా తేవడం జరిగింది.

విద్యా సౌకర్యాల విస్తరణలోనూ, విభిన్న నేపథ్యాల నుండి వచ్చిన పిల్లల సార్వత్రిక విద్య అందుబాటులోకి తేవడంలోనూ గణనీయమైన ప్రగతిని సాధించడం జరిగిందని భావించవచ్చును. రాష్ట్రంలోని పిల్లలందరూ ఉన్నతస్థాయి గుణాత్మక విద్య పొందాలనేది రాష్ట్ర ప్రభుత్వ దృక్పథం. ఇతరుల పట్ల స్పందించే వైఖరులను కలిగి ఉండే బాధ్యతా యుతమైన పౌరులుగా విద్యార్థులు రూపొందాలి. తమ పరిసరాల పట్ల పరిజ్ఞానం కలిగి నిర్భయంగా మాట్లాడ గలగాలి. విన్నదాన్ని చదివినదాన్ని అవగాహన చేసుకోగలగాలి. కేవలం సమాచారం పొందడమే జ్ఞానం కాదు. సాంఘిక, గత అనుభవాల నుండి జ్ఞానం నిర్మితమవుతుంది. మానవీయ నైతిక విలువలు పెంచేందుకు పాఠశాలలు చోటు కల్పిస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ ప్రణాళికలను, నూతన విధానాలను చేపడుతూ తద్వారా రాష్ట్ర విద్యారంగంలో అభివృద్ధిని సాధించడానికి కృషి చేస్తుండడం, మన విద్యా వ్యవస్థ నూతన ఒరవడిలోకి నడవడం మనకెంతో గర్వకారణం. మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా అనేక కొత్త విద్యా విధానాలను సిద్ధం చేస్తుంది మన ప్రభుత్వం. మనకు తెలిసిన కొన్ని విద్యా చట్టాలను పరిశీలిద్దాం.

❖ జాతీయ విద్యా ప్రణాళిక చట్టం (ఎన్‌సిఎఫ్) 2005; ❖ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) 2009; ❖ జాతీయ ఉపాధ్యాయ విద్యా ప్రణాళిక చట్టం (ఎన్‌సిఎఫ్‌టిఇ) 2010; ❖ రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్టం 2011. మొదలయిన ఎన్నో నూతన విధానాలను అనుసరిస్తూ రాష్ట్ర విద్యారంగంలో సమగ్ర అభివృద్ధిని సాధించడానికి పూర్తి ప్రయత్నం చేస్తున్నాయి.

పాఠశాల విద్యా ప్రణాళికలో ప్రతి విద్యార్థి తన సమగ్ర అభివృద్ధికి కావలసిన గుణాత్మక విద్యను తప్పనిసరిగా పొందాలి. ఈ విషయం ప్రస్తుతం ఒక రాజ్యాంగ బద్ధమైన శాసనంగా అవతరించింది. ప్రతి పిల్లవాడు గుణాత్మక విద్య పొందే హక్కు ఉన్నదనే విషయం ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తృత ప్రచారం పొందింది. పాఠశాల పరిసరాలలో పెరుగుదల, భౌతిక అవసరాలు, రాష్ట్రవ్యాప్త హాజరు మెరుగుకై చర్యలు ప్రారంభించడం జరిగింది. ఆదర్శ పాఠశాల అభ్యాసకులకు తమను తాము తెలుసుకోవ డానికి, ఇతరుల గురించి, సమాజం గురించి తెలుసుకోవడానికి నూతన అవకాశాలను కల్పిస్తుంది. పాఠశాలలో గౌరవప్రదమైన వాతావరణాన్ని నిర్మించి, ఏ కుటుంబానికి చెందిన వారైనప్పటికీ అందరు పిల్లలను బడికి వచ్చేలా చేస్తుంది.

పాఠశాల విద్యా ప్రణాళికలో అనుకున్న లక్ష్యాలు సాధించడానికి వినూత్న కార్యక్రమాలను అనుసరిస్తున్నారు. అనేక సాంకేతిక బోధనోపకరణాలు ఉపయోగించి విద్యార్థులకు విషయాన్ని అర్థం చేయిస్తున్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో కాలానుగుణంగా జరిగే మార్పులకు అనుగుణంగా పిల్లలను సన్నద్ధులను చేస్తున్నారు. ఉపాధ్యాయుల సమగ్ర విద్యా లక్ష్యాల పట్ల అవగాహన కలిగి ఉండి మారుతున్న అవసరాలకు అనుగుణంగా వీరు పనిచేస్తున్నారు. అభ్యసన ప్రక్రియలో పిల్లలకు దోహదకారిగా ఉంటున్నారు. గతంలో ఉపాధ్యాయులు కేవలం విజ్ఞానాన్ని బోధించడానికి మాత్రమే పరిమితంగా ఉండేవారు. కాని నేటి మారిన పరిస్థితులలో ఉపాధ్యాయుడు ప్రతి విద్యార్థిలో జ్ఞాన నిర్మాణం జరగడానికి సహాయపడుతూ పిల్లలు ప్రతిస్పందించడానికీ, విశ్లేషించడానికీ, వివరించడానికీ అనుకూల పరిస్థితులను కల్పిస్తున్నారు.

పాఠశాల అనేది సూక్ష్మరూప సమాజం. భిన్న సంస్కృతి, సాంఘిక నేపథ్యం గల పిల్లలు పాఠశాలలకు వస్తారు. ప్రతి విద్యార్థిలో అనంతమైన సామర్థ్యాలు ఉంటాయి. పిల్లలందరూ అభ్యసించగలరు. సమయానుకూలం, పెద్దలు, ప్రకృతి, పరస్పర ప్రతిచర్యల వల్ల వారి అంతర్గత సామర్థ్యాల ఆధారంగా జ్ఞాన నిర్మాణం చేసుకుంటారు. అందులో భాగంగానే పాఠశాల ఒక చక్కని వాతావరణ అవకాశంగా ఉపయోగపడుతుంది. ప్రజాస్వామిక విలువలను ఆచరణలోకి తెచ్చి, పిల్లల పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అభిరుచులను పెంపొందించి సంపూర్ణ మూర్తిమత్వానికి చేయుతనిచ్చేది పాఠశాల. అన్ని రకాల బోధనాభ్యాసన, సహపాఠ్య కార్యకలాపాలతో బాధ్యతాయుతమైన పౌరునిగా విద్యార్థిని రూపుదిద్దే స్థలం ఒక పాఠశాల మాత్రమే. అనేక విధానాలను అనుసరిస్తూ నిర్మించిన నేటి నూతన విద్యా విధానాలు గౌరవించదగినవి. రాష్ట్రం విద్యారంగంలో అభివృద్ధిని సాధించి ఉన్నత స్థానంలో నిలపడానికి మనమంతా ప్రయత్నం కూడా అందిద్దాం. విద్యార్థులకు జ్ఞాన సంపదను పంచడానికి మనమూ తోడ్పడుదాం.

(రచయిత తెలుగు పండిట్) వీ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కబీర్

సుప్రీంకోర్టు 39వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అల్లమాస్ కబీర్ నియమింపబడ్డారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆయనతో సెప్టెంబర్ 29న ప్రమాణ స్వీకారం చేయించారు. కబీర్ ఆ పదవిలో 2013 జూలై 18 వరకు కొనసాగుతారు.

మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో ఎన్నికలు

మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నట్లు భారత ఎన్నికల ప్రధాన అధికారి వి.ఎస్ పంత్ అక్టోబర్ 3న ప్రకటించారు. ఈ రెండు రాష్ట్రాలలో బిజెపి అధికారంలో ఉంది. మధ్యప్రదేశ్‌లోని 68 స్థానాలకు నవంబర్ 4న, గుజరాత్‌లోని 182 స్థానాలకు, డిసెంబర్ 13న (87 స్థానాలకు), డిసెంబర్ 17న (95 స్థానాలకు) పోలింగ్ జరుగనుంద న్నారు. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 20న నిర్వహిస్తారన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నేరచరిత్రను, ఆస్తులను, అప్పులను, విద్యార్హతలను ఒకే ఫారంలో వివరించాలని ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని మొత్తం ఓటర్ల సంఖ్య 4,07,84,056. గుజరాత్‌లోని మొత్తం ఓటర్ల సంఖ్య 3,78,15,306.

కర్ణాటక రాష్ట్ర బంద్

కర్ణాటక రైతుల, ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెట్టి తమిళనాడుకు కావేరీ జలాలను విడుదల చేయాలన్నందుకు నిరసనగా కన్నడ సంస్థల పిలుపుమేరకు అక్టోబర్ 6న కర్ణాటక బంద్ పాటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు తక్కువ మంది హాజరయ్యారు. సినిమాహాళ్లు మూసివేశారు. కేబుల్ ప్రచారాలు నిలిపివేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మూసివేశారు. ఆటోలు, బస్‌లు అంతటా నడవలేదు. ఆందోళనకారులు ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్, కేంద్ర మంత్రి ఎస్.ఎం కృష్ణల ఇండ్ల ముట్టడికి ప్రయత్నించారు.

దొంగల రాజ్యం

ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) చైర్మన్ జస్టిస్ మార్కండేయ కట్జూ రాజకీయ నేతల గురించి మాట్లాడుతూ 'దేశం దొంగల రాజ్యంగా మారుతోంది. ఎక్కడ చూసినా దోపిడీ కొనసాగుతోందన్నారు. రాజకీయ నాయకుల్లో అవినీతి పెచ్చరిల్లడంతో నేతలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. నైతికవర్తన, దూరదృష్టి, చిత్తశుద్ధి కొరవడడమే దీనికి కారణమన్నారు. రాజకీయ నేతలు తమ పంథాను మార్చుకోకుంటే దేశ పరిస్థితులు మరింత దిగజారుతాయని అన్నారు.

భారత్‌లో పెరుగుతున్న అత్యాచారాలు

గత మూడు దశాబ్దాల్లో (1971-2011) అత్యాచారాల కేసులు 873 శాతం పెరిగాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో వెల్లడించింది. ఇవి అధికారికంగా నమోదైనవే. సామాజిక, ఇతర కారణాల వల్ల నమోదు కాకుండా ఉన్న అత్యాచారాల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. గత మూడు దశాబ్దాల్లో అన్ని నేరాల్లోకి రేప్‌ల సంఖ్యనే ఎక్కువగా ఉంది. ప్రతి 22 నిమిషాలకూ ఒక మహిళపై అత్యాచారం, ప్రతి 76 నిమిషాలకు ఒక రేప్ జరుగుతున్నట్లుగా వెల్లడయింది.

సునీల్ గంగోపాధ్యాయ కన్నుమూత

కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు సునీల్ గంగోపాధ్యాయ (78) గుండెపోటుతో అక్టోబర్ 24న మరణించారు. తూర్పు బెంగాల్‌లోని (ప్రస్తుత బంగ్లాదేశ్) ఫరీద్‌పూర్‌లో 1934 సెప్టెంబర్ 7న సునీల్ గంగోపాధ్యాయ పుట్టారు. ఆయన కవిత్వం, కథ, నాటకం తదితర సాహిత్య ప్రక్రియల్లో కృషి చేసి 200కు పైగా రచనలు వెలువరించారు. ఆయన 'క్రిత్తిబాస్' పత్రికను స్థాపించారు. ఆయన రాసిన 'సెయి సమయ్' (ఆ సమయంలో) నవలకు 1985లో సాహిత్య అకాడమీ అవార్డ్ అందుకున్నారు. 2008 నుంచి కేంద్ర సాహిత్య అకాడమీకి అధ్యక్షుడుగా కొనసాగారు.

అవినీతి దర్యాప్తుకు శిక్షణ

అవినీతి కేసుల విచారణను వేగవంతం చేయడానికి సిబిఐ, సివిసి అధికారులకు ప్రత్యేక శిక్షణను ఇప్పించాలని సిబ్బంది శిక్షణ విభాగం నిర్ణయించింది. శిక్షణ కోసం ఆస్ట్రియా, మలేసియాల్లో అవినీతి దర్యాప్తుకు సంబంధించిన రేండేళ్ల మాస్టర్ డిగ్రీ కోర్సు కోసం అధికారులను అనుమతించాలని నిర్ణయించింది.

జర్నలిస్టులకు అవార్డులు

పాత్రికేయ వృత్తిలో కృషిచేసిన వారికి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) జాతీయ స్థాయిలో అవార్డులను ప్రకటించింది. జాతీయస్థాయిలో మొదటిసారిగా అందజేస్తున్న ఈ అవార్డుకు 11 మందిని ఎంపిక చేసింది. నవంబర్ 16న భారత మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య ఈ అవార్డులను అందజేస్తారు. పరిశోధనాత్మక జర్నలిజంలో దమయంతి (ఇండియా టుడే), ప్రియాంక దూబే (తెహల్కా), పిటిఐ (ఢిల్లీ), ఫోటో జర్నలిస్ట్ కమల్‌కిషోర్‌లు, సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్, అవార్డుకు ఎంపికయ్యారు.

యశ్ చోప్రా ఇక లేరు

ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు, నిర్మాత, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ గ్రహీత యశ్ చోప్రా (80) అక్టోబర్ 21న మరణించారు. డెంగీ వ్యాధికి చికిత్స కోసం ముంబైలోని లీలవతి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కన్ను మూశారు. ఆయన 1932 సెప్టెంబర్ 27న లాహోర్‌లో పుట్టారు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు భారత సినీరంగానికి దర్శకుడిగా, నిర్మాతగా సేవలందించారు. సినీరంగానికి ఆయన చేసిన సేవలకుగాను ప్రభుత్వం ఆయనకు 2001లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్, 2005లో పద్మభూషణ్ పురస్కారాలను ఇచ్చి గౌరవించింది. వీ

భూమి కోసం...

భూమి, నివాసం, విద్యా, ఉపాధి హక్కుల కోసం మధ్యప్రదేశ్‌లోని 50 వేల మంది గిరిజనులు, రైతు కూలీలు గ్వాలియర్ నుండి ఢిల్లీకి అక్టోబర్ 2న ఏక్తా పరిషత్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. కూడు, గూడు, గుడ్డ వంటి ప్రధాన సమస్యలపై దేశ ప్రజలను సంఘటితం చేసే ప్రయత్నంలో భాగంగా ఏక్తా పరిషత్ (గాంధేయవాద సంస్థ) వ్యవస్థాపకుడు పి.వి. రాజగోపాల్ ఈ యాత్రకు పూనుకున్నారు. అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 29 వరకు 27 రోజుల పాటు 340 కిలోమీటర్లు కొనసాగి ఢిల్లీని చేరుకోనున్నది. ఈ యాత్రలో 'సగం రోటి తింటాం, ఢిల్లీ దాకా పోతాం' అనేది నినాదం అయింది. యాత్ర కాలంలో వీరు ఒక పూట మాత్రమే తింటారు. అందుకే ఈ ఉద్యమానికి జన సత్యాగ్రహం అని పేరు వచ్చింది. ఈ యాత్ర ఉద్దేశం భూమిని అనాదిగా సాగుచేసుకుంటున్న వారికి దానిపై హక్కు ఉండాలని కోరుతున్నారు. వారికి హక్కు లేకపోవడానికి 'బ్రిటిష్ కాలంనాటి భూ చట్టాలే' కారణం అని ఏక్తా పరిషత్ నాయకుడు రాజగోపాల్ అంటున్నారు. ఆ చట్టాలను మార్చి జాతీయ స్థాయిలో భూ బ్యాంకును ఏర్పాటుచేయాలంటున్నారు. భూమితోనే సంపూర్ణ స్వేచ్ఛ సాధ్యమనేది ఏక్తా పరిషత్ సిద్ధాంతం. ఇప్పటికీ బ్రిటిష్ చట్టాలు కొనసాగడమనేది మనల్ని పాలిస్తున్నది వ్యక్తులుగా ఇక్కడివారైనా, విధానపరంగా చూసినప్పుడు విదేశీ విధానాలే అమలులో ఉన్నాయి. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ, దేశంలోని ప్రజల ప్రమేయంతో చట్టాలు రూపొందించాలనీ, అవి దేశ ప్రజల కనీస అవసరాలు తీరేలా ఉండాలని అడుగుతున్న ఆదివాసుల ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. ఈ దేశ పాలకులు మాత్రం విదేశీ సంస్థలకు ఈ దేశ సహజవనరులను దోచిపెడుతూ, ఆదివాసులకు జీవితమే లేకుండా చేస్తూ, పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నారు. సత్యాగ్రహ యాత్ర సాగుతున్న క్రమంలోనే కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేశ్‌తో జరిగిన చర్చలు కొనసాగాయి. ఈ చర్చల్లో భూమిలేని నిరుపేదలకు భూములను పంచాలనీ, ఉపాధి కల్పించాలనే డిమాండ్‌లు ప్రధానంగా ముందుకు వచ్చాయి.

ఏక్తా పరిషత్ నాయకుడు రాజగోపాల్ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేశ్‌ల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు యాత్రను అక్టోబర్ 11న విరమించుకున్నారు. ఏక్తా పరిషత్ ఆధ్వర్యంలో భూమి కోసం జరిగిన పాదయాత్ర అయినా, అన్నా హజారే నాయకత్వంలో అవినీతికి వ్యతిరేకంగా జనలోక్‌పాల్ బిల్లుకోసం సాగుతున్న దీక్షలయినా ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తెచ్చేవే. చివరికి అవి పరిష్కారాలవైపు వెళ్లకుండానే మధ్యలోనే ఏదో కారణం చెప్పి ముగుస్తున్నాయి. అలా కాకుండా ఏ సమస్యల కోసమయితే ప్రజలు ముందుకు వచ్చారో ఆ సమస్యల అంతిమ పరిష్కారాల కోసం ప్రయాణిస్తే ఏ యాత్రలయినా, అన్నా దీక్షలకయినా ప్రయోజనం ఉంటుంది. ప్రజల ఆకాంక్షలను మధ్యలో వదిలేయడమనేది ఆయా వ్యక్తుల ప్రతిష్ట పెంచుకోవడానికో, లేదా ప్రజలు అంతిమ పరిష్కారాల వైపు వెళ్లకుండా అడ్డుకోవడానికో దారితీస్తాయి. స్వచ్ఛంద సంస్థల, కార్పొరేటు సంస్థల ఆధ్వర్యంలో సాగే ఉద్యమాలు ఎటు వైపు వెళతాయనేదానికి ఈ మధ్య కాలంలో జరిగిన ఈ రెండు ఉద్యమాలు మంచి ఉదాహరణలు. ఈ దేశంలోని ప్రజలు తమ కనీస అవసరాలు తీర్చమంటూ వేలాది మంది రోడ్ల మీదికి వచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాకుండా వేలాది ఎకరాల భూమినీ, అటవీ సంపదనూ, గనులనూ పాలకులు విదేశీ సంస్థలకు దోచి పెడుతూ, అక్రమ సంపాదనకు పాల్పడుతూ, తమ అధికారాన్ని నిలుపుకోవడానికి ప్రజలపై నిర్బంధాన్ని ప్రయోగించి వేలాది మందిని జైళ్లలో పెట్టి హింసిస్తున్నారు.

కూడంకుళం వేరే దేశమా...?

తమిళనాడులోని కూడంకుళం అణువిద్యుత్ కేంద్రాని వ్యతిరేకిస్తూ గత కొంత కాలంగా స్థానిక జాలర్లు, ప్రజలు వివిద రూపాల్లో పోరాడుతున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల సముద్ర జలాలు విషతుల్యమై, మత్స్య సంపద చనిపోతుందని దీని వల్ల తమ జీవనాధారం పోయి వేలాది కుటుంబాలు వీధిన పడతాయనేది వారి ఆందోళనకు ప్రధాన కారణం. ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను దృష్టిలోకి తీసుకోకుండా అణువిద్యుత్ కేంద్రం నిర్మాణం కోసం ప్రజలపై తీవ్రమైన అణిచివేతను ప్రయోగించింది. అణువిద్యుత్ కేంద్రం నిర్మాణం వల్ల తమ జీవితాలకే కాక భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆరు వేల మందిని ప్రభుత్వం ఇప్పటికే జైళ్లలో నిర్బంధించింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామిక వాదులు, మేధావులు, ప్రజా సంఘాల వారు అక్కడి ప్రజలు పరిస్థితిని తెలుసుకుందామని నిజనిర్ధారణ బృందంగా వెళ్లారు. అక్కడి ప్రభుత్వం అణువిద్యుత్ కేంద్రం ఉన్న ప్రాంతం చుట్టూ 144 సెక్షన్ విధించింది. అక్టోబర్ 12న కూడంకుళానికి వెళ్లిన బృందాన్ని 40 కిలోమీటర్ల దూరంలోనే అరెస్ట్ చేసి వివిధ సెక్షన్‌లు మోపి జైళ్లో నిర్బంధించింది. ఆ బృందంలో పళని సామి (సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం నాయకుడు, తమిళనాడు), అరవింద అవినాష్, దామోదర్ (పియుసిఎల్, ఝార్ఖండ్), పి. వరలక్ష్మి (విప్లవ రచయితల సంఘం), అగరాది (ఉమెన్ ఆఫ్ రైజింగ్ మూవ్‌మెంట్, మధురై), ప్రియదర్శిని (పరిశోధన విద్యార్థిని, జెఎన్‌యు, ఢిల్లీ), ప్రతిమాదాస్ (ఒడిశా హైకోర్టు న్యాయవాది), దస్తగిరి (రాయలసీమ విద్యార్థి వేదిక), హమీద్ (ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం), జగన్ (స్టూడెంట్ ఆఫ్ రైజింగ్ మూవ్‌మెంట్ ఫర్ సోషల్ వెల్‌ఫేర్, మదురై), కేశవన్ (సిపిసిఎల్, న్యాయవాది)లు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు. వీరికి మావోయిస్టులతో సంబంధాలున్నాయిని అసత్య ప్రచారానికి పూనుకుంది.

ఈ మధ్యనే జరిగిన అంతర్జాతీయ జీవ వైవిధ్య సదస్సులో స్థానిక ప్రజల భాగస్వామ్యంలేదు. పర్యావరణంపై పనిచేస్తున్న మేధావుల సూచనలను పరిగణనలోకి తీసుకోలేదు. స్థానిక సమస్యలను ప్రతిబింబించే మీడియాను కూడా అనుమతించలేదంటే స్థానిక పాలకులకు ఎంత భయం ఉందో అర్థమవుతోంది. అణువిద్యుత్ కేంద్రం చుట్టుపక్కల ఉన్న వేలాది కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని పర్యావరణవేత్తలు, ప్రజా సంఘాలు, మేధావులు చెబుతున్నా తమిళనాడు ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టును నిర్మించే తీరుతామని పట్టుదలతో ఉంది. ఈ మధ్య సుప్రీం కోర్టు కూడా అణువిద్యుత్ కేంద్ర భద్రతపై అనుమానాలను వ్యక్తం చేసింది. ఇక్కడి వనరులను కొల్లగొడుతూ లాభాలను ఆర్జించాలనుకుంటున్న సెజ్‌లు కావచ్చు, అణువిద్యుత్ కేంద్రాలు కావచ్చు, కార్పొరేట్ సంస్థలు కావచ్చు, జీవ వైవిధ్య సదస్సు కావచ్చు వీటిలో వేటికి స్థానిక ప్రజల ఆమోదం లేదు. భోపాల్‌లో కార్బైడ్ కంపెనీ చేసిన విధ్వంసానికి ఈ నాటికీ స్థానిక ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు. అనేక రకాల వ్యాధులతో బాధలు అనుభవిస్తున్నారు. ఆ దుర్మార్గానికి కారణమైన కంపెనీ యాజమాన్యాన్ని రక్షించడంలో మాత్రం మన పాలకులు ముందున్నారు. ఈ దేశంలో ఏమూలకైనా వెళ్లి బహుళజాతీ కంపెనీలు ఈ దేశ సంపదలను దోచుకోవడానికి అనుమతి ఉంది. ఈ దోపిడీని ఎవరైనా ప్రశ్నిస్తే మాత్రం మన సైన్యాలు ఏమూలకైనా వెళ్లి వారిని అణిచివేస్తాయి. ఇది మన దేశ ప్రజల పట్ల పాలకులు అనుసరిస్తున్న విధానం. ఈ దేశ పౌరులకు మాత్రం సాటి మనుషులకు ఏమౌతుందో తెలుసుకునే కనీస హక్కు కూడా లేదని మన దళారీ పాలకులు వారి అణిచివేత చర్యల ద్వారా మళ్లీ మళ్లీ చాటి చెపుతున్నారు.

వార్త - వ్యాఖ్య : వై. రామచంద్రం

ఛావెజ్ విజయం

వెనిజులా అధ్యక్షుడిగా హ్యూగో ఛావెజ్ మరోసారి ఎన్నికయ్యారు. అక్టోబర్ 7న జరిగిన ఎన్నికల్లో మొత్తం 81 శాతం ఓటింగ్ నమోదైంది. ఛావేజ్‌కు 55 శాతం మంది ఓటువేయగా, ఆయన సమీప ప్రత్యర్థి, ముప్పై పార్టీలతో కూడిన సంకీర్ణ కూటమి అభ్యర్థి హెన్రిక్ కాప్రిల్స్‌కు 44.39 శాతం మంది ఓటు వేశారు. ఈ విజయంతో ఛావెజ్ మరో ఆరేళ్ల పాటు వెనిజులా అధ్యక్ష పదవిలో కొనసాగుతారు. నాల్గవసారి పదవి కాలపరిమితిని పూర్తి చేస్తే మొత్తం ఇరవై ఏళ్లపాటు దేశాధ్యక్షుడిగా కొనసాగినట్లవుతుంది. ఆయన నాల్గవసారి దేశాధ్యక్షుడిగా జనవరి 10, 2013న పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ విజయం సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు మరింత బలాన్నిస్తుంది. ఉపాధ్యక్షుడిగా నికొలస్ మదురో పేరును ప్రకటించారు. కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించారు. కొత్త హోంమంత్రిగా నెస్టర్ రెవరాల్‌ను నియమించారు. ప్రముఖ జర్నలిస్టు ఎర్నెస్టో విల్లెగాస్‌ను కొత్త కమ్యూనికేషన్‌ల మంత్రిగా, భారతీయ వ్యవహారాల మంత్రిగా, క్రిస్టోబర్ ఫ్రాన్సిస్కోను పర్యావరణ మంత్రిగా నియమించారు. కార్మెన్ మెలెండెజ్ అధ్యక్ష, ప్రభుత్వ వ్యవహారాల శాఖకు సారథ్యం వహిస్తారు.

వాల్‌మార్ట్ కార్మికుల సమ్మె హెచ్చరిక

రిటైల్ వ్యాపార దిగ్గజం వాల్‌మార్ట్‌కు వ్యతిరేకంగా అమెరికా కార్మికులు సమ్మెకు దిగారు. భారీగా వ్యాపార లావాదేవీలు జరిగే 'బ్లాక్ ఫ్రైడే' నాడు సమ్మె చేస్తామని వాల్‌మార్ట్ సిబ్బంది అక్టోబర్ 11న హెచ్చరించారు. కంపెనీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కొన్నేళ్లుగా మౌనంగా ఉన్నామనీ, వాటిపై మాట్లాడితే ఉద్యోగం నుంచి తీసేస్తారనే భయంతో ఉన్నామనీ, ఇక ఇప్పుడు వాటిని సహించేది లేదనీ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డల్లాస్, శాన్‌డీగో, చికాగో, లాస్ ఏంజెల్స్‌లోని వాల్‌మార్ట్ మాల్స్‌లలో పనిచేస్తున్న సిబ్బంది అక్టోబర్ 11న ఆర్కాన్సాస్‌లోని బెంటాన్‌విల్లేలో ఉన్న వాల్‌మార్ట్ ప్రధాన కార్యాలయం ముందు దాదాపు రెండు వందల మంది నిరసన ప్రదర్శన నిర్వహించారు. పని గంటలు, వేతనాల విషయంలో తమ డిమాండ్లు పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

గ్రీస్‌లో చర్చలు - నిరసనలు

యూరో సంక్షోభాన్ని పరిష్కరించే విషయమై చర్చించేందుకు సమావేశమైన యూరోపియన్ యూనియన్ (ఇయు) నేతలకు గ్రీస్ ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు. ఏథెన్స్‌లో, ఇతర నగరాలలో భారీగా ప్రజలు తరలివచ్చి నిరసన ప్రదర్శనలు జరిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాలకు కారణమైన ఇయు తీసుకుంటున్న పొదుపు చర్యలను నిరసిస్తూ ప్రజలు అక్టోబర్ 18న ఏథెన్స్‌లో దాదాపు ఎనభై వేల మంది కార్మికులు వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. ప్రదర్శనలు, సార్వత్రిక సమ్మెలతో గ్రీస్ జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. రవాణా పూర్తిగా నిలిచిపోయింది. ఏథెన్స్‌లోని సింటాగ్మా స్క్వేర్ ఇప్పుడు మరొక తెహ్రీర్ స్క్వేర్‌గా మారుతోంది. పోలీసులు స్క్వేర్ వద్ద తీవ్ర ఆంక్షలు విధించారు. నిరసనకారులను స్క్వేర్ వద్దకు రానీయకుండా అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా ఇయు, గ్రీస్‌ల భవిష్యత్తుపై ఇయు నేతలు చర్చలు జరిపారు. గ్రీస్‌కు విడుదల చేయాల్సి ఉన్న 31.5 బిలియన్‌ల యూరోలు నవంబర్ కల్లా రాకపోతే గ్రీస్ మనుగడ కష్టమవుతుంది. ఇందుకు గాను ప్రతిగా సామాజిక వ్యయాలపై మరింత కోత విధించాలని ఇయు పట్టుబడుతోంది. ఇప్పటికే నెలల తరబడి గ్రీస్ కార్మికులకు వేతనాలు, పెన్షన్‌లు లేవు.

మలాలా స్ఫూర్తి

పాకిస్తాన్ బాలిక మలాలా యూశిసుఫ్‌జాయ్‌పై అక్టోబర్ 9న తాలిబన్ దళాలు కాల్పులు జరిపాయి. పాకిస్తాన్‌లోని మింగోరా పట్టణంలో స్కూల్ వ్యాన్‌లో వెళ్తున్న మలాలాపై తాలిబన్లు జరిపిన కాల్పుల్లో ఆమె తీవ్రంగా గాయపడింది. పాకిస్తాన్‌లోని శ్వాత్ లోయలో బాలికా విద్యను ప్రోత్సహించడంలో మలాలా తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఆడపిల్లల చదువుకు స్ఫూర్తిదాయకంగా మలాలా నిలుస్తోంది. దీనికి వ్యతిరేకంగా తాలిబన్లు ఆమెను చంపడానికి ప్రయత్నించారు. మలాలాను ప్రోత్సహిస్తున్న ఆమె తండ్రిని కూడా చంపుతామని తాలిబన్లు హెచ్చరిస్తున్నారు. మెరుగైన చికిత్స కోసం మలాలాను బ్రిటన్‌కు తరలించారు. మలాలాకు అన్ని విధాలుగా పాకిస్తాన్ ప్రభుత్వం సహాయ పడుతుందని పాకిస్తాన్ ప్రధాని రజా పర్వేజ్ అష్రఫ్ తెలిపారు. మలాలా ఇప్పుడు పాకిస్తాన్‌లోనే కాకుండా పొరుగున ఉన్న అఫ్ఘనిస్తాన్ అమ్మాయిలకు కూడా స్ఫూర్తిగా నిలిచింది.

నోబెల్ పురస్కారాలు

ఈ సంవత్సరం నోబెల్ శాంతి పురస్కారం యూరోపియన్ యూనియన్ (ఇయు) కు లభించింది. ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న యూరప్‌లో శాంతి నెలకొనడానికి, ప్రజాస్వామ్యం, మానవ హక్కులు పెంపొందించేందుకు కృషి చేసినందుకు గాను ఇయుకు ఈ బహుమతి లభించింది. చైనా రచయిత మోయాన్‌కు నోబెల్ సాహిత్య పురస్కారం లభించింది. 'మో యాన్' కలం పేరుతో యాభై ఏడేళ్ల నవలా రచయిత గ్వాన్ మొయె చైనా సాహిత్యంలో ప్రముఖులు. మూలకణ పరిశోధనలకు గాను ఈ సంవత్సరం ఇద్దరికి వైద్యశాస్త్ర నోబెల్ బహుమతి లభించింది. పెద్ద కణాలు మూలకణాలుగా మారడం పైనా, శరీరంలోని అవి తిరిగి ఏ తరహా కణాలుగానైనా మారిపోవడం పైన విశేష పరిశోధనలు చేసిన బ్రిటన్‌కు చెందిన్ జాన్‌బి గుర్డాన్, జపాన్‌కు చెందిన షిన్యా యమనకకు ఈ పురస్కారం సంయుక్తంగా లభించింది. అమెరికాకు చెందిన డాక్టర్ రాబర్ట్ లెఫ్కోవిట్జ్, డాక్టర్ బ్రియాన్ కోబిల్కాలు రసాయన శాస్త్రంలో నోబెల్ పురస్కారం గెలుచుకున్నారు. జి-ప్రోటీన్ కపుల్డ్ రెసెప్టార్స్‌కు సంబంధించిన కీలక రహస్యాలను ఆవిష్కరించినందుకుగాను ఈ ఇద్దరికి నోబెల్ పురస్కారం లభించింది. అర్థశాస్త్రం నోబెల్ బహుమతి అమెరికా ఆర్థికవేత్తలు అల్విన్ రోత్, లాయిడ్ షాప్లీలు కైవసం చేసుకున్నారు. వినియోగదారులు, వ్యాపారవేత్తల మధ్య సరైన వారధిని ఏర్పరచడం ద్వారా స్థిరమైన మార్కెటింగ్ రూపకల్పనకు సిద్ధాంతాన్ని రూపొందించినందుకు వీరికి నోబెల్ దక్కింది. క్వాంటమ్ ఫిజిక్స్‌లో కృషి చేసిన ఫ్రాన్స్‌కు చెందిన సెర్గి హారోక్, అమెరికాకు చెందిన డేవిడ్ వినీలాండ్‌కు సంయుక్తంగా నోబెల్ బహుమతి లభించింది. క్వాంటమ్ ఫిజిక్స్ ప్రాతిపదికన కొత్త తరహా సూపర్‌ఫాస్ట్ కంప్యూటర్‌ను నిర్మించే దిశగా తొలి చర్య తీసుకోవడానికి వీరి పరిశోధన ఎంతగానో ఉపయోగపడుతుందని నోబెల్ జ్యూరీ పేర్కొంది.

ఈజిప్ట్ రాజకీయ ఖైదీలకు క్షమాభిక్ష

ఈజిప్ట్ మాజీ అధ్యక్షుడు హోస్నీ ముబారక్‌ను గద్దె దించడానికి జరిగిన నిరసనోద్యమంలో అరెస్ట్ అయిన రాజకీయ ఖైదీలందరికీ నూతన అధ్యక్షుడు మహమ్మద్ మోర్సీ క్షమాభిక్ష ప్రసాదించారు. విచారణను ఎదుర్కొంటున్న, జైలు పాలైన వారందరికీ ఈ క్షమాభిక్ష వర్తిస్తుందని తెలిపారు. ముబారక్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో ప్రభుత్వ మిలిటరీ బలగాలు వేలాది మందిని అరెస్ట్ చేసి జైళ్లలో నిర్బంధించారు. వారి సంఖ్య దాదాపు ఐదువేల మంది వరకు ఉండవచ్చని అంచనా. వీ

(... 4వ పేజీ తరువాయి)

రాష్ట్రాల్లో అసోంలో 73 నుంచి మిజోరంలో 91 దాకా ఉంది. అంతేకాదు రాజకీయ చైతన్యం హెచ్చుగా ఉండి, సుదీర్ఘ రాజకీయ, సాయుధ పోరాటాలు సాగిస్తున్నవారు. వారిని అణచడానికి మిలటరీతో పాటు, కుటిల రాజకీయాలను ప్రయోగిస్తున్నారు. ఆయా జాతుల మధ్య వైషమ్యాలు, మారణకాండలు సృష్టిస్తున్నారు. దీనికై అటు ప్రభుత్వ ఏజెన్సీలనూ, ఇటు పాలకవర్గ పార్టీల రాజకీయాలనూ ప్రయోగిస్తున్నారు. ఇటీవలి బోడో ఘర్షణలు వాటి ఫలితమే. నాలుగు లక్షల మంది నిర్వాసితులైంది వాటి ఫలితంగానే. అందులో హిందువులైన బిజెపితో పాటు లక్షలాదిగా ముస్లింలు కూడా ఉన్నారు. ఈ అంశాన్ని మరుగుపరిచి ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టడానికి బోడోలతో పాటు, కొన్ని సోకాల్డ్ సెక్యులర్ పార్టీలూ, మీడియా ప్రయత్నించడం ఎత్తి చూపాల్సిన అంశం.

'అస్సామీలపై వివక్షలు, దాడులు దేశంలోని ప్రతిచోట నిత్యకృత్యమైపోయాయి' అన్నది అతిశయోక్తి. అవి చెదురు మదురుగా మాత్రమే జరిగాయి. లేదా కొందరు జరిపించారు అనడం ఇంకా సరిగ్గా ఉంటుందేమో. ముస్లిం వ్యతిరేకతను, మతోన్మాద రాజకీయాలను రెచ్చగొట్టడానికి పాలకులూ, వారి మీడియా చాలా ప్రయత్నించాయి. ఒక మోతాదులో చేశాక ఆయా ఘటనలను, ప్రచారాన్ని కూడా ఆపేశారు. ఇదొక జియోపొలిటికల్ వ్యూహంతో నిర్వహించబడిన 'కంట్రోల్డ్ రాజకీయ ఎక్స్‌ప్లోజన్' అని చెప్పవచ్చు. మన రాష్ట్రంలో రాజకీయ లక్ష్యంతో సాగించిన మత కలహాలను అర్థం చేసుకున్న వారు వీటిని అర్థం చేసుకోగలరు. ఒక్క తేడా- అసోంలో వీటికి అంతర్జాతీయ కోణం కూడా ఉంది.

బంగ్లాదేశ్ సరిహద్దును తాకుతూ అసోంలో ఉన్న ప్రాంతమంతా బోడో గిరిజనులు మెజారిటీగా ఉన్న ప్రాంతం అన్నది సరి కాదు. బోడోల్యాండ్‌గా ఉన్న నాలుగు జిల్లాల్లో (కోక్రాఝార్, చిరాంగ్, ఉదల్ గురి, బక్సా) ఏవీ బంగ్లాదేశ్‌ను తాకవు. మధ్యలో మేఘాలయ, అసోంలోని ప్రాంతాలు ఉన్నాయి. బోడోల రాజధానిగా చెప్పబడే కోక్రాఝర్ జిల్లాలో బోడో భాషీయులు మొత్తం జనాభాలో సుమారు 32 శాతం మాత్రమే. (బెంగాలీలు 21, అస్సామీలు 20.3, సంథాలీ 16.7, ఇతర భాషలవారు 10 లోపు). బిటిసి(బోడో టెరిటోరియల్ కౌన్సిల్)లో బోడోయేతరులు 70 శాతం మంది. వారు బిటిసిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి గత ఆగస్ట్ 11 నాడు వినతిపత్రం సమర్పించారు. కాబట్టి బోడోలు మెజారిటీగా ఉండే ప్రాంతాలుగా వాటిని చెప్పలేం. చొరబాట్ల నియంత్రణకై ఇందిరా-ముజీబ్ ఒప్పందం కట్టుకథ. నిజానికి చొరబాట్లను, ఆ సాకుతో బంగ్లా యుద్ధాన్ని సాగించిందే వారు. నాటి సోవియట్ సామ్రాజ్యవాద వ్యూహంలో భాగంగా, భారత విస్తరణవాదులు ఆనాడు చేపట్టిన నిరంకుశ-చాణక్య-విస్తరణవాద రాజకీయాల, వాటి పర్యవసానాల కొనసాగింపే నేటి విపరిణామాలు.

1971-91 మధ్య భారత్ జనాభా పెరుగుదల రేటు 54.41 శాతం. 1991-2001 మధ్య 21.54, 2001-2011 మధ్య 17.64 శాతం. అదేకాలంలో అసోంలో పెరుగుదల శాతాలు: 53.26, 18.92, 16.93. అంటే దేశం మొత్తంతో పోల్చినప్పుడు అసోంలో ఎక్కువేమి లేదు. ముస్లింలు వరదలాగా వచ్చిపడుతున్నారనేది ఓ కట్టుకథ. గత 20 ఏళ్లుగా అలాంటి వలసలేమి లేవు. అసోంలోని ధెమాజి, కర్బీ-ఆంగ్ లాంగ్ జిల్లాల పెరుగుదల రేటు 1971-1991 మధ్య వరుసగా 107.50, 74.72 శాతం. ఈ రెండు జిల్లాల్లో మొత్తం జనాభాలో ముస్లింల శాతం చాలా తక్కువ(2-3 మధ్య). అయినా పెరుగుదల హెచ్చు మోతాదులో ఉంది. బంగ్లాదేశ్ నుంచి ముస్లింల అక్రమ చొరబాట్లు భారీగా కొనసాగుతున్నాయన్నది తప్పుడు ప్రచారం అనడానికి ఇది చాలు. కొన్ని రాజకీయ లక్ష్యాలతో సాగిస్తున్న తప్పుడు ప్రచారాలివి.

బంగ్లా ముస్లింల వలసలతో బోడోల ఉపాధి దెబ్బ తిన్నదనీ, 1970ల నుంచి బోడో-ముస్లింల మధ్య పోటీ పెరిగిందనీ చెప్పారు. ఘర్షణలు జరిగిన కోక్రాఝార్ జిల్లాలో జనాభా పెరుగుదల 1991-2001 మధ్య 14.5 శాతం, 2001-2011 మధ్య 5.2 శాతం మాత్రమే. ఇది మొత్తం అసోంలో కన్నా చాలా తక్కువే. వలసలు దాదాపు ఆగిపోయాయి. బంగ్లా ముస్లింల దశాబ్దాల వలస ప్రవాహం తర్వాత కూడా ఈ జిల్లాలో నేటికీ ముస్లింల శాతం 20 మాత్రమే. హిందువులు 65 శాతం. క్రైస్తవులు 13.7 శాతం (వీరిలో అత్యధికులు స్థానిక గిరిజన తెగలవారు). అసోంలోని ముస్లింల శాతం 31 కన్నా ఈ జిల్లాలో తక్కువే (2001 లెక్కలు). కాబట్టి ఘర్షణలు ప్రధానంగా వలసల వల్ల కాదని చెప్పవచ్చు. జూలై 2012 ఘర్షణలు ఒరిజినల్‌గా స్థానికమైనవి. వాటికి రాజకీయ రంగు పులిమి, వివిధ పక్షాలవారు తీవ్రం చేశారు. ఇందులో కొంత గోద్రాతో పోలిక ఉందని నిపుణులు వ్యాఖ్యానించారు.

1970ల చివర్లో అసోం ఉద్యమం బంగ్లా ముస్లింలకు వ్యతిరేకంగా మొదలైనది కాదు. బయటివారికి ముఖ్యంగా బెంగాలీ పెత్తనానికి దాన్ని ప్రోత్సహించిన కాంగ్రెస్‌కి (సిపిఎంకి కూడా) వ్యతిరేకంగా మొదలైనది కాదు. అసోంలోని బెంగాలీలంతా విదేశీయులుకారు. వారంతా ముస్లింలూ కారు. దేశ(బెంగాల్) విభజన 1947లో జరిగినప్పుడు పదుల లక్షల సంఖ్యలో బెంగాలీలు (ప్రధానంగా హిందువులు) బెంగాల్‌లోకి, నాటి అసోంలోకి తరలి వచ్చారు. 1971 బంగ్లా యుద్ధానికి ముందూ, తర్వాతా మళ్లీ పదుల లక్షల మంది వలస వచ్చారు. ఈ రెండో వలసలో అధిక సంఖ్యాకులు ముస్లింలు. వారు మౌలికంగా బెంగాలీలు. ముందు బ్రిటిష్ పాలకులు, తర్వాత దేశీ పాలకులు చీల్చిన బెంగాలీ జాతీయులు. 1971లో బంగ్లాదేశ్ ఏర్పడక ముందే వచ్చినవారు బంగ్లాదేశీయులు కాజాలరు కదా! తర్వాత క్రమంగా దాన్ని విదేశీయులకూ, ముస్లింలకూ వ్యతిరేకంగా మలిచారు. భారత్‌లో కేంద్రానికి వ్యతిరేకంగా పెరిగిన వివిధ జాతుల ఉద్యమాలను చీల్చడానికి, దెబ్బతీయడానికి మతవాద శక్తులను (హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ) ప్రోత్సహించే ఎత్తుగడలను పాలక వర్గాలు, ప్రభుత్వం అనుసరిస్తున్నాయి. అసోంలో జరుగుతున్నది అదే.

అసోం సరిహద్దు రాష్ట్రం. వ్యూహాత్మకంగా కీలకమైనది. అక్కడ జాతి ఆధారంగా ఉద్యమాలను దెబ్బ తీయడానికి కేంద్రం దాని ఏజెన్సీలు అనేక ఎత్తుగడలు అనుసరిస్తున్నాయి. మిలటరీ పద్ధతులే కాదు, పంజాబు అటానమీ ఉద్యమాన్ని ఎదుర్కోవడానికి భింద్రన్‌వాలేను, ఖలిస్తాన్ వాదాన్ని సృష్టించాయి. కాగా ఈశాన్యంలో ఆయా స్థానిక వైరుధ్యాలను రెచ్చగొట్టి, అనేక ఉపజాతి ఉద్యమాలను, తెగ వైషమ్యాలను సృష్టించారు. నెల్లీ ఊచకోత అలాటిదే. రెండు వేల మంది చనిపోయిన ఆ ఘటన సిక్కుల(1985) ఊచకోతను, గోద్రా మారణకాండను పోలినది. కానీ వాటికి వచ్చినంత ప్రచారం రాలేదు. వాటి గురించి సీరియస్‌గా విచారణ జరగలేదు. ఎవరికీ శిక్షలు పడలేదు. పాలక వర్గాల ప్రచ్ఛన్న హస్తం ఉందనడాన్ని అది సూచిస్తుంది. మణిపూర్‌లో, నాగాలాండ్‌లో కూడా ఇలాంటి మారణకాండలు అనుమానాస్పదంగా చాలా జరిగాయి. వేలాదిగా చనిపోయారు. 'కౌంటర్ ఇన్‌సర్జెన్సీ' పేరిట సిఐఎ తరహాలో అనేక ఆపరేషన్‌లను సాగిస్తున్నారు. వాటి గురించిన పూర్తి వివరాలు బైటికి రాకపోవచ్చు. అలాగే అసోం ఉద్యమాన్ని దెబ్బతీయడానికి బోడోలను ప్రయోగించారు. పాత అసోం నుంచే నాగాల్యాండ్, మేఘాలయ, మణిపూర్, మిజోరం విడివడినాయి. ఇంకా నాలుగు రాష్ట్రాలకు డిమాండ్లున్నాయి. వాటిలో బోడో ఒకటి. ఒక భాషా సాంస్కృతిక వేదికగా ఉండిన బోడోల సంస్థ రాజకీయ సంస్థగా మారింది. ఇందులో కేంద్రం పాత్ర, 'రా' పాత్ర ఉన్న దాఖలాలు వెలువడినాయి. అసోం జనాభా మూడు కోట్లకు మించింది. బోడోల జనాభా 30 లక్షలే అయినా అసోంని 'ఫిఫ్టీ-ఫిఫ్టీ'గా విడగొట్టాలని కోరుతున్నారు. ఈశాన్య భారతంలోని అనేక శక్తుల వలెనే బోడో గ్రూపులు కొన్ని కాంగ్రెస్ మిత్రపక్షంగా ఉన్నాయి. వారి వ్యూహానికి దోహదపడుతున్నాయి. ఇందులో అంతర్జాతీయ కోణం కూడా ఉంది. నిశితంగా పరిశీలించాల్సిన సంక్లిష్ట సమస్య ఇది.

(వ్యాస రచయితని, రచనని విమర్శించడం కోసం కాక, విషయాలను వేర్వేరు కోణాల్లో పరిశీలించే లక్ష్యంతో రాసిన వ్యాఖ్య ఇది అని గమనించాలని ప్రార్థన. ఈశాన్య భారత్ వ్యవహారాలను పరిశీలించే గువాహతిలోని 'స్ట్రాటజిక్ రిసర్చ్ అండ్ ఎనాలిటిసిస్ ఆర్గనైజేషన్' ప్రచురించిన గణాంకాల విశ్లేషణను గ్రహించడమైనది)

- డా. ఎం. బాపూజీ

సిఎస్ఐఆర్ రిటైర్డ్ సైంటిస్ట్, హైదరాబాద్

గమనిక : పాఠకుల వీక్షణం శీర్షికకు, వ్యాసాలపై చర్చకు పాఠకుల నుంచి ఇతోధికమైన స్పందనను ఆశిస్తున్నాం. కాని, ఎక్కువ మంది పాఠకుల స్పందనకు అవకాశం కల్పించేలా, స్థలాన్ని దృష్టిలో ఉంచుకొని తమ స్పందనలను వీలైనంత క్లుప్తంగా రాయాలని కోరుతున్నాం. చర్చ ఏ వ్యాసంపై జరుగుతుందో దానికే పరిమితమయి ఉండడం, చద్దికన్న ఊరగాయ ఘనం కాకుండా ఉండడం అవసరం. స్థలాభావం దృష్ట్యా ఉత్తరాలు, చర్చ ఎడిట్ చేసి ప్రచురించే అధికారం సంపాదకవర్గానికి ఉంది. ఇప్పటివరకూ వాడని ఈ అధికారాన్ని ఇకముందు కూడా వాడని స్థితి కల్పించాలని కోరుతున్నాం. - సం.

అసహజ మరణాల సూచి


సంకలనం : రాంకి, వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగానూ వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 సెప్టెంబర్ నుండి 30 సెప్టెంబర్ 2012 వరకు 16 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 2174)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	–	4	–	21	24	7	8	5	3	2	4	3	1	1	13	26	–	–	–	2	4
హైదరాబాద్	–	–	–	9	8	–	–	–	1	1	5	6	–	–	19	22	–	–	–	4	–
నల్గొండ	1	12	2	26	30	6	13	8	–	9	1	8	–	12	47	44	–	–	–	7	–
మహబూబ్‌నగర్	1	8	–	20	25	7	20	17	2	5	8	18	15	10	41	14	–	–	–	–	–
మెదక్	–	4	–	9	8	5	2	9	2	2	1	1	1	13	19	20	–	–	–	–	–
నిజామాబాద్	–	–	–	19	20	6	5	12	4	5	13	7	4	10	43	43	–	–	–	–	1
రంగారెడ్డి	–	9	–	16	26	9	12	6	6	4	10	6	4	2	46	9	–	–	–	–	–
వరంగల్	–	12	1	22	18	9	10	16	1	1	–	–	3	16	26	11	–	–	–	–	6
కరీంనగర్	2	5	3	12	18	6	20	5	2	6	2	3	3	5	20	16	–	–	–	–	2
ఖమ్మం	1	5	–	19	17	15	18	10	6	2	6	15	1	16	40	18	–	–	–	–	2
అనంతపూర్	–	13	3	12	14	5	5	7	–	3	3	8	7	9	45	8	–	–	–	–	–
నెల్లూరు	–	–	–	2	–	–	–	–	–	–	–	–	–	1	21	7	–	–	–	–	–
కర్నూలు	–	9	–	25	17	9	7	11	13	10	7	5	12	6	48	56	–	–	–	–	1
చిత్తూరు	–	–	–	4	8	–	–	–	–	–	–	–	8	–	25	–	–	–	–	–	–
విశాఖపట్నం	–	–	–	6	4	2	5	–	–	6	1	–	9	4	18	22	–	–	–	6	–
విజయనగరం	–	–	–	5	4	4	6	4	5	4	1	2	3	–	23	8	–	–	–	–	2
మొత్తం	**5**	**81**	**9**	**227**	**241**	**90**	**131**	**110**	**45**	**60**	**62**	**82**	**71**	**105**	**494**	**324**	**–**	**–**	**–**	**19**	**18**

ఖమ్మం, కర్నూలు, నిజామాబాద్, నల్గొండ అసహజ మరణాల వివరాలు ఆగస్ట్, సెప్టెంబర్ 2012వి



విద్యార్థులు, మేధావులు, అధ్యాపకులు, పరిశోధకులు,
పోటీ పరీక్షలకు హాజరయ్యే వారు,
ఆసక్తితో చదువుకునే వారందరి కోసం
మూడో ముద్రణగా...

ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
1956 - 2006

పేజీలు 568 రు.300 మాత్రమే

సోల్ డిస్ట్రిబ్యూటర్ : **బుక్ సెలక్షన్ సెంటర్**
షాలిమార్ థియేటర్ పక్కన, కింగ్ కోఠి,
హైదరాబాద్. ఫోన్ : 040 23446850

శ్రీ బుక్ స్క్వేర్
వైశ్యా హాస్టల్ బిల్డింగ్, కాచిగూడ క్రాస్ రోడ్
హైదరాబాద్. ఫోన్ : 040 23446848

వీక్షణంలో ప్రకటనలు ఇవ్వండి! మీ సందేశం వేలాది మందికి చేర్చవచ్చు!
వీక్షణంకు ఆర్థిక సహాయం అందించవచ్చు!

వీక్షణం నాలుగు కాలాలపాటు మనగలగాలంటే ఆర్థిక పరిపుష్టి అవసరమని మీకు తెలుసు. వీక్షణం పాఠకులుగా, అభిమానులుగా వీక్షణంకు ఆర్థిక సహాయం అందించాలనే కోరిక, ఆర్థిక సహాయం అందించగలిగిన వారికి వీక్షణంను పరిచయం చేయాలనే కోరిక కూడా మీకు ఉన్నాయి. కానీ, ఆ ఆర్థిక సహాయం ఏ రూపంలో అందించాలో మీరు ఆలోచిస్తుండవచ్చు. చందాలు, విరాళాల రూపంలో మాత్రమే కాదు, ప్రకటనల రూపంలో కూడా ఆర్థిక సహాయం అందించవచ్చు. ఆ పూర్తి పేజీ, అర పేజీ, పావు పేజీ ప్రకటనలు ఎక్కువ ఖరీదు అవుతాయనీ, భరించలేమనీ అనుకుంటే వెయ్యి రూపాయల నుంచి ప్రారంభించి కూడా ప్రకటనలు ఇవ్వవచ్చు. లోపలి పేజీలలో 4.5 కాలమ్స్ సెంటీమీటర్ల ప్రకటన (4.5 సెం.మీ. పొడవు, 8.4 సెం.మీ. వెడల్పు) వెయ్యి రూపాయలలో వస్తుంది. శుభాకాంక్షలు తెలిపే ప్రకటనలు, జీవన సహచరి / సహచరుడు కావాలనే ప్రకటనలు, పుస్తక ప్రకటనలు, సందేశాలు... ఏమయినా సరే మీరు చెప్పదల్చుకున్న ఏ సంక్షిప్త సమాచారమయినా అతి తక్కువ ఖర్చుతో వీక్షణం పాఠకులకు చేరుతుంది. వీక్షణం పాఠకులలో ప్రజా ఉద్యమాల కార్యకర్తలు, నాయకులు, విద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు, సామాజిక విశ్లేషకులు, రాజకీయ కార్యకర్తలు, మొదలైన ఎన్నో సమూహాల ప్రజలు ఉన్నారు. వీక్షణంలో ఒక ప్రకటన తెలుగు సీమలోని వేలాది పాఠకులకు చేరుతుంది. ఈ ప్రకటన ఇంటర్‌నెట్‌లో www.veekshanam.wordpress.com లో కూడా ఉంటుంది గనుక మరెన్ని వేల మందికి చేరుతుందో చెప్పలేం.

8.4 సెం.మీ. వెడల్పు
4.5 సెం.మీ. పొడవు

వీక్షణం, మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495;
Email : veekshanam2003@gmail.com www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 136 -November 2012 • **ISSN 2231-6892**
• RNI Regn.No.APTEL/2003/11482 • Published on 27/10/2012 • Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

వీక్షణం కృషిలో భాగం పంచుకోండి!
దశాబ్ది ప్రత్యేక సంచికను బలోపేతం చేయండి!!

వీక్షణం రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక డిసెంబర్ 2012 సంచికతో విజయవంతంగా పది సంవత్సరాలు పూర్తి చేసుకుని, జనవరి 2013 సంచికతో రెండో దశాబ్దిలోకి అడుగు పెడుతున్నది. ఈ సందర్భాన్ని చిరస్మరణీయం చేసేందుకు జనవరి 2013 సంచికను విశిష్ట ప్రత్యేక సంచికగా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాం. ఈ ప్రత్యేక సంచిక తయారీ ప్రయత్నాలలో భాగంగా జూలైలో జరిగిన వీక్షణం రచయితల, అభిమానుల, పాఠకుల సమావేశం విలువైన సూచనలు, సలహాలు అందించింది. ఈ సంచికను కలకాలం దాచి ఉంచుకోదగిన అరుదైన ప్రత్యేక సంచికగా రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సంచికలో ఇవాళ భారత సమాజం ముందూ, తెలుగు సమాజం ముందూ ఉన్న ప్రధానమైన సమస్యలూ అంశాలూ వివరంగా చర్చకు రానున్నాయి. పన్నెండు అంశాలపై ప్రముఖ విశ్లేషకులు రాస్తున్న సవివరమైన వ్యాసాలతో ఈ సంచిక వెలువడనుంది. అంటే ఈ సంచిక సాధారణ నెలవారీ పత్రికగా కన్న మిన్నగా ఒక సమగ్రమైన పుస్తకంగా రానుంది.

వీక్షణం ఆర్థిక స్థితి ఈ బృహత్ప్రయత్నానికి సరిపోదని మీకు తెలుసు. వీక్షణం ముందుకు నడవడమైనా, ఈ ప్రత్యేక విశిష్ట సంచిక వెలువడడమైనా వీక్షణం అభిమానులు, పాఠకులు, దాతలు, రచయితలు తలా ఒక చెయ్యి వేస్తేనే సాధ్యమవుతుంది.

- **ఎక్కువ మందితో వీక్షణం చదివించండి!**
- **ప్రత్యేక సంచిక కోసం విరాళాలు ఇవ్వండి!**
- **ప్రకటనలు ఇవ్వండి!**
- **చందాలు చేర్పించండి!**
- **విరాళాలు సేకరించి పంపండి!**
- **ప్రకటనలు సేకరించండి!**

వీక్షణం మీ పత్రిక. వీక్షణం ప్రజల పత్రిక.

వీక్షణం తెలుగు సమాజం తనతో తాను సాగిస్తున్న సంభాషణ.

వీక్షణం తెలుగు సమాజం తన గురించి తాను చేసుకుంటున్న అన్వేషణ.

వీక్షణంను నిలబెట్టండి. చిరకాలం కొనసాగడానికి హామీపడండి.

వీక్షణం

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com www.veekshanam.wordpress.com

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao